

# విజన్ - విధ్వంసం





కె. బాలగోపాల్

# విజన్ – విధ్వంసం


## కె. బాలగోపాల్




5




25




49




85

మానవహక్కుల వేదిక ప్రచురణ

# విజన్ – విధ్వంసం

మానవహక్కుల వేదిక ప్రచురణ
**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 46

ప్రచురణ కాలం: అక్టోబర్ 2019

వెల: 100 రూపాయలు

కవర్: **అనంతు**

**ముద్రణ**
అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126
శాంతినగర్, హైదరాబాద్–500028
ఫోన్: 23391364, 233041941
Email: anupamaprinters1978@gmail.com

**ప్రతులకు**
ఎస్. జీవన్ కుమార్
3–12–117/ఎ–2/బి, పి.ఎస్. కాలనీ,
గణేష్‌నగర్, రామాంతపూర్,
హైదరాబాద్–500013
ఫోన్: 9848986286

**ప్రజాశక్తి, నవోదయ బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# మా మాట

విధ్వంసం సిరీస్‌లో ఇది చివరి పుస్తకం. మొదటి నాలుగూ : అభివృద్ధి – విధ్వంసం (2015), విస్థాపన – విధ్వంసం (2016), సరళీకరణ – విధ్వంసం (2017), అణుశక్తి – విధ్వంసం (2018). ఐదో పుస్తకమైన 'విజన్ – విధ్వంసం' నిజానికి నాలుగు నివేదికలు కలిపి తీసుకొస్తున్న పుస్తకం. అవి – చిత్తూరు జిల్లాలో ఏనుగుల ప్రభుత్వం (1991), వెయ్యి మెగావాట్ల చీకట్లు (1992), పంట పొలాలకు సిమెంటు చీడ (1998), ఎండమావి–2020 (1999). మొదటి మూడూ నిజ నిర్ధారణ కమిటీల విపులమైన నివేదికలు కాగా చివరిది చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రూపొందించిన విధాన రచనా పత్రం 'విజన్ 2020' పై విమర్శనాత్మక విశ్లేషణా నివేదిక. అదే పెద్ద నివేదిక కావడం వలన ఈ పుస్తకానికి ఆ పేరే వచ్చేలా 'విజన్ – విధ్వంసం' అని పేరు పెట్టాం.

'ప్రభుత్వ యంత్రాంగం, పెత్తందార్లు చేసే ప్రత్యక్షదాడుల వల్లనే కాక ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక రాజకీయార్థిక విధానాల వల్ల, నిర్లక్ష్యం వల్ల కూడ ప్రజల జీవితానికీ, జీవనానికీ తీవ్రమైన హాని కలుగుతూ ఉంటుంది. చిత్తూరు జిల్లా అడవి ఏనుగుల సమస్య ఈ కోవకు చెందిన పౌరహక్కుల సమస్య' అని బాలగోపాల్ 'ఏనుగుల ప్రభుత్వం' నివేదిక ప్రారంభంలోనే అన్నారు. ఇది రాసి మూడు దశాబ్దాలు గడిచినా ప్రభుత్వాలు ఈ సమస్యకు ఇంకా పరిష్కారం కనుగొనలేదు. చిత్తూరు జిల్లాలో, కొన్ని ఇతర రాష్ట్రాలలో రైతులకు ఏనుగులకు మధ్య నేటికీ 'ఘర్షణ' కొనసాగుతూనే ఉంది. 'వెయ్యి మెగావాట్ల చీకట్లు' అనేది భారీ విద్యుత్ కేంద్రం కోసం ముంపుకు గురయిన శ్రీశైలం పరిసర గ్రామాల ప్రజల నిర్వాసిత, నష్టపరిహార సమస్య. ఈ 27


ఏళ్ళలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోనే కాదు, దేశమంతటా కూడ లక్షలాది ప్రజలు ఇదే సమస్యను ఎదుర్కోవడం చూశాం, చూస్తున్నాం. విద్యుత్ ప్రాజెక్టుల వల్లనే కాదు అనేక ఇతర ప్రాజెక్టుల వలన కూడ ప్రజలు పెద్దఎత్తున ఊరూ, ఉపాధీ వదిలేసుకుని తరలి పోవాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయి.

'పంటపొలాలకు సిమెంటు చీడ' నివేదిక పారిశ్రామిక కాలుష్యం ప్రజలకు, ప్రకృతికి చేయగల నష్టానికి ఒక మచ్చుతునక. ప్రతి పరిశ్రమ గురించి ఇలాంటి అధ్యయనం జరిపితే పారిశ్రామికాభివృద్ధికి ప్రజలు చెల్లిస్తున్న మూల్యం ఎంతో తెలుస్తుంది. పారిశ్రామికవేత్త పెట్టిన పెట్టుబడి గురించి అందరికీ తెలుస్తుంది. కాని ప్రజలు తమ ఆరోగ్యాలను, జీవనోపాధులను పోగొట్టుకుని పరోక్షంగా సమకూరుస్తున్న 'పెట్టుబడి' గురించి ఎవరికీ తెలియదు. రాష్ట్రంలో పరిణామాలు అనూహ్యంగా, అత్యంత వేగంగా మారిపోవడం వలన 'విజన్ – 2020' అక్షరాలా అమలు జరగలేదు కాని ఆ ఆలోచనాధోరణి నేటికీ ప్రబలంగా ఉంది. అమలు జరిగి ఉంటే వ్యవసాయ సంక్షోభం ఇంకెంత తీవ్రరూపం దాల్చి ఉండేదో!

20, 30 ఏళ్ళ క్రితం ఈ సమస్యలను హక్కుల సమస్యలుగా గుర్తించడమే కొత్త విషయం. బాధితుల ఆందోళనల ఫలితంగా కొన్ని కొత్త చట్టాలు వచ్చినప్పటికీ వాటి అమలును నీరుకార్చే ప్రయత్నం ప్రభుత్వం సమాంతరంగా చేస్తూనే ఉంది. ఒక పరిష్కార యంత్రాంగం నెలకొల్పినట్టే ఉంటుంది. కాని దాని గురించి అందరికీ తెలిసి బాధితులు దానిని ఆశ్రయించే లోపల దాన్ని నిర్వీర్యం చేస్తూ ఉంటుంది. ఉదాహరణకు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ లాంటివి. ఇంత నిజాయితీ లేని ప్రభుత్వంతో ప్రజలు ఎలా వ్యవహరించాలి? 'ఏ సంస్కరణ అమలు కావాలన్నా ప్రజలు సంఘటితం కావాలనేది నాలుగు దశాబ్దాల భారత ప్రజాస్వామ్యం మనకు నేర్పిన గుణపాఠం' అని బాలగోపాల్ ఈ నివేదికలలోనే ఒకచోట అన్నారు. దాన్ని 'ఏడు దశాబ్దాల గుణపాఠం'గా మార్చుకుని ప్రభుత్వాన్ని నిరంతరం సంఘటితంగా నిలదీస్తూ ఉండడమే మనం చేయగలిగిన పని.


**మానవహక్కుల వేదిక**

**8 అక్టోబర్ 2019**


చిత్తూరు జిల్లాలో
ఏనుగుల ప్రభుత్వం
గజ నిరోధక విద్యుత్ కంచె
ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

CHITTORJILLALO ENUGULA PRABHUTVAM

చిత్తూరు జిల్లా




మన ప్రభుత్వ ఆర్థిక విధానంలో భాగంగా జరుగుతూవున్న అడవుల విధ్వంసనం ఏనుగుల సహజ నివాసాలను నాశనం చేసింది. కలప పరిశ్రమ, ఖనిజ ఉత్పత్తి, ప్రాజెక్టుల నిర్మాణం, కాలవల తవ్వకం, రోడ్ల నిర్మాణం, ప్లాంటేషన్లు, ఇవన్నీ కూడ దేశంలోని అటవీ భూభాగాన్ని కుదించేస్తున్నాయి. వీటికి విలువయిన క్ర దొంగరవాణా కూడ తోడయింది. ఈ పరిణామాలు ఏదో ఒక మేరకు అభివృద్ధిలో భాగంగా అనివార్యమే, అయితే తత్ఫలితంగా జరిగే అడవుల విధ్వంసనంతో పాటు ప్రయత్నపూర్వకమయిన పునరుజ్జీవనం కూడ జరిగితే దుష్ఫలితాలుండవు. కానీ విధ్వంసనం వల్ల లాభాలుపొందేవారెవ్వరికీ అడవుల పునరుజ్జీవనం తక్షణ అవసరం కాదు. ప్రభుత్వానికి దీర్ఘకాలిక దృక్పథంగానీ సమగ్ర అభివృద్ధి పథకంగానీ లేదు. దీని ఫలితంగా అడవుల వినాశనం పెరిగేకొద్దీ వన్యప్రాణుల మనుగడ సమస్యాత్మకంగా తయారవుతోంది. అవి జనావాసాల మీదికి వచ్చి ప్రజలకు సమస్యగా తయారవుతున్నాయి.

# చిత్తూరు జిల్లాలో ఏనుగుల ప్రభుత్వం

ప్రభుత్వ యంత్రాంగం, పెత్తందార్లు చేసే ప్రత్యక్ష దాడుల వల్లనే కాక, ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక రాజకీయార్థిక విధానాల వల్ల, నిర్లక్ష్యం వల్ల కూడ ప్రజల జీవితానికీ జీవనానికీ తీవ్రమయిన హాని కలుగుతూ ఉంటుంది.

చిత్తూరు జిల్లా అడవి ఏనుగుల సమస్య, కర్నూలు–మహబూబ్‌నగర్ జిల్లాల పులుల సమస్య ఈ కోవకు చెందిన పౌరహక్కుల సమస్యలు.

చిత్తూరు జిల్లాలోని కుప్పం, పలమనేరు అడవి ప్రాంతం చాలా అందమయిన ప్రాంతం. ఎత్తయిన పీఠభూమి మీద వున్న ఎగుడు దిగుడు నేల, విస్తారమయిన చిట్టడవి, సమృద్ధిగా కురిసే వర్షం, ఆ వర్షం నీటికి ప్రవహించే వాగులు, ఆ నీటిని నిలుపుకొనే చిన్న చిన్న మడుగులు, పెద్ద నీటివనరులేవీ లేకపోయినా ఎప్పుడూ పచ్చగా వుండే పొలాలు – మనుషులు తమకు తాము కష్టాలను కల్పించుకుంటే తప్ప కష్టాలనేవి ఉండనక్కరలేదనిపిస్తుంది ఈ నేలను చూస్తే. వరి, చెరుకు, పప్పుధాన్యాలు, రాగులు, వేరుశెనగ, కొబ్బరి, రకరకాల పండ్లు ఈ నేల ఇచ్చే ఫలసాయం. అడవి అని పేరే గానీ అది క్రూరమృగాలు సంచరించేటంత దట్టమయిన అడవి కాదు. అంతకంటే క్రూరమయిన అటవీ శాఖకు పెద్దగా అక్కరకు వచ్చే అడవీ కాదు ఈ అడవిలో గంధం చెట్లు బాగా ఉండేవి. అవి స్మగ్లర్ల వాతబడి దాదాపు ఖాళీ అయిపోయాయి. టేకు ప్లాంటేషన్లకు యోగ్యమయిన అడవి కాదు. కాబట్టి ఖరీదయిన కలప ఇక్కడ పెద్దగా దొరకదు. అందువల్ల అటవీశాఖ బెడద అంతగా లేదు.

కాని సామాజికంగా రాజకీయంగా ఇది బాగా వెనకబడ్డ ప్రాంతం. వందల ఎకరాల భూములున్న భూస్వాములు సహితం గ్రామాలను అంటిపెట్టుకునే బతుకుతున్నారు. పట్టణ ఆర్థిక వ్యవస్థలోకీ, రాష్ట్ర రాజకీయాలలోకీ ఎక్కువగా ప్రవేశించలేదు. అసలు పెద్ద భూస్వాముల సంఖ్యే తక్కువ.

ఏ ఒడిదుడుకులూ లేకుండా సాగిపోతున్న ఈ జీవితంలోకి 1984లో ఏడు అడవి ఏనుగుల మంద ఒకటి ప్రవేశించింది.

***ఫ్రెంచి నగల వ్యాపారి, పర్యాటకుడు అయిన జె.బి. టావర్నియర్ క్రీ.శ. 1652 ఆగస్టు నెలలో ఈ అడవుల గుండా ప్రయాణించాడు. ఆ రోజులలో ఈ అడవులలో ఏనుగుల వేట జరిగేదని రాశాడు. మీర్‌జుమ్లా సైన్యానికి చెందిన ఒక అధికారి ఈ అడవులలో ఏనుగులను వేటాడేవాడని రాశాడు. కాని ఇప్పుడు ఈ అడవుల స్థితిగతులతోనూ, ఇక్కడున్న జంతుజాతులతోనూ పరిచయం ఉన్న వాళ్ళకు ఇది నమ్మశక్యంగా అనిపించదు... ఏనుగులు, అడవిదున్నల వంటి పెద్ద జంతువులే కాదు, పులులు చిరుతల వంటి జంతువులు సహితం ఇప్పుడు ఈ అడవులలో మృగ్యం అయిపోయాయి.***

***చిత్తూరు జిల్లా గెజెటీర్ (1979)***
***(రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ)***

పొరుగున వున్న హోసూరు (తమిళనాడు) అటవీ డివిజన్ నుండి ఈ మంద చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించింది. కుప్పం అటవీ డివిజన్‌లోని పెద్దూరు అడవులలో ఇది మొట్టమొదటిసారి కనబడింది. ప్రజలు వాటికి కొబ్బరి కాయలు కొట్టి మంగళహారతులు ఇచ్చారు. రెండవ మంద 1986లో ఇదే రేంజ్‌లోకి ప్రవేశించింది. ఆ మందలో 22 ఏనుగులున్నాయి. ఆ తరువాత ఏనుగుల సంఖ్య నెమ్మదిగా పెరుగుతూపోయింది. ప్రస్తుతం 40 దాకా ఉన్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలలో కొందరు ఇంకా ఎక్కువ ఉన్నాయంటారు.

ఎందుకు వచ్చాయి ఇవి?

ఈ ఏనుగులు తమిళనాడు నుండి వచ్చాయని చెప్పాం కదా! అయితే ఇవి కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు ప్రాంతం నుండి బయలుదేరి తమిళనాడు మీదుగా చిత్తూరు అడవిలోకి ప్రవేశించాయని నమ్మడానికి ఆధారాలు ఉన్నాయి. వాటి వలసలకు ప్రధాన కారణం అడవుల వినాశనం. ఒక ఏనుగుల మంద జీవించడానికి అవిచ్ఛిన్నమైన

విస్తారమయిన అడవి కావాలి. ఎదిగిన ఒక ఏనుగు రోజుకు 270 నుండి 320 కిలోల ఆహారం (ఆకులు, మొక్కలు మొదలయినవి) తీసుకుంటుంది. అంటే ఒక ఏనుగును పోషించడానికి ఏడాదికి సగటున 25 ఎకరాల సారవంతమయిన అడవి కావాలి. ఇంత తిండి ప్రతీ రోజు ఒకేచోట దొరకదు కాబట్టి ఏనుగులు విశాల భూభాగంలో సంచరిస్తూ బతుకుతాయి. ప్రతిరోజూ దాదాపు 60 నుండి 80 చదరపు కి.మీ.ల భూభాగంలో సంచరిస్తాయని నిపుణుల అంచనా. అందుకే వాటికి విస్తారమయిన అడవే కాక అవిచ్ఛిన్నమయిన అడవి కావాలి.

ప్రభుత్వ ఆర్థిక విధానంలో భాగంగా జరుగుతున్న అడవుల విధ్వంసం ఏనుగుల సహజ నివాసాలను నాశనం చేసింది. కలప పరిశ్రమ, ఖనిజాల తవ్వకం, ప్రాజెక్టుల నిర్మాణం, కాలవల తవ్వకం, రోడ్ల నిర్మాణం, ప్లాంటేషన్లు – ఇవన్నీ కూడ దేశంలోని అటవీ భూభాగాన్ని కుదించేస్తున్నాయి. వీటికి విలువయిన కలప దొంగరవాణా కూడ తోడయింది. ఈ పరిణామాలు ఏదో ఒక మేరకు అభివృద్ధిలో భాగంగా అనివార్యమైనవే. అయితే తత్ఫలితంగా జరిగే అడవుల విధ్వంసంతో పాటు ప్రయత్నపూర్వకమయిన పునరుజ్జీవనం కూడ జరిగితే దుష్ఫలితాలుండవు. కానీ విధ్వంసం వల్ల లాభాలు పొందేవారెవ్వరికీ అడవుల పునరుజ్జీవనం పట్టదు. ప్రభుత్వానికేమో దీర్ఘకాలిక దృక్పథంగానీ, సమగ్ర అభివృద్ధి పథకంగానీ లేదు. ఫలితంగా అడవుల వినాశనం పెరిగేకొద్దీ వన్యప్రాణుల మనుగడ సమస్యాత్మకంగా తయారవుతోంది. అవి జనావాసాల మీదికి వచ్చి ప్రజలకు సమస్యగా మారుతున్నాయి.

1984లో ప్రవేశించిన ఏనుగులు 1985 మే నెల దాకా పంటల మీదికీ, మనుషుల మీదికీ రాలేదు. మే నెల తర్వాత ఎందుకు రావడం మొదలుపెట్టాయనే దానికి ఒక కథ ప్రచారంలోకి వచ్చింది. ఒకనాడు ఆ ఏడు ఏనుగులలో ఒకటి ప్రసవించిందట. పుట్టిన పిల్లను ఒకచోట వదిలి ఏనుగుల మంద మేతకని అడవిలోకి పోయిన సందర్భంలో ఆ ఏనుగుపిల్ల అడవిలోకి మేతకు వచ్చిన పశువులతో కలిసి ఎరికంబట్టు గ్రామంలోకి వచ్చేసింది. గ్రామస్థులకు ఏం చేయాలో అర్థంకాక దానిని పశువులతో బాటు కొట్టంలో ఉంచి పాలు తాగించే ప్రయత్నం చేసారు. అది ఎంతకూ తాగకపోయేసరికి వాళ్ళు సమీపంలోని పేర్నంబట్టు అటవీ అధికార్లకు తెలియజేసారు. వాళ్ళు వచ్చి చూసి ఎవరికీ చెందని ఏ వస్తువయినా ప్రభుత్వానికి చెందుతుందనే పాలసీ కింద ఆ ఏనుగు పిల్లను మద్రాసు జంతుప్రదర్శనశాలకు అప్పజెప్పారు. అది అక్కడ ఇమడలేక త్వరలోనే చచ్చిపోయిందట.

మేత నుండి తిరిగివచ్చిన ఏనుగుల మంద పిల్ల లేకపోవడం చూసి కోపగించు కున్నాయి. ఏనుగులకు వాటి పిల్లలమీద ప్రేమ ఎక్కువని, వాటికి ఏ కొంచెం హాని జరిగినా సహించవని నిపుణులు అంటారు. అవి కోపంతో అడవిని ధ్వంసం చేయడమే కాక అప్పటి నుండి పొలాల మీద, మనుషుల మీద దాడి చేయనారంభించాయని కథ. ఈ కథ నిజమే కావచ్చునుగానీ ఈ సంఘటన జరగకపోయినా ఏనుగుల సంఖ్య పెరిగేకొద్దీ అవి ఏదో ఒక రోజు మేత కోసం పొలాలకు వచ్చేవి. అడ్డం వచ్చిన మనుషుల మీద దాడిచేసేవి.

ఈ విధంగా 1985 మే నెల నుండి పంటల మీదా, మనుషుల మీదా ఏనుగుల దాడులు ప్రారంభమయ్యాయి. 1986లో 22 ఏనుగులతో కూడిన రెండవ మంద వీటితో కలిసేసరికి ఈ దాడులు మరిన్ని రెట్లు పెరిగాయి. ఈ అయిదేళ్ళలో ఆ ప్రాంత ప్రజల జీవితమే మారిపోయింది. వాళ్ళు పొలంలో చేసే శ్రమ అంతా ఏనుగులకు నైవేద్యం అయింది. ప్రతి గ్రామంలోనూ ఏనుగులు లక్షల రూపాయలు విలువ చేసే పంటను తింటున్నాయి. లేదా ధ్వంసం చేస్తున్నాయి. వాటికి చెరుకు గడలంటే ప్రీతి. పంటను బాగా ఎదగనిచ్చి మొత్తం తినేస్తాయి. రాగి చేనులోకి వచ్చాయంటే మొక్కలు విరవకుండానే కంకి మట్టుకు కొడవలితో కోసినట్లు తినేసిపోతాయి. వరి పొలాల్లోకి వస్తే వరికంకులు తినడమే కాక పొలంలో పడి పొర్లుతాయి. మామిడితోటలలో, కొబ్బరి తోటలలో చెట్లూ కొమ్మలూ విరగ్గొట్టి ఆడుకుంటాయి. ఏనుగులకు ఆకలి ఎంత ఎక్కువో క్రీడాభిలాష కూడ అంతే ఎక్కువ. రెండు కారణాలుగానూ రైతులు ఘోరంగా నష్టపోతున్నారు. నెలల తరబడి చేసిన శ్రమను కోల్పోని ఒక్క రైతూ ఆ ప్రాంతంలో లేడు. కొందరయితే పదే పదే నష్టపోతూ వున్నారు.

ప్రాణనష్టమూ విపరీతంగా జరిగింది. ఏనుగుపిల్ల పోయినందుకు కోపంతో మనుషుల మీద దాడి చేసి కొందరిని చంపి ఉండవచ్చును. కాని దానికంటే పొలానికి కాపలా వున్న రైతులను చంపిన సంఘటనలే ఎక్కువ. ఏనుగులు చాలా తెలివయిన జంతువులు. పొలం పక్కన చిన్న పాక వుంటే అది కాపలాదారు వుండే పాక అని అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నాయి. అందుకే పొలం మీద దాడిచేసే ముందు పక్కనున్న పాకను ధ్వంసం చేసి, అందులో మనిషి ఉంటే చంపుతున్నాయి. మొత్తం ఇప్పటిదాకా చనిపోయిన వారి సంఖ్య 30 అని ప్రభుత్వం చెపుతోంది. కాని 42 దాకా ఉండవచ్చునని ప్రజల అంచనా.

# నష్టం - నష్టపరిహారం

రాష్ట్ర హైకోర్టులో దాఖలు చేసిన కేసు కోసం పౌరహక్కుల సంఘం 60 గ్రామాలకు చెందిన 630 మంది రైతుల నుండి ఏనుగుల వలన వాళ్ళకు కలిగిన పంట నష్టం, వాటికి ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం వివరాలను సేకరించింది. అందులో ఒక్క గ్రామం వివరాలు మచ్చుకు ఇస్తున్నాం. మూడు పంట సీజన్లలో (1984-87) జరిగిన నష్టం వివరాలు ఇవి.

*గ్రామం : ఆరిమానిపెంట, పంచాయతి : పెద్దూరు, మండలం : రామకుప్పం*

| రైతు పేరు | నష్టపోయిన పంట | నష్టం విలువ (రూపాయలు) | నష్టపరిహారం (రూపాయలు) |
|---|---|---|---|
| తిమ్మప్ప (60) తండ్రి కదిరప్ప | వరి, పప్పుధాన్యాలు | 8450 | 750 |
| చిన్న కన్నప్ప (40) తండ్రి మునెప్ప | వరి, పప్పుధాన్యాలు | 10720 | -- |
| వెంకటస్వామి (35) తండ్రి మునుస్వామి | వరి, పప్పుధాన్యాలు | 12000 | -- |
| కన్నప్ప (35) తండ్రి మునెప్ప | వరి, పప్పుధాన్యాలు | 3300 | -- |
| దొరస్వామి నాయుడు (60) తండ్రి గవిరి నాయుడు | వరి, పప్పుధాన్యాలు | 2200 | -- |
| వేటస్వామి (35) తండ్రి కరెప్ప | వరి | 7200 | -- |
| మునుస్వామి (50) తండ్రి కరెప్ప | వరి | 4400 | -- |
| కన్నయ్య (50) తండ్రి కరెప్ప | వరి | 4000 | -- |
| కుట్టమ్మ (30) భర్త తోటహో హనుమప్ప | వరి, పప్పుధాన్యాలు | 5400 | -- |
| హనుమంతు (37) తండ్రి కదిరప్ప నాయుడు | వరి, పప్పుధాన్యాలు | 1700 | 750 |
| మునుస్వామి (32) తండ్రి గౌరప్ప | వరి, పప్పుధాన్యాలు | 10000 | -- |
| బట్టెప్ప (20) తండ్రి మల్లప్ప | వరి, పప్పుధాన్యాలు | 30000 | -- |
| గజ్జప్ప (60) తండ్రి మూలప్ప | వరి | 9600 | -- |
| మునుస్వామి (50) తండ్రి మునెప్ప | వరి | 4400 | -- |
| వీరప్ప (35) తండ్రి చిన్నప్ప | వరి, మల్బరీతోట | 11000 | -- |
| ఇందప్ప (22) తండ్రి కొర్రెప్ప | వరి | 3000 | -- |
| శంకరాచారి (40) తండ్రి రంగాచారి | వరి | 1200 | -- |
| గంగప్ప (55) తండ్రి గజ్జప్ప | వరి | 6000 | -- |
| నాగినేని స్వాయయప్ప తండ్రి మునుస్వామి | వరి, కొబ్బరి | 1200 | 1000 |
| మొత్తం 19 మంది రైతుల నష్టం - నష్టపరిహారం | | 1,45,770 | 2500 |

## ఏనుగులు తొక్కి చంపింది ఎంతమందిని, వాళ్ళెవరు...

ఇప్పటికి 30 మంది ఏనుగులవాత పడి చనిపోయారని ప్రభుత్వం అంటోంది. 42 మంది చనిపోయారని ప్రజలన్నారు. మొట్టమొదటి మృతుడు వి. కోట మండలం మద్దిమాకులపల్లెకు చెందిన మూగాచారి. ఆఖరివారు (ఇప్పటికి) వెంకటాచలం అనే వృద్ధుడు. పలమనేరు మండలం కొలమానపల్లి పంచాయితీలోని దొడ్డిపల్లె సమీపంలో 1990 నవంబర్ 5 సాయంత్రం 7 గంటలకు పొలం దగ్గర కాపలా ఉన్న ఇతని మీద 3 ఏనుగులు దాడిచేసి చంపాయి. చనిపోయిన వారంతా అడవిలో దొంగతనంగా కట్టె కొట్టుకోవడానికో లేక చట్ట వ్యతిరేక కార్యకలాపానికో పోయి ఏనుగులవాత పడిన వారేననీ, చట్టబద్ధంగా బతికే వాళ్ళకు ఏనుగుల బెడద ఏమీ లేదనీ ప్రభుత్వం హైకోర్టు ముందు ఇచ్చిన సమాధానంలో అనింది. చనిపోయిన వారందరి వివరాలూ మాకు దొరకలేదు గానీ దొరికిన మేరకు ఇక్కడిస్తున్నాం. ఒకే ఒక మినహాయింపుతో అందరూ చట్టబద్ధంగా బతుకుతూ చనిపోయినవారేనని ఈ పట్టిక తెలుపుతుంది. అయినా పోలీసులను వెనకేసుకొచ్చినట్లు ప్రభుత్వం ఏనుగులనూ వెనకేసుకురావటం ఏమిటి?

| పేరు | ఊరు (మండలం) | ఏ విధంగా చంపింది |
|---|---|---|
| *భీమానాయక్* | *నవియాల (రామకుప్పం)* | *వేరుశెనగ చేనుకు కాపలా ఉండగా చంపాయి* |
| *బోసన్నగారి బోడన్న* | *బోయచిన్నాగపల్లి (వి.కోట)* | *చేనుకు కాపలా ఉండగా చంపాయి.* |
| *బై సేగౌడ (ఇంటర్ విద్యార్థి)* | *లింగం ఆరిపల్లి (బై రెడ్డి పల్లి)* | *ఊరి బయట ఏనుగుల మంద ఉందని తెలిసి చూడడానికి వెళ్ళిన 15 మంది యువకుల్లో ఇతనొకడు. ఏనుగులు దాడిచేసి చంపేశాయి.* |
| *రంక్యమ్మ* | *నారాయణపురం (రామకుప్పం)* | *తన వూరి నుండి బస్సు కోసం ననియాలకు పోతుండగా దారిలో ఏనుగు దాడిచేసి చంపింది.* |
| *తట్టెప్ప* | *వీర్నమల (రామకుప్పం)* | *పొలం నుండి ఇంటికి తిరిగి వస్తుండగా దారిలో ఏనుగు దాడిచేసి చంపింది.* |
| *సేటప్ప* | *సింగసముద్రం (రామకుప్పం)* | *వీర్నమల నుండి తన ఊరికి అడవి మార్గాన వస్తూండగా ఏనుగులు దాడిచేసి చంపాయి.* |
| *మునిరావు* | *పాలరేవుగడ్డ (రామకుప్పం)* | *జొన్న చేనుకు కాపలా ఉండగా దాడిచేసి చంపాయి.* |
| *దశరథరావు* | *పాలరేవుగడ్డ (రామకుప్పం)* | *పొలం పక్కన గుడిసెలో పండుకొని ఉంటే ఏనుగులు గుడిసెను ధ్వంసం చేసి చంపాయి.* |

| | | |
|---|---|---|
| మునెప్ప | దాసయ్య గవునూరు (కుప్పం) | వేరుశెనగ చేనుకు కాపలా ఉండగా ఒక ఏనుగు ఎత్తి రాళ్ళమీద పడేసి చంపింది. |
| తుండుమప్ప | కంగుంది (కుప్పం) | ఇంట్లో పెళ్ళి వుంటే కట్టె తెచ్చుకుందామని అడవికి వెళితే ఏనుగులు దాడిచేసి చంపాయి. |
| చెంగ్రాయప్ప | కక్కునూరు (బైరెడ్డిపల్లి) | రాగిచేనుకు కాపలా ఉండగా ఏనుగులు దాడిచేసి చంపాయి. |
| పెద వెంకటప్ప | వెంగంవారిపల్లి (బైరెడ్డిపల్లి) | మేతకై అడవిలోకి పోయిన పశువుల కోసం వెళితే దారిలో ఏనుగులు దాడిచేసి చంపాయి. |

* *చనిపోయిన వారికి ఎక్స్‌గ్రేషియా కింద 10,000 రూపాయలు ఇస్తున్నారు.*

## ప్రభుత్వ వైఖరి

ఇది మొదటి నుండి ఏనుగులు తిరుగాడే అడవి అయివుంటే ప్రజలు వాటికి అలవాటు పడి ఉండేవారు. వాటి ఉనికికి అనుగుణమయిన వ్యవసాయ పద్ధతులూ, జీవన విధానమూ అలవర్చుకొని ఉండేవారు. అట్లాకాక అకస్మాత్తుగా ఈ జంతువుల దాడి ప్రారంభమయ్యేసరికి వాళ్ళకేమీ పాలుపోలేదు. భయం భయంగా బ్రతకసాగారు. సాయంత్రమయితే గ్రామ పరిసరాలు నిర్మానుష్యం కాసాగాయి. రాత్రంతా బిక్కుబిక్కు మంటూ ఇంట్లో గడిపి పొద్దున్న లేచి పొలంలో అవి ఎంత తినిపోయాయో చూసి రావడం వారికి దినచర్య అయింది. దానితోపాటు ఇప్పుడిప్పుడే ప్రతిఘటన కూడ నేర్చుకుంటున్నారు. ప్రధాన ఏనుగు బాధిత ప్రాంతమయిన కుప్పం, రామకుప్పం, బైరెడ్డిపల్లి, వెంకటగిరికోట (వి.కోట), పలమనేరు, బంగారుపాళ్యం మండలాలలో ఒక రకమయిన ప్రజల 'ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్' ఏర్పడింది. ఏనుగులు ఏ మండలంలో తిరుగుతున్నాయో మిగతా అన్ని మండలాలలోనూ తెలుస్తుంది. అవి ఒక ప్రాంతం నుండి ఇంకొక ప్రాంతానికి మకాం మారిస్తే వెంటనే అందరికీ తెలిసిపోతుంది. ఏనుగుల అలవాట్లనూ, మనస్తత్వాన్నీ గమనించడం నేర్చుకున్నారు. అవి శబ్దానికి జడుస్తాయని తెలుసుకొని ఊరిబయట ఏనుగుల మంద వుంటే గట్టిగా టపాకాయలు కాల్చడం, సుగాలీ (లంబాడా) తండాల వాళ్ళయితే నాటు తుపాకులు ఒక్కసారిగా గాలిలోకి పేల్చడం, తప్పెట్లతో గట్టిగా శబ్దాలు చేయడం, లేకపోతే అందరూ కలిసి ఒక్కసారిగా అరవడం నేర్చుకున్నారు. నైరాశ్యం, ధైర్యం, కర్మతత్వం, ప్రతిఘటన వీటి మధ్య ఊగిసలాడుతూ బతుకుతున్నారు.

| ప్రధాన ఏనుగుల బాధిత ప్రాంతం (1981 జనాభా లెక్కలు) | |
|---|---|
| రామకుప్పం మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 38047 హెక్టార్లు |
| అందులో అడవులు | 23978 హెక్టార్లు (63%) |
| 38 గ్రామాలు, జనాభా 34210 | |
| వెంకటగిరికోట (వి.కోట) మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 27751 హెక్టార్లు |
| అందులో అడవులు | 8705 హెక్టార్లు (31%) |
| 34 గ్రామాలు, జనాభా 48531 | |
| బైరెడ్డిపల్లి మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 24299 హెక్టార్లు |
| అందులో అడవులు | 7976 హెక్టార్లు (33%) |
| 25 గ్రామాలు, జనాభా 36200 | |
| పలమనేరు మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 21176 హెక్టార్లు |
| అందులో అడవులు | 11626 హెక్టార్లు (55%) |
| 17 గ్రామాలు, జనాభా 45225 | |
| కుప్పం మండలం (చిత్తూరు పశ్చిమ అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 30999 హెక్టార్లు |
| అందులో అడవులు | 20067 హెక్టార్లు (65%) |
| 64 గ్రామాలు, జనాభా 64188 | |
| బంగారుపాళ్యం మండలం (చిత్తూరు తూర్పు అటవీ డివిజన్) | |
| మొత్తం భూవైశాల్యం | 28184 హెక్టార్లు |
| అందులో అడవులు | 8097 హెక్టార్లు (29%) |
| 27 గ్రామాలు, జనాభా 50590 | |
| * ....ఇది ప్రధాన బాధిత ప్రాంతం. మొత్తం 15 మండలాలలో ఏనుగుల సంచారం ఉంది. | |

చిన్న జంతువులయితే వాటిని శాశ్వతంగా తరిమేద్దురేమోగానీ ఏనుగుల ముందు మనుషులు ఎంతయినా బలహీనులే. ఒకవేళ బలం తెచ్చుకొని వాటికి హాని కలిగిస్తే అది చట్టం ప్రకారం నేరం అవుతుంది. ప్రభుత్వ అటవీ విధానం ఫలితంగా ఏనుగులు ప్రజలపైన దాడులు చేస్తే దానికి ప్రభుత్వం బాధ్యత వహించదు గానీ ప్రజలు కోపం కొద్దీ ఏనుగులను ఏమయినా చేస్తే మట్టుకు వాళ్ల మీద కేసులు పెడుతుంది. ఏనుగును హత్యచేసి జైలుకు పోయిన ఒక రైతు ఉన్నాడు.

*వి. కోట మండలంలోని ఎగుడు, దిగుడు నేలల్లో ఒక ఇరుకైన లోయలో ఉంది 'వీరగురమ్మ తోపు' అనే కుగ్రామం. ఆ గ్రామానికి పక్కనే ఓ చిన్న మడుగుంది. నీళ్ళు తాగడానికి ఆ మడుగు దగ్గరికి వచ్చే పోయే ఏనుగులు ఆ ఊరి పొలాలను పదే పదే ధ్వంసం చేస్తున్నాయి. వేసిన ప్రతీ పంటా నాశనం అవుతూ వుంటే కడుపు మండిన వెంకటేశు అనే రైతు ఏనుగుల మీద ప్రతీకారం తీర్చుకోదల్చుకున్నాడు. వన్యమృగాల సంరక్షణ చట్టం ఒకటుందని, ఆ చట్టం కింద తాను నేరస్థుడవుతాడని అతనికి తెలియదో, తెలిసి కూడ పరవాలేదనుకున్నాడో గాని, తన ఊరి పక్కగా పోయే హైటెన్షన్ లైన్ నుండి కరెంటు లాగి ఏనుగుల దారికడ్డంగా ఇనపతీగ పెట్టాడు. ఒక ఏనుగు ఆ తీగ మీద కాలుబెట్టి షాక్ తగిలి కిందబడి చనిపోయింది. ఇది జరిగింది 1989 ఆగస్ట్ 16వ తేదీన. ఈ వార్త బయటికి పొక్కగానే చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా వచ్చి వెంకటేశు నాయకత్వంలో చచ్చిన ఏనుగుకి బొట్లు పెట్టి, దాని కళేబరాన్ని పూలతో అలంకరించి దానికి కర్మ చేసినంత పనిచేశారు.*

*అంతలో పోలీసులు వచ్చి వెంకటేశుని అరెస్టుచేసి వన్యప్రాణుల సంరక్షణ చట్టం సెక్షన్ 9(2) కింద కేసుపెట్టి జైలుకి పంపించారు.*

మరి ప్రభుత్వం ఏం చేస్తూ వుంది? 1987 దాకా అసలు పట్టించుకోలేదు. అంతగా సామాజికంగా రాజకీయంగా చైతన్యవంతమయిన ప్రాంతం కాదు కాబట్టి ఈ జనం కష్టాలను ఎవ్వరూ పట్టించుకోలేదు. కానీ క్రమంగా ఒత్తిడి పెరిగే కొద్దీ ప్రభుత్వం కొద్ది కొద్దిగా మేలుకోసాగింది. అయితే ఏనుగుల రాకకు తనదే బాధ్యత అని ఒప్పుకునే బదులు అది ప్రకృతిసిద్ధమయిన విషయమయినట్టు మీ జాగ్రత్త మీరే చూసుకోండి అని ప్రచారం చేసింది. అటవీ శాఖాధికార్లు కరపత్రాలు వేసారు, సినిమా టాకీసులలో స్లైడ్లు వేయించారు. ఏనుగులను 'స్వాములవారు' అని భావించే ప్రజల మూఢ నమ్మకాలను ఈ ప్రచారంలో సిగ్గువిడిచి వాడుకున్నారు.

చనిపోయిన వారి కుటుంబాలకూ నష్టపోయిన పంటకూ పరిహారం ఇవ్వడం కూడ ప్రారంభించారు. ఈ నష్టపరిహారాన్ని గురించి ప్రభుత్వం ఘనంగా చెప్పుకుంటూ వుంది కాబట్టి ఇది ఏ పరిమాణంలో వుందో స్పష్టంగా తెలుసుకోవాలి. ఏనుగుల బెడద తీవ్రంగా వున్న గ్రామాలు దాదాపు 100 ఉన్నాయి. పౌరహక్కుల సంఘం హైకోర్టులో కేసు వేయడం కోసం 60 గ్రామాలు తిరిగి 630 మంది రైతుల నుండి

వాళ్ళకు జరిగిన పంటనష్టాన్ని గురించి సమాచారం సేకరించిందని చెప్పాం కదా! ఆ కేసు 1988లో వేసాము. ఆ నాటికే సగటున ఒక్కొక్క గ్రామంలో 1 లక్ష రూపాయల దాకా పంట నష్టం అయిందని గమనించాము. ఆ తరువాత కూడ ఏనుగుల దాడి పెద్దఎత్తున జరిగినప్పుడల్లా గ్రామాలకు పోయి సమాచారం సేకరిస్తున్నాము. ఇప్పటికి మొత్తం పంట నష్టం (అన్ని గ్రామాలలో కలిపి) 2 లేక 3 కోట్ల రూపాయల దాకా ఉంటుంది. అయితే ప్రభుత్వం 1989 ఏప్రిల్ నెలదాకా ఇచ్చిన మొత్తం నష్టపరిహారం కేవలం 6 లక్షల 28 వేల రూపాయలు. ఇది పౌరహక్కుల సంఘం అంచనా కాదు, చిత్తూరు (పశ్చిమ) డివిజన్ అటవీ శాఖాధికారి అధికారికంగా ఇచ్చిన ప్రకటన. 1990 సెప్టెంబర్ నాటికి ఈ మొత్తం 7 లక్షల 65 వేలకు పెరిగిందని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికలో 27-7-1990 నాడు వచ్చిన వార్తను బట్టి తెలుస్తూ ఉంది.

ఈ నష్టపరిహారం అన్ని పంటలకూ లేదు. వరి, చెరుకు వంటి పంటలకు తప్ప జొన్న, వేరుశెనగ వంటి మెట్టపంటలకు నష్టపరిహారం లేదు. మామిడి, కొబ్బరితోటలకు నష్టపరిహారం లేదు. ఇళ్ళూ, నీళ్ళ పైపులూ ధ్వంసమయినా నష్టపరిహారం లేదు. వరి, చెరుకు పంటలకు ఇచ్చే నష్టపరిహారం కూడ చాలా తక్కువ. మొదట్లో వరిపంటకు ఎకరానికి 250 రూపాయలు, చెరుకు పంటకు 500 రూపాయలు ఇచ్చేవారు. అది మరీ తక్కువ అని రైతులు గొడవ చేయగా వరి పంటకు 500 రూపాయలు, చెరుకు పంటకు 1250 ఇవ్వసాగారు. ఒక ఎకరం పంటకు అయ్యే ఖర్చుతో వారిచ్చే నష్టపరిహారాన్ని పోల్చి చూస్తే ఇది ఎంత తక్కువో అర్థమవుతుంది. చిత్తూరు జిల్లాలో వున్న ధరలలో 1 ఎకరం వరి పంటకు 4500 రూ॥లు పైగా ఖర్చవుతుంది. సగటు ధర పలికితే ఖర్చులు పోను నికర ఆదాయం 2000 పైగా ఉంటుంది. అదే విధంగా చెరుకుపంటకు ఎకరానికి 6000 పైగా ఖర్చు అవుతుంది. దాన్ని బెల్లం చేసి అమ్మితే నికర ఆదాయం 5000 పైగా ఉంటుంది. అంటే ప్రభుత్వం ఇస్తున్న నష్టపరిహారం రైతులు చేసే ఖర్చులో 10 నుండి 20 శాతం మట్టుకే ఉంది. అది కూడ ఈ రెండు పంటలకే. మెట్టపంటలకు అసలేమీ ఇవ్వడం లేదు.

ఈ మాత్రం నష్టపరిహారానికి కూడ రైతులను చాలాసార్లు తిప్పించుకుంటారు. పంట నష్టపోయిన రైతు ఏనుగులు ధ్వంసం చేసిన దాఖలాలు మాసిపోయే లోపల మండల రెవెన్యూ ఆఫీసరు గారికి లిఖిత పూర్వకంగా అర్జీ పెట్టుకోవాలి. ఆయన

దాన్ని విలేజి అసిస్టెంట్లకు, ఆర్.ఐ.లకు పంపుతాడు. వాళ్ళు పంట నష్టాన్ని మదింపువేసి రిపోర్టు పంపుతారు. దానిని ఎం.ఆర్.ఓ. పరిశీలించి కలెక్టరు కార్యాలయానికి చేరుస్తారు. అక్కడ మళ్ళీ అది శల్యపరీక్షకు గురైన తరువాత జిల్లా కలెక్టరు ప్రకృతి వైపరీత్యాల చట్టం కింద నిధులు మంజూరుచేసి సంబంధిత డివిజినల్ ఫారెస్టాఫీసరుకు పంపిస్తాడు. ఆ అటవీ శాఖాధికారి నష్టపరిహారాన్ని డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో స్థానిక శాసనసభ్యులు, లేక మండలాధ్యక్షుల సమక్షంలో బాధితులకు చెల్లిస్తాడు. ఇదంతా అయ్యేసరికి వచ్చే నష్టపరిహారానికి, జరిగిన నష్టానికి పొంతన లేకపోవడమే కాక కాలయాపన కూడ చాలా అవుతుంది. రామకుప్పం మండలంలోని పంద్యాలమడుగుకు చెందిన పూజారి కరెప్ప అనే రైతు వరి పొలాన్ని ఏనుగులు నాశనం చేసిపోగా పై అధికారులంతా కలిసి నలభై సెంట్ల భూభాగంలో కొద్దిగా పెరిగిన పంట మాత్రమే నష్టమైందని చెప్పి, కేవలం 20 రూపాయల నష్టపరిహారం మంజూరుచేసి అతనికి డి.డి. ఇచ్చారు. దాన్ని రొక్కంగా మార్చుకోవడం కోసం కుప్పం వెళ్ళిరావడానికి అతనికి బస్ ఛార్జీయే 14 రూపాయలు అయింది!

ఒక్కొక్కసారి ఈ జాప్యం ఎంతుంటుందంటే పెట్టుకున్న అర్జీకి సమాధానం రాకముందే  ఆ పొలంలో మళ్ళీ పంట వేయడం, దాన్ని కూడ ఏనుగులు తొక్కిపోవడం జరుగుతుంది. దీనితో విసుగొచ్చి చాలామంది రైతులు పిటిషన్లు పెట్టుకోవడమే మానేశారు. ఫలితంగా ఈ మధ్య కాలంలో రిపోర్టు కాని పంట నష్టం చాలా వుంది.

నష్టపరిహారం ప్రహసనం ఇట్లావుంటే ఏనుగుల రాకపోకలను నిరోధించడానికి ప్రభుత్వం విద్యుద్దీకరించబడిన కంచెను నిర్మించడానికి పూనుకుంది. అడవికి అడ్డంగా ఇప్పటికే 56 కిలోమీటర్ల పొడవున 12 లక్షల ఖర్చుతో కంచెను నిర్మించారు. మరొక 25 కిలోమీటర్లు పొడిగించబోతున్నారు. దేశంలో ఇంత పొడవైన విద్యుత్ కంచె ఎక్కడా లేదని  పౌరహక్కుల సంఘం హైకోర్టులో వేసిన పిటిషన్‌కు సమాధానం చెప్తూ రాష్ట్రప్రభుత్వం చెప్పింది. అది నిజమే కావచ్చు గాని, ఆ కంచె ఏనుగులను ఆపడంలో సఫలం కాకపోతే బాధితులకి వచ్చిన సంతోషం ఏమీ లేదు. ఆ కంచె పూర్తిగా విఫలం అయిందని ఇప్పుడు ప్రభుత్వానికే ఒప్పుకోక తప్పడం లేదు.

ఈ కంచెకు 'గజ నిరోధక విద్యుత్ కంచె' అని పేరు పెట్టారు. ఎక్కువ ఓల్టేజీతో బలహీనమయిన కరెంటు సెకండులో పావువంతు ప్రవహిస్తుంది (పల్సేటింగ్

కరెంట్). ఈ కంచెను తాకితే ఏనుగులకు చురుక్కుమని షాక్ తగిలి అవి దూరం వెళ్ళిపోతాయని ప్రభుత్వం ఉద్దేశ్యం. ఇది ఏనుగులను భౌతికంగా ఆపడానికి కాదని, మానసికంగా నిరుత్సాహపరచడానికని ప్రభుత్వమే చెబుతోంది. కాని అటువంటి ఫలితమేమీ దక్కలేదు. కంచెను నిలబెట్టడానికి ఉపయోగించిన రాతి స్థంభాలను ఏనుగులు కాలితో తన్ని కంచెను కూల్చేస్తున్నాయి. తమ పశువులను అడవిలో మేపుకోడానికి కంచె అడ్డం వస్తోందని ప్రజలే కొన్ని చోట్ల కంచెను పీకేస్తున్నారు. ఈ చర్యే కంచె వైఫల్యానికి కారణమని ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తోంది. కాని కంచె నిర్మాణంలోనే లోపం వుంది. అడవి మొత్తం ఒకవైపు, ఊర్లు మొత్తం ఒకవైపు వుంటే ఊళ్ళకీ, అడవికీ మధ్య కంచె వేయొచ్చు. కాని అడవి అంతటా ఊళ్ళున్నప్పుడు కంచె ఎక్కడ వేసినా రెండు వైపులా అడవీ వుంటుంది, ఊర్లూ వుంటాయి. అంతేకాకుండా ఈ అడవిగుండా నిలువుగా మూడు రహదార్లు చిత్తూరు నుంచి తమిళనాడుకు పోతాయి. ఒకటి – పలమనేరు నుండి గుడియాట్టం పోయే రోడ్డు. రెండోది – రామకుప్పం నుండి వానియంబాడి పోయే రోడ్డు. మూడోది – వెంకటగిరికోట నుండి పేర్నంబట్టుకు పోయే రోడ్డు. ఈ మూడు రోడ్ల మీదుగా నిత్యం వాహనాలు ప్రయాణం చేస్తూ వుంటాయి. వీటిలో రెండో రోడ్‌ను మద్రాసు – బెంగుళూరుల మధ్య ప్రత్యామ్నాయ జాతీయ రహదారిగా రూపొందించే ప్రతిపాదన కూడ వుంది. ఈ రోడ్లకడ్డంగా కంచె వేయడానికి వీలు లేదు. నిజానికి ఇప్పటికి వేసిన కంచె కూడ ఈ రహదార్లకు ఖాళీ వదిలేసింది. కాబట్టి ఏ విధంగా చూసినా ఈ కంచె ఘోరంగా విఫలమయిందనే చెప్పాలి.

## పౌరహక్కుల సంఘం కేసు

ఈ పరిస్థితిలో పౌరహక్కుల సంఘం చిత్తూరు జిల్లా శాఖ 1988 తొలి రోజుల్లో ఏనుగు బాధిత ప్రాంతాల్లోని అనేక గ్రామాలు తిరిగి ప్రాణ నష్టాన్ని గురించి, పంట నష్టాన్ని గురించి సమాచారం సేకరించింది. అరవై గ్రామాలకు చెందిన 630 మంది రైతుల దగ్గర అఫిడవిట్లు సేకరించి హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. (ఎం.ఎస్. బాలాజీ వర్సస్ స్టేటాఫ్ ఆంధ్రప్రదేశ్, రిట్ పిటిషన్ నెం. 17746/88) ఏనుగుల బెడద గురించి సమగ్రమైన నివేదిక సమర్పించడానికి ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయమని, ఆ నిపుణుల కమిటీ నివేదికను అనుసరించి నివారణ చర్యలు చేపట్టమని ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వమని, పంటనష్టానికి, ప్రాణనష్టానికి న్యాయమయిన నష్టపరిహారం ఇప్పించమని కోర్టును పౌరహక్కుల సంఘం కోరింది.

**ఏనుగుల బాధితులకు అటవీశాఖ హితవు చెప్తూ విడుదల చేసిన కరపత్రం**

**కుప్పం, పలమనేరు, పుంగనూరు మరియు బంగారుపాళ్యం**

**రేంజి అడవుల సమీప గ్రామ ప్రజలకు విజ్ఞప్తి**

మన అడవులలో గత మూడు సంవత్సరములుగా ఏనుగులు సంచరిస్తున్నది మీకు తెలిసిన విషయమే. కానీ కొందరు అజాగ్రత్తగా నిర్లక్ష్యముగా ప్రవర్తించినందు వలన ప్రాణములు కోల్పోయినారు.

పై విషయములను పురస్కరించుకొని కొన్ని సూచనలు ఇవ్వడమయినది.

1. అడవులలో తిరుగు పశువుల కాపరులు తప్పనిసరిగా తెల్లగుడ్డలు వేసుకోరాదు.
2. పశువుల కాపరులు అడవిలోనికి వెళ్ళరాదు. లైను పక్కనే మేపుకొనవలెను.
3. పశువుల కాపరులు సాయంత్రం సమయంలో అతి జాగ్రత్తగా వుండవలెను. ఏనుగులు అడవి నుండి పొలములకు వచ్చునప్పుడు మీరు ఎదురయిన అవి హాని చేయవచ్చును.
4. అకస్మాత్తుగా ఎదురయిన పరుగెత్తవలయును. అంతేగాని వాటిని తరుముటకు ప్రయత్నించిన మీకు హాని జరగవచ్చును.
5. అటవీ సంపద దొంగిలించుటకు పోయి ఏనుగుల వలన నష్టపోయిన వారికి ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందదు.
6. మీరు నష్టపోయిన పంటలకు త్వరలో నష్టపరిహారము చెల్లించెదరు.
7. ఏనుగులు దేవతా జంతువులు. వాటిని కాపాడుట మన కర్తవ్యము.
8. ఏనుగులకు హాని తలపెట్టిన చట్టరీత్యా శిక్షార్హులు.
9. అడవి సమీపంలో ఏనుగులు ఎవరికయినా కనబడిన వెంటనే సమీపము లోని గార్డు వాచర్లకు తెలియజేయవలయును.
10. ముఖ్యంగా రాత్రులందు రైతులు చెరుకు గానుగల వద్ద నుండు సమయమున అగ్గి మంటలు వేసుకొని జాగ్రత్తగా మేల్కొని ఉండవలయును.

⟶

కావున ప్రజలు పై సూచనలను గమనించి అప్రమత్తముగా ఉండి అటవీ శాఖతో సహకరించవలయును.

ఏనుగుల వలన ఏ విధమయిన నష్టము వాటిల్లినను తక్షణమే సమీప స్థానిక అటవీ అధికారికి తగు సహాయము నిమిత్తము తెలియజేయవలసిందిగా కోరడమైనది.

ఇట్లు
అటవీ అధికారి
చిత్తూరు (పశ్చిమ)

ప్రభుత్వం సమాధానం చెప్తూ ఇంతకంటే నష్టపరిహారం వేరే ఏ రాష్ట్రంలోనూ ఇవ్వడం లేదని, ఇంత పొడుగు కంచె ప్రపంచంలో ఎక్కడా లేదని అంది. ఇంకా హాస్యాస్పదంగా ఏనుగులు తొక్కి చంపిన వాళ్ళందరూ కూడ కలప దొంగతనం కోసమో, వేరే ఏదో దుర్బుద్ధితోనో అడవిలోకి వెళ్ళిన వాళ్ళేనని, చట్టబద్ధంగా బతుకుతున్న వాళ్ళకి ఏనుగుల వల్ల ఏం ప్రమాదం లేదని చెప్పింది.

ఏనుగుల సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం ప్రభుత్వ అటవీ విధానంతో ముడిపడి వున్నప్పటికీ కొన్ని తక్షణ పరిష్కార చర్యలు లేకపోలేదు.

1. ఏనుగులను జనావాసం లేని దూరప్రాంత అడవులకు తరిమి వేయవచ్చును. ఉదాహరణకు తమిళనాడులో ఒక ఏనుగుల మందను ఈ మధ్యనే 600 కిలోమీటర్ల దూరాన వున్న మధుమలై అడవులలోకి తరిమేశారు. కర్ణాటకలో 11 ఏనుగుల మందను కూర్గ్ అడవులలోకి తరిమారు. బీహార్‌లోని రాంచి జిల్లాలో కూడ ఇదే విధంగా ఏనుగులను అడవిలోకి తరిమారు. ఈ విధంగా తరమడంలో నైపుణ్యంగల వ్యక్తులు దేశంలో వున్నారు. దీని గురించి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రానికి చెందిన కొందరు నిపుణులతో సంప్రదింపులు కూడ జరిపింది గాని ఏ కారణం వల్లనో ఆ పనిని వాళ్ళకి అప్పగించలేదు.
2. అభయారణ్యం : ఏనుగులకు ఆహార వసతి, నీటి వసతి కల్పించే ఒక అభయారణ్యాన్ని రూపొందించి వాటిని అక్కడికి తరమవచ్చును.
3. ఒకే ఒక పొడవైన కంచె కాకుండా ప్రతి గ్రామం చుట్టూ కంచె వేయవచ్చును.

పశువులు రావడానికి పోవడానికి సౌకర్యం కల్పించి, ఏనుగులను మాత్రం ఆపే విధంగా దాన్ని రూపొందించవచ్చును.

4. నష్టపరిహారం కంటితుడుపుగా కాక న్యాయమైనదిగా ఉండాలి. ఖర్చు, దిగుబడి, తిరిగి పంట వేయడానికయ్యే ఖర్చు వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. వరి, చెరుకు పంటలకే కాక జొన్న, వేరుశనగ వంటి మెట్ట పంటలకు, మామిడి, కొబ్బరి తోటలకు, ఇళ్ళు, గోడలు, బావులు వంటి స్థిరాస్తులకు కూడ నష్టపరిహారం ఇవ్వాలి.

5. ఏనుగులను పూర్తిగా తరిమివేయడానికి కొంతకాలం పడుతుంది కాబట్టి, అంతవరకూ న్యాయమైన నష్టపరిహారం ఇప్పించడానికి పంటబీమా పథకాన్ని ప్రవేశపెట్టాలి. ఖర్చే కాకుండా పంటమీద వచ్చే నికరాదాయంలో 80% రైతుకు వచ్చేటట్టు బీమా పథకాన్ని రూపొందించాలి. ఈ రకమైన 'ప్రకృతి వైపరీత్యాల పంట బీమా పథకాలు' కూడ కొన్ని వున్నాయి. అప్పుడు ఉదాహరణకు ఒక ఎకరం చెరుకు పంట నష్టమయితే ప్రస్తుతం ఇస్తున్న 1200 నష్టపరిహారం కాక మొత్తం 10,000 రూపాయల నష్టపరిహారం వస్తుంది. ఇతర పంటలకు కూడ ఇదే దామాషాలో నష్టపరిహారం వస్తుంది.

6. ఏనుగుల దాడిలో చనిపోయిన మనిషికి 10,000 రూపాయల ఎక్స్‌గ్రేషియా కాక సంపూర్ణ నష్టపరిహారం ఇవ్వాలి. ఉదాహరణకు పోలీసు కస్టడీలో చనిపోయిన వారికి కోర్టులు కొన్ని సందర్భాల్లో లక్ష రూపాయలకు పైగా నష్టపరిహారం మంజూరు చేశాయి.

ఈ సూచనలను పౌరహక్కుల సంఘం కోర్టుకి ఇచ్చిన సమాధానంలో ప్రతిపాదించింది.

## కౌండిన్య అభయారణ్యం

ఎంతసేపూ గ్రామస్థుల మీదేనా తన ప్రతాపం, ఒకసారి మంత్రికి కూడ తన తడాఖా చూపించాలనుకుందేమో ఒక పెద్ద గజరాజు. 1990 సెప్టెంబర్ 16 రాత్రి కుప్పం నుంచి చిత్తూరు వస్తున్న అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి చెంగారెడ్డి కారును అడ్డగించింది. మంత్రిగారే కాక వారి ఎస్కార్టు సైతం తారెత్తిపోయి ప్రాణాలరచేత

పెట్టుకున్నారు. కొంతసేపు వారిని ఏడిపించి మళ్ళీ ఏమనుకుందో ఏమో ఏనుగు నిశ్శబ్దంగా అడవిలోకి వెళ్ళిపోయింది. అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డికి ప్రీతిపాత్రుడయిన చెంగారెడ్డి ఈ విషయం తన నాయకుడికి చెప్పగానే అన్ని దినాలుగా లేని కదలిక ప్రభుత్వంలో అకస్మాత్తుగా వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏనుగులు సంచరించే ప్రాంతాన్ని 'కౌండిన్య అభయారణ్యం'గా ప్రకటించింది. సెప్టెంబరు 25వ తేదీన చెన్నారెడ్డి పలమనేరు దగ్గర దానికి శంఖుస్థాపన సైతం చేశాడు.

ఈ అభయారణ్యం కోసం పలమనేరు, బైరెడ్డిపల్లి, వి.కోట, రామకుప్పం, కుప్పం మండలాల్లో 357.6 చదరపు కిలోమీటర్ల అటవీ భాగాన్ని కేటాయించారు. 1990 నుంచి 1995 దాకా 1.5 కోట్ల రూపాయల బడ్జెట్‌ను మంజూరు చేశారు. ఇక ఆ 'అభయారణ్యా'న్ని అమలుచేయడమే తరువాయి.

అయితే అభయారణ్యం తయారుచేసినంత మాత్రాన ఏనుగు బాధితుల సమస్యలు తీరిపోవు. అభయారణ్యం జంతువులకు అభయం ఇస్తుంది. వాటి వల్ల బాధితులయిన ప్రజలకి కాదు. జంతువులు ఆ ప్రాంతంలో బతకడానికి కావాల్సిన సదుపాయాలన్నీ కల్పిస్తూ అదే సమయంలో అభయారణ్యం పరిసరాల్లో బతికే ప్రజలకు వాటివల్ల నష్టం జరక్కుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. అది మరొక నిష్ఫలమైన గజ నిరోధక విద్యుత్ కంచె కాకుండా నిజమైన సంరక్షణ కావాలి. మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలలోని శ్రీశైలం అడవుల్లో ఏర్పరచిన పులుల అభయారణ్యం విషయంలో ఇటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే అది ప్రజలకు భీతావహంగా మారింది. ఇక చిత్తూరులో ఏం జరుగుతుందో చూడాలి.

**ముగింపు**

ఏ సంస్కరణ అమలు కావాలన్నా ప్రజలు సంఘటితం కావాలనేది నాలుగు దశాబ్దాల భారత ప్రజాస్వామ్యం మనకు నేర్పిన గుణపాఠం. చిత్తూరు జిల్లా ఏనుగు బాధితులు ఇప్పటివరకూ సంఘటితం కాలేకపోయారు. అందుకోసం జరిగిన అన్ని ప్రయత్నాలకు స్థానిక పెత్తందార్లు అడ్డం వస్తున్నారు. చివరికి పౌరహక్కుల సంఘం అండ కూడ ప్రజలకు దక్కకుండా చేయాలని కుట్రలు పన్నారు. బాధిత ప్రాంతాల రైతులను, యువకులను కూర్చోబెట్టి ఒక ఐక్య ఆందోళనా వేదికను తయారు చేయాలని

పౌరహక్కుల సంఘం ప్రయత్నం చేసింది. అందుకోసం 1989 ఫిబ్రవరి 5వ తేదీన వి.కోటలో సమావేశం ఏర్పాటు చేసింది. అయితే అప్పటి పలమనేరు శాసనసభ్యులయిన మంత్రి సుబ్బయ్యగారి మనుషులూ, పోలీసులూ గ్రామ గ్రామం తిరిగి సమావేశానికి ఎవరూ హాజరు కాకూడదని, అది నక్సలైట్ల సమావేశమని జనాన్ని బెదిరించారు. ఆ రోజు ఉదయం తెల్లబట్టల పోలీసులు, తెలుగుదేశం గూండాలు పెద్ద సంఖ్యలో సమావేశ స్థలానికి వచ్చి పౌరహక్కుల సంఘం బాధ్యులను దౌర్జన్యంగా వి.కోట నుండి పంపించేశారు. ఆనాటి నుండి ఈనాటి దాకా ఏనుగు బాధితులను సంఘటితపరచే ప్రయత్నం ముందుకు సాగలేదు.

***ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రచురణగా వచ్చింది,***
***ఏప్రిల్ 1991***

# వెయ్యి మెగావాట్ల చీకట్లు


(శ్రీశైలం ముంపు గ్రామాలు: ఒక పరిశీలన)



ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

# వెయ్యి మెగావాట్ల చీకట్లు


## (శ్రీశైలం ముంపు గ్రామాలు : ఒక పరిశీలన)




ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

# వెయ్యి మెగావాట్ల చీకట్లు

## శ్రీశైలం ముంపు గ్రామాలు : ఒక పరిశీలన



శ్రీశైలం ప్రాజెక్టు గురించి పుస్తకాలలో పత్రికలలో తరచు చదువుతుంటాం. శ్రీశైలం, నాగార్జునసాగర్ రాష్ట్రంలోని ప్రధాన జలవిద్యుదుత్పత్తి కేంద్రాలు. రాష్ట్రంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో 2/3వ వంతు జలవిద్యుత్తు కాగా అందులో 60 శాతం పైగా ఈ రెండు ప్రాజెక్టులలో తయారవుతుంది.

1960లో ప్రారంభమయిన శ్రీశైలం ఆనకట్ట నిర్మాణం 1981లో పూర్తయింది. ఆ మధ్యలో దానిని బహుళార్థ సాధక ప్రాజెక్టు చేశారు. అంటే విద్యుత్ ఉత్పత్తికే కాక సాగునీటికి కూడ ఆ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. 1986–87 నాటికి శ్రీశైలం ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 440 మెగావాట్లు కాగా 1988–89 నాటికి అది 770 మెగావాట్లయింది. మరొక 990 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం నిర్మాణంలో ఉంది. ఇప్పటికే పూర్తయిన 770 మెగావాట్ల సామర్థ్యం రాష్ట్రంలోని జలవిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 32 శాతం.

సాగునీటి కాలువలు కూడ నిర్మాణంలో ఉన్నాయి. కుడికాలువ పూర్తయితే కర్నూలు, కడప జిల్లాలలో కొంత ప్రాంతానికి సాగునీరు ఇవ్వడమే కాక 'తెలుగుగంగ' రూపంలో మద్రాసుకు కూడ మంచినీళ్ళు ఇస్తుంది. ఎడమ కాలవ పూర్తయితే నల్గొండ జిల్లాకు సాగునీరు ఇస్తుంది. మొత్తం 4 లక్షల 95 వేల ఎకరాలకు సాగునీరొస్తుందని అంచనా.

ఇదంతా ప్రయోజనకరమే. కానీ ఈ ప్రయోజనం వెనక చాలా నష్టమూ ఉంది. కొంతమందికి, కొన్ని ప్రాంతాలకు ప్రయోజనం కలిగించే ఈ ప్రాజెక్టు మరికొంత మందికి, మరికొన్ని ప్రాంతాలకు చాలా నష్టం కలిగించింది, కలిగిస్తూ ఉంది. కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాలలో లక్షన్నర జనాభా నివసించే విశాల ప్రాంతం ముంపుకు గురయింది. లక్ష ఎకరాలకు పైగా భూమి నీటిపాలయింది. 21 వేల ఇళ్ళు నేలపాలయ్యాయి. 27 వేల కుటుంబాలు వీధిపాలయ్యాయి.

'అభివృద్ధికి మూల్యం చెల్లించాల్సిందే'నని ప్రభుత్వం అంటుంది. ప్రభుత్వమే కాదు, మన చుట్టూ ఉన్నవారు చాలామంది అంటారు. ఎవరి అభివృద్ధికి ఎవరు మూల్యం చెల్లించాలి? అనేది మొదటి ప్రశ్న. మూల్యం చెల్లించే వారి సమ్మతి తీసుకొని 'అభివృద్ధి' ప్రారంభించారా? అనేది రెండవ ప్రశ్న. 'ఇది కొందరి అభివృద్ధి కాదు, దేశం అభివృద్ధి' అంటారేమో. కొందరి అభివృద్ధిని దేశం అభివృద్ధిగా భావించేటట్లయితే కొందరి నష్టాన్ని దేశం నష్టంగా భావించనవసరం లేదా? అనేది మూడవ ప్రశ్న.

ఏ ప్రాజెక్టు నిర్మించినా ఎందరో కొందరి భూములూ, నివాసాలూ, జీవనమూ నాశనం అవుతాయి. మన రాష్ట్రంలో ఇప్పటిదాకా నిర్మించిన నదీ జలాల ప్రాజెక్టులే కాక, విశాఖ ఉక్కు కర్మాగారం వంటి పెద్ద పరిశ్రమల విషయంలోనూ ఇది జరిగింది, జరుగుతూ ఉంది. ఈ నష్టం 'దేశం కోసం' అనుకుంటే కొంతమంది మాత్రమే దానిని ఎందుకు భరించాలి? దేశమంతా భరించాలి కదా? నష్టాన్ని దేశమంతటికీ ప్రభుత్వం సమంగా పంచాలి కదా? 'దేశ అభివృద్ధి కోసం త్యాగం చేయాలి' అనే సూక్తి వినడానికి ఇంపుగానే ఉంటుంది. కానీ త్యాగం చేసేది ఒకరు, అభివృద్ధి ఫలితం పొందేది ఒకరని అర్థమయితే ఈ ఇంపుదనం పోతుంది.

పూర్తి స్థాయి నష్టపరిహారాన్ని – అంటే నిర్వాసితుల సంపూర్ణ పునరావాసంతో సహా – ప్రాజెక్టు ఖర్చులో భాగంగా పరిగణించి ప్రభుత్వం ప్రాజెక్టుకు రూపకల్పన చేయాలనేది పౌరహక్కుల సంఘం అభిప్రాయం. ఆ విధంగా చేస్తే ప్రాజెక్టు ఖర్చు భరించరానంత అవుతుందంటారేమో. ఇప్పుడు కూడ అవుతూ ఉంది కదా? ఎటొచ్చీ ఇప్పుడు ఆ ఖర్చుని నిర్వాసితులే భరిస్తున్నారు. భరించలేకపోతే చస్తున్నారు. అది ప్రాజెక్టు ఖర్చులో లెక్కకు రావడం లేదు. దానిని ప్రాజెక్టు ఖర్చులో లెక్కగట్టినప్పుడు పెద్ద ప్రాజెక్టులు ఖర్చురీత్యా అసాధ్యం అయిపోయేటట్లయితే చిన్న ప్రాజెక్టులే

కట్టుకుందాం. వాటివల్ల ముంపు తక్కువ ఉంటుంది. పునరావాసం ఖర్చు తక్కువ ఉంటుంది. అంతే తప్ప ప్రభుత్వం భరించడానికి సిద్ధంగా లేని ఖర్చును కొంతమంది ప్రజల మీదికి నెట్టేసి ఉన్న ఖర్చును లేనట్టు చూపించే ఈ బుకాయింపు వద్దు.

'అభివృద్ధి' ప్రజాస్వామికంగా ఉండాలనే అవగాహనలో భాగంగా ఇవ్వాళ ఈ చర్చ అంతర్జాతీయంగా జరుగుతూ ఉంది. శ్రీశైలం ముంపు గ్రామాల ప్రజల పరిస్థితుల గురించి ఢిల్లీకి చెందిన లోకాయన్ సంస్థ 1981లో ఒకసారి, 1985లో మరోసారి సర్వే జరిపి రెండు నివేదికలు ప్రచురించింది. వాటికి కొనసాగింపుగా 1992 ఏప్రిల్ నెలలో పౌరహక్కుల సంఘం బృందం మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలకు చెందిన 21 ముంపు గ్రామాలలో పర్యటించి నిర్వాసితుల స్థితిగతుల గురించి స్థూలంగా సమాచారం సేకరించి ఈ నివేదిక ప్రచురిస్తోంది. ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థలో ప్రజల జీవనం పట్ల ప్రభుత్వానికి ఉండవలసిన ప్రజాస్వామిక దృక్పథం, దాని నుండి ఉత్పన్నమయ్యే బాధ్యత మా విశ్లేషణకు గీటురాయి. ప్రజాస్వామ్యమంటే ఎవరో ఒకరు ఏదో విధంగా ఎన్నికయి ఏదో ఒక రకంగా పరిపాలించడం కాదు. దానికి కొన్ని ప్రమాణాలుంటాయి. కొన్ని విలువలుంటాయి. వాటికి అనుగుణంగా పరిపాలన సాగినప్పుడే అది ప్రజాస్వామ్యం.

## పౌరహక్కుల సంఘం పర్యటించిన గ్రామాలు

*మహబూబ్‌నగర్ జిల్లా: ప్రాగటూరు, మారమునగాల, క్యాతూరు, యాపల్దేవపాడు, గుండుమల్ల, సోమశిల, మంచాలకట్ట, జటప్రోలు, కొప్పునూరు, చిన్నమరూర్, వెల్లటూర్, చెల్లెపాడు, సోలీపురం, కాలూరు*

*కర్నూలు జిల్లా : బిజినవేముల, నెహ్రూనగర్ *, ముచ్చుమర్రి, బీరవోలు, ప్రాతకోట, తాటిపాడు, సిద్ధేశ్వరం ***

** నెహ్రూనగర్‌లో మురవకొండ, వీరాపురం, అర్లపాడు, మరుగుత్తి, కొండ ప్రాగటూరు గ్రామాల నిర్వాసితులు నివసిస్తున్నారు.*

*** సిద్ధేశ్వరం నిర్వాసితులు కొందరు జూపాడు బంగ్లా మండల కేంద్రంలో నివసిస్తున్నారు.*

## ఊరు మునిగింది

శ్రీశైలం ప్రాజెక్టు ఇరుకయిన కొండలోయలో ఉంది కాబట్టి ఆనకట్ట వల్ల జరిగే ముంపు ఆనకట్ట సమీప ప్రాంతానికి మాత్రమే పరిమితం కాలేదు. ఆనకట్టకు బాగా ఎగువన కూడ భూములు మునిగాయి. కృష్ణానది ప్రాజెక్టుకు ఎగువన దాదాపు 100 కిలోమీటర్ల వరకు వెడల్పయింది. ఈ పక్క, ఆ పక్క వున్న నేల కూడ మునిగింది. ఊళ్ళు మునిగాయి. పొలాలు మునిగాయి. నదీ ప్రవాహానికి ఎడమవైపు ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలోనూ, కుడి పక్కన ఉన్న కర్నూలులోనూ మొత్తం 117 గ్రామాలు – చిన్నవీ పెద్దవీ – ముంపుకు గురయ్యాయి. కొన్ని పూర్తిగా, కొన్ని పాక్షికంగా మునిగాయి. కొన్ని గ్రామాలలో ఊరూ పొలాలూ మొత్తం మునిగాయి. కొన్ని గ్రామాలలో ఊరు మిగిలి పొలాలు మునిగాయి. కొన్నింటిలో ఊరూ పొలాలూ రెండూ పాక్షికంగా మునిగాయి.

### ముంపు సమస్య

| | |
|---|---|
| *ముంపునకు గురయిన గ్రామాలు* | *117* |
| *అందులో పూర్తిగా మునిగినవి* | *27* |
| *గ్రామం పూర్తిగా, వ్యవసాయ భూమి పాక్షికంగా మునిగినవి* | *45* |
| *గ్రామం, వ్యవసాయ భూమి రెండూ పాక్షికంగా మునిగినవి* | *10* |
| *వ్యవసాయ భూమి మాత్రమే పాక్షికంగా మునిగినవి* | *35* |

*గమనిక : ఈ 117 గ్రామాలలో 100 రెవెన్యూ గ్రామాలు, 17 హామ్లెట్లు.*

ప్రాజెక్టు నిర్మాణం 1960లో ప్రారంభం అయినప్పటికీ 1981 దాకా పూర్తి కాలేదు. ఈ జాప్యం వల్ల మునగబోయే గ్రామాల ప్రజలు తమకు రాబోయే ప్రమాదాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. మునగబోయే గ్రామాలలో భూసేకరణ ప్రభుత్వం 1969 లోనే ప్రారంభించినా డబ్బులు లేక వాయిదా వేసింది. 1976–79 సంవత్సరాల మధ్య భూసేకరణ జరిగింది. పట్టా వున్న భూమికీ, ఇళ్ళకూ మాత్రమే కొంత నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం వాటిని 'స్వాధీనం చేసుకుంది'. అప్పటికీ జనం అక్కడే నివాసం కొనసాగించారు తప్ప ప్రత్యామ్నాయం వెతుక్కోలేదు. ముంపు ఇంకా ప్రారంభం కాలేదు కాబట్టి ఎవరి భూములలో వారు సేద్యం చేసుకుంటూ, ఎవరి ఇళ్ళలో వారు ఉండసాగారు. అకస్మాత్తుగా 1981 మార్చి నెల చివరలో ప్రభుత్వ అధికారులు గ్రామాల

మీద పడి బలప్రయోగంతో ఖాళీ చేయించారు. పోలీసుల సాయంతో కూలి వాళ్ళను పెట్టి ఇళ్ళు కూలగొట్టించి జనాన్ని ఊళ్ళ నుండి తరిమేసారు. ఆ విధంగా ఒక్కసారిగా 27 వేల కుటుంబాలు వీధిపాలై కొత్త నివాసాలు ఏర్పరచుకోవలసి వచ్చింది.

**తాలూకా వారీగా ముంపుకు గురయిన గ్రామాల సంఖ్య**

| | |
|---|---|
| ***కర్నూలు జిల్లా :*** | |
| *నందికొట్కూరు తాలూకా* | *32* |
| *ఆత్మకూరు తాలూకా* | *14* |
| *కర్నూలు తాలూకా* | *4* |
| ***మహబూబ్‌నగర్ జిల్లా :*** | |
| *కొల్లాపూర్ తాలూకా* | *27* |
| *ఆలంపూర్ తాలూకా* | *29* |
| *వనపర్తి తాలూకా* | *11* |
| *మొత్తం* | *117* |

జనం ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారో ఊహించడం కష్టం కాదు. ప్రాజెక్టు ఎక్కడో ఉంది. దానిని చూసిన వాళ్ళు ఆ వూళ్ళలో లేరు. దానివలన తమ జీవితాలకు నిజంగా భంగం కలుగుతుందని వాళ్ళు చాలాకాలం నమ్మలేదు. ఏదో కొంచెం మునిగినా బ్రతుకు అక్కడే వెళ్ళదీయవచ్చుననుకొన్నారు. ప్రాజెక్టు పూర్తి కావడంలో జాప్యం జరిగే కొద్దీ ఇదంతా వట్టి బెదిరింపేనన్న అభిప్రాయం కూడ జనంలో బలపడింది. 'ప్రభుత్వం ఎప్పుడూ అది చేస్తాము ఇది చేస్తాము అంటుంది కానీ ఏమీ చేయదు. ఈ ప్రాజెక్టు మాత్రం నిజంగా కట్టేదేనా' అనుకున్నారు.

1981 మధ్య భాగంలో రెండు నెలల వ్యవధిలో లక్షన్నర మందిని ప్రభుత్వం ఈ విధంగా బలప్రయోగంతో నిర్వాసితులను చేసింది. వాళ్ళంతా ఎక్కడికి పోవాలి? అది వాళ్ళ 'కర్మ'. ప్రభుత్వానికి అక్కరలేదు. వాళ్ళకు వ్యవసాయ భూమి కాదు సరి కదా, కనీసం ఇళ్ళ ప్లాట్లయినా ప్రభుత్వం ఎక్కడా ఇవ్వలేదు (షెడ్యూల్డు కులాలకు తప్ప).

| | | |
|---|---|---|
| నిర్వాసితులయిన కుటుంబాలు | *27,871* | |
| ఇళ్ళు | *20,800* | |
| జనాభా | *1,50,000* | (సుమారు) |
| మునిగిన భూమి | *1,07,348* | ఎకరాలు |

ఊరి చుట్టూ నీళ్ళు వచ్చిన వాళ్ళు దూరం పోక తప్పలేదు. కర్నూలు జిల్లాలోని సిద్ధేశ్వరం, సంగమేశ్వరం, కపిలేశ్వరం గ్రామాలవారు ఊరి చుట్టూ నీళ్ళు రాగానే జూపాడు బంగ్లా మండల కేంద్రానికీ, ఇతర దూరప్రాంత గ్రామాలకూ వలసపోయారు. అయితే ఆ అగత్యం లేనివాళ్ళు పాత ఊరికి దగ్గరలోనే మెట్ట ప్రాంతంలో కొత్తగా నివాసాలు వేసుకున్నారు. ఇళ్ళ ప్లాట్లు కొనుక్కొని ఇళ్ళు వేసుకున్నారు. నాలుగయిదేళ్ళ క్రితం ఇచ్చిన నష్టపరిహారం కొత్త ఇల్లు కట్టుకోవడానికి ఏ మాత్రం సరిపోదు కాబట్టి పశువులమ్మి, అప్పుచేసి తలదాచుకోవడానికి ఇల్లొకటి ఉందనిపించుకున్నారు. అత్యధిక భాగం కుటుంబాలు పాత ఇంట్లో సగం విలువచేసే ఇళ్ళు కూడ కట్టుకోలేకపోయారు. కర్నూలు జిల్లా ముంపు గ్రామాలలో ముంపుకు పూర్వం రాతి ఇళ్ళు చాలా ఉండేవి. కొత్తగా వచ్చిన పునరావాస గ్రామాలను చూస్తే రాతితో కట్టిన కట్టడాలు తగ్గినట్టు స్పష్టంగా తెలుస్తుంది. లోకాయన్ 1985లో సర్వే చేసిన ఒక గ్రామంలో ముంపుకు ముందు 81 శాతం ఇళ్ళు రాతితో కట్టినవి అయితే ముంపు తరువాత వారు పునరావాస గ్రామంలో కట్టుకున్న ఇళ్ళలో రాయితో కట్టినవి 55 శాతం మాత్రమే. అన్ని పునరావాస గ్రామాలలోనూ పక్కా ఇళ్ళ కంటే గుడిసెలే ఎక్కువ కనిపిస్తాయి.

గ్రామం అంటే ఇళ్ళు మట్టుకే కాదు కదా! ఇల్లయితే అప్పో సప్పో చేసి కట్టుకున్నారు. కాని పునరావాస స్థలానికి గ్రామం రూపం రావాలంటే రోడ్లు కావాలి, కరెంటు కావాలి, బోర్‌లు కావాలి, స్కూలు కావాలి, గ్రామ పంచాయితీ కార్యాలయం కావాలి, ఇంకా ఎన్నో కావాలి. ఇవన్నీ ఒక్కొక్కటీ సమకూరి గ్రామం రూపం రావడానికి నాలుగయిదేళ్ళు పట్టింది. ఇప్పటికీ పూర్తిగా రాలేదు. ఒక్క కరెంటు మాత్రమే వెంటనే వచ్చింది. మిగిలిన వసతులన్నీ తీరికగా రాసాగాయి. ముఖ్యంగా రోడ్ల గురించి, మంచినీటి గురించి మహబూబ్‌నగర్ జిల్లా పునరావాస గ్రామాలలో అందరూ ఫిర్యాదు చేస్తున్నారు. ఆలంపూరు తాలూకాలోని ప్రాగటూరు, క్యాతూరు, మారమునగాల, యాపల్దేవపాడు తదితర గ్రామాలలోనూ, కొల్లాపూర్ తాలూకాలోని చిన్నమరూర్,

వెల్లటూర్ తదితర గ్రామాలలోనూ ప్రజలు నీటి సమస్య గురించి పౌరహక్కుల సంఘం కమిటీకి ఫిర్యాదు చేశారు. పాత గ్రామాలు పల్లపు ప్రాంతాలలో ఉండేవి. నదికి దగ్గర ఉండడం వల్ల భూగర్భజలం బాగా ఉండేది. ఇప్పుడు వారు తమ పునరావాస గ్రామాన్ని మెట్ట ప్రాంతంలో గట్టి నేలలో కట్టుకున్నారు. ప్రభుత్వం చేతిబోర్లు వేసిందిగానీ నీళ్ళుమట్టుకు సరిగా రావడం లేదు. గ్రామం లోపల రోడ్లు కూడ చాలా ఊళ్ళలో ఇప్పటికీ సరిగా లేవు. వర్షం వస్తే రాకపోకలు కష్టం. గ్రామానికీ గ్రామానికీ మధ్య రోడ్లు కూడ సరిగా లేవు. వర్షాకాలంలో బస్సులు రావు. ముంపుకు పూర్వం యాపల్దేవపాడు, మారమునగాల, గుండుమల్ల, చిన్నమరూర్ గ్రామాలకు బస్సులు వచ్చేవిగానీ పునరావాస గ్రామాలకు రావడం లేదు. రోడ్లు ఇదిగో వేస్తున్నామని ప్రభుత్వం అంటుందిగానీ గ్రామాల నుండి ప్రజలను తరిమేసి 11 ఏళ్ళయినా అవి పూర్తికాలేదు. ఈ వసతుల విషయంలో మహబూబ్‌నగర్ కంటే కర్నూలు పరిస్థితి కొంచెం మెరుగ్గా ఉంది.

అకస్మాత్తుగా ప్రజలను ఊళ్ళనుండి వెళ్ళగొట్టి, వాళ్ళు నానాకష్టాలు పడి దగ్గరిలో ఎక్కడో ఇళ్ళు వేసుకుంటే అప్పుడొచ్చి ప్రభుత్వం అరకొరగా గ్రామ వసతులు కల్పించే ప్రయత్నం మొదలుపెట్టే బదులు, ప్రాజెక్టు పూర్తికావడానికి రెండు మూడేళ్ళు ఉండగానే పునరావాస కార్యక్రమాన్ని మొదలు పెట్టవచ్చును గదా? ప్రభుత్వానికి ఈ ఆలోచన ఎందుకు రాలేదు? ముంపు గ్రామాలవాళ్ళు ప్రజలు కారా, పౌరులు కారా, వాళ్ళ సౌకర్యం ప్రభుత్వానికి అక్కరలేదా?

నిజం చెప్పాలంటే పునరావాసాన్ని ప్రభుత్వం తన బాధ్యతగా భావించడం లేదు. ప్రాజెక్టు కట్టి కరెంటు ఉత్పత్తి చేయడం మాత్రమే తన బాధ్యత అనుకుంటోంది. కాలవలు తవ్వి సేద్యపునీరు ఇవ్వడం మాత్రమే తన బాధ్యత అనుకుంటోంది. పునరావాసాన్ని వెతుక్కోవడం నిర్వాసితుల బాధ్యత అనుకుంటోంది. అక్కడ వసతులు లేకపోతే అది వాళ్ళ 'కర్మ' అనుకుంటోంది.

## పొలం మునిగింది

ఊరితోపాటు చాలాచోట్ల పొలమూ మునిగింది. 1976-79 సంవత్సరాల మధ్య ప్రభుత్వం పట్టాభూమిని ఎకరానికి సగటున 2560 రూపాయల నష్టపరిహారం మాత్రమే ఇచ్చి 1 లక్ష 7 వేల ఎకరాల భూమిని సేకరించింది. అయితే 1981 వరకు ఆ భూమిని రైతులు అనుభవిస్తూనే ఉన్నారు. ఆ సంవత్సరం ప్రాజెక్టు పూర్తికావడంతో అకస్మాత్తుగా భూమి కోల్పోయారు.

### ఏ రకం భూమి ఎంత మునిగింది

(ఎకరాలలో)

| | కర్నూలు జిల్లా | మహబూబ్‌నగర్ జిల్లా | మొత్తం |
|---|---|---|---|
| మాగాణి | 2028 | 1546 | 3574 |
| మెట్ట | 47029 | 42929 | 89958 |
| తోపులు | 456 | 114 | 570 |
| బంజరు, పోరంబోకు | 5294 | 7952 | 13246 |
| మొత్తం | 54807 | 52541 | 107348 |

మునగని మెట్టప్రాంతం వెతుక్కొని ఇళ్ళయితే వేసుకున్నారు గానీ కొత్తగా పొలం ఎక్కడనుండి రావాలి? ప్రభుత్వం నష్టపరిహారం పేరిట ఒక ఎకరానికి ఇచ్చింది అరెకరం కొనుక్కోవడానికి కూడ సరిపోదు. మెట్టభూమికి ఎకరానికి రూ. 200 నుండి 1000 దాకా, మాగాణికి 2500 నుండి 3000 దాకా, కె.సి. కెనాల్ ఆయకట్టు భూమికి 5000 దాకా ఇచ్చింది ప్రభుత్వం. ఆనాటికే ఈ మొత్తం ఆ భూమి మార్కెట్ వెలలో సగం మాత్రమే. ఇంక ఆ తరువాత పెరిగిన ధరలతో తిరిగి అంత భూమి కొనుక్కోవడం కలలోని మాట. నిజానికి ఇంటికి ఇచ్చిన నష్టపరిహారం, పొలానికి ఇచ్చిన నష్టపరిహారం కలిపి పునరావాసం ఖర్చుకే సరిపోయింది. కొత్త ప్రాంతానికి పోవడానికీ, ఇంటి ప్లాటు కొనుక్కోవడానికీ, ఇల్లు వేసుకోవడానికీ, నాలుగు రోజులు తినడానికీ అన్నిటికీ డబ్బు కావాలి కదా! ప్రభుత్వం ఇచ్చిన డబ్బు ఇల్లు కట్టుకోవడానికే సరిపోతే ఇంక పొలం ఎక్కడ నుండి కొనుక్కోవాలి?

కొత్తగా భూమి కొనుక్కున్నది నిజానికి చాలా కొద్దిమంది. అధికులు భూమిలేని కూలీలుగా మారారు. ముంపుకు ముందు వేల ఎకరాలు సాగుచేసిన గ్రామాలు ముంపు తరువాత కేవలం కొన్ని వందల ఎకరాల సేద్యంతో సంతృప్తి చెందవలసి వచ్చింది. దీని ప్రభావం రైతుల మీదా వ్యవసాయ కూలీల మీదా బలంగా పడింది.

ముంపుకు గురయిన భూమిలో 13 వేల ఎకరాలు పోరంబోకు లేక బంజరు. మరొక 570 ఎకరాలు తోపులు. తోపులలో ప్రధానమయినవి తాటి లేక ఈత తోపులు.

| రైతాంగంలో పెరిగిన పేదరికం | | |
|---|---|---|
| గ్రామీణ జనాభాలో | ముంపుకు ముందు | తరువాత |
| ధనిక రైతులు | 17% | 8% |
| మధ్యతరగతి రైతులు | 16% | 6% |
| పేద రైతులు | 36% | 17% |
| వ్యవసాయ కూలీలు | 17% | 52% |

*(మూలం : 'లోకాయన్' 1985లో 9 గ్రామాలలో జరిపిన సర్వే)*

గౌడ (ఈడిగ) కులస్థులకు ఈ తోపులే జీవనాధారం. ముంపు ఫలితంగా వాళ్ళు చాలావరకు తమ జీవనాధారాన్ని కోల్పోయారు. ఉదాహరణకు నందికొట్కూరు తాలూకా బిజినవేములకు చెందిన 15 ఈడిగ కుటుంబాలు కులవృత్తి కోల్పోయి కూలి చేసుకుంటున్నారు. ముంపుకు గురయిన పోరంబోకు లేక బంజరు భూమిలో కొంత భాగం బీడు భూమిగా ఆవులు, ఎడ్లు, గొర్రెలు, మేకలు మేయడానికి ఉపయోగపడేది. మరికొంత భూమిని షెడ్యూల్డు కులాలు తదితర పేదలు పట్టా లేకుండా సాగు చేసుకునేవారు. ముంపు వల్ల ఇదంతా పోయింది.

ఈ నష్టానికి నామమాత్రపు నష్టపరిహారం కూడ లేదు. దీనివల్ల నష్టపోయేది ప్రధానంగా దళిత కులాలవారు, భూమిలేని వ్యవసాయ కూలీలు. గొల్లలు అన్ని గ్రామాలలోనూ తమ గొర్రెల్ని 75% నుండి 90% దాకా అమ్మేసుకున్నారు. రైతులు కూడ ఆవులను, ఎడ్లను 75% దాకా అమ్మేసుకున్నారు. వ్యవసాయభూమి చాలావరకు పోయిన పరిస్థితిలో రైతులకు పశువుల అవసరం తగ్గింది. వాటిని మేపటమూ కష్టమయింది. బీడు భూముల ముంపు కూడ మేత సమస్యను చాలా పెంచింది. అయితే అన్ని గ్రామాల రైతులూ ఒక్కసారిగా పశువులను అమ్మజూపేసరికి పశువుల ధర పడిపోయి చవకగా అమ్మివేయవలసి వచ్చింది. దీనినంతా నష్టంగా పరిగణించే దృష్టే ప్రభుత్వానికి లేదు.

పశువులు మేసే బీళ్ళు పెద్ద మొత్తంలో మునిగిపోవడమే కాక, మునిగిపోని బీడు భూములు కూడ తప్పనిసరై సేద్యపు భూములుగా మారాయి. ఆ రకంగా కూడ పశువులకు మేత తగ్గిపోయింది. అమ్ముకున్న పశువులను అమ్ముకోగా మిగిలిన వాటి

మేత కోసం చాలా దూరం పోవలసి వస్తూ ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా మంచాలకట్టకు చెందిన గొల్లవాళ్ళు సంవత్సరంలో ఆరునెలలు మేత కోసం గొర్రెల్ని తీసుకొని కర్నూలు జిల్లాలోని కె.సి. కెనాల్ గట్ల వెంబడిపోవలసి వస్తూ ఉందని చెప్పారు.

మరి ఇప్పుడు ఊళ్ళల్లో బతుకు ఏ విధంగా గడుస్తూ ఉంది?

బొత్తిగా బతుకు గడవని వాళ్ళు దూరప్రాంతాలకు వలసపోతున్నారు. ప్రతి ఊరిలోనూ వలసపోయిన కుటుంబాలున్నాయి. కొన్ని ఊళ్ళలో 10 శాతం, కొన్ని ఊళ్ళలో 20 శాతం కుటుంబాలు వలసపోయాయి. నందికొట్కూరు తాలూకా ముచ్చుమర్రిలో సగం కుటుంబాలు వలసపోయాయని గ్రామ పెద్దల అంచనా.

మిగిలిన వాళ్ళు సన్నకారు రైతులుగా, వ్యవసాయ కూలీలుగా పనిచేసుకొని బతుకుతున్నారు. ప్రాజెక్టుల వల్ల అదనంగా ఒకే ఒక వృత్తి పుట్టుకొచ్చింది. అది చేపలు పట్టే వృత్తి. సంప్రదాయకంగా బెస్తల వృత్తి అయినది ఇప్పుడు (ముఖ్యంగా కొల్లాపూర్ తాలూకాలోని ముంపు గ్రామాలలో) అందరి వృత్తీ అయింది. ముంపు వల్ల నది వెడల్పయి చేపల వేటకు అవకాశం పెరిగింది. 'పుట్టి' వేసుకొని నదిలోకి పోయి చేపలు పట్టి బయట అమ్మి బతుకుతున్నారు. పొలాలు మొత్తం మునిగిపోయిన కాలూరు, సోలీపురం, చెల్లెపాడు, వెంకటంపల్లె వంటి గ్రామాలలో అందరూ జాలర్లయ్యారు. ఒకప్పుడు రైతులుగా సంపాదించిన దానిలో నాల్గవవంతు సంపాదనతో బతికేస్తున్నారు. నందికొట్కూరు తాలూకాలోని మూర్వకొండ, వీరాపురం, అర్లపాడు, కొండ ప్రాగటూరు, బీరవోలు, తాటిపాడు మొదలయిన గ్రామాలలోనూ అందరూ కాకున్నా కొందరు జాలర్లయ్యారు.

వ్యవసాయమంటూ ఏమయినా మిగిలి వుంటే అది మునిగిపోయిన భూమిలోనే. వేసవిలో నది సగం ఎండిపోతుంది. అప్పుడు రైతులు తమ (ఒకప్పటి) పొలాలలో ఏదో ఒక మెట్ట పంట వేసుకుంటున్నారు. ఆ మాత్రం జీవనాధారం కూడ లేకపోతే ఏమయిపోదురో. అయితే ప్రభుత్వం దీనిని కూడ సాగనివ్వకుండా చూడాలని ప్రయత్నించింది. 'నష్టపరిహారం ఇచ్చి నేను సేకరించిన భూమి నాది గానీ, మళ్ళా మీరు దానినెట్లా సాగుచేసుకుంటారు' అనేది ప్రభుత్వ వైఖరి. కర్నూలు జిల్లాకు చెందిన బన్నూరు, తమ్మలూరు, కృష్ణారావుపేట తదితర గ్రామాలలో ముంపు నేలలలో సాగును

ఆపటం కోసం ప్రభుత్వం ఆ నేలలలో తుమ్మలు నాటించింది. అయితే రైతులు ఆందోళన చేసేసరికి ఆ కార్యక్రమాన్ని తాత్కాలికంగా ఆపివేసినట్టుంది.

ముంపు గ్రామాల యువకులకు ప్రాజెక్టులో ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఒకటి ప్రభుత్వం అప్పట్లో ఇచ్చింది. అయితే దానికి జీవో రూపం ఇచ్చేనాటికి (1985) ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిపోయింది. కేవలం ప్రాజెక్టు నిర్వహణే మిగిలింది. ఈ దశలో ఉద్యోగాలు దొరికే అవకాశం తక్కువ. కర్నూలు జిల్లాకు చెందిన వారు అప్పటి నీటి పారుదల శాఖ మంత్రిని పట్టుకొని పైరవీ చేసుకోగలిగారు కాబట్టి ఈ జీవో కింద ఇచ్చిన 35 ఉద్యోగాలూ కర్నూలు వాళ్ళకే వచ్చాయి. అందులోనూ ఎక్కువ భాగం ఒక్క ప్రాతకోట గ్రామస్తులకే వచ్చాయి. అయినా లక్షన్నర నిర్వాసితులెక్కడ, 35 ఉద్యోగాలు ఎక్కడ!

## ప్రజలు కోర్టు పక్షులయ్యారు

మునిగిపోయిన ఇళ్ళకూ, సేద్యపు భూమికీ ప్రభుత్వం కొంత నష్టపరిహారం ఇచ్చిందని పైన చెప్పాము కదా! దాని గురించి ఇంకొంచెం వివరంగా తెలుసుకోవలసి ఉంది. తెలుసుకున్న తరువాత ఈ ప్రభుత్వం తనను తాను ప్రజలకు ప్రతినిధిగా భావించుకుంటుందా లేక శత్రువుగా భావించుకుంటుందా అని మీకు అనుమానం వస్తే ఆ తప్పు మీది కాదు.

ప్రాజెక్టుల కోసం ప్రజల భూములు సేకరించడానికి ఒక చట్టం ఉంది. దాని పేరు భూసేకరణ చట్టం (Land Acquisition Act) 1894. భూమికీ, ఇళ్ళకూ ఇతర స్థిరాస్తికీ తాను నిర్ణయించిన నష్టపరిహారాన్ని సూచిస్తూ ప్రభుత్వం ఒక్కొక్క పట్టాదారుకూ నోటీసు ఇస్తుంది. నష్టపరిహారాన్ని నిర్ణయించేది ప్రభుత్వ అధికారులే. న్యాయంగా అయితే అటువంటి ఆస్తిని తిరిగి కొనుక్కోవడానికి ఎంత ఖర్చవుతుందో అంత నష్టపరిహారం ఇవ్వాలి. అప్పుడే నష్టపరిహారం అన్నమాటకు అర్థం ఉంటుంది. కానీ ప్రభుత్వ అధికారులు ఆ విధంగా అంచనా వేయరు. ఆ ప్రాంతంలో గతంలో జరిగిన భూముల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ కాగితాలలో పేర్కొన్న ధరలను బట్టి నష్టపరిహారం నిర్ణయిస్తారు. (ఆ పైన పట్టాదారులు ఇచ్చుకునే లంచాలు, ముడుపులు పనిచేస్తాయి.) దీని వల్ల లంచాలు బాగా ఇచ్చుకోగల పట్టాదారులను మినహాయిస్తే మిగిలిన వారికి

చాలా తక్కువ ధర వస్తుంది. స్టాంప్ డ్యూటీ తగ్గించుకోవడం కోసం అసలు కొనుగోలు ధర కంటే తక్కువ ధరకు రిజిస్టర్ చేయడం అన్ని చోట్లా ఉండే అలవాటే. అంతేకాక, ప్రాజెక్టు నిర్మాణం 1960లో ప్రారంభమయిన నాటి నుండి ఈ ప్రాంతంలో భూములు మునిగిపోతాయని చెపుతూ వచ్చారు కాబట్టి అక్కడ భూముల ధర పడిపోయింది. అసలు అమ్మకాలే తక్కువయ్యాయి. దీనివల్ల నష్టపరిహారం ఇంకా తగ్గిపోయింది. ఇది చాలదన్నట్టు ప్రభుత్వం రైతులను నేరుగా మోసం చేయడానికి పూనుకుంది. కె.సి. కెనాల్ ఆయకట్టు భూముల వెల ఎక్కువ ఉంటుంది కాబట్టి నష్టపరిహారం ఎక్కువ ఈయవలసి ఉంటుంది. 1957 తరువాత కె.సి. కెనాల్‌లో నీటిపారుదల పెరిగిన కారణంగా కర్నూలు జిల్లా రైతులు అదనంగా 19,000 ఎకరాల భూమిని ఆయకట్టు కిందికి తెచ్చారు. సాధారణ పరిస్థితిలో ప్రభుత్వం దానిని క్రమేణా ఆయకట్టు భూమిగా గుర్తించడానికి సిద్ధపడేదే గానీ ఆ భూమి ముంపుకు గురికాబోతూ ఉంది కాబట్టి దానిని 'నాన్-ఆయకట్టు'గానే లెక్కించాలనీ, లేకపోతే నష్టపరిహారం ఎక్కువ ఈయవలసి వస్తుందనీ ప్రభుత్వం 1960లో ఒక జీవో జారీచేసింది! ఇళ్ళ వెల నిర్ణయించడంలోనూ ప్రభుత్వం తమను మోసం చేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక ఇల్లు మునిగిపోయేటట్టయితే దానిని తిరిగి కట్టుకోవడానికి ఎంత ఖర్చు అవుతుందో అంత నష్టపరిహారం ఇవ్వాలి. కానీ ప్రభుత్వం అట్లా చేయకుండా ఆ యింటి వెలలో అది పాతబడిపోవడం వల్ల వచ్చే తరుగుదల (డిప్రీషియేషన్) తీసేసి మరీ నష్టపరిహారం నిర్ణయించింది! లాభాలు ఆర్జించే మిల్లులకూ, హోటళ్ళకూ తరుగుదల లెక్కగట్టడంలో అర్థం ఉంది కానీ నివాసాలకు లెక్కగట్టడంలో అర్థమేమిటన్న రైతుల ప్రశ్నకు ప్రభుత్వం నుండి సమాధానం లేదు.

అసలే తక్కువగా నిర్ణయించిన నష్టపరిహారం ఒక ఎత్తయితే, అకస్మాత్తుగా గృహనిర్మాణ పరికరాలకూ వ్యవసాయ భూమికీ పెరిగిన గిరాకీ వల్ల ధరలలో వచ్చిన పెరుగుదల మరొక ఎత్తు. ఈ రెండు కారణాల ఫలితంగా పట్టాదారులకు ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం తిరిగి ఆ తరహా యింటిని లేక భూమిని కొనుక్కోవడానికి అయ్యే ఖర్చులో సగం నుండి నాలుగవ వంతు మాత్రమే అయింది. నష్టపరిహారం నిర్ణయించే అధికారులను మంచి చేసుకోవడానికి రైతులు నానా తంటాలు పడ్డారు. లంచాలు ఇచ్చారు. విందు భోజనాలు పెట్టారు. సకల విధాలా ప్రసన్నం చేసుకొన్నారు.

అయినా ప్రయోజనం స్వల్పమే. కొద్దిమంది పెద్ద రైతులు మాత్రమే ఎక్కువ నష్టపరిహారం రాయించుకోగలిగారు. తక్కినవాళ్ళు చాలా నష్టపోయారు.

సగటున ఇంటికి 5458 రూ॥ల చొప్పున ఇళ్ళకు మొత్తం 11.46 కోట్ల రూపాయలు, ఎకరం వ్యవసాయ భూమికి సగటున 2560 రూ॥ల చొప్పున భూమికి మొత్తం 21.76 కోట్ల రూపాయలు నష్టపరిహారంగా ఇచ్చింది ప్రభుత్వం. అంటే మొత్తం 33.22 కోట్ల రూపాయలు ఇచ్చింది. ఈ డబ్బు 1976-79 సంవత్సరాలలో పట్టాదారులకు ముట్టింది. అయితే వెంటనే ఊళ్ళు వదలిపెట్టి పోవలసిన అవసరం రాలేదు కాబట్టి ఆ డబ్బు కొంత వేరే అవసరాలకు ఖర్చుపెట్టుకున్నారు. 1981లో అకస్మాత్తుగా మీదపడి తరిమివేసేసరికి చేతిలో మిగిలిన నష్టపరిహారం డబ్బు కొత్త స్థలం వెతుక్కొని, ప్లాటు కొనుక్కొని, ఇల్లు వేసుకొని, నాలుగు పూటలు తినడానికి మాత్రమే సరిపోయింది. ఆ తరువాత వట్టి చేతులతో మిగిలారు నూటికి తొంభై శాతం రైతులు, కూలీలు.

అప్పటికే అదనపు నష్టపరిహారం కోసం కోర్టులో ప్రయత్నాలు ప్రారంభం అయివున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం సరిపోదనిపిస్తే 8 వారాల లోపల పట్టాదారు తన అభ్యంతరాన్ని భూసేకరణ అధికారికి (ప్రాజెక్ట్ కలెక్టర్, లేక సబ్ - కలెక్టర్) తెలియజేయాలని భూసేకరణ చట్టం సెక్షన్ 18 అంటుంది. అప్పుడు ఆ అధికారి దానిని కోర్టుకు నివేదిస్తాడు. కోర్టు ఆ అభ్యంతరాన్ని విచారించి తీర్పు చెప్తుంది. అభ్యంతరాన్ని కొట్టేయవచ్చు, లేదా అదనపు నష్టపరిహారం మంజూరు చేయవచ్చు.

ఈ విధంగా అభ్యంతరం తెలియజేయవచ్చుననీ, దానిని కోర్టు విచారిస్తుందనీ రైతులకు తెలియకపోతే ప్రభుత్వం వాళ్ళ అజ్ఞానాన్ని ఆసరా చేసుకొని మోసం చేయవచ్చునా? లేకపోతే వాళ్ళ హక్కులు వాళ్ళకు ముందే తెలియజెప్పే బాధ్యత ప్రభుత్వం మీద ఉందా? ఇందులో ఏది ప్రజాస్వామిక వైఖరి?

ప్రజలను నిరక్షరాస్యులుగా ఉంచే ప్రభుత్వం తత్ఫలితమయిన అజ్ఞానాన్ని ఆసరా చేసుకొని వాళ్ళను మోసం చేయడానికి వెనుకాడదు. శ్రీశైలం నిర్వాసితుల విషయంలో అదే జరిగింది. ఒక 10 శాతం పెద్ద రైతులూ, వాళ్ళ ఆశ్రితులూ మాత్రమే

8 వారాల గడువులోగా అభ్యంతర పత్రాలు దాఖలు చేశారు. వాళ్ళ కేసులు మాత్రమే భూమి సేకరణ అధికారి ద్వారా కోర్టుకు పోయాయి. మిగిలినవాళ్ళు ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారాన్ని తీసుకొని ఊరుకొన్నారు. అయితే గ్రామాల నుండి వాళ్ళను తరిమేసే సమయం దగ్గరయ్యేసరికి వాళ్ళలోనూ ఆలోచన ప్రారంభం అయింది. ఎట్లాగయినా ఆలస్యానికి సంజాయిషీ చెప్పుకొని ఇప్పుడయినా అభ్యంతర పత్రాలు దాఖలు చేసి కోర్టుకు పోదామన్న ఆతృత ప్రారంభమయింది. అది గమనించి ఊరూరా పైరవీకార్లు బయలుదేరారు. అధికారులను మెప్పించి లంచాలు ఇచ్చి పనికానిస్తామంటూ ముందుకొచ్చారు. మహబూబ్‌నగర్ నుండీ, కర్నూలు నుండీ వకీళ్ళు బయలుదేరి వెళ్ళారు. అభ్యంతర పత్రాలకు పాత తేదీలు వేసి కొన్ని కేసులు కోర్టు ముందుకు తెచ్చారు. అయితే ఇది ఎల్లకాలం సాగేది కాదు కాబట్టి వకీళ్ళు హైకోర్టు నుండి ఆర్డర్ తెచ్చి చట్టబద్ధంగా వ్యవహారం నడిపిద్దామని నిర్ణయించుకొన్నారు.

1980లో హైకోర్టులో రిట్‌పిటిషన్ వేసారు. భూసేకరణ అధికారులు పట్టా దారులకు నోటీసులు విడివిడిగా ఇవ్వలేదనీ, ఒక గ్రామానికి చెందిన నోటీసులన్నీ కట్టగట్టి గ్రామ కరణానికి ఇచ్చారనీ, ఇది నోటీసు సక్రమంగా ఇచ్చినట్టు కాదనీ వాదించారు. అందువల్ల 8 వారాల గడువు తరువాత నమోదుచేసిన అభ్యంతర పత్రాలను కూడ స్వీకరించి విచారణ జరపాలని వాదించారు. హైకోర్టు ఈ వాదనలను ఆమోదించి ప్రభుత్వానికి రిట్ జారీ చేసింది. ప్రభుత్వం ఈ తీర్పు మీద అప్పీల్ వేయగా హైకోర్టు కొట్టేసింది. అప్పుడిక గత్యంతరం లేక పట్టాదారుల అభ్యంతరాలను భూమి సేకరణ అధికార్లు స్వీకరించి కోర్టుకు నివేదించసాగారు. 1984 నుండి వాటిమీద విచారణ ప్రారంభమయింది.

అయినా ప్రభుత్వం తన అప్రజాస్వామిక వైఖరి వదులుకోలేదు. ఒక్కొక్క ఇంటికీ ఒక్కొక్క పొలం పట్టాకూ ఒక్కొక్క కేసు విడిగా నడపాలి. ఇన్ని వేల కేసులు నడపడానికీ, వాటి కాగితాలు తయారు చేయడానికీ కావలసిన సిబ్బందిని ప్రభుత్వం భూమి సేకరణ కార్యాలయాలకు ఇవ్వలేదు కాబట్టి కేసు కాగితాలు త్వరగా తయారుకావడానికి ఆ సిబ్బందికీ, అధికారులకూ రైతులు వేల రూపాయలు లంచాలు ఇచ్చుకోవలసి వచ్చింది. సిబ్బంది చేయవలసిన పని సగం వకీళ్ళే చేయడం వల్ల వకీళ్ళకు రైతులిచ్చే ఫీజు (కోర్టు మంజూరు చేసే అదనపు నష్టపరిహారంలో వకీలు

తీసుకునే కమీషన్) పెరిగింది. అంతేకాదు, ఇటు రైతులకూ, అటు వకీళ్ళకూ అధికారులకూ మధ్య పైరవీ చేసే గ్రామ పెద్దల 'కమీషన్' కూడ పెరిగింది.

1984లో ప్రారంభమయిన కేసుల విచారణ ఇప్పటికీ కొనసాగుతూ ఉంది. కేసుల ఒత్తిడి ఎక్కువ ఉండడం కూడ రైతులకు నష్టదాయకం అయింది. 'నీ కేసు త్వరగా అయ్యేట్టు చూస్తాన'ని పైరవీకార్లు, వకీళ్ళు కమీషన్ పెంచుకుంటున్నారు. కేసు ముగియడంతో సరిపోదు. కోర్టు పట్టాదారులకు అదనపు నష్టపరిహారం మంజూరు చేసినా ప్రభుత్వం ఆ డబ్బు కోర్టులో డిపాజిట్ చేస్తే కదా రైతుకు దక్కేది. ప్రతి సంవత్సరం కోర్టులు 10 లేక 15 కోట్ల రూపాయల అదనపు నష్టపరిహారం మంజూరు చేస్తున్నా ప్రభుత్వం మాత్రం 75 లక్షలు, 1 కోటి, 1.5 కోట్లు – ఈ మోతాదులో డబ్బు డిపాజిట్ చేస్తూ ఉంది. అది కొంతమంది పట్టాదారులకే సరిపోతుంది. ఇక్కడ మళ్ళా పట్టాదారుల మధ్య పోటీ పెరిగింది. అధికారులకు లంచాలు, వకీళ్ళకూ పైరవీకార్లకూ కమీషన్లు పెరిగాయి. ఇన్ని కారణాల ఫలితంగా వకీళ్ళ కమీషన్ మంజూరయిన అదనపు నష్టపరిహారంలో 5 లేక 10 శాతం ఉండవలసింది కాస్తా 35 శాతానికీ, కొన్ని కేసులలో 50 శాతానికీ పెరిగింది. పైరవీకార్ల ముడుపులు, అధికారుల లంచాలు కలుపుకుంటే పట్టాదారు చేతికి వచ్చేది నూరు రూపాయలలో ముప్పయ్యో యాభయ్యో. ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక వైఖరి వల్ల పట్టాదారులు ఇంతగా నష్టపోతున్నారు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే కోర్టులు ఇప్పటిదాకా తీర్పు చెప్పిన అన్ని కేసులలోనూ ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం తక్కువని నిర్ణయించి అదనపు నష్ట పరిహారం మంజూరు చేశాయి. మొదట నష్టపరిహారం చెల్లించిన తేదీ నుండి లెక్క గట్టి మొదటి సంవత్సరానికి 9 శాతం, తరువాత ప్రతి సంవత్సరానికి 11 శాతం వడ్డీతో సహా చెల్లించమని ప్రభుత్వాన్ని ఆదేశించాయి. వడ్డీ కలుపుకుంటే కోర్టు మంజూరు చేసిన అదనపు నష్టపరిహారం తొలినాడు ప్రభుత్వం ఇచ్చిన దానికి 6,7,8 రెట్లు ఉంది. ఉదాహరణకు చిన్నమరూర్‌లో 1976లో 2200 రూ॥లు నష్టపరిహారం ఇచ్చిన భూమికి 1986లో కోర్టు మంజూరు చేసిన అదనపు నష్టపరిహారం వడ్డీ కలుపుకొని 16 వేలయింది. జటప్రోలులో ప్రభుత్వం 3000 రూ॥లు ఇచ్చిన మాగాణి పొలానికి కోర్టు (వడ్డీ కలుపుకొని) 1986లో 30 వేలు మంజూరు చేసింది. అయితే ఈ లోపల వ్యవసాయ భూముల ధరలు ఎంతగా పెరిగాయంటే ఈ మొత్తం కూడ

ప్రస్తుత మార్కెట్ ధరల కంటే చాలా తక్కువ. శ్రీశైలం ముంపు ప్రాంతంలో ప్రస్తుతం ఎకరం మెట్టభూమి ధర 15 వేల నుండి 25 వేలుంది. మాగాణి 50, 60 వేలుంది. కె.సి. కెనాల్ ఆయకట్టులో ఎకరం ధర ఒక లక్ష రూపాయలుంది. అంటే కోర్టులో కేసు గెలిచి అదనపు నష్టపరిహారం పొందిన రైతు కూడ పాత ఆస్తిలో సగం లేక ముప్పావు వంతు మాత్రమే కొనుక్కోగలడు. అది కూడ మొత్తం నష్టపరిహారం రైతు చేతికి చిక్కితేనే! కానీ అధికారుల లంచాలు, వకీళ్ళ ఫీజు, పైరవీకారుల కమీషన్ పోను దక్కేది సగానికి సగమేనని చూసాం.

ఈ కోర్టు పోరాటం అనంతంగా సాగుతూ ఉంది. 20 లేక 30 శాతం పట్టాదారులకు మాత్రమే కోర్టుల ద్వారా అదనపు నష్టపరిహారం చేతికి వచ్చింది. మరొక 30 లేక 40 శాతానికి కోర్టులు అదనపు నష్టపరిహారం మంజూరు చేసాయిగానీ ప్రభుత్వం డబ్బు డిపాజిట్ చేయలేదు. కాబట్టి అది చేతికి రాలేదు. మిగిలిన వాళ్ళ కేసులింకా కోర్టులో తేలనేలేదు. పౌరహక్కుల సంఘం పర్యటించిన గ్రామాలలో సోలీపురం, కాలూరు, బిజినవేముల, ఆర్లపాడు, కొండ ప్రాగటూరు, మురవకొండ, తాటిపాడు, ముచ్చుమర్రిలలో ఒక్క పట్టాదారుకూ కోర్టు నుండి ఒక్క రూపాయి కూడ రాలేదు.

### పులిమీద పుట్ర

*అందరూ ఒకసారి నిర్వాసితులయితే ఆలంపూర్ తాలూకా ప్రాగటూరుకు చెందిన దళితులు రెండుసార్లు అయ్యారు. వాళ్ళకు గ్రామ భూస్వామి పాపిరెడ్డితో తగాదా వచ్చింది. అన్ని నిర్వాసిత గ్రామాలలోనూ భూస్వాములు పైరవీకార్లుగా మారి నష్టపరిహారం 'ఇప్పించి' కమీషన్ తీసుకుంటే, పాపిరెడ్డి అదేమీ చేయకుండానే కేవలం తాను గ్రామ పెద్ద అయినందుకు పట్టాదార్లంతా తమకు దక్కిన నష్టపరిహారంలో కొంత కమీషన్ తనకు ఇవ్వాలన్నాడు. ఇచ్చినవాళ్ళు ఇచ్చారు, ఇవ్వనివాళ్ళు గొడవపెట్టుకున్నారు. దళితులు ఇవ్వలేదు. తమకున్న కొద్దిపాటి భూమికీ, ఇళ్ళకూ వచ్చిన నష్టపరిహారంలో పాపిరెడ్డికి వాటా ఇవ్వడానికి నిరాకరించారు.*

*పునరావాస గ్రామానికి వచ్చిన తరువాత కూడ పాపిరెడ్డికీ, దళితులకూ మధ్య ఘర్షణ కొనసాగింది. కూలి ఇవ్వని కాంట్రాక్టర్ దగ్గరికి ప్రాగటూరు దళితులు*

*పనికి పోవడానికి నిరాకరించగా, పాపిరెడ్డి జోక్యం చేసుకొని దళితులను బలవంతం చేసాడు. నిర్బంధించి కొట్టాడు. 1987లో పాపిరెడ్డిని ఎవరో హత్యచేస్తే పాపిరెడ్డి కొడుకు దళితుల మీద పోలీసు కంప్లైంట్ ఇచ్చాడు. దళితులను గ్రామం నుండి బహిష్కరించాడు. బాంబులతో వాళ్ళ మీద దాడి చేసాడు. వాళ్ళు గ్రామం నుండి మరొకసారి నిర్వాసితులయి ఆముదాలపాడు దగ్గర గుడిసెలు వేసుకొని బిక్కుబిక్కుమంటూ బ్రతుకుతున్నారు.*

మొదట్లో ఇచ్చిన 33.22 కోట్ల రూపాయలు కాక ప్రభుత్వం ఆ తరువాత కోర్టుల ద్వారా మరొక 48 కోట్లు చెల్లించింది. ప్రస్తుత మార్కెట్ ధరలలో ఈ నష్టపరిహారాన్ని లెక్కగడితే మొత్తం ఇళ్ళకూ, పొలాలకూ కలిపి 250 నుండి 350 కోట్ల రూపాయలు అవుతుంది. కోర్టులు మంజూరు చేస్తున్న అదనపు నష్టపరిహారం ఈ మోతాదులో లేకున్నా ఎంత లేదన్నా మరొక 100 లేక 150 కోట్లు మంజూరవుతుంది. ప్రభుత్వం అంత చెల్లించడానికి సిద్ధంగా లేదు. కేవలం మరొక 25 కోట్లు చెల్లించి తప్పించుకోవాలని ప్రభుత్వం యోచన.

దీనికోసం ప్రభుత్వం నానా తిప్పలు పడుతూ ఉంది. జనార్ధనరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఒక ఆర్డినెన్స్ తయారుచేసాడు. 8 వారాల గడువులోగా అభ్యంతర పత్రం దాఖలు చేయక ఆలస్యంగా చేసినవారి కేసులు కూడ కోర్టుకు నివేదించాలని 1980లో హైకోర్టు ఇచ్చిన తీర్పును వమ్ము చేయడం ఈ ఆర్డినెన్స్ ఉద్దేశ్యం. హైకోర్టు తీర్పులతో నిమిత్తం లేకుండా సక్రమంగా దాఖలయిన అభ్యంతర పత్రాలను మాత్రమే కోర్టుకు నివేదించాలని ఆర్డినెన్స్ అంటోంది. అయితే స్థానిక రాజకీయ నాయకులు గవర్నర్ ఆమోదం పొందకముందే జోక్యం చేసుకొని ఈ ఆర్డినెన్స్‌ను ఆపగలిగారు. ఆ తరువాత (1991 మార్చి నెలలో) జనార్ధనరెడ్డి ప్రభుత్వం వేరే జీవో ఒకటి జారీ చేసింది. జీవోఎంఎస్ 100 నెంబర్ గల ఈ హుకుం ఏమంటుందంటే ముంపు భూముల నష్టపరిహారం కేసులు పరిష్కరించడం కోసం లోక్ అదాలత్ ఏర్పాటవుతుందని. ప్రభుత్వమూ, పట్టాదారులూ కూడ ఆ లోక్ అదాలత్ ఎదుట హాజరయి పరిష్కరించుకోవాలి. తన ప్రతిపాదనగా ప్రభుత్వం మెట్టభూమి ఎకరానికి 5000 రూ॥లు, మాగాణికి ఎకరానికి 7000 రూ॥లు, కె.సి. కెనాల్ ఆయకట్టు భూమికి ఎకరానికి 9000 రూ॥లు ఇస్తానని జీవోలో సూచించింది. తొలినాటి నుండి సంవత్సరానికి 11 శాతం

చొప్పున వడ్డీ లెక్కగట్టి ఈ మొత్తం ఇవ్వడానికి ఒప్పుకొంది. దీనికి గాను అయ్యే అదనపు ఖర్చు 25 కోట్లని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కోర్టులు ప్రస్తుతం మంజూరు చేస్తున్న మోతాదులో అదనపు నష్టపరిహారం ఇస్తూపోతే ఇందుకు నాలుగు నుండి ఆరు రెట్లు వస్తుందని పైన చూసాం. అంటే లోక్ అదాలత్ పేరిట ఆ మేరకు రైతులకు టోపీ వేయడానికి ప్రభుత్వం సిద్ధం అయింది. చిన్న రైతులు గత్యంతరం లేక 'బ్రతికుంటే బలుసాకు తినొచ్చు'నని ఈ ప్రతిపాదనను ఒప్పుకోవడానికి తయారుగా ఉన్నారు. కాని పెద్ద ఆస్తిపరులు మట్టుకు ఎంత ఆలస్యమయినా సరే కోర్టు నుండి పెద్ద మొత్తం పొందగలమనే ఆశతో లోక్ అదాలత్ ప్రతిపాదనను తిరస్కరిస్తున్నారు.

## అధికారులకు కనువిప్పు కలిగింది (!)

ఇదిలా ఉండగా 1989 జూలై 5వ తేదీన దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల రెవెన్యూ కార్యదర్శులు, భూమి సేకరణ శాఖ డైరెక్టర్లు సమావేశమై భూసేకరణకూ, పునరావాసానికీ సంబంధించిన అన్ని సమస్యలనూ చర్చించారు. ప్రజల నుండి, ప్రజాహిత సంస్థల నుండి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకొని మరీ చర్చించారు. ఈ చర్చల ఫలితంగా భూసేకరణ అధికారులకూ, ప్రభుత్వానికీ కొన్ని సూచనలు చేస్తూ ఒక పత్రాన్ని ప్రచురించారు. ఆ పత్రంలోని ప్రధాన అంశాలను ఈ దిగువ ఇస్తున్నాము. ఇవన్నీ ఆ ఉన్నత స్థాయి అధికారుల అభిప్రాయాలే. మావి కావు.

### *I. నిర్వాసితుల పునరావాసం*

నిర్వాసితులకు కలిగే కష్టాన్ని ఉపశమింపచేయడం కోసం ఒక జాతీయ విధానం రూపొందించడం అవసరం. ఆ రూపకల్పన జరిగేదాకా రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా ప్రాజెక్టు అధికారులను సంప్రదించి నిర్వాసితుల సక్రమ పునరావాసం కోసం తగు చర్యలు తీసుకోవాలి. ఆ చర్యలు ఈ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి –

(అ) పునరావాసం కేవలం భూమిగల రైతులకే కాక, భూమిలేని వ్యవసాయ కూలీలకు, ఇతర వృత్తుల వారికి కూడ వర్తించాలి.

(ఆ) అన్ని నిర్వాసిత కుటుంబాలకూ 0.02 హెక్టార్ల విస్తీర్ణంగల ఇంటి ప్లాటు ఇవ్వాలి. దానితోపాటు ఇల్లు కట్టుకోవడానికి అయ్యే ఖర్చు కూడ సమకూర్చాలి.

(ఇ) తొలి దినాలలో పునరావాసానికయ్యే ఖర్చు – అంటే కొత్త ప్రాంతానికి సామాన్లు వగైరా తరలించడం కోసం అయ్యే ఖర్చు ఇత్యాది – సమకూర్చాలి. దీనిని లెక్కగట్టేటప్పుడు దరిద్రరేఖ కంటే ఎగువన ఉన్న జీవన ప్రమాణాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

(ఈ) నీటిపారుదల ప్రాజెక్టుల ఫలితంగా నిర్వాసితులయిన వారికి సేద్యపు భూమి ఇచ్చి పునరావాసం కల్పించాలి. మాగాణి కనీసం రెండున్నర ఎకరాలు, మెట్ట కనీసం 5 ఎకరాలు ఇవ్వాలి.

(ఉ) సేద్యపు భూమి ఇవ్వడం సాధ్యం కానప్పుడు కనీసం ఒక్కొక్క నిర్వాసిత కుటుంబంలో ఒక్కొక్కరికయినా ప్రాజెక్టులో ఉద్యోగం ఇవ్వాలి.

(ఊ) పై రెండు సాధ్యం కాని చోట పాడి పరిశ్రమ, చేపల పెంపకం లేక ఇతర స్వయం ఉపాధి పథకాలను నిర్వాసితులకు అందజేయాలి. దానికి కావలసిన తర్ఫీదు ఉచితంగా ఇవ్వాలి. పెట్టుబడి రుణం రూపంలో ఇవ్వాలి.

(ఎ) ఇవేవీ సాధ్యం కానప్పుడు ఒక్కొక్క నిర్వాసిత కుటుంబ పెద్దకూ ప్రభుత్వం కనీస దిన కూలి, నెలకు 100 రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. తిరిగి ఉపాధి దొరికేంత వరకు ఈ వేతనం ఇవ్వాలి. దినకూలి రేటు ఏ విధంగా ఉండాలంటే నెలకు కుటుంబానికి 500 రూపాయలకు తక్కువ కాకుండా ఆదాయం దొరికేలా ఉండాలి. పెరిగే ధరలకు అనుగుణంగా ఈ కూలిరేటు పెరగాలి.

### *II. నష్టపరిహారం*

(అ) సేకరించిన భూమికి మార్కెట్ వెల కట్టివ్వాలని చట్టం చెప్పినప్పటికీ, తమకు నిజంగా మార్కెట్ ధర ఇవ్వడం లేదని రైతులు చాలా సందర్భాలలో నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం ఏమిటంటే మార్కెట్ ధర నిర్ణయించేటప్పుడు భూమిసేకరణ అధికారులు ఆ ప్రాంతంలో ఒక నిర్ణీత కాలవ్యవధిలో జరిగిన క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ వివరాలను ప్రమాణంగా తీసుకుంటారు. అయితే స్టాంపు డ్యూటీ, ఇతర పన్నులు ఎగవేయడం కోసం అమ్మకపు ధరను కావాలని తగ్గించి చూపడం జరుగుతుంటుంది కాబట్టి ఇది నిజమయిన మార్కెట్ వెలను ప్రతిబింబించదని నిర్వాసితులు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకొని భూమి వెలను హేతుబద్ధంగా నిర్ణయించే పద్ధతులను అనుసరించాలి.

(ఆ) ప్రభుత్వ భూమిని ప్రాజెక్టుల కోసం సేకరించేటప్పుడు ఆ భూమిలో పట్టా లేకుండా వ్యవసాయం చేస్తున్న, లేక నివాసాలు ఏర్పరచుకున్న పేదవారికి ఏ మాత్రం నష్టపరిహారం దక్కడం లేదు. కాబట్టి పేదల ప్రయోజనాలను సంరక్షించడం కోసం, అటువంటి భూమిని సేకరణకు అప్పజెప్పే ముందు, దానిని పట్టా లేకుండా వినియోగిస్తున్న పేదలకు ముందు ప్రభుత్వ పట్టా ఇచ్చి, ఆ తరువాత వాళ్ళ భూమిగా దానిని సేకరించి నష్టపరిహారం ఇవ్వాలి.

### *III. భూమి సేకరణ పద్ధతి*

(అ) నిర్వాసితులు కాబోయే వారికి ప్రభుత్వం పూర్తి సమాచారాన్ని సకాలంలో అందజేయాలి. ఇది చట్టపరమయిన బాధ్యత కాబట్టి ఖర్చుతో నిమిత్తం లేకుండా దీనిని నిర్వహించాలి.

(ఆ) భూమి సేకరణ చట్టం నిర్దేశించిన పద్ధతిలో నోటీసు ఇవ్వడమే కాక, మైక్ ద్వారా గ్రామాలలో ప్రచారం చేయడం, దండోరా వేయించడం, స్థానిక సినిమా హాళ్ళలో స్లైడ్లు వేయించడం మొదలయిన పద్ధతుల ద్వారా నిరక్షరాస్యులకు కూడ తమ భూమి పోయేదీ లేనిదీ తెలిసేటట్టు ప్రచారం చేయాలి. దీనికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఎంత భూమి పోయేది, ఎవరి భూమి పోయేది గ్రామస్తులందరికీ స్పష్టంగా తెలియాలి.

(ఇ) 18/1/1985న భారత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును (NO. 12011/32/12/84-LRD) అనుసరించి ఎంత భూమి సేకరించడం నిజంగా అవసరమో అంత మాత్రమే సేకరించేటట్టు చూడాలి. నిజంగా అవసరం కాని (అంటే ముంపుకు గురి కాని) భూమిని సేకరించరాదు.

(ఈ) భూమి సేకరణకు సంబంధించిన పని చాలా సంక్లిష్టమయినది కాబట్టి, ఈ అవసరం తరచుగా ఏర్పడే రాష్ట్రాలు భూమి సేకరణ కోసం ప్రత్యేక (శాశ్వత) అధికారులను నియమించాలి. దానికి కావలసిన ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలి. భూమిని కోల్పోయే వాళ్ళ పట్ల, ప్రత్యేకించి వారిలోని బలహీనవర్గాల పట్ల సానుభూతితో వ్యవహరించడం ఈ తర్ఫీదులో భాగం కావాలి. భూమి సేకరణ కార్యక్రమం సక్రమంగా జరుగుతూ ఉందా లేదా అని పర్యవేక్షించడానికి రాష్ట్రాలలో సరయిన యంత్రాంగం

లేదు. అటువంటి యంత్రాంగాన్ని కల్పించాలి. తరచుగా భూమి సేకరించే అవసరం ఏర్పడే రాష్ట్రాలు దీనికోసం ఒక డైరెక్టరేట్‌ను నెలకొల్పాలి.

(ఉ) అదనపు నష్టపరిహారం కోసం కోర్టులలో ఉన్న అన్ని కేసులనూ త్వరగా పరిష్కరించడం కోసం ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకోవాలి.

(ఊ) నష్టపరిహారంగా ఇచ్చిన మొత్తం నుండి ప్రభుత్వానికి రావలసిన పాత బాకీలు వసూలు చేసుకోకూడదు. నష్టపరిహారం మీద ఆదాయపు పన్ను లెక్కగట్టకూడదు.

## ముగింపు

చాలా ఏళ్ళుగా అస్తవ్యస్తంగా, అన్యాయంగా సాగుతున్న భూసేకరణ పట్ల ప్రజలలో వ్యక్తమయిన నిరసన ఫలితంగా అధికార యంత్రాంగం ఎట్టకేలకు కళ్ళు తెరిచి పైన వివరించిన సూచనలు చేసింది. శ్రీశైలం ముంపు గ్రామాలలో భూమి సేకరణ పై సూచనలతో పోల్చి చూస్తే అధికార యంత్రాంగం దృష్టిలోనే చాలా అన్యాయంగా జరిగిందని అర్థమవుతుంది.

అయితే మన దేశంలో అధికార యంత్రాంగానికి ఒక చెడ్డ లక్షణం ఉంది. తన నిర్వాకం పట్ల ప్రజలలో వ్యతిరేకత ఎక్కువగా వచ్చినప్పుడు ఒక సమావేశం జరిపి ఆత్మవిమర్శ చేసుకొని ఇక మీదట ఎట్లా వ్యవహరించాలో నిర్దేశిస్తూ గంభీరమయిన 'సూచనలు' చేస్తుంది. ఈ సూచనలు చదవడానికి చాలా బాగుంటాయి. కానీ వాటిని అమలు చేయించడానికి ఏమయినా ప్రయత్నం జరుగుతుందని ఆశిస్తే మాత్రం మూర్ఖులమవుతాము.

పునరావాసాన్ని గురించి 'జాతీయ విధానం' అవసరమని అన్ని రాష్ట్రాల రెవెన్యూ కార్యదర్శులూ, భూమి సేకరణ డైరెక్టర్లూ మూడేళ్ళ కింద కాన్ఫరెన్స్ జరిపి నిర్ణయించారు. కానీ జాతీయ విధానమేదీ? దాని రూపకల్పనకు ప్రయత్నాలేవీ?

అప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాలూ, ఇతర భూమి సేకరణ అధికారులూ అనుసరించవలసిన ప్రమాణాలను కూడ ఈ కాన్ఫరెన్స్ సూచించింది. ఆ ప్రమాణాలలో ముఖ్యమయిన వాటిని పైన వివరించాము. కానీ ఈ మూడేళ్ళలో దేశంలో ఎక్కడయినా ప్రభుత్వాలు వాటిని అనుసరించడం జరిగిందా? శ్రీశైలం ముంపు గ్రామాల నిర్వాసిత

ప్రజానీకం పట్ల ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరిలో ఈ మూడేళ్ళలో ఏమయినా మార్పు వచ్చిందా? ఇళ్ళ ప్లాట్లు, సేద్యపు భూములు, ఉద్యోగాలు, స్వయం ఉపాధి పథకాలు – ఏ ఒక్కటయినా దక్కిందా? నిర్వాసితుల సమస్యలను 'సానుభూతి'తో చూసే వైఖరి అధికారులకు అలవడిందా? కోర్టు కేసులు త్వరగా ముగించి నష్టపరిహారం చేతికిస్తున్నారా?

ప్రజల నుండి నిరసన, లేక విమర్శ వచ్చినప్పుడు ఆత్మ విమర్శ చేసుకోవడం, గంభీరమయిన ప్రకటనలూ సూచనలూ తీర్మానాలూ చేయడం, ఆచరణ దగ్గరికొచ్చేసరికి ఏ మార్పూ లేకుండా కొనసాగడం మన అధికార యంత్రాంగం నేర్చుకున్న ఎత్తుగడ. అందువల్ల ఆ సూచనలూ, తీర్మానాలూ పూర్తిగా అమలు కావాలని డిమాండ్ చేస్తూ ఉద్యమించవలసిన అవసరం ఉంది. ప్రజలను బుకాయించడం కోసం ఆచరణలో వెలుగు చూడని ప్రకటనలు చేయడం ప్రజాస్వామ్య వైఖరి కాదు.

– 1989లో జరిగిన రెవెన్యూ కార్యదర్శులు, భూమి సేకరణ డైరెక్టర్ల సమావేశం చేసిన సూచనలకు శాసన రూపం ఇస్తూ జాతీయ పునరావాస విధానాన్ని తక్షణం రూపొందించాలి.

– ఇప్పటిదాకా సరయిన నష్టపరిహారం పొందని శ్రీశైలం నిర్వాసితులకు ప్రస్తుత మార్కెట్ ధరలలో వారు కోల్పోయిన ఆస్తులకు పూర్తి నష్టపరిహారం ఇవ్వాలి.

– భూమిలేని వ్యవసాయ కూలీలకూ, ఇతర వృత్తుల వారికీ ప్రభుత్వ ప్రాజెక్టులలో పని కల్పించాలి.

– తక్షణ చర్యగా కోర్టులలో పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ రెండు నెలలలో పూర్తిగా విచారించి అందరికీ కోర్టు తీర్పుననుసరించి నష్టపరిహారం ఇవ్వాలి.


– పునరావాస గ్రామాలకు రోడ్లు, నీళ్ళు, బస్సులు, స్కూళ్ళు, ఆస్పత్రులు తదితర వసతులు వెంటనే కల్పించాలి.

పై డిమాండ్లతో ఉద్యమించవలసిందని శ్రీశైలం నిర్వాసితులకే కాక, ప్రజా జీవితంలో ప్రజాస్వామిక విలువలను కాంక్షించే వారందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

***ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రచురణగా వచ్చింది***

***1992***

# పంట పొలాలకు సిమెంటు చీడ



ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం
(APCLC)

## PANTA POLALAKU CEMENT CHEEDA Rs. 5/-

### A REPORT ON CEMENT POLLUTION IN A.P.

కాలుష్యంతో కూడిన పారిశ్రామిక ప్రగతి అందరికీ ప్రగతి కాదు. కొందరికి ప్రగతి, కొందరికి వినాశనం, విధ్వంసం. కొందరికి విపరీతమైన లాభాలు, కొందరికి మంచి మంచి ఉద్యోగాలు, కొందరికి మెరుగయిన వినియోగ వస్తువుల లభ్యత, కొందరికి అనారోగ్యకరమైన కూలీ పని, కొందరికి ఏ ప్రయోజనం లేని వట్టి వినాశనం. సిమెంటునే ఉదాహరణగా తీసుకుంటే వేగంగా పెరుగుతున్న సిమెంటు పరిశ్రమ దాని యాజమాన్య వర్గాలకు విపరీతంగా లాభాలు ఆర్జించి పెట్టడమే కాక పట్టణ జీవితం విస్తరించడానికీ అందమైన భవనాలు కట్టుకోవడానికీ ఉపయోగపడింది. అయితే ఫ్యాక్టరీల చుట్టూ ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసి రైతుల ఆదాయాన్ని సగానికి తగ్గించింది. పర్యావరణాన్ని ధూళితో కలుషితం చేసి (ముఖ్యంగా పశుగ్రాసాన్నీ పశువులు తాగే నీటి వనరులనూ) పశువుల ఆరోగ్యాలను దెబ్బతీసింది. ఆ విధంగా మళ్లీ రైతుల జీవనాన్ని దెబ్బ తీసింది.

ప్రగతి అనేది ఈ విధంగా ఉండకూడదు. పారిశ్రామిక కాలుష్యాన్ని వ్యతిరేకించడమంటే ఈ రకమైన వికృతమైన ప్రగతిని వ్యతిరేకించడం. అంతే తప్ప పరిశ్రమలనూ అభివృద్ధినీ వ్యతిరేకించడం కాదు.

***A Publication by***
**Andhra Pradesh Civil Liberties Committee**

# పంట పొలాలకు సిమెంటు చీడ

## I. కాలుష్య నివారణ చట్టాలు

**మూ**డవ ప్రపంచ దేశాలలో కాలుష్య నివారణ గురించి పట్టింపు చాలా ఆలస్యంగా వచ్చింది. వేగంగా, విస్తృతంగా పారిశ్రామిక 'ప్రగతి' సాధించాలనేదే ఈ దేశాలు వలస పాలన నుండి స్వాతంత్ర్యం పొందిన తరువాత పెట్టుకున్న లక్ష్యం. అప్పటి వరకు దిగుమతి చేసుకుంటున్న పారిశ్రామిక ఉత్పత్తులు ఇక మీదట ఇక్కడే తయారు కావాలనుకున్నాయి. ఆ తరువాత కొత్తగా ఆవిష్కరించిన ఉత్పత్తి ప్రక్రియలన్నీ ఎప్పటి కప్పుడు ఇక్కడికి దిగుమతి కావాలనుకున్నాయి.

నలుమూలలా ఫ్యాక్టరీలు, వాటి పొగ గొట్టాలూ, యంత్రాల రొద, సైకిళ్ళపైన బారులు తీరి డ్యూటీకి పోతున్న కార్మికులు, విశాలమైన హైవేల పైన వేగంగా పోతున్న విలాసవంతమైన కారులు, లోడు లారీలు, బొగ్గుతోనూ, ఇనుపరాడ్లతోనూ బరువుగా కదిలే 'మాల్‌గాడీ'లు – ఈ చిత్రం పారిశ్రామిక ప్రగతికి చిహ్నం అయింది.

దీనికి అనుబంధంగా మరొక చిత్రం కూడా ఉంటుంది. గొట్టాల నుండి బయటికొచ్చే పొగ, ఆ పొగలో హానికరమైన వాయువులు, ధూళి, ఫ్యాక్టరీ నుండి ద్రవరూపంలో బయటికొచ్చే వ్యర్థ పదార్థాలు, వాటిలో హానికరమయిన రసాయనాలు, యంత్రాలు చేసే భయంకరమైన శబ్దం, ఫ్యాక్టరీల చుట్టూ బీడుపడిన సాగు భూములు, రోగగ్రస్థులయిన మనుషులు, పశువులు, విషప్రాయమైన బావి నీళ్ళు, చెరువు నీళ్ళు,

ఊపిరితిత్తులలో రోగాలు నిండిన కార్మికులు – ఈ చిత్రం కూడ పారిశ్రామిక ప్రగతికి చిహ్నమే.

ఈ చిత్రం చాలాకాలం మన బోటి దేశాలలో ఎవరికీ కనపించలేదు. దానిని మనం చూడదలచుకోలేదు కాబట్టి కనిపించలేదు. ఎవరైనా దానిని చూసినా, దాని గురించి మాట్లాడినా వాళ్ళు ప్రగతినీ, అభివృద్ధినీ వ్యతిరేకించే తిరోగామివాదులు గాను, అభివృద్ధి నిరోధకులు గాను, దేశద్రోహులు గాను కనిపించారు.

కానీ నిజం మాట్లాడుకుంటే కాలుష్యంతో కూడిన పారిశ్రామిక ప్రగతి అందరికీ ప్రగతి కాదు. కొందరికి ప్రగతి, కొందరికి వినాశనం, విధ్వంసం. కొందరికి విపరీతమైన లాభాలు, మంచి మంచి ఉద్యోగాలు, మెరుగయిన వినియోగ వస్తువుల లభ్యత అయితే కొందరికి అనారోగ్యకరమైన కూలి పని, ఏ ప్రయోజనమూ లేని వట్టి వినాశనం. సిమెంటునే ఉదాహరణగా తీసుకుంటే వేగంగా పెరుగుతున్న సిమెంటు పరిశ్రమ దాని యాజమాన్య వర్గాలకు విపరీతంగా లాభాలు ఆర్జించి పెట్టడమే గాక పట్టణ జీవితం విస్తరించడానికీ, అందమైన భవనాలు కట్టుకోవడానికీ ఉపయోగపడింది. అయితే ఫ్యాక్టరీల చుట్టూ ఉన్న వ్యవసాయాన్ని నాశనం చేసి రైతుల ఆదాయాన్ని సగానికి తగ్గించింది. పర్యావరణాన్ని ధూళితో కలుషితం చేసి (ముఖ్యంగా పశుగ్రాసాన్నీ, పశువులు తాగే నీటి వనరులనూ) పశువుల ఆరోగ్యాలను దెబ్బతీసింది. ఆ విధంగానూ మళ్ళీ రైతుల జీవనాన్ని దెబ్బతీసింది.

ప్రగతి అనేది ఈ విధంగా వుండకూడదు. కొందరికి ప్రయోజనం, కొందరికి వినాశనం; కొందరికి నాగరికత, కొందరికి అంధకారం మిగిలించే ప్రగతి ప్రగతి కానే కాదు. పారిశ్రామిక కాలుష్యాన్ని వ్యతిరేకించడమంటే ఈ రకమైన వికృతమైన ప్రగతిని వ్యతిరేకించడమే. అంతే తప్ప పరిశ్రమలనూ, అభివృద్ధినీ వ్యతిరేకించడం కాదు.

మరి దీనికి ఆచరణ యోగ్యమైన పరిష్కారమేమైనా వుందా లేక కాలుష్యం లేని పారిశ్రామిక ప్రగతి కేవలం ఒక ఊహాజనితమైన ఆదర్శమా అంటే ఊహాజనితమేం కాదు. కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం పెరిగే కొద్దీ కాలుష్యాన్ని నివారించే సాంకేతిక ప్రక్రియలను అన్వేషించడం జరిగింది. వాటిని తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పే చట్టాలూ వచ్చాయి.

ఈ మార్పు పాశ్చాత్య దేశాలలో మొదలయి చాలా కాలం అయింది.  మన దేశాలలో ఆలస్యంగా వచ్చింది. ఈ లోపల పాశ్చాత్య పెట్టుబడిదారీ కంపెనీలు తమ దేశాలలో మామూలుగా తీసుకునే కాలుష్య నివారణ చర్యలేవీ తీసుకోకుండా చవకగా ఉత్పత్తి చేసుకునే అవకాశం ఇక్కడ ఉందని గుర్తించి దానిని అవకాశంగా తీసుకొని చాలా లాభాలు గడించాయి. మన దేశ పెట్టుబడిదారులు కూడ వాళ్ళను అనుసరించారు.

కానీ 1970ల తరువాత క్రమంగా మన దేశంలోనూ కాలుష్య వ్యతిరేక చైతన్యం పెరిగింది. చట్టాలు చేసి వాటిని గట్టిగా అమలు చేయాలని ప్రభుత్వంపైన ఒత్తిడి పెరిగింది. ఐక్యరాజ్యసమితి నుండి కూడ ఒత్తిడి పెరిగింది. 1972లో స్వీడన్ రాజధాని స్టాక్‌హోంలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో మానవ పర్యావరణం పైన అంతర్జాతీయ సదస్సు జరిగింది. కాలుష్య నివారణ అనేది మనుషుల జీవించే హక్కుకు సంబంధించిన సమస్య అనీ, దానికి కావలసిన అనేక సాంకేతిక ప్రక్రియలిప్పటికే అందుబాట్లో ఉన్నాయనీ ఆ సదస్సు గుర్తించింది. లాభాల వేటలో ఉన్న కంపెనీలు తమంతట తాము ఈ నివారణ చర్యలు చేపట్టక పోవచ్చును కాబట్టి ప్రభుత్వాలు సమాజ శ్రేయస్సు దృష్ట్యా చట్టాలు చేసి నిర్బంధంగా కాలుష్య నివారణ చర్యలను అమలు చేయించాలని ఆ సదస్సు తీర్మానించడం జరిగింది.

ఈ సదస్సు ప్రేరణతోనే తాను మొట్టమొదటి కాలుష్య నివారణ చట్టం చేసినట్టు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఇది **1974** లో జారీ అయిన **నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం.** పరిశ్రమలు ఎక్కువ భాగం తమ వ్యర్థ పదార్థాలను పరిసరాలలోని నీటి వనరులలోకి వదులుతుంటాయి. లేదా గుంట తవ్వి అందులోకి వదులుతుంటాయి. ఈ విధంగా నేలలోకి ఇంకిన వ్యర్థ పదార్థాలు భూగర్భ జలాలలో కలిసి, తద్వారా బావినీటి లోనికీ, చెరువునీటి లోనికీ చేరుతుంటాయి. ఇది మనుషులకూ, పశువులకూ, పొలాలకూ చేసే నష్టం అంతా యింతా కాదు. హైదరాబాదు నగర పరిసరాలలోని పారిశ్రామిక వాడల సమీపంలోని జనావాసాలను పరిశీలిస్తే ఈ విషయం సులభంగా అర్థం అవుతుంది.

అయితే నీటి కాలుష్యమే కాక గాలి కాలుష్యం కూడ ఉంటుంది. ఫ్యాక్టరీ పొగ గొట్టాల నుండి గాలిలో కలిసే విష వాయువులూ, ధూళీ కూడ చాలా హాని

చేస్తాయి. సిమెంటు కాలుష్యం ఈ కోవకు చెందినది. సిమెంటు ఫ్యాక్టరీల నుండి బయటికొచ్చే ధూళి ప్రధానంగా పంటలను నాశనం చేస్తుంది. పశువుల ఆహారమైన గడ్డినీ, నీటినీ కలుషితం చేస్తుంది. కొంత మేరకు మనుషులకు కూడ శ్వాసకోశ సంబంధమైన రోగాలు కలిగిస్తుంది. ధూళి మాత్రమే కాక విషవాయువులు బయటికొచ్చే ఉత్పత్తి ప్రక్రియలు కూడ ఉంటాయి. అవి మరింత ప్రత్యక్షంగా పరిసరాలలో నివసించే ప్రజల జీవితానికీ, ఆరోగ్యానికీ నష్టకరమైనవి.

1974 నాటి చట్టంలో దీని గురించి ఏమీ లేదని గమనించిన ప్రభుత్వం **1981లో వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ)** చట్టం చేసింది.

ఈ చట్టాలు నివారణ, నియంత్రణ అన్న రెండు మాటలనూ వాడుతున్న సంగతి గమనించదగినది. కాలుష్యాన్ని పూర్తిగా నివారించడం అభిలషణీయమే. కానీ సంపూర్ణ నివారణ ఆచరణ సాధ్యం కాకపోవచ్చు. అప్పుడు కనీసం ప్రమాదకరమైన మోతాదులో వుండకుండా నియంత్రించడం అవసరం. అంటే ఫ్యాక్టరీలు ధూళి ద్వారా, వాయువుల ద్వారా, ద్రవ పదార్థాల ద్వారా కలిగించే కాలుష్యం ఒక మోతాదు మించి ఉండడానికి వీలు లేదని అర్థం. ఆ మోతాదు ఎంత అనేది వ్యర్థ పదార్థాన్ని బట్టి మారుతుంది. దీనికి ప్రమాణం ఏమిటంటే ఆ వ్యర్థ పదార్థం చుట్టూ ఉన్న మనుషులకు కలిగించగల నష్టం. ఉదాహరణకు నూనె ఫ్యాక్టరీల నుండి బయటకొచ్చే ద్రవరూపకమైన వ్యర్థ పదార్థాలలో 'జిడ్డు' (గ్రీస్) ఉంటుంది. అది 1000 టన్నుల ముడి పదార్థానికి 7 కేజీలు మించి ఉండకూడదని చట్టం అంటుంది. జౌళి మిల్లుల నుండి బయటకొచ్చే పొగలో ఉండే ధూళి 1 లీటర్ గాలిలో 100 మిల్లీ గ్రాములకు మించి ఉండడానికి వీలులేదని చట్టం అంటుంది. ఈ విధంగా ఒక్కొక్క హానికరమైన కాలుష్య పదార్థానికీ పరిమితులు నిర్దేశించే 'షెడ్యూల్' పై రెండు చట్టాలకూ అనుబంధంగా ప్రకటించబడింది.

ఈ ప్రమాణాలను ఎవరు నిర్ణయిస్తారు? ఎవరు అమలుచేస్తారు? దీని కోసం ఒక యంత్రాంగాన్నీ, ఒక వ్యవస్థనూ రూపొందించడం పై రెండు చట్టాల ముఖ్య లక్ష్యాలలో ఒకటి. ఆ యంత్రాంగం కాలుష్య నియంత్రణ బోర్డు. కేంద్రంలో ఒకటి, ప్రతి రాష్ట్రంలో ఒకటి కాలుష్య నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేయాలని 1974 నాటి చట్టం అంటుంది. 1981 నాటి చట్టం అదే బోర్డులకు గాలి కాలుష్యానికి సంబంధించిన బాధ్యతలు అప్పగించింది.

కాలుష్య నియంత్రణ బోర్డులకు పై రెండు చట్టాలూ చాలా బాధ్యతలు పెట్టాయి గానీ ముఖ్యమైనవి ఇవి :

- ఒక్కొక్క పరిశ్రమకు ఒక్కొక్క రకమైన కాలుష్య పదార్థానికి సంబంధించిన పరిమితులను నిర్దేశించే ప్రమాణాలను రూపొందించడం. అంటే ఆ వ్యర్థ పదార్థాన్ని ఏ మోతాదు మించి విడుదల చేయడానికి వీలులేదో నిర్ణయించి షెడ్యూల్‌లో ప్రకటించడం.
- పరిశ్రమల పరిసరాలలోని గాలినీ, నీటినీ పరీక్ష చేసి అందులో కాలుష్యం చట్ట పరిమితులకు లోబడి ఉందా లేదా అని అధికారికంగా సర్టిఫై చేయగల ప్రయోగశాలలను నెలకొల్పడం, లేదా ఇప్పటికే ఉన్న వాటికి గుర్తింపు ఇవ్వడం.
- కాలుష్యాన్ని నివారించడానికి అవసరమైన ఆదేశాలు ఫ్యాక్టరీ యజమానులకు జారీ చేయడం, కాలుష్య నివారణకు అవసరమైన నిర్మాణాలు చేపట్టమని అదేశించడం.
- ఫ్యాక్టరీలు కాలుష్య సంబంధమైన పరిమితులను పాటిస్తున్నాయో లేదో పరిశీలించడానికి ఫ్యాక్టరీలలోకి ప్రవేశించి వ్యర్థ పదార్థాల 'శాంపిల్స్' తీసుకొని పరీక్ష చేయించడం.
- కొత్త పరిశ్రమలు నెలకొల్పేటప్పుడు వాటి వల్ల రాగల కాలుష్యాన్ని పరిశీలించి ఫ్యాక్టరీకి అనుమతి నిరాకరించడం, లేదా కొన్ని షరతులతో ఇవ్వడం.
- అనుమతి పొందిన ఫ్యాక్టరీ ఆ తరువాత కాలుష్య సంబంధమైన పరిమితులను అతిక్రమించినట్లయితే, దానిని అదుపు చేయడానికి ఇచ్చిన ఆదేశాలను పాటించకపోయినట్టయితే ఇచ్చిన అనుమతిని నిరాకరించి మూసివేయించడం.
- ఒక ఫ్యాక్టరీ కలిగిస్తున్న కాలుష్యాన్ని నివారించడానికి కోర్టు నుండి ఆదేశం పొందడం అవసరం అని భావిస్తే మేజిస్ట్రేట్ కోర్టులో దావా వేసి ఇంజక్షన్ తీసుకోవడం.
- నియమాలను అతిక్రమించిన కంపెనీ పైన క్రిమినల్ కేసు దాఖలు చేసి ప్రాసిక్యూట్ చేయడం.

ఈ అధికారాలు రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డులకు ఉన్నాయి. నీటి కాలుష్య చట్టంలోనూ, వాయు కాలుష్య చట్టంలోనూ ఉన్నాయి. కేంద్ర బోర్డుకు ఇన్ని అధికారాలు లేవు. ప్రధానంగా కాలుష్యానికి సంబంధించిన ప్రమాణాలు నెలకొల్పడానికీ, కాలుష్య నివారణకు కావలసిన సాంకేతిక ప్రక్రియలు రూపొందించడానికీ, ప్రయోగశాలలు నెలకొల్పడానికీ కేంద్ర బోర్డుకు అధికారాలు ఇవ్వబడ్డాయి. రాష్ట్ర బోర్డులకు ఆ అధికారంతోపాటు, కాలుష్యాన్ని నివారించడానికీ, నివారించడంలో సహకరించని కంపెనీలను అదుపు చేయడానికీ, అవసరమయితే మూసివేయడానికీ, బోనెక్కించి క్రిమినల్ కోర్టులో ప్రాసిక్యూట్ చేయడానికీ కూడ అధికారం ఇవ్వబడింది.

కాలుష్యం కలిగిస్తే కోర్టు వేయగల శిక్షలు కూడ ఈ చట్టాలలో తీవ్రంగానే ఉన్నాయి. రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నడిపినా, అనుమతి ఉపసంహరించిన తరువాత ఫ్యాక్టరీని మూసేయకుండా ఉత్పత్తి కొనసాగించినా 6 సంవత్సరాల దాకా జైలు శిక్ష వేయవచ్చు. కాలుష్య నియంత్రణ బోర్డు నిర్దేశించిన ప్రమాణాలను మించి కాలుష్యం కలగజేస్తున్నట్టు తెలిసీ ఆ పనిచేస్తున్న ఫ్యాక్టరీ యజమానికి కూడ ఆరు సంవత్సరాల జైలు శిక్ష వేయవచ్చు. కాలుష్యాన్ని కలిగిస్తున్న పదార్థం నీళ్ళలోకి గానీ, గాలిలోకి గానీ ప్రవేశించిందని కాలుష్య నియంత్రణ బోర్డు గమనించి దానిని తొలగించడానికి గానీ, దానివల్ల జరిగే హానిని నివారించడానికి గానీ ఫలాన తక్షణ చర్య తీసుకొమ్మని ఫ్యాక్టరీ యజమానికి ఆదేశం ఇచ్చినట్టయితే, దానిని పాటించని యజమానికి కూడ ఆరు సంవత్సరాల జైలు శిక్ష వేయవచ్చు. కాలుష్య నివారణ బోర్డు వేసిన దావాపై కోర్టు ఏదైనా ఆదేశం జారీచేస్తే ఆ అదేశాన్ని అమలు చేయని ఫ్యాక్టరీ యజమానికి కూడ ఆరు సంవత్సరాల దాకా జైలు శిక్ష వేయవచ్చు.

చిన్న నేరాలకు కూడ ఈ చట్టాలు శిక్షలు పెట్టాయి. కాలుష్య నివారణ బోర్డు అడిగిన సమాచారం ఇవ్వకపోతే దానికి 3 నెలల జైలు శిక్ష వేయొచ్చు. కాలుష్యాన్ని మదింపు వేయడం కోసం బోర్డు ఏర్పాటుచేసిన పరికరాలను తొలగించినా, పాడుచేసినా 3 నెలల జైలు శిక్ష వేయొచ్చు. గాలిలోకి గానీ, నీటిలోకి గానీ ఒక ఫ్యాక్టరీ వదులుతున్న వ్యర్థ పదార్థాలను నిలుపుదల చేయడానికి కాలుష్య నివారణ బోర్డు ఇచ్చిన ఆదేశాన్ని పాటించకపోయినా, కాలుష్య నివారణ బోర్డు నెలకొల్పమన్న కాలుష్య నివారణ

యంత్రాన్ని లేక సాంకేతిక ప్రక్రియను నెలకొల్పకున్నా కూడ 3 నెలల జైలు శిక్ష వేయవచ్చు.

ఇక్కడ జాగ్రత్తగా గమనించవలసిన విషయం ఒకటి వుంది. కాలుష్యం కలిగించడం దానంతటది నేరం కాదు. మీ యింటి పక్కనున్న ఫ్యాక్టరీ నుండి ధూళి లేక రసాయన పదార్థాలు బయటికొచ్చి మీ ఆరోగ్యాన్నీ, మీరు లేక మీ పశువులు తాగే నీటినీ పాడుచేస్తున్నాయనుకోండి. దానికి మీరు వెంటనే ఆ ఫ్యాక్టరీ యజమానిని జైలులో పెట్టించగలరనుకుంటే పొరబాటే. అది దానంతటదే శిక్షార్హమైన నేరం కాదు.

ఆ కాలుష్యాన్ని నివారించడానికి కాలుష్య నివారణ బోర్డు జారీ చేసిన ఆదేశాన్ని అతిక్రమించినా, లేక కాలుష్య నివారణ బోర్డు నిర్దేశించిన ప్రమాణాలకు మించి కాలుష్యం కలిగిస్తున్నానని తెలిసి కూడ ఆ పనిచేస్తున్నా, లేక కాలుష్య నివారణ బోర్డు అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నడిపినా, కాలుష్య నివారణ బోర్డుకు వుండే అధికారాలకు సహకరించకపోయినా లేక ఆటంకం కలిగించినా అది మాత్రమే నేరం అవుతుంది.

ఈ నేరాలలో మళ్ళీ రెండు రకాలు. పెద్ద నేరానికి 6 సంవత్సరాల దాకా శిక్ష వేయొచ్చు గానీ చిన్న దానికి 3 నెలలే. ఈ చిన్నదే నిత్యం జరుగుతుంటుంది. కాలుష్య నివారణ బోర్డు ఇమ్మన్న సమాచారం ఇవ్వకపోవడం, వారిని మోసం చేయడం, బోర్డు కాలుష్య నివారణ గురించి ఇచ్చిన సాధారణ ఆదేశాలను (కాలుష్య నియంత్రణ యంత్రాన్ని నెలకొల్పమని, పొగ గొట్టం ఎత్తు పెంచమని, వ్యర్థ పదార్థాల్ని బయటికి తీసుకుపోయే కాలువ వెడల్పు పెంచమని లేక దానిని భూగర్భంలో నిర్మించమని వగైరా) పాటించకపోవడం నిత్యం జరిగే విషయాలు. అయితే ఫలానా వ్యర్థ పదార్థాన్ని పర్యావరణం నుండి తొలగించడానికి తక్షణమే ఫలానా చర్య తీసుకొమ్మని కాలుష్య నివారణ బోర్డు ఆదేశించినప్పుడు దానిని పాటించకపోతే సీరియస్ నేరం అవుతుంది. కాలుష్య నివారణ బోర్డు అనుమతి లేకుండా ఫ్యాక్టరీ నెలకొల్పినా, అది ఉపసంహరించబడిన తరువాత కూడ ఉత్పత్తి కొనసాగించినా అదీ సీరియస్ నేరమే అవుతుంది. దీనికి 6 సంవత్సరాల దాకా జైలు శిక్ష వేయవచ్చు.

అయితే శిక్ష తక్కువా ఎక్కువా అన్న సంగతి అటుంచి, ఈ నేరాల గురించి కోర్టును కదిలించే అవకాశం బాధితులకు కాక కేవలం కాలుష్య నియంత్రణ బోర్డుకే

ఇవ్వబడింది. అంటే కాలుష్యానికి సంబంధించిన ప్రమాణాలను బోర్డు నిర్ణయిస్తుంది. వాటిని ఫ్యాక్టరీలు పాటిస్తున్నదీ లేనిదీ తానే పర్యవేక్షిస్తుంది. పాటించడానికి అవసరమైన ఆదేశాలూ తానే జారీచేస్తుంది, కాలుష్య సంబంధమైన నేరాలపైన కోర్టుకు ఫిర్యాదులు కూడ తానే చేస్తుంది.

దొంగతనం లాగ, హత్యలాగ ఇవి 'కాగ్నైజబుల్' నేరాలెందుకు కాకూడదు? ఇవి కచ్చితంగా వాటికంటే ఎక్కువ హాని చేస్తాయి. కాలుష్యం కొన్ని వందల, ఒక్కొక్క సారి కొన్ని వేల ప్రాణాలకు అపాయం కలిగిస్తుంది. జీవనాన్నీ, జీవితాన్నీ ధ్వంసం చేస్తుంది. కాలుష్యానికి సంబంధించిన ప్రమాణాలను నిర్దేశించే అధికారం కాలుష్య నివారణ బోర్డు వంటి సాంకేతిక సామర్థ్యం గల సంస్థకు ఇస్తే తప్పు లేదు. అలాగే వాటి అమలుకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చే అధికారం బోర్డు చేతిలో పెట్టడం కూడ సబబే. ప్రజలందరికీ ఆ అధికారం వుండడం సాధ్యం కాదు. కానీ ఒకసారి ప్రమాణాలు నిర్ణయించిన తరువాత, వాటి అమలు గురించి ఆదేశాలు జారీ చేసే అధికారం ఒక వ్యవస్థకు ఇచ్చిన తరువాత, వాటిని అతిక్రమిస్తే వెంటనే పోలీసులు రంగంలోకి దిగి కేసు పెట్టేటట్టు చట్టమెందుకు చేయకూడదు?

చేయలేదు. దానిని నాన్ – కాగ్నైజబుల్ నేరం చేసారు. అంటే కోర్టుకు తగిన రీతిలో ఫిర్యాదు చేసిన మీదటే ఆ నేరం పైన పరిశోధన చేపడతారు. ఫిర్యాదు చేసే అధికారం కూడ ప్రధానంగా కాలుష్య నియంత్రణ బోర్డుకే ఇవ్వబడింది.

'ప్రధానంగా' అని ఎందుకంటున్నామంటే, బాధితులు కూడ ఫిర్యాదు చేయ వచ్చును. అయితే నియంత్రణ బోర్డుకు రెండు నెలల ముందే చెప్పి (నోటీసు రూపంలో తెలియజేసి) ఆ తర్వాత ఫిర్యాదు చేయవచ్చు.

ఆ తర్వాతయినా కేసు పెట్టి దోషులైన ఫ్యాక్టరీ యజమానులను జైలుకు పంపించవచ్చు కదా అనుకుంటే పొరబాటే. ఉదాహరణకు మీ యింటి పక్కన ఉన్న ఫ్యాక్టరీ తూము నుండి రసాయన పదార్థాలు బయటికొచ్చి మీ ఇంటి బావినీటిని కలుషితం చేస్తున్నాయనుకోండి. దానివల్ల మీకూ, మీ పిల్లలకూ రోగాలొచ్చి చాలా నష్టపోయారనుకోండి. ఆ ఫ్యాక్టరీ యజమానికి శిక్ష వేయించడం కోసం మీరు ఫిర్యాదు చేయదలచుకుంటే ఆ ఉద్దేశ్యాన్ని కాలుష్య నివారణ బోర్డుకు తెలియజేసి, రెండు

నెలల తరువాత కోర్టులో కేసు వేసారనుకోండి. ఆ తర్వాత ఏం చేయాలి? సాక్ష్యాలను ప్రవేశపెట్టాలి. కానీ మీ నోటీస్ సంగతి తెలిసిన ఆ ఫ్యాక్టరీ యజమాని జాగ్రత్తలు తీసుకొని ఆ రెండు నెలలలో రసాయన పదార్థాలేవీ బయటికి రాకుండా (కనీసం మీరున్న వైపు రాకుండా) చూసుకుంటాడు. అప్పుడు మీకు ప్రవేశపెట్టడానికి సాక్ష్యమేముంటుంది?

ఇవాళ్టి బావినీటి 'శాంపిల్'ను భద్రపరచి దాన్ని సాక్ష్యంగా ప్రవేశపెట్టవచ్చు కదా? కానీ అది ఆ బావిదే అన్న రుజువు కావాలి. పై రెండు చట్టాలూ కాలుష్య నియంత్రణ బోర్డుకే అధికారికంగా శాంపిల్స్ తీసుకునే హక్కు ఇచ్చాయి. బోర్డుతో ఫ్యాక్టరీ యాజమాన్యం తప్పనిసరిగా సహకరించాలని చెప్పాయి. శాంపిల్ తీసుకునే పద్ధతిని వివరంగా నిర్దేశించాయి. బోర్డు సేకరించిన శాంపిల్‌ను గుర్తింపు పొందిన ప్రయోగశాలలు పరీక్ష చేయాలని చెప్పాయి. అలాంటప్పుడు మనం చేయగలిగిందేమిటి? మనం శాంపిల్ సేకరించడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం సహకరించదు. సహకరించమని చెప్పే హక్కు మనకు లేదు. వెరసి యాజమాన్యం సహకారం లేకుండా చట్టం నిర్దేశించిన పద్ధతిలో శాంపిల్ సేకరించడం మనకు అసాధ్యం. ఈ సహకారం మన యింటి బావి నుండి సేకరించే నీటి శాంపిల్‌కు అవసరం కాదు. కానీ అది ఫ్యాక్టరీ నుండి వచ్చిన కాలుష్యమేనని రుజువు చేయడానికి ఆ ఫ్యాక్టరీ తూములలో ప్రవహించే ద్రవ పదార్థం నుండి కూడ శాంపిల్ సేకరించవలసి వుంటుంది. దానికి యాజమాన్యం సహకారం తప్పనిసరిగా కావాలి. వారి సహకారం లేకుండా మన పాటికి మనం ఒకవేళ ఒక శాంపిల్ సేకరించి, గుర్తింపు పొందిన ప్రయోగశాలలో దానిని పరీక్ష చేయించి పెట్టినా అది ఆ ఫ్యాక్టరీ తూములోనిదే అని కోర్టులో రుజువు చేయడం కష్టం.

మొత్తం మీద కాలుష్య బాధితులకు కాలుష్యం కలిగించే ఫ్యాక్టరీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు పెట్టి కోర్టుకు లాగే అవకాశం చాలా తక్కువేనని చెప్పాలి. కాలుష్య నియంత్రణ బోర్డుకు రెండు నెలల నోటీసు ఇచ్చి కేసు పెట్టొచ్చుననడంలో ఉద్దేశ్యం బహుశా ఆ విధంగానయినా బోర్డు కదిలి ఆ ఫ్యాక్టరీ కాలుష్యాన్ని నిరోధిస్తుందన్న ఆశ కావచ్చు.

చట్టానికున్న ఈ వైఖరి వెనక ఒక ఆలోచన వుంది. పరిశ్రమలు దేశ ఆర్థిక ప్రగతికి అవసరం. వాటి వల్ల కాలుష్యం వస్తే రావచ్చు. దానివల్ల నష్టం జరిగితే

జరగవచ్చు. దానిని నివారించవలసిందే. ఎవ్వరూ కాదనరు. కానీ పారిశ్రామిక సంస్థల యజమానులను 'చీటికీ మాటికీ' కోర్టుకు లాగడం మంచిది కాదు. కాలుష్య నియంత్రణ బోర్డు వంటి 'బాధ్యతాయుతమైన' సంస్థ చేతిలో అధికారం పెడితే ప్రతి దానికీ కేసు పెట్టి జైలులో పెట్టించే ప్రయత్నం చేయకుండా కాలుష్యాన్ని మాన్పించే ప్రయత్నం మీద అది ఎక్కువ దృష్టిపెడుతుందనేదే ఆ ఆలోచన.

దొంగలను ప్రతి దొంగతనానికీ శిక్షించనవసరం లేదనీ, దొంగతనాలు మాన్పించడం మీద దృష్టిపెడితే చాలుననీ అంటే ఎవరూ ఒప్పుకోరు. 'చేసినదంతా చేసేసి ఇప్పుడు మానుకుంటానంటే క్షమించవలసిందేనా? చేసిన దానికి శిక్షపడ వలసిందే' నంటారు కానీ ఘరానా వ్యక్తులు పాల్పడే పన్నుల ఎగవేత, కాలుష్యం వంటి నేరాల విషయంలో చట్టానిదీ సమాజానిదీ కూడ ఇదే వైఖరి.

కాలుష్యం కలగజేస్తూ, చెప్పినా మానుకోని యాజమాన్యం మీద కోర్టులో దావా వేసి ఇంజక్షన్ తీసుకునే హక్కు కూడ ఈ చట్టాలు కాలుష్య నియంత్రణ బోర్డుకు ఇచ్చాయని చెప్పాము కదా! ఆ హక్కు కూడ (ఈ చట్టాలలో) బాధితులకు లేదు. కాలుష్య నివారణ విషయంలో సకల బాధ్యతా ఈ చట్టాలు కాలుష్య నియంత్రణ బోర్డు పైననే పెట్టాయి. ఆ క్రమంలో న్యాయం కోసం మనమెవరమూ కోర్టులలో చొరవ తీసుకునే హక్కు లేకుండా చేసాయి.

అయితే పాత చట్టాలలో ఈ హక్కు కొంత మేరకు ఉంది. ఉదాహరణకు ఎవరైనా మానవ హక్కులకు భంగం కలిగించినా, లేదా మనకు హానికరమైన విధంగా ప్రవర్తించినా, వారిని అదుపు చేయడానికి సివిల్ కోర్టులో దావా వేసి ఇంజక్షన్ కోరే హక్కు సివిల్ చట్టాలలో ఉంది. అట్లాగే ఏదయినా వ్యాపారం గానీ, వ్యవహారం గానీ ప్రజల ఆరోగ్యానికీ, సౌఖ్యానికీ హానికరంగా లేక నష్టకరంగా నిర్వహించబడుతున్నదన్న ఫిర్యాదు జిల్లా మేజిస్ట్రేట్ అయిన కలెక్టర్‌కు గానీ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ అయిన ఆర్.డి.ఓ.కు గానీ, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అయిన ఎంఆర్‌ఓకు గానీ అందితే, ఆ అధికారి దానిపైన విచారణ జరిపి ఆ వ్యవహారాన్ని లేక వ్యాపారాన్ని తగిన రీతిలో సవరించుకొమ్మని దాని నిర్వాహకులకు ఆదేశం జారీ చేయవచ్చుననీ, దానిని వాళ్ళు పాటించని పక్షంలో ఆ వ్యవహారాన్ని లేక వ్యాపారాన్ని నిషేధించవచ్చుననీ సిఆర్‌పిసి సెక్షన్ 133 అంటుంది.

ఇవి పాత చట్టాలు. ప్రత్యేకించి పారిశ్రామిక కాలుష్యం కోసం ఉద్దేశించబడినవి కావు గానీ దానిని ఎదుర్కొనడానికి ఉపయోగపడతాయి. కొత్త చట్టాలు పౌరులకున్న ఈ హక్కులను పెంచవలసింది పోయి కాలుష్య నియంత్రణ బోర్డును ఏర్పాటు చేసి పౌరుల హక్కులు దానికి అప్పగించాయి. బోర్డు వల్ల ఉన్న ఇతర ప్రయోజనాలను మేము కాదడనం లేదు. ఫ్యాక్టరీ నెలకొల్పడానికి ముందు పర్యావరణం దృష్ట్యా పరిశీలన జరిపి అనుమతి ఇవ్వడం, లేదా నిరాకరించడం, మధ్య మధ్యలో అధికారికంగా కాలుష్య సంబంధమైన పరీక్షలు నిర్వహించి అదుపులో ఉన్నదీ లేనిదీ తేల్చడం, లేనట్టయితే తగిన ఆదేశాలు జారీ చేయడం, మాట వినకపోతే ఫ్యాక్టరీకి ఇచ్చిన అనుమతిని ఉపసంహరించడం, లేదా కోర్టులో దావా వేయడం – ఈ సాధారణ అధికారాలు గల బోర్డు ఒకటి ఉండడం మంచిదే. కాలుష్యానికి సంబంధించిన హేతుబద్ధమైన ప్రమాణాలు నిర్దేశించే నైపుణ్యత కూడ ప్రజలందరికీ ఉండదు. దానికి కూడ ఇటువంటి సంస్థ ఉండడం మంచిదే. అయితే ఒక చేత్తో ఆ సదుపాయం కల్పిస్తూ మరో చేత్తో కాలుష్య బాధితులయిన పౌరులకుండవలసిన కోర్టులను కదిలించే హక్కును బోర్డుకు అప్పగించడం అభ్యంతరకరమైన విషయం. తమ హక్కుల పరిరక్షణ కోసం కోర్టును నేరుగా కదిలించే హక్కు ప్రజాస్వామ్యంలో పౌరులకు ఉండవలసిన ముఖ్యమైన హక్కులలో ఒకటి.

పోనీలే పాత చట్టాలున్నాయి కదా అనుకుంటే కాలుష్య నియంత్రణ బోర్డు వచ్చాక అవి ఇంక చెల్లవని ఫ్యాక్టరీ యజమానులు వాదించే ప్రయత్నం చేసారు. నీటి కాలుష్యాన్ని గురించి, వాయు కాలుష్యాన్ని గురించి చట్టాలు చేసి కాలుష్య నివారణ కోసం ఒక కచ్చితమైన విభాగాన్ని రచించిన తరువాత సిపిసిలోని ఇంజక్షన్ దావాలు, సిఆర్‌పిసి లోని సెక్షన్ 133 కింద జరిపే విచారణలు ఇంక చెల్లవని ఫ్యాక్టరీ యజమానులు వాదించారు. అదృష్టవశాత్తు కోర్టులు ఒప్పుకోలేదు. ఇవి రెండూ వేరు వేరు అధికారాలనీ, దేనిపాటికది చెల్లుతుందనీ మన రాష్ట్ర హైకోర్టు 1986లోనే స్పష్టం చేసింది.

క్రిమినల్ కేసులు పెట్టడానికి కూడ కాలుష్య నియంత్రణ బోర్డుకు రెండు నెలల నోటీసు ఇచ్చి కాచుకునే బదులు భారత శిక్షాస్మృతి కింద కేసులు పెట్టుకోవచ్చు.

ప్రాణానికి హాని కలిగించే రోగం వ్యాపించడానికి కారణమయిన ఏ పని అయినా నేరమని భారత శిక్షాస్మృతి (ఐపిసి) సెక్షన్ 269 అంటుంది. దీనికి శిక్ష 6 నెలల ఖైదు.

ప్రజలు ఉపయోగించే నీటి వనరులను కలుషితం చేసి మనుషుల వాడకానికి పనికి రాకుండా చేయడం నేరమని సెక్షన్ 277 అంటుంది. దీనికి శిక్ష 3 నెలల ఖైదు.

కలుషిత పదార్థాలు నీటిలో కలవడం వల్ల ఆ నీరు విషప్రాయంగా మారి దానిని తాగడం వల్ల ఒకరి ప్రాణం పోయిందనుకోండి. ఇది 'అజాగ్రత్తగా ప్రవర్తించడం ద్వారా ప్రాణం తీసిన' ఘటన అవుతుంది. అంటే ఐపిసి సెక్షన్ 304-ఎ కింద నేరం అవుతుంది.

ఈ చట్టాల కింద కాలుష్యం కలిగించే ఫ్యాక్టరీ యజమానుల పైన కేసులు పెట్టడానికి మనం ఎవరికీ నోటీసు ఇవ్వనవసరం లేదు. నేరుగా కేసు పెట్టొచ్చు. అయితే కొత్త చట్టాలు, ప్రత్యేకించి పారిశ్రామిక కాలుష్యానికి వర్తించే చట్టాలు చేసినప్పుడు ఈ పాత చట్టాల కంటే ఎక్కువ హక్కులు, ఎక్కువ అవకాశాలు మనకు కల్పిస్తాయని ఆశిస్తాం. తిరిగి మళ్ళీ పాత చట్టాల దగ్గరికే పోయి 'పోనీలే ఇవి ఉన్నాయి కదా' అని సంతృప్తి చెందే పరిస్థితి మిగులుస్తాయని అనుకోము.

అంతే కాకుండా ఐపిసిలోని పై సెక్షన్‌లలో శిక్షలు చాలా తక్కువ. కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టి లాభాల వేటలో కాలుష్య నియంత్రణను పట్టించుకోకుండా చుట్టూ ఉన్న ప్రజల జీవితాలకూ, జీవనానికీ హాని కలిగించే వాళ్ళను శిక్షించడం కోసం ఉద్దేశించిన చట్టాలు కావవి. ఈ ఆధునిక నేరాలకు ఆధునిక చట్టాలు కావాలి. గట్టి శిక్ష వేసే చట్టాలు కావాలి.

శిక్షల విషయంలో చట్టాలలో ఉండే పరిస్థితికీ, పర్యావరణం పట్ల సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలకూ పొంతన లేదు. పరిశుభ్రమైన పర్యావరణం జీవించే హక్కులో భాగమని సుప్రీంకోర్టు అనింది. జీవించే హక్కు అంటే భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కయిన ఆర్టికల్ 21. అంటే పరిశుభ్రమైన పర్యావరణం ఒక ప్రాథమిక హక్కని సుప్రీంకోర్టు గుర్తించిందని దీని అర్థం. ఆ ప్రాథమిక హక్కును అతిక్రమిస్తే, అతిక్రమించి ప్రాణానికీ, జీవితానికీ హాని కలిగిస్తే దానికి 3 నెలలూ, 6 నెలలూ జైలుశిక్ష ఉండడం సబబేనా? దాని గురించి బాధితులు కోర్టును కదిలించజాలరనీ, వారి తరఫున కాలుష్య నియంత్రణ బోర్డు మాత్రమే కదిలించాలనీ అనడం సబబా?

సుభాష్ కుమార్ వర్సస్ స్టేట్ ఆఫ్ బీహార్ (AIR 1991 SC 420) లో మొట్టమొదటిసారి సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా పరిశుభ్రమైన పర్యావరణం జీవించే హక్కులో భాగమేననీ, కాబట్టి అది ఆర్టికల్ 21లోని ప్రాథమిక హక్కులో భాగమనీ ప్రకటించింది. ఈ గుర్తింపు ఎప్పుడయితే వచ్చిందో దానితోబాటు ఈ ప్రాథమిక హక్కును అతిక్రమించే ఫ్యాక్టరీ యజమానులకు తగిన శిక్షలు నిర్దేశించాలి, వారిని శిక్షింపచేయడానికి కోర్టులను కదిలించే హక్కు బాధితులకు నిరాటంకంగా కలిగించాలి.

దాని బదులు పై రెండు చట్టాలకూ ఉన్న ఉదాసీన వైఖరినే కొనసాగించడం ఏం న్యాయం? ఈ చట్టాలలో కాలుష్య నియంత్రణ బోర్డుకు కొన్ని ఉపయోగకరమైన అధికారాలు ఉన్న మాట వాస్తవమే. అది కాలుష్యానికి ప్రమాణాలు నిర్దేశిస్తుంది. దాని కోసం పరిశోధనలు జరిపిస్తుంది. ఆ ప్రమాణాలు అమలవుతున్నాయా లేదా అని తెలుసుకోవడం కోసం అది ఎప్పుడయినా సరే ఫ్యాక్టరీకి పోయి పరిశీలన చేయువచ్చు. శాంపిల్స్ సేకరించవచ్చు. ఈ పరిశీలనకు యాజమాన్యం సహకరించవలసిందే. సహకరించకపోతే అది నేరం. ఒకవేళ సహకరించకపోతే ఆ విషయాన్ని బోర్డు ప్రతినిధి నమోదు చేసి తన పరిశీలనను (ఉదాహరణకు శాంపిల్ సేకరణ) కొనసాగించవచ్చు. కాలుష్యం చట్టపరమైన ప్రమాణాలకు లోబడి ఉండేటట్టు చూడడానికి అది ఫ్యాక్టరీ యాజమాన్యానికి తగిన ఆదేశాలు జారీ చేయవచ్చు. ఆ ఆదేశాలు అమలు చేసేందుకు ఏదైనా నిర్మాణం చేపట్టవలసి ఉంటే దాన్ని యాజమాన్యం చేపట్టి తీరవలసిందే. ఉదాహరణకు బోర్డు గోడ లేక తూము కట్టమంటే, యాజమాన్యం ఆ పని చేయకపోతే వాళ్ళు చేసేంతవరకు ఆగకుండా బోర్డే ఆ నిర్మాణం చేపట్టి ఆ తరువాత దానికైన ఖర్చును వారి నుండి రాబట్టుకోవచ్చు.

ఇదంతా బాగానే వుంది గానీ ఈ అధికారాలు ఏ విధంగా అమలవుతాయనేది బోర్డు వైఖరిని బట్టి ఉంటుంది. ఇప్పటి దాకా కనిపిస్తున్న వైఖరి పెట్టుబడిదారుల పట్ల చాలా 'ఉదారంగా' ఉండే వైఖరి. చట్టం ప్రభుత్వానికి కొన్ని ప్రాంతాలను మొత్తంగా నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం పరిధి నుండి మినహాయించే అవకాశం ఇస్తుంది (సెక్షన్ 19). వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టమైతే ప్రకటిత ప్రాంతాలకు మాత్రమే వర్తిస్తుంది. బోర్డు ఏం చేస్తుందంటే, కాలుష్య నివారణ యంత్రాలను ప్రవేశపెట్టమని యాజమాన్యానికి ఆదేశం ఇచ్చినప్పుడు వాళ్ళు దానికి

డబ్బులు లేవనీ, టైం కావాలనీ అడిగితే ఎంత అడిగితే అంత ఇస్తుంది. ఈ లోపల జరిగే కాలుష్యం జరుగుతూనే ఉంటుంది. ఆదేశాన్ని అమలు చేయడం కోసం బోర్డు కొంత గడువు ఇస్తుంది కదా. ఆ గడువు లోపల జరిగే కాలుష్యం నేరం కిందికి రాదని ఈ చట్టాలు అంటాయి. చట్టానికి, బోర్డుకు కూడ ఉన్న వైఖరి ఏమిటంటే ఉత్పత్తి ముఖ్యం. ఫ్యాక్టరీలు మూసేయకూడదు. యజమానులను జైలుకు పంపించకూడదు. ఈ వైఖరి చట్టమన్నా, ప్రజల ఆరోగ్యమన్నా ఖాతరు లేని యజమానులకు తమ బాధ్యత నుండి తప్పించుకోవడానికి చాలా అవకాశం ఇస్తుంది.

కాలుష్యం కలిగించే యాజమాన్యాల పైన కోర్టులో కేసులు వేసే అధికారాన్ని ఈ చట్టాలు కాలుష్య నియంత్రణ బోర్డు చేతిలో పెట్టినప్పటికీ బోర్డులు ఎప్పుడో గాని కేసులు వేయవు. ఎక్కువ భాగం వాళ్ళను బుజ్జగించి, నచ్చజెప్పి మంచి చేసుకోవాలనేదే బోర్డు వైఖరి. ఈ లోపల ఎంతమంది ప్రాణాలకు ఎంత నష్టం జరిగినా ఫరవాలేదు. పొలాలూ, నీళ్ళూ, గాలీ ఎంత నాశనం అయినా ఫరవాలేదు.

తప్పు చేస్తే శిక్ష పడుతుందన్న భయం ఉండాలనీ, అది లేకపోతే చట్టాలూ నియమాలూ అమలు కావనీ వేరే సందర్భాలలో అందరమూ గుర్తిస్తాము. కానీ ప్రాణాంతకమైన కాలుష్యానికి వచ్చేసరికి 'మాన్పించడం ముఖ్యం, శిక్షించడం కాదు' అనే వైఖరి వచ్చేస్తుంది. ఇదంతా దేశ అభివృద్ధి పేరిట, ఉత్పత్తిని కాపాడే పేరిట పేదలు చేసే దొంగతనాల విషయంలో లేని ఔదార్యం ధనవంతులు చేసే ఈ నేరాల విషయంలో ఉండడం విచిత్రమైన విషయం.

ఈ వైఖరే కాక అవినీతి కూడ ఒక సమస్యే. పెట్టుబడిదారులకు కాలుష్య నివారణ చర్యలు చేపట్టడం కంటే కాలుష్య నియంత్రణ బోర్డు అధికారుల చేతులు తడిపి తప్పించుకోవడం చాలా చవక అయిన విషయం. మొత్తంగా చట్టం నుండి తప్పించకపోయినా కొంత ఉదారంగా చూసీచూడనట్లు పోయే వైఖరి అనుసరిస్తే చాలు వాళ్ళ అవసరాలు తీరిపోతాయి. అందువల్ల చట్టం అధికారం కల్పించే ఇన్స్‌పెక్షన్‌లు బోర్డు అధికారులు ఎప్పుడో తప్ప చేయరు. చేసినా నిష్పాక్షికంగా, స్వతంత్రంగా చేయరు. 'కంపెనీ గెస్ట్ హౌస్‌లో కూర్చొని డిన్నర్ చేసి రిపోర్టు కూడ అక్కడే రాసుకొని పోతారు' అని బాధితులు చెప్పేది పూర్తిగా అతిశయోక్తి అనలేము.

కాలుష్య బోర్డు వ్యవహారం ఈ విధంగా వుండగా, 1986లో కేంద్ర పార్లమెంటు మరొక చట్టం చేసింది. దీని పేరు **పర్యావరణ (పరిరక్షణ) చట్టం.** 1974, 1981 చట్టాలకూ, దీనికీ రెండు ప్రధానమైన తేడాలున్నాయి.

1. పాత వాటిలో ఒకటి నీటి కాలుష్యానికీ, ఒకటి వాయు కాలుష్యానికీ సంబంధించినవి. కాగా కొత్త చట్టం ఏ కాలుష్యం అన్న దానితో నిమిత్తం లేకుండా అన్నిటికీ వర్తిస్తుంది. కాలుష్య నియంత్రణ అనే బదులు పర్యావరణ పరిరక్షణ అంది. పర్యావరణం అంటే గాలీ, నీరూ మాత్రమే కాదు, 'గాలి, నీరు, భూమి, వాటి మధ్య వుండే సంబంధాలు, వాటికీ మనుషులకూ మధ్య వుండే సంబంధాలు, వాటికీ అన్ని రకాల జీవులకూ మధ్య వుండే సంబంధాలు' అని ఈ చట్టం పర్యావరణాన్ని నిర్వచిస్తుంది.

2. ఈ చట్టం కాలుష్య నియంత్రణ బోర్డుల గురించి మాట్లాడదు. 1974, 1981 చట్టాలు కాలుష్య నియంత్రణ బోర్డు చేతిలో పెట్టిన అధికారాలను ఈ చట్టం కేంద్ర ప్రభుత్వం చేతిలోనే నేరుగా పెడుతుంది.

పర్యావరణం బాగుండడానికి అవసరమైన ప్రమాణాలను నిర్దేశించడం, పర్యావరణ కాలుష్యానికి ప్రమాణాలను నిర్దేశించడం, అంటే కాలుష్య పదార్థం ఎంత మోతాదు కంటే ఎక్కువ ఉండడానికి వీలు లేదో నిర్దేశించడం, కొన్ని ప్రకటిత పరిశ్రమలను లేక ఉత్పాదన క్రియలను నిర్దిష్ట ప్రాంతాలలో నిషేధించడం, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు చేపట్టే కాలుష్య నివారణ కార్యక్రమాలను సమన్వయ పరచడం, జాతీయ స్థాయిలో పర్యావరణ కాలుష్య నివారణ కోసం, నియంత్రణ కోసం కార్యక్రమాన్ని రూపొందించడం మొదలయినవి ఈ చట్టం కింద కేంద్ర ప్రభుత్వం బాధ్యతలు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్‌లో ప్రకటించిన కాలుష్య ప్రమాణాలకు విరుద్ధంగా ఎవ్వరూ ఏ పరిశ్రమను గానీ, ఉత్పాదన క్రియను గానీ నడపడానికి వీలు లేదని సెక్షన్ 7 అంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇందు నిమిత్తం నియమించిన అధికారి ఏ పరిశ్రమనైనా ఎప్పుడయినా పరిశీలించవచ్చుననీ, శాంపిల్ తీసుకోవచ్చుననీ, అక్కడే పరీక్షలు నిర్వహించవచ్చుననీ, దీనికి ఆ సంస్థ యాజమాన్యం తప్పక సహకరించాలనీ, సహకరించకపోవడం నేరమనీ సెక్షన్ 10 అంటుంది.

ఒకవేళ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కాలుష్య ప్రమాణాలకు వ్యతిరేకంగా ఎవరయినా ఉత్పాదన క్రియను నిర్వహిస్తే ఏమవుతుంది? అంటే చట్టం అనుమతించిన దానికంటే ఎక్కువ మోతాదులో అభ్యంతరకరమైన వ్యర్థ పదార్థాలను పర్యావరణంలోకి విడిచిపెడితే ఏం చేస్తారు? 1974, 1981 చట్టాల లాగా 3 నెలల శిక్షతో సరిపెట్టకుండా ఈ చట్టం 5 సంవత్సరాల జైలు శిక్ష పెట్టింది.

అయితే ఈ చట్టంలో కూడ బాధితులకు నేరుగా కేసు పెట్టే హక్కు లేదు. కేంద్ర ప్రభుత్వం పెట్టాలి. లేదా బాధితులు కేంద్ర ప్రభుత్వానికి 2 నెలల నోటీస్ ఇచ్చి, ఆ తరువాత కేసు పెట్టాలి. అంటే ఈ విషయంలో పాత పరిస్థితే కొన సాగుతుంది. కాలుష్యం సృష్టించి జీవనాన్నీ, జీవితాన్నీ ప్రమాదానికి గురిచేసే వారిపైన చట్టపరమైన చర్య తీసుకునే చొరవ కేంద్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం కదలకపోతే బాధితులు నేరుగా చట్టాన్ని కదిలించలేరు. రెండు నెలల నోటీసిచ్చి కదిలించాలి. అందులో ఉన్న సమస్యలు పైన వివరించాము.

కొత్త చట్టం వచ్చిందంటే అర్థం కాలుష్య నియంత్రణ బోర్డులకు కాలం చెల్లిందని కాదు. దేనిపాటికది అన్ని చట్టాలూ పనిచేస్తాయి. ఇప్పుడు మనం కాలుష్యాన్ని నివారించడానికి సివిల్ దావాలు సిపిసి కిందా వేసుకోవచ్చు. సిఆర్‌పిసి సెక్షన్ 133 కింద విచారణ జరిపి చర్య తీసుకొమ్మని జిల్లా కలెక్టర్ దగ్గరో, ఆర్‌డివో దగ్గరో పిటిషన్ ఇదివరకటి లాగానే వేసుకోవచ్చు. ఐపిసి సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు పెట్టవచ్చు. నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం (1974) కింద, వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం (1981) కిందా కాలుష్య నియంత్రణ బోర్డుకు అర్జీ పెట్టుకోవచ్చు. లేదా పర్యావరణ (పరిరక్షణ) చట్టం (1986) కింద కేంద్ర ప్రభుత్వానికి అర్జీ పెట్టుకోవచ్చు.

ఎన్ని చేసినా కాలుష్యం కలిగించే చర్యలను ఏదో ఒక రకంగా నచ్చచెప్పి మాన్పించవలసిన తప్పిదాలుగా కాక నేరాలుగా చూసే వైఖరి ప్రభుత్వానికీ, కాలుష్య నియంత్రణ బోర్డుకూ, ఆమాటకొస్తే కోర్టులకూ లేనంత కాలం ప్రయోజనం అంతంత మాత్రంగానే ఉంటుంది. ప్రభుత్వానికి ఉండే ఈ వైఖరే పై చట్టాలలోని పరిమితులలో కూడ కనిపిస్తుంది.

## II. సిమెంటు కాలుష్యం

సిమెంటు పరిశ్రమ బాగా అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి. ఇప్పుడు నల్గొండ – కృష్ణా – గుంటూరు జిల్లాలు కలిసే ప్రాంతం సిమెంటు ఉత్పత్తికి ప్రధాన కేంద్రం కాగా, కడప – కర్నూలు – అనంతపురం జిల్లాల సరిహద్దులు కలిసే ప్రాంతం కూడ రాబోయే రోజులలో సిమెంట్ ఉత్పత్తికి ఒక ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చెందే సూచనలున్నాయి. ఇవి కాక ఆదిలాబాద్ జిల్లాలో కూడ ఇప్పుడున్న మూడు ఫ్యాక్టరీలే కాక ఇంకా ఫ్యాక్టరీలు నెలకొల్పే అవకాశం వుంది. రంగారెడ్డి జిల్లాలోని తాండూరు ప్రాంతం మరొక కేంద్రం.

సిమెంటు ఆధునిక పట్టణ నాగరికతా అభివృద్ధిలో కీలకమైన పాత్ర నిర్వహించింది అనటంలో సందేహం లేదు. అటువంటి పరిశ్రమ మన రాష్ట్రంలో అభివృద్ధి చెందడం సంతోషించదగ్గ విషయమే. సిమెంటు ఉత్పత్తిలో ప్రధాన ముడిసరుకు అయిన సున్నపు రాయి (లైమ్‌స్టోన్) తెలంగాణలోను, రాయలసీమలోను, కోస్తా జిల్లాలలోని పల్నాడు వంటి మెట్ట ప్రాంతాలలోనూ బాగా దొరుకుతుంది కాబట్టి ఈ పరిశ్రమ ఇంకా విస్తరించగలదు.

బాగానే వుంది.

కానీ దీనికి సంతోషించే ముందు ఇప్పటికి దాదాపు 20 సంవత్సరాలుగా అభివృద్ధి చెందుతూ ఉన్న సిమెంటు పరిశ్రమ వల్ల వచ్చిన కాలుష్య సంబంధమైన సమస్యలను, వాటి వల్ల నష్టపోయిన రైతాంగం వెతలను కొంచెం తెలుసుకుంటే మంచిది.

మామూలుగా పరిశ్రమలు పట్టణ ప్రాంతంలో నెలకొల్పడానికే పెట్టుబడిదారులు ఇష్టపడతారు. అయితే సిమెంటు పరిశ్రమ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో ఉంది. ఎక్కడ సున్నపురాయి దొరికితే అక్కడే క్వారీ లీజుకు తీసుకొని పక్కనే ఫ్యాక్టరీ కట్టుకోవడమే చవక అవుతుంది కాబట్టి ఎక్కడెక్కడ సున్నపురాయి క్వారీలు ఉంటే అక్కడ సిమెంటు ఫ్యాక్టరీలు వచ్చాయి. మాచర్ల, ఆదిలాబాదు, మంచిర్యాల, జగ్గయ్య పేట, యెర్రగుంట్లలలో ఉన్న సిమెంటు ఫ్యాక్టరీలను మినహాయిస్తే మిగిలినవన్నీ గ్రామీణ ప్రాంతాలలోనే ఉన్నాయి. వాటి క్వారీల దగ్గర గ్రామాలున్నాయి. పొలాలు

వున్నాయి. ఫ్యాక్టరీ దగ్గర కూడ గ్రామాలున్నాయి, పొలాలున్నాయి. పశువులూ, మనుషులూ నీళ్ళు తాగే వాగులున్నాయి, వంకలున్నాయి.

సిమెంటు కాలుష్యం ప్రధానంగా వాయు కాలుష్యం. పొగ గొట్టం నుండి సున్నపురాయి ధూళి గాలిలోకి ప్రతీ గంటకూ కొన్ని టన్నుల మేరకు బయటికొస్తుంది (కాలుష్య నివారణ యంత్రం నెలకొల్పకపోతే). నేల నుండి చాలా ఎత్తున ఉండే ఈ పొగ గొట్టాలు వెదజల్లే ఆ సన్నటి ధూళి కొన్ని కిలోమీటర్ల మేరకు గాలి ఎటువీస్తే అటు కొట్టుకుపోయి చివరికి నేల మీదికి దిగుతుంది. చెట్ల ఆకుల మీద, పొలాలలోని మొక్కల మీద, నేలమీదున్న గడ్డి మీద నిలుస్తుంది. వాగులూ, వంకలూ, కుంటలూ ఉంటే వాటి మీద ఒక పల్చటి తెరలాగా కమ్ముకుంటుంది. ఇళ్ళుంటే ఇళ్ళ మీద పడుతుంది. మనుషులుంటే వాళ్ళకు ఆపాదమస్తకం 'సిమెంట్ పౌడర్' పూస్తుంది.

గాలి కాలుష్య నివారణకు ఒక చట్టమంటూ రావడం 1981లోనే జరిగిందని చూశాము. అప్పటిదాకా ఏ ఫ్యాక్టరీ కూడ ఈ కాలుష్యాన్ని నివారించటానికి పెద్దగా ప్రయత్నమేమీ చేయలేదు. ఆ తరువాత చాలా ఫ్యాక్టరీలు ఈ ధూళిని నిలుపుదల చేసే యంత్రాలను ప్రవేశపెట్టాయి. కానీ పరిస్థితి ఇప్పటికీ పూర్తిగా మెరుగు కాలేదు.

సిమెంటు ధూళిని అదుపుచేసే యంత్ర పరికరాన్ని ఎలెక్ట్రో-స్టాటిక్ ప్రెసిపిటేటర్ (ఇఎస్‌పి) అంటారు. ఇది కరెంటుతో పని చేస్తుంది. ఫ్యాక్టరీ నుండి బయటికొచ్చే ధూళిలోని రేణువులను గొట్టాల నుండి బయటికి రాకుండా లోపలికి లాగుతుంది (ప్రెసిపిటేట్ చేస్తుంది). ఇది వ్యర్థ పదార్థం కాదు, సిమెంటు ముడిపదార్థమే. ధూళి రూపంలో బయటికి పోతుంది కాబట్టి దానిని నిలువరించే ఏర్పాటు ముడిపదార్థాన్ని ఆదా చేస్తుంది. ఒక టన్ను ముడిపదార్థంలో 6 లేక 7 శాతం ధూళి రూపంలో వెళ్ళిపోతుందనీ (10 శాతం అని కొందరంటారు), దానిని పొగ గొట్టం నుండి బయటకు పోకుండా ఆపి తిరిగి ముడిపదార్థంలో కలిపే కాలుష్య నివారణ ప్రక్రియ కంపెనీకి కూడ ఉపయోగకరమైనదేనని సిమెంట్ కంపెనీల నిర్వాహకులు అంటారు. అంటే, ఇఎస్‌పి నెలకొల్పడం తమకు కూడ ప్రయోజనకరమే కాబట్టి ఇష్టపూర్వకంగానే ఈ కాలుష్య నివారణ చర్య చేపడతామని అంటారు. ఇతర పరిశ్రమలలాగ బలవంతం చేయవలసిన అవసరం లేదంటారు. మరి ఎందుకు చేయరు?

ఒక ఇఎస్‌పి యూనిట్ నెలకొల్పడానికి (ప్రస్తుత ధరలలో) దాదాపు 2 కోట్లు ఖర్చు అవుతుంది. ఒక ఫ్యాక్టరీలో కాలుష్యం నివారించాలంటే మూడు నాలుగు ఇఎస్‌పిలు కూడ నెలకొల్పవలసి రావచ్చు. ఇప్పుడివి భారతదేశంలోనే తయారవుతున్నాయి కాబట్టి కొంత మెరుగు గానీ కొన్ని సంవత్సరాల కిందటి వరకు దిగుమతి చేసుకోవలసి వచ్చేది.

కాబట్టి కొత్తగా నెలకొల్పిన సిమెంట్ ఫ్యాక్టరీలలో సాధారణంగా ఇఎస్‌పి ఉండదు. ఒకవేళ కాలుష్య నియంత్రణ బోర్డు నుండి అనుమతి పొందడం కోసం నెలకొల్పినా, రెండు కావలసిన చోట ఒకటి, నాలుగు కావలసిన చోట రెండు నెలకొల్పుతారు. కాలుష్య నియంత్రణ బోర్డును ఈ విధంగా సంతృప్తి పరుస్తారు. ఇంకా ఇఎస్‌పిలు కావాలి కదా అని బోర్డు ఒకవేళ అడిగితే దానికి ఇప్పుడు చేతిలో పెట్టుబడి లేదనీ, ఇంకా టైం కావాలనీ అడుగుతారు. బోర్డు ఉదారంగా టైం ఇస్తుంది. ఎందుకంటే ఉత్పాదన ముఖ్యం, సిమెంటు పరిశ్రమ పురోగమించడం ముఖ్యం, కాలుష్య నివారణ, నియంత్రణ తరువాత వస్తాయి. ఇది సిమెంటు కంపెనీల యజమానుల వైఖరే కాదు, కాలుష్యం నివారించడం కోసమే ఏర్పాటు చేసిన కాలుష్య నియంత్రణ బోర్డు వైఖరి కూడ.

ఉండవలసినవన్నీ ఇఎస్‌పిలు నెలకొల్పినా ధూళి కాలుష్యం తగ్గుతుందేమో గానీ పూర్తిగా పోదు. హాని కలిగించలేనంతగా కూడ తగ్గిపోదు. దీనికి కారణం తరువాత వివరిస్తాము.

ముందు సిమెంటు ధూళి వల్ల కలిగే నష్టాన్ని తెలుసుకుందాం. ఈ నష్టాన్ని బాధితుల నుండే తెలుసుకోవడం కోసం పౌరహక్కుల సంఘం ఆరు జిల్లాల్లోని 27 సిమెంటు ఫ్యాక్టరీల పరిసరాలలోని గ్రామాలు పర్యటించింది. ఈ జిల్లాలు నల్గొండ (13), గుంటూరు (4), కడప (3), ఆదిలాబాద్ (3), అనంతపురం (2), కృష్ణా (2)*. గ్రామ ప్రజలతోను, ఫ్యాక్టరీ యాజమాన్యంతోను వివరంగా మాట్లాడింది. ప్రధాన సిమెంటు ఉత్పత్తి కేంద్రాలలో ఒక్క రంగారెడ్డి జిల్లా తాండూరు ప్రాంతాన్ని మాత్రం

* ఆ ఫ్యాక్టరీల జాబితా, బాధిత గ్రామాల పేర్లు, అక్కడ పండించే పంటల వివరాలు అనుబంధంలో ఇచ్చాము.

సందర్శించలేదు. అయినప్పటికీ ఈ 27 ఫ్యాక్టరీల గురించి సేకరించిన సమాచారం మొత్తంగా సిమెంటు కాలుష్యం సమస్యలను అర్థం చేసుకోవడానికి సరిపోతుందని భావిస్తున్నాము.

ఆ పరిశీలనలో మాకు కనిపించిన చిత్రం ఇది :

సిమెంటు ధూళి వల్ల ప్రధానంగా పంటలకు చాలా నష్టం వాటిల్లుతుంది. ధూళి ఆకులపైన పడి వాటి పచ్చదనాన్ని కప్పేస్తుంది. పత్ర హరితానికీ, సూర్యరశ్మికీ మధ్య జరగవలసిన కిరణజన్య సంయోగ క్రియకు ఆటంకం ఏర్పడుతుంది. దీని వల్ల ప్రత్యక్షంగానే పంట దిగుబడి దెబ్బతింటుంది.

పూత వచ్చి ఉంటే సిమెంటు ధూళి పూలలో పడడం వల్ల కూడ ఫలదీకరణ దెబ్బతింటుంది. పూత 'మాడిపోయి' రాలిపోవడం కూడ జరుగుతుంది. దీనివల్ల కూడ పంట దిగుబడి దెబ్బతింటుంది.

సిమెంటు ధూళి మొక్కల ఆకులపైన పరచుకోవడం వల్ల క్రిమిసంహారక మందుల ప్రభవానికి ఆటంకం ఏర్పడుతుందని నల్గొండ జిల్లా సాగర్ ఆయకట్టు ప్రాంత రైతుల ఫిర్యాదు. మొక్కలకు కొట్టిన పురుగుల మందు ఆకుల మీద వున్న సిమెంటు ధూళిని కడగడానికి సరిపోయి పురుగు ఏ హానీ లేకుండా తప్పించుకుంటుంది.

మన రాష్ట్రమంతటిలోకీ సిమెంటు ఫ్యాక్టరీలు ఎక్కువ ఉండేది నల్గొండ జిల్లా మేళ్ళ చెరువు, మఠంపల్లి మండలాలలో. ఇది నాగార్జునసాగర్ ఎడమ కాలువ 'టెయిల్ ఎండ్' ప్రాంతం. ఒకప్పుడు కరువు ప్రాంతంగా ఉన్న ఈ మండలాలు సాగర్ నీళ్ళు వచ్చిన తరువాత కొంతవరకు సస్యశ్యామలమయ్యాయి. కానీ 'టెయిల్ ఎండ్' ప్రాంతానికి ఉండే సమస్యలన్నీ ఎదుర్కొంటున్నాయి. ఇంతలో సిమెంటు ఫ్యాక్టరీలు వచ్చాయి. పంటల దిగుబడి బాగా తగ్గింది.

సిమెంటు ఫ్యాక్టరీలు రాకముందు ఈ గ్రామాలలో పొగాకు లాభసాటి పంటగా ఉండేది. అయితే సిమెంటు ధూళి వల్ల పొగాకు పంట ఎంతగా దెబ్బతినిందంటే ఇప్పుడు పొగాకు వేయడం పూర్తిగా మానేసారు. దీనివల్ల ఎంత ఆదాయం రైతులు కోల్పోయారో లెక్కపెట్టినవారు లేరు.

ప్రస్తుతం ఈ ఊర్లలో పత్తి, మిర్చి ప్రధాన పంటలుగా వున్నాయి. సిమెంటు కాలుష్యం వల్ల ఇవి రెండూ బాగా దెబ్బతింటున్నాయి. దిగుబడి తగ్గిపోవడమే కాక, పంట నాణ్యత కూడ తగ్గడం వల్ల మార్కెట్‌లో ధర బాగా తగ్గిపోతోంది.

దిగుబడి 25 శాతం నుండి 50 శాతం దాకా పడిపోయిందని రెండు మండలాల రైతులూ ఏకగ్రీవంగా చెప్పారు. ఈ దుమ్ము ఫ్యాక్టరీలకు దగ్గరున్న చేలపైన పడినంతగా దూరాన ఉన్న చేలపైన పడదు. అందువల్ల ప్రభావం కూడ ఒకే రకంగా ఉండదు.

పత్తి ఎకరానికి 6 క్వింటాళ్ళు వచ్చేది ఇప్పుడు 3 క్వింటాళ్ళు మాత్రమే వస్తున్నదని మహంకాళి గూడెం రైతులు అంటే, 8 క్వింటాళ్ళు వచ్చేది ఇప్పుడు 4 లేక 5 క్వింటాళ్ళు మాత్రమే వస్తున్నదని పెదవీడు రైతులంటారు. 12 క్వింటాళ్ళ నుండి 5 కు పడిపోయిందని దొండపాడులో చెప్పారు. మిర్చి 12 లేక 15 క్వింటాళ్ళు (ఎకరానికి) వచ్చేదనీ, సిమెంటు ఫ్యాక్టరీలు వచ్చిన తరువాత 8 క్వింటాళ్ళకు పడి పోయిందనీ మేళ్ళ చెరువులో అంటే, 50 శాతం పడిపోయిందని దామరచర్లలో చెప్పారు.

మొత్తం మీద ఇది గణనీయమైన నష్టమే.

దిగుబడి పడిపోవడమే గాక నాణ్యత లోపించడం వల్ల కూడ మార్కెట్‌లో ధర బాగా పడిపోయిందని ఈ రెండు మండలాల రైతులూ ముక్తకంఠంతో చెప్పారు. ఈ ఫిర్యాదు ప్రధానంగా మిర్చి పంట గురించి వినపడుతుంది. మిర్చి పూత చాలా సున్నితమైనదనీ, సులభంగా దెబ్బతింటుందనీ చెప్పారు. ఎర్రగా నిగనిగలాడుతూ ఉండవలసిన మిరపకాయలు సిమెంటు ధూళి ప్రభావం వల్ల నల్లగా మాడిపోయినట్టు తయారవుతున్నాయి. సహజంగానే మార్కెట్‌లో ధర పలకదు. ఈ మిర్చిని గుంటూరు మార్కెట్‌కు తీసుకుపోతే దానిని వెంటనే 'సిమెంటు కాయ' అనీ, 'దొండపాడు కాయ' అని గుర్తుపట్టి పక్కన పెడతారని రైతుల ఫిర్యాదు. దానికి ధర (మార్కెట్ పరిస్థితిని బట్టి మామూలుగా క్వింటాల్‌కు 2000 రూ.ల నుండి 3500 దాకా వుంటుంది) 300 నుండి 500 రూ.లు తక్కువ ఇస్తారు.

పంట దిగుబడి నాలుగవ వంతు పడిపోయి ధర కూడ నాలుగవ వంతు పడిపోతే ఆదాయం 44 శాతం పడిపోతుంది.

గుంటూరు జిల్లా దాచేపల్లి మండలంలోని గ్రామాలలోనూ, కృష్ణా జిల్లా జగ్గయ్య పేట మండలంలోని గ్రామాలలోనూ ఇదే ఫిర్యాదు వినపడుతుంది. ఈ మూడు

జిల్లాలలో సిమెంటు ఫ్యాక్టరీలున్న ప్రాంతం కృష్ణా నదికి ఇటూ అటూ ఉన్న సారవంతమైన వ్యవసాయ క్షేత్రం. అంతా బాగున్నప్పుడు వరి, పత్తి, మిర్చి, పొగాకు బాగా పండించిన ప్రాంతం. సిమెంటు కాలుష్యం పుణ్యాన పొగాకు సిమెంటు ఫ్యాక్టరీల పరిసర గ్రామాల నుండి అదృశ్యం కాగా మిగిలిన వాటి దిగుబడి, ధర బాగా తగ్గిపోయాయి.

గుంటూరు జిల్లా కారంపూడి మండలంలోని సనిగళ్ళ గ్రామంలో మల్లెతోటలు విస్తారంగా ఉన్నాయి. బాగా కాస్తే ఎకరానికి 25 లేక 30 వేల రూపాయల ఆదాయం వస్తుంది. అటువంటి తోటలు కారంపూడి సమీపంలో ఉన్న శ్రీచక్ర సిమెంటు ఫ్యాక్టరీ వల్ల బాగా దెబ్బతిన్నాయి. గత సంవత్సరం అసలు పూతే మిగలలేదని రైతులంటారు.

ఒక సంవత్సరం పంట బాగా రావడానికీ రాకపోవడానికీ ఎన్నో కారణాలు ఉంటాయనీ, రైతులు తప్పంతా సిమెంటు ధూళిపైననే పెడుతున్నారనీ ఫ్యాక్టరీల యజమానులు అంటారు. పంట దిగుబడి తగ్గడానికి ఒక్కొక్కసారి సిమెంటు కాలుష్యమే కాక వేరే కారణాలు కూడ ఉండవచ్చు. కాదనలేం. అయితే ఫ్యాక్టరీ వచ్చినప్పటి నుండి ఒకే రకంగా సగటున 25 నుండి 50 శాతం దాకా దిగుబడి పడిపోతున్నప్పుడు 'ఇదంతా అతిశయోక్తి' అని కొట్టిపారేయడానికి వీలు లేదు.

పూర్తిగా వెనుకబడిన ప్రాంతాలలో రైతులకు జరిగే నష్టాన్ని రూపాయలలో లెక్కబెడితే సాగర్ ఆయకట్టు ప్రాంతంలో ఉన్నంత ఎక్కువ ఉండదు గానీ రైతుల జీవితాలపై దాని దుష్ప్రభావం మాత్రం నిజానికి ఇంకా ఎక్కువ ఉంటుంది. ఆదిలాబాద్ జిల్లా దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంటు వర్క్సును ఉదాహరణగా తీసుకుంటే – ఈ ఫ్యాక్టరీ ధూళి 18 గోండు, కొలాం గూడేలపైన పడుతుంది. సాగునీరు లేని ఈ ప్రాంతంలో ఆ గిరిజనులు వర్షాధారంగా జొన్నలు, కందులు, ఆముదాలు పండించుకొని బతుకుతారు. అందులో 25 లేక 50 శాతం పడిపోతే అది పేద గిరిజన రైతులకు తీవ్రమైన దెబ్బ. కడప, అనంతపురం జిల్లాలలో వేరుశెనగ, పొద్దుతిరుగుడు పువ్వు పండించుకుంటున్న రైతులకు కూడ ఇది వర్తిస్తుంది. నిజానికి రైతులు చెప్పే దాన్ని బట్టి మాగాణి పంటల కంటే మెట్ట పంటలపైన కాలుష్య ప్రభావం ఎక్కువ ఉండేటట్టుంది. ఆదిలాబాద్ జిల్లా మెట్ట నేలలలో పండించే పత్తి పంట దిగుబడి ఓరియంట్ సిమెంట్స్ కాలుష్య ప్రభావమున్న గిరిజన గ్రామాలలో 75 శాతం దాకా

పడిపోయిందని గోండు రైతులంటారు. జొన్నల దిగుబడి 1 ఎకరానికి 5 బస్తాల నుండి ఒకటిన్నర బస్తాలకు పడిపోయిందన్నారు. కడప, అనంతపురం జిల్లా సిమెంటు బాధిత రైతులు కూడ ఇదే అన్నారు. ధనియాలు ఎకరానికి 10 మూటలు పండేవి ఇప్పుడు 3 మాత్రమే పండుతున్నాయని కడప జిల్లాలో ఇండియా సిమెంట్స్, జువారి సిమెంట్స్ బాధితులు చెప్పారు.

ప్రధాన సమస్య పంట దిగుబడి తీవ్రంగా పడిపోవడమైనా ఇతర సమస్యలు కూడ చాలా ఉన్నాయి.

సిమెంటు 'దుమ్ము' పడిన గడ్డి తిన్న పశువులకు రోగాలొస్తున్నాయి. బలహీనంగా తయారవుతున్నాయి. తరచుగా డయేరియా వస్తున్నది. పాలిచ్చే పశువయితే పాలు తక్కువ ఇస్తుందనే ఫిర్యాదులున్నాయి. వరి చొప్ప తిన్నా అంతే.

నీటి వనరులపైన సిమెంటు ధూళి పడడం కూడ ఇదే ఫలితానికి దారి తీస్తుంది. ఫలితంగా రక్షిత నీటి సరఫరా లేని గ్రామాలలో మనుషులు కూడ సిమెంటు ధూళి పడిన నీరు తాగవలసి వస్తున్నది. నల్గొండ జిల్లా వాడపల్లి గ్రామానికి తాగునీరు కృష్ణా నది నుండి నేరుగా తీసుకుంటారు. అయితే రాశి సిమెంట్స్ నుండి వెలువడే సిమెంటు ధూళి నిండిన వంకలు, కాలువల నీళ్ళు కృష్ణా నదిలో కలవడం వల్ల వాడపల్లి వాసులు సిమెంటు ధూళి కలిసిన నీళ్ళు తాగవలసి వస్తున్నది. కడప జిల్లా వై.కోడూరు గ్రామస్థులు కూడ ఇదే రకమైన సమస్య ఎదుర్కొన్నారు. ఆ ఊరికి మంచి నీళ్ళు ఒక వంక నుండి నేరుగా తీసుకునేవారు. జువారి సిమెంట్స్ నుండి వెలువడే ధూళి ఆ వంకలో పడడం వల్ల గ్రామస్థులు ధూళితో నిండిన ఆ నీటినే తాగవలసి వచ్చింది. వాళ్ళు ఎన్నిసార్లు కంపెనీ యజమానులకు చెప్పినా పట్టించుకోకపోయేసరికి ఒక రోజు గుంపుగా పోయి గొడవ పెట్టుకున్నారు. అప్పటి నుండి ఆ కంపెనీ ఆ ఊరికి తాగునీరట ట్యాంకర్లలో సరఫరా చేస్తున్నది. ఇది మనుషుల తాగునీటి సమస్యను పరిష్కరించింది కాని పశువుల సమస్య మాత్రం అలానే ఉంది.

నీటి వనరులలో కలవకపోయినా కేవలం గాలిలో ఉన్న సిమెంటు ధూళిని పీల్చుకోవడం వల్ల కూడ మనుషులకు అనేక రోగాలు రాగలవు. రామకృష్ణ సిమెంట్స్ వల్ల మాచర్ల (గుంటూరు జిల్లా), రాంకో సిమెంట్స్ వల్ల జగ్గయ్యపేట (కృష్ణా జిల్లా),

మూడు సిమెంట్ ఫ్యాక్టరీల వల్ల యెర్రగుంట్ల (కడప జిల్లా) తీవ్రమైన సిమెంట్ ధూళి దాడికి గురయ్యాయి. ఒక దశలో (యెర్రగుంట్ల ఇప్పటికీ) ఈ ఊర్లు ఎప్పుడు చూసినా తెల్లని పౌడర్ పూసినట్లు ఉండేవి. మాచర్లలోనూ, జగ్గయ్యపేటలోనూ దీనికి వ్యతిరేకంగా గట్టి ప్రజాందోళన జరిగిన ఫలితంగా ఆ రెండు ఫ్యాక్టరీలు (ముఖ్యంగా మాచర్లలోని రామకృష్ణ సిమెంట్స్) కాలుష్యాన్ని అదుపు చేసాయి.

జగ్గయ్యపేటకు చెందిన డాక్టర్లు చెప్పే దాని ప్రకారం సిమెంటు ధూళి గాలి ద్వారా, నీటి ద్వారా శరీరంలోకి పోతే మనిషికి రాగల రోగాలు ఇవి : 1. శ్వాసకోశ సంబంధమైన ఎలర్జీ (బ్రాంకియల్ ఎలర్జీ). దీనివల్ల శ్వాసకోశం బలహీనపడి క్షయ వంటి వ్యాధులు సులభంగా వచ్చే ప్రమాదం ఉంది. 2. చర్మానికి దురద (ఎలర్జిక్ డెర్మటైటిస్), పొక్కులు రావడం 3. మూత్ర పిండాలలో రాళ్లు (స్టోన్స్), మలమూత్ర విసర్జనకు సంబంధించిన నాళాలలో రాళ్ళు 4. కీళ్ళ జబ్బులు (ఆర్థరైటిస్) వగైరా.

ఈ రోగాలు – ముఖ్యంగా శ్వాసకోశ సంబంధమైన రోగాలు, మూత్ర పిండాలలో రాళ్ళు – సిమెంటు కాలుష్యం బలంగా ఉన్న ప్రాంతాలలో మామూలు కంటే ఎక్కువ కనిపిస్తాయని స్థానిక వైద్యులందరూ అంటారు.

క్వారీలలో జరిగే బ్లాస్టింగ్ వల్ల కూడ పరిసర గ్రామాల ప్రజలకు సమస్యలు వుంటాయి. సిమెంటు ఉత్పత్తికి ప్రధాన ముడి సరుకు సున్నపురాయి అని చెప్పాము. అది దొరికేచోట క్వారీ లీజుకు తీసుకొని దగ్గరలో సిమెంటు ఫ్యాక్టరీ కట్టుకుంటారు. ఈ క్వారీలలో తవ్వకం కోసం బ్లాస్టింగ్ జరుపుతారు. అంటే గ్రెనేడ్లు పెట్టి పేలుస్తారు. పేలుడు వల్ల సమీప జనావాసాలకు రెండు రకాల సమస్యలుంటాయి. ఒకటి పేలుడు వల్ల ఇళ్ళు అదరడం, ఇంటి గోడలు బీటలు వారడం, రెండు రాళ్ళు ఎగిరి పొలాలలో పనిచేసుకుంటున్న రైతులపై పడడం.

బ్లాస్టింగ్ జరిగినప్పుడు గ్రామంలో ఇళ్ళ గోడలు కదులుతున్నాయన్న ఫిర్యాదు నల్గొండ జిల్లాలో ఎక్కువగా ఉంది. దొండపాడులో (విష్ణు సిమెంట్స్ వల్ల), మేళ్ళచెరువులో (సువర్ణ సిమెంట్స్ వల్ల), హేమ్లాతండాలో (ప్రియదర్శిని సిమెంట్స్ వల్ల), పెదవీడులో (సాగర్ సిమెంట్స్ వల్ల), మహంకాళి గూడెంలో (దక్కన్ సిమెంట్స్ వల్ల), వీరప్ప గూడెంలో (రాశి సిమెంట్స్ వల్ల) ఈ సమస్య ఉందని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే అందరి కంటే ఎక్కువ సమస్య అనుభవిస్తున్నది మఠంపల్లి దళితులు. గ్రే

గోల్డ్ సిమెంట్స్ వాళ్ళ క్వారీ మఠంపల్లి ఎస్.సి కాలనీకి చాలా దగ్గరగా ఉంది. దళితులకు ప్రభుత్వమే లీజుకు (డి. పట్టా) ఇచ్చిన 135 ఎకరాల భూమిని ఆనుకొనే గ్రే గోల్డ్ కంపెనీ క్వారీకి, ఫ్యాక్టరీకి భూమి లీజుకు ఇవ్వడం జరిగింది. దీని గురించి దళితులు గొడవ పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. గ్రే గోల్డ్ వాళ్ళు బ్లాస్టింగ్ చేసినప్పుడు ఎస్‌సి కాలనీలో ఇళ్ళు దడదడలాడతాయి. జనం ఇళ్ళ నుండి బయటకి పారిపోయి వస్తారు. వాళ్ళకు ప్రభుత్వం లీజుకిచ్చిన భూమిలోకి బండలు ఎగిరిపడతాయి.

క్వారీ నివాస స్థలాలకు ఎంత దూరం ఉండాలో చెప్పే నియమాలున్నాయి. తమ క్వారీలన్నీ ఆ నియమాలకు లోబడే వున్నాయని ఆ ఫ్యాక్టరీల యజమానులు అంటారు. ఒకటి రెండు మినహాయింపులతో అది నిజమే కావచ్చు. అయితే బ్లాస్టింగ్ ప్రభావం ఎంత ఉంటుందనేది బ్లాస్టింగ్‌కు ఉపయోగించే పేలుడు పదార్థాల శక్తిని బట్టి కూడ ఉంటుంది. తక్కువ సమయంలో ఎక్కువ ముడిపదార్థం సేకరించడం కోసం అనుమతించిన దానికంటే చాలా శక్తివంతమైన డైనమేట్లను వాడతారు. దీనిపైన నిఘా వేసే అధికారి ఎవడూ లేడు. అందువల్ల అనుమతించినంత దూరంలో ఉన్న ఆవాసాలపైన కూడ పేలుడు ప్రభావం ఉంటుంది.

వీరప్పగూడెం వాసులకు వేరే ఒక సమస్య కూడ వచ్చింది. రాష్ట్రంలోని పెద్ద సిమెంటు ఫ్యాక్టరీలలో ఒకటయిన రాశి సిమెంట్స్ ఫ్యాక్టరీ వారి క్వారీని చాలా లోతుగా తవ్వడం వల్ల క్వారీలో నీటి ఊట పెరిగి సమీపంలోని వీరప్పగూడెం బావులు ఎండిపోతున్నాయి.

## కాలుష్య నివారణ

పొగ గొట్టం నుండి ధూళి బయటకు పోకుండా ఉండాలంటే తగిన సంఖ్యలో కాలుష్య నివారణ పరికరాలను ప్రయోగించాలి. ఎక్కువగా ఉపయోగించేది ఎల్‌క్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్ (ఇఎస్‌పి) అని పైన చెప్పాము.

ఏవో ఒకటి రెండు ఫ్యాక్టరీలు తప్ప (కడప జిల్లా యెర్రగుంట్లలోని ఇండియా సిమెంట్స్ ఫ్యాక్టరీ, నల్గొండ జిల్లా మఠంపల్లిలోని గ్రే గోల్డ్ సిమెంట్స్ ఫ్యాక్టరీ మేము గమనించిన రెండు ఫ్యాక్టరీలు) ఈ రోజు అన్ని ఫ్యాక్టరీలు ఇఎస్‌పిలు నెలకొల్పి వున్నాయి. అయితే వాటిని నెలకొల్పడానికి అన్ని జిల్లాలలోను ప్రజలు ఆందోళన చేయవలసి వచ్చింది. అసెంబ్లీలో స్థానిక ప్రజాప్రతినిధులు ప్రశ్నలు అడగటం, అసెంబ్లీ సభా

సంఘం సిమెంటు బాధిత గ్రామాలు పర్యటించడం కూడ జరిగింది. ఇఎస్‌పిలు నెలకొల్పిన తర్వాత కాలుష్యం సమస్య తగ్గినమాట వాస్తవమే. కానీ పూర్తిగా పోలేదు.

### పట్నం అల్లుడిపై ఆశ వదులుకుంది

*లాండసాంగి గ్రామ సర్పంచ్ రుక్మాబాయికి ఒక కోరిక ఉండింది. తన ఊరు ఆదిలాబాద్‌కు కేవలం 6 కి.మీ. దూరాన వుంది కాబట్టి కూతురును పట్టణానికి పంపించి చదివించుకుందామనుకుంది. చదివించుకుంటే తన లాగా కాకుండా తన కూతురుకైనా పట్నంలో ఉద్యోగం చేసుకునే భర్త దొరుకుతాడని రుక్మాబాయి ఆశ.*

*అయితే ఈలోపు సిమెంటు కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వాళ్ళు లాండసాంగి నుండి ఆదిలాబాద్ పోయే దారిలో సిమెంటు ఫ్యాక్టరీ కట్టారు. సరిగ్గా బాట మీదనే కట్టారు. ఆ బాటకు ఇటు పక్క బ్రిడ్జి లేని వాగు ఉంది. ఫ్యాక్టరీ వచ్చిన తరువాత లాండసాంగికి ఎవరైనా రావాలంటే అడవిలో 22 కి.మీ.లు ప్రయాణం చేయవలసి వచ్చింది. పట్టణానికి కేవలం 6 కి.మీ. దూరం ఉన్న లాండసాంగి 22 కి.మీ.ల దూరాన అడవిలో ఉన్న గ్రామం అయిపోయింది.*

*ఊరికి ఉన్న ఒకే ఒక బాట మీద ఫ్యాక్టరీ కట్టడానికి సిసిఐకి అనుమతి ఎవరిచ్చారో సర్పంచ్ రుక్మాబాయికి అర్థం కావడం లేదు. అంత మారుమూల అడవి గ్రామానికి చెందిన అమ్మాయిని ఏ పట్టణవాసి చేసుకుంటాడు? చివరికి తన కూతురికి కూడ తన లాగే ఒక రైతును చేసుకోక తప్పలేదని రుక్మాబాయి బాధగా అంటుంది.*

దీనికి కారణమేమిటి?

రైతులు అన్ని జిల్లాలలో, అన్ని గ్రామాలలో మినహాయింపు లేకుండా ఒకటే కారణం చెప్తారు. ఇఎస్‌పి నెలకొల్పినా కూడ దానిని నిరంతరాయంగా నడపరు. నడిపితే కరెంటు ఖర్చు అవుతుంది కాబట్టి ఆ ఖర్చు ఆదా చేయడం కోసం పగలు నడుపుతారు. గానీ రాత్రి మూసేస్తారనీ, రాత్రంతా ధూళి యథేచ్ఛగా బయటికి వస్తుంటుందనీ అంటారు.

దీనికి తగినట్టు మేము ఫ్యాక్టరీల్లోకి పోయినప్పుడు పొగ గొట్టం నుండి ధూళి విపరీతంగా వస్తుండడం, మేము యాజమాన్యంతో కొద్దిసేపు మాట్లాడి బయటకు వచ్చేసరికి ధూళి బాగా తగ్గిపోయి ఉండడం చాలా చోట్ల గమనించాము. అదే విధంగా పగలు ఏమంత ధూళి బయటికి రాని ఫ్యాక్టరీని రాత్రి గమనిస్తే చాలా ఎక్కువగా ధూళి బయటికొస్తున్న విషయం కూడ మేము గమనించాము. (ఉదా. హైదరాబాదు – గుంటూరు రహదారి పక్కనున్న రాశి, దుర్గ ఫ్యాక్టరీలు.)

దీనికి యజమానులు చెప్పే జవాబు ఏమిటంటే – పొగ గొట్టం నుండి ధూళిగా బయటకు పోయేది వ్యర్థ పదార్థం కాదు. అది తమ ఉత్పత్తికి ముడిపదార్థం. దానిని బయటకు పోనీయకుండా అదా చేసుకోవడం తమకే ప్రయోజనకరం. ఒకసారి ఒకటి రెండు కోట్లు ఖర్చుపెట్టి ఇఎస్‌పిని నెలకొల్పిన తరువాత కేవలం కరెంటు ఖర్చు మిగిలించుకోవడానికి ఇఎస్‌పిని బంద్ చేసుకొని ముడిపదార్థాన్ని పోగొట్టుకోవడం తెలివితక్కువతనం. అందువల్ల ఆ పని ఎవరూ చేయరు.

ఈ జవాబుకు ఒకటే పరీక్ష. ఒక గంట సేపు ఇఎస్‌పిని నడపడానికి అయ్యే కరెంటు ఖర్చు ఎక్కువా, లేక అదే గంటసేపు నడపకపోవడం వల్ల పోగొట్టుకునే ముడిపదార్థం వెల ఎక్కువా? అనేది తెలుసుకోవడమే.

ఆ లెక్కల వివరాలలోకి పోకుండానే, ఫ్యాక్టరీ పూర్తి కెపాసిటీలో నడిచేటప్పుడు ఇఎస్‌పిని నడిపించడమే పొదుపు చర్య అనీ, ఫ్యాక్టరీ తక్కువ కెపాసిటీలో నడిచేటప్పుడు ఇఎస్‌పిని ఆపుచేయడం వల్లనే ఖర్చు తగ్గుతుందనీ (ఎంత తక్కువ కెపాసిటీ అనే దాన్ని బట్టి) చెప్పవచ్చు.

అయితే సిమెంట్ ఫ్యాక్టరీలలో పనిచేసే సాంకేతిక సిబ్బంది రైతుల అనుభవానికి వేరొక అర్థం చెప్తారు. ఒకసారి ఇఎస్‌పి నెలకొల్పిన తరువాత ఎవరూ కావాలని దానిని బంద్ చేయరు. అయితే ఫ్యాక్టరీ పనిచేసే క్రమంలో ఇఎస్‌పి తరచూ ట్రిప్ అయి దానంతటదే ఆగిపోతుంటుంది. దానిని తిరిగి బాగుచేసేంత వరకూ ఫ్యాక్టరీలో ఉత్పత్తిని ఆపరు. ఉత్పత్తి నడుస్తూనే వుంటుంది. సహజంగానే ఆ సమయంలో ధూళి ఎక్కువగా బయటికి పోతుంటుంది అని చెపుతారు వాళ్ళు.

ఇఎస్‌పి ట్రిప్ కావడానికి రెండు కారణాలుంటాయి. కరెంటు వోల్టేజిలోని హెచ్చుతగ్గులు ఒక కారణం కాగా, సిమెంటు ముడిపదార్థాన్ని వేడి చేయడానికి

ఉపయోగించే బొగ్గులో బూడిద ఎక్కువ ఉన్నట్టయితే, అది కాలినప్పుడు కార్బన్ మోనాక్సైడ్ ఎక్కువగా విడుదల అవుతుంది. అప్పుడు కూడ ఇఎస్‌పి ట్రిప్ అవుతుంది.

ఒకసారి ఇఎస్‌పి ట్రిప్ అయితే దానిని తిరిగి పనిలో పెట్టడానికి 15 లేక 30 నిమిషాలు మాత్రమే పడుతుందని యాజమాన్య ప్రతినిధులంటారు. రిపేర్ చేయడానికి పూనుకున్నాక 15 లేక 30 నిమిషాలు మాత్రమే పట్టవచ్చును గానీ, వెంటనే రిపేర్ చేయడం మొదలు పెడతారా అనేది ప్రశ్న.

అనుభవజ్ఞులు చెప్పేదేమిటంటే, ఫ్యాక్టరీని నడపడానికి యాజమాన్యం ప్రాముఖ్యం ఇస్తుందే తప్ప ఇఎస్‌పి రిపేరుకు కాదు. అంటే వేరే పని మీద ఉన్న వారిని ఇఎస్‌పి రిపేర్ చేసే పనిమీద పెట్టరు. ఖాళీగా వుంటేనే ఈ పని చేయమంటారు. సిబ్బంది ఖాళీగా దొరకడానికి ఒక్కోసారి ఎంతైనా సమయం పట్టవచ్చు. అంతవరకు ఫ్యాక్టరీ ఇఎస్‌పి లేకుండానే నడుస్తుంది.

ముఖ్యంగా రాత్రి వేళ ఎక్కువమంది డ్యూటీలో ఉండరు కాబట్టి రాత్రి వేళ ట్రిప్ అయితే చాలాసేపు రిపేర్ కాకపోవచ్చు. రైతులు గమనించే విషయానికి ఇదే కారణం కావచ్చునంటారు.

రోజుకు ఇఎస్‌పి ఎన్నిసార్లు ట్రిప్ అవుతుంది అనేది పరిస్థితులను బట్టి వుంటుంది. అయితే యాజమాన్యం వారు చెప్పేదేమిటంటే రోజుకు కనీసం ఒకసారి తప్పనిసరిగా ట్రిప్ అవుతుందనీ, ఏడెనిమిది సార్ల దాకా కూడ కావచ్చుననీ. అంటే ఏ రోజయినా మూడు నాలుగు గంటల సేపు ఇఎస్‌పి లేకుండా ఫ్యాక్టరీ నడిచినా ఆశ్చర్యపోనక్కరలేదు.

అయితే వేరొక కారణం కూడ ఉందేమో ఆలోచించాలి.

కాలుష్య నివారణ బోర్డు ప్రతి పరిశ్రమకూ కాలుష్య ప్రమాణాలు నిర్దేశిస్తుందని మొదటి అధ్యాయంలో చెప్పాము. అంటే కాలుష్యం కలిగించే వ్యర్థ పదార్థాలు ఏ మోతాదు మించి ఉండరాదో చెప్పే ప్రమాణాలని అర్థం. సిమెంట్ ధూళి విషయంలో ఆ ప్రమాణం ఏం చెప్తుందంటే ఫ్యాక్టరీ లోపల 1 ఘనపు మీటర్ గాలిలో 500 మిల్లీ గ్రాముల మించి ధూళి ఉండకూడదనీ, ఫ్యాక్టరీకి 1 కిలోమీటర్ దూరంలో 1 ఘనపు మీటర్ గాలిలో 115 మిల్లీగ్రాముల మించి ధూళి ఉండకూడదనీ.

ఇది కాలుష్య నివారణ బోర్డు నిర్ణయించిన సిమెంటు కాలుష్య ప్రమాణం. దీనికి ఫ్యాక్టరీలు లోబడి ఉన్నాయా లేదా చూడడానికి 3 నెలల కొకసారి బోర్డు ప్రతినిధి వచ్చి పరీక్ష చేసి పోతారని అన్ని కంపెనీల మేనేజర్లు అంటున్నారు. అంతే కాక, బోర్డు ఆదేశాల మేరకు తాము గుర్తింపు పొందిన ప్రైవేట్ ప్రయోగశాలల చేత నెలకొకసారి పరీక్ష చేయిస్తున్నామని కూడ అంటారు. (గుర్తింపు పొందిన ప్రయోగ శాలలు హైదరాబాదులోని సంధ్య ఎన్విరాన్స్, అనాల్యాబ్స్, వింటాల్యాబ్స్, స్వాన్, పొల్యూటెక్). ఇదంతా ఎంత నిజాయితీగా జరుగుతున్నదో తెలీదు గానీ మొత్తానికయితే జరుగుతున్నది. అన్ని ఫ్యాక్టరీల దగ్గరా ఈ పరీక్షల ఫలితంగా పొందిన సర్టిఫికెట్లు ఉన్నాయి. అయితే కాలుష్య పరీక్షల విషయంలో అవినీతి చాలా ఉంది కాబట్టి వీటిని ఎంతవరకు నమ్మగలమో చెప్పలేం.

ఈ పరీక్షలు నిజంగానే జరుగుతున్నాయని భావించినా ఒక ప్రశ్న మిగిలిపోతుంది. కాలుష్య నియంత్రణ బోర్డు ఆ ప్రమాణాలను ఏ విధంగా నిర్ణయించింది? మిర్చి పంటపైన వుండే ప్రభావాన్ని లెక్కలోకి తీసుకుందా? మల్లె తోటలకు ఏమవుతుందో లెక్కలోకి తీసుకుందా? సిమెంటు ధూళి కలిసిన నీరు పశువులు తాగితే వాటికి రాగల రోగాలను లెక్కలోకి తీసుకుందా? లేక కేవలం మనుషులకు రాగల శ్వాసకోశ సంబంధమైన రోగాలను మాత్రమే లెక్కలోకి తీసుకుందా?

ఈ దృష్టితో కాలుష్య నియంత్రణ బోర్డు నెలకొల్పిన సిమెంట్ కాలుష్యం ప్రమాణాలను తిరిగి పరీక్షించవలసిన అవసరం ఉంది. ఎందుకంటే అన్ని ప్రమాణాల లాగా ఇవి కూడ మనుషుల ఆరోగ్యాన్ని మాత్రమే లెక్కలోకి తీసుకున్న ప్రమాణాలు అయి ఉండే అవకాశం ఉంది. అప్పుడవి పంటల నాశనాన్ని అరికట్టడానికి సరిపోక పోవచ్చు. అంటే కాలుష్యం పరిమితులకు లోబడి ఉంటూ కూడ హాని కలిగించవచ్చు.

## ముగింపు

కాబట్టి కాలుష్య నియంత్రణ బోర్డు నిర్దేశించిన సిమెంట్ కాలుష్య ప్రమాణాల అమలు కోసం కృషి చేస్తూనే ఆ ప్రమాణాల హేతుబద్ధతను ప్రశ్నించవలసిన అవసరం ఉంది. సిమెంటు పరిశ్రమకు ఉండే ప్రత్యేక స్వభావాన్ని – అది గ్రామీణ ప్రాంతాలలో, పంట పొలాల మధ్యన వుండే పరిశ్రమ అనే విషయాన్ని, దాని నుండి వచ్చే కాలుష్యం వల్ల మొక్కలూ, పశువులూ ప్రధానంగా దెబ్బతింటాయనీ – ఆ ప్రమాణాలు లెక్కలోకి

తీసుకున్నాయా లేక కేవలం ఆ పరిశ్రమ దగ్గరలో ఉండే జనావాసాల ఆరోగ్య సమస్యలను మాత్రమే లెక్కలోకి తీసుకొని నిర్ణయించేసారానేది పరిశీలించవలసిన అవసరం ఉంది.

కాలుష్య నియంత్రణ బోర్డు కేవలం అలంకారప్రాయమైన సంస్థగా ఉండి పోకుండా, తన డ్యూటీ తాను చేసేటట్టు చూడాలి. పర్యావరణ సంబంధమైన ప్రజారోగ్యాన్ని కాపాడే మొత్తం బాధ్యతను చట్టం ఆ బోర్డుపైన పెట్టింది. ప్రజలకు సహితం ఆ అవకాశం లేకుండా చేసి భారమంతా బోర్డుపైననే పెట్టింది. కానీ బోర్డు నిద్రపోతూ ఉంది. నిద్రపోతూ ఉంది అనడం కూడ మెత్తని మాటే, అవినీతిలో కూరుకుపోయి ఉంది అనడం న్యాయమైన మాట.

సిమెంటు పరిశ్రమ రావడం వల్ల ఆయా గ్రామాల ప్రజలకొచ్చిన ప్రయోజనం స్వల్పమే. ఫ్యాక్టరీ కోసం భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఒక్కొక్క ఉద్యోగం ఇస్తామని చాలా చోట్ల హామీలిచ్చారు. కాని ఆ హామీ కొన్నిచోట్ల మాత్రమే నిలుపుకున్నారు.

ఇది ఫ్యాక్టరీలు కొనుక్కున్న భూముల సంగతి మాత్రమే. కొనుక్కోకుండా, చుట్టూ ఉండి పోయి పాడవతున్న భూములకు ఈ కంపెనీలు ఏమీ చేయడం లేదు. పూర్తిగా మెట్ట ప్రాంతాలలోనైతే ఆ భూమిని కూడ అదే కంపెనీకి అమ్ముకొని పోదామని రైతులు భావిస్తున్నారు, అనంతపురం జిల్లాలో పెన్న సిమెంట్స్ వల్ల దెబ్బతిన్న తలారి చెరువు, ఊరుచింతల గ్రామాల రైతులలాగా. అయితే ఇప్పుడు అవసరం రైతులది కాబట్టి కంపెనీ బెట్టు చేస్తోంది. పైగా అది తాడిపత్రి తాలూకా కాబట్టి, కంపెనీ యజమాని వై.ఎస్. రాజశేఖరరెడ్డికి సన్నిహితుడు కాబట్టి ఫాక్షనిస్టులను పిలిచి బెదిరిస్తున్నాడు కూడ.

అయితే తక్కిన కంపెనీల బాధితులయిన రైతులు అమ్ముకోవడానికి సిద్ధంగా లేరు. కాలుష్యం పూర్తిగా ఆపాలనీ, అంతవరకు జరిగే పంట నష్టానికీ, ఇతర నష్టాలకూ పరిహారం కట్టివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పాశ్చాత్య దేశాలలో ఇటువంటి చట్టాలూ, న్యాయ ప్రక్రియలూ బాగా అభివృద్ధి చెంది ఉన్నాయి. కాని మన దగ్గర ఇంకా చెందలేదు.

వీటన్నిటి కోసం ఇప్పుడు కృషి జరగవలసి ఉంది. కోర్టులలో, అసెంబ్లీలో, పార్లమెంటులో జరగవలసి వుంది. అక్కడ సఫలం కావాలంటే బయట ఆందోళన సంఘటితంగా చేపట్టాలి. కాబట్టి సిమెంటు కాలుష్యానికి, ఆ మాటకొస్తే మొత్తంగా కాలుష్యానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చేపట్టవలసి ఉంది.

## III. అనుబంధం

## పౌరహక్కుల సంఘం పరిశీలించిన సిమెంటు ఫ్యాక్టరీలు

| ఫ్యాక్టరీ పేరు | ఉత్పత్తి సామర్థ్యం (రోజుకు టన్నులు) | ఆ ప్రాంతంలో పండించే ప్రధాన పంటలు | కాలుష్య ప్రభావం పడే గ్రామాలు (మొత్తంగా/ పాక్షికంగా) |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| **నల్గొండ జిల్లా**<br>రాశి సిమెంట్స్ (వాడపల్లి) | 4500 | పత్తి, వరి, మిర్చి (మెట్ట నేలలో కంది కూడ) | వాడపల్లి, దామరచర్ల, తాళ్ల వీరప్ప గూడెం, మహంకాళి గూడెం, ఇరికి గూడెం (నల్గొండ జిల్లా), పొందుగుల (గుంటూరు జిల్లా) |
| దక్కన్ సిమెంట్స్ (మహంకాళి గూడెం) | 800 | ,, | రాయపాడు, మహంకాళి గూడెం, వాడపల్లి, జాన్ పహాడ్ |
| సాగర్ సిమెంట్స్ (పెదవీడు) | 600 | ,, | పెదవీడు, దొనమాన తండా, మఠంపల్లి, చౌటపల్లి |
| నాగార్జున సిమెంట్స్ (మట్టపల్లి) | 600 | ,, | మట్టపల్లి, సుల్తాన్‌పురం తండా, రామచంద్రాపురం, పెదవీడు |
| గ్రే గోల్డ్ సిమెంట్స్ (మఠంపల్లి) | 150 | ,, | మఠంపల్లి, చౌటపల్లి |
| కోరమండల్ సిమెంట్స్ (రామాపురం) | 350 | ,, | రేవూరు, దుబ్బ తండా, కందిబండ, రామాపురం |
| విష్ణు సిమెంట్స్ (దొండపాడు) | 2400 | ,, | దొండపాడు, రేవూరు రామాపురం, వజినేపల్లి, బుగ్గ మాధవరం, మల్కాపురం (నల్గొండ జిల్లా), బోదాడ, ముక్త్యాల (కృష్ణా జిల్లా) |


| 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|
| ప్రియదర్శిని సిమెంట్స్ (రామాపురం) | 1800 | పత్తి, వరి, మిర్చి (మెట్ట నేలలో కంది కూడ) | రామాపురం, కప్పలగుంట తండా, దొండపాడు |
| కాకతీయ సిమెంట్స్ (దొండపాడు) | 600 | ,, | దొండపాడు, రేవూరు, వజినేపల్లి, బుగ్గ మాధవరం, మల్కాపురం (నల్గొండ జిల్లా), ముక్త్యాల, బోదాడ (కృష్ణా జిల్లా) |
| సువర్ణ సిమెంట్స్ (రఘునాథ పాలెం) | 300 | మిర్చి, పత్తి వరి, కంది | మేళ్ళచెరువు, వెంకట్రాంపురం, చౌటపల్లి, మఠంపల్లి, వేపల మాదారం, రఘునాథపాలెం, ఎర్రగట్టు తండా |
| పిఆర్ సిమెంట్స్ (వేపలమాదారం) | 200 | ,, | వేపలమాదారం, రఘునాథ పాలెం, మేళ్ళ చెరువు, మల్లారెడ్డి గూడెం, గుడి మల్కాపురం |
| విశ్వం సిమెంట్స్ (రేవూరు) | 100 | ,, | హేమ్లా తండ, జగ్గు తండా, రాఘవాపురం, మేళ్ళచెరువు, రేవూరు, కప్పలకుంట తండా |
| కోహినూర్ సిమెంట్స్ (రఘునాథ పాలెం) | 100 | ,, | రఘునాథపాలెం |
| **కృష్ణా జిల్లా** హేమాద్రి సిమెంట్స్ (వేదాద్రి) | 550 | మిర్చి, పత్తి, వరి, కంది, మినుము, పెసర, నువ్వులు | వేదాద్రి, బండిపాలెం, గుండ బోయినపాలెం, చెరుకుంపాలెం, తక్కెళ్ళపాడు, పెద్దారం |
| రాంకో సిమెంట్స్ (జయంతి పురం) | 2200 | ,, | చిల్లకల్లు, జగ్గయ్యపేట, జయంతిపురం |
| **అనంతపురం జిల్లా** పెన్న సిమెంట్స్ (తలారి చెరువు) | 1000 | వేరుశెనగ, కంది, పొద్దుతిరుగుడు, మామిడి తోటలు | తలారి చెరువు, ఊరుచింతల |

| 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|
| ఎల్ అండ్ టి సిమెంట్స్ (భోగ సముద్రం) | 7500 | వేరుశెనగ, కంది, పొద్దుతిరుగుడు, మామిడి తోటలు | ఉత్పత్తి ఈ మధ్యనే మొదలయింది. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం లోనూ, కర్నూలు జిల్లా కొలిమిగుండ్ల మండలంలోనూ చాలా గ్రామాలపైన దీని ప్రభావం వుండగలదు. |
| **ఆదిలాబాద్ జిల్లా** ఓరియెంట్ సిమెంట్స్ (దేవాపూర్) | 3150 | కంది, జొన్న, పత్తి అనుములు, పెసలు | దేవాపూర్, పెద్దాపూర్, సోనాపూర్ పంచాయితీలలోని గూడెములు |
| ఎసిపి (మంచిర్యాల) | 1000 | జొన్న, కంది, పత్తి | మంచిర్యాల, గద్దెరేగడి, అగ్రవాది, బొక్కలగుట్ట, తిమ్మాపూర్ |
| సిసిఐ (ఆదిలాబాద్) | 1200 | ,, | చాందా, లాండసాంగి, బెల్లూరి, భీమసరి, అనుకుంట, నిషాన్ఘాట్ |
| **గుంటూరు జిల్లా** దుర్గా సిమెంట్స్ (శ్రీనగర్) | 3500 | పత్తి, మిర్చి, వరి | శ్రీనగర్, రామాపురం, బట్రుపాలెం, కాట్రపాడు, గామాలపాడు, మాదినపాడు (గుంటూరు జిల్లా), వాడపల్లి (నల్గొండ జిల్లా) |
| శ్రీ చక్ర సిమెంట్స్ (కారంపూడి) | 600 | పత్తి, మిర్చి, మల్లె తోటలు | సనిగళ్ళ, కారంపూడి, ఉప్పుచర్ల, చింతపల్లి, చిన కొదంగూళ్ళ, పెదకొదంగూళ్ళ, వేపకంపల్లి |
| రామకృష్ణ సిమెంట్స్ (మాచర్ల) | 1700 | ప్రధానంగా పట్టణ ప్రాంతం | మాచర్ల |

| 1 | 2 | 3 | 4 |
|---|---|---|---|
| లక్ష్మీ చెన్నకేశవ సిమెంట్స్ (మాచర్ల) | 70 | ప్రధానంగా పట్టణ ప్రాంతం | మాచర్ల |
| **కడప జిల్లా** జువారీ సిమెంట్స్ (వై.కోడూరు) | 1500 (4500కు పెంచుతున్నారు | వేరుశెనగ, ధనియాలు, పొద్దు తిరుగుడు | వై.కోడూరు, వలసపల్లి, తుమ్మలపల్లి, సుంకేసుల, తిప్పలూరు, పెదనపాడు |
| ఇండియా సిమెంట్స్ (చిలంకూరు) | 3000 | వేరుశెనగ, జొన్న, పొద్దుతిరుగుడు, ధనియాలు | చిలంకూరు, కర్భుగుంటపల్లి, రంగసాయిపురం, సిరాజుపల్లి, కొత్తపల్లి, నిడిజీవి, ముగ్గు రాళ్ళపల్లి, సున్నపురాళ్ళపల్లి |
| ఇండియా సిమెంట్స్ (యెర్రగుంట్ల) | 1200 | ,, | యెర్రగుంట్ల, పోట్లదుత్తి, చిలంకూరు |

*ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రచురణగా వచ్చింది*
*సెప్టెంబర్ 1998*

# ఎండమావి
# 2020



**మానవహక్కుల వేదిక (HRF) ప్రచురణ**

# ఎండమావి

# 2020

'విజన్' ప్రతిపాదించే విధానాల ఫలితంగా మన సమాజం రెండు ప్రపంచాలుగా చీలిపోయే ప్రమాదం ఉంది. కంప్యూటర్ సాంకేతిక ప్రక్రియల చుట్టూ అల్లుకున్న అతిఖరీదయిన అత్యాధునిక ప్రపంచం ఒకటి. దాని పాదాల కింద చీకట్లో చావలేక బతికే అధోజగత్తు ఒకటి. మొదటిది పెత్తందారీ కులాలకు నిలయంగా ఉంటుంది. దళిత బహుజన ఆదివాసీ ప్రజానీకం (వారిలో ఇప్పటికే బాగుపడి పైకి పోయిన కొద్దిమందిని మినహాయిస్తే) రెండవ ప్రపంచంలో ఉంటారు. రెండు ప్రపంచాలలోనూ స్త్రీల పరిస్థితి కొన్ని దశాబ్దాలు వెనక్కి పోతుంది.

# ఎండమావి 2020

## I ప్రవేశిక

**‘వి**జన్’ అనే ఇంగ్లీషు మాటకు దృశ్యం అనీ దృష్టి అనీ దృక్కోణం అనీ పలు అర్థాలు వున్నాయి.

చంద్రబాబు నాయుడు ప్రకటించిన విజన్ 2020లో ఒక దృశ్యం ఉంది. ఒక దృక్కోణం ఉంది. సమగ్ర దృష్టి మాత్రం తీవ్రంగా లోపించింది.

ఆ దృశ్యాన్ని మేము ఎండమావి అనదలచుకున్నాం. ఎండమావి అంటే కేవలం ఏమీ లేనిదని అర్థం కాదు. ఏదో ఉందనిపించి ఏమీ లేనిది ఎండమావి.

చంద్రబాబు ‘విజన్ 2020’లో ఎవ్వరికీ ఏమీ లేదంటే అబద్ధం అవుతుంది. అది అందరికీ ఎండమావి కాదు. కొందరికి అందులో చాలా ఉంది. అపారమైన లాభార్జనకు కావలసిన అవకాశాలన్నీ ఉన్నాయి. మరికొందరికి అస్థిరతా ప్రమాదంతో కూడుకున్న అవకాశాలున్నాయి. ఈ వర్గం మొదటి వర్గం కన్న పెద్దది.

కానీ చాలామందికి అందులో ఏమీ లేదు. ఏదో ఉందనిపించడానికి కావలసిన పటాటోపం, ప్రచారం ఉన్నాయి గానీ కొంచెం దగ్గరకొచ్చి చూస్తే ఉండేది శూన్యం. నిజానికది శూన్యం కూడ కాదు. శూన్యం వల్ల ప్రమాదం ఉండదు కానీ ‘విజన్’ చాలామందికి ప్రమాదకరం కూడ.

2020 నాటికి ఆంధ్రప్రదేశ్ భూతల స్వర్గంగా మారుతుందని 'విజన్' హామీ ఇస్తుంది కాబట్టి ఎవరికైనా అందులో ఏమీ లేదని అనేవాళ్ళు తమ వాదనను రుజువు చేసుకోవలసి ఉంటుంది. రుజువు చేసుకోవడానికి మేము సిద్ధం కాబట్టి ఈ ప్రచురణ తీసుకొస్తున్నాం.

ఆ భూతల స్వర్గం ఏ విధంగా ఉండబోతుందో 'విజన్ 2020'లో చాలాచోట్ల వివరించబడింది. ఫలాన స్వర్ణయుగంలో ప్రజలంతా సర్వసుఖాలతో మునిగి తేలారని స్కూలు పుస్తకాలలో రాసుకోవడం, పిల్లలు చదువుకోవడం చాలా కాలంగా జరుగు తున్నది. నిజంగా అట్లా ఉండిందని ఎవరూ నమ్మకపోయినా పిల్లలకు అట్లా చెప్పడం జాతీయస్ఫూర్తిగా చలామణి అవుతున్నది.

గతం సంగతేమోగానీ ఇప్పుడు భవిష్యత్తులో స్వర్ణయుగం రాబోతున్నదని చంద్రబాబు మనల్ని నమ్మమంటాడు. ఎప్పుడో సుదూర భవిష్యత్తులో కాదు ఇంకొక ఇరవై ఏళ్ళలో.

తలసరి ఆదాయం తొమ్మిదిరెట్లు పెరుగుతుందనీ, వ్యవసాయ ఉత్పత్తి నాలుగు రెట్లు పెరుగుతుందనీ, పారిశ్రామిక ఉత్పత్తి 13 రెట్లు పెరుగుతుందనీ 'విజన్' అంటుంది. వ్యవసాయ రంగం 6 శాతం పెరుగుదల రేటునూ, పారిశ్రామిక రంగం 11 శాతం పెరుగుదల రేటునూ, మొత్తం ఆర్థిక వ్యవస్థ 10 శాతం పెరుగుదల రేటునూ సాధిస్తాయని 'విజన్' అంచనా.

ఈ అంకెలకు మూలం ఏమిటని ఆశ్చర్యపోవద్దు. చైనా, కొరియా, చిలీ మొదలయిన దేశాలు ఒక్కొక్క చారిత్రక దశలో ఒక్కొక్క రంగంలో సాధించిన అత్యధిక పెరుగుదల రేట్లను తీసుకొని అన్నీ ఏకసమయంలో ఆంధ్రప్రదేశ్ సాధిస్తుందని ఊహ చేసారు తప్ప ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడున్న ఆర్థిక వ్యవస్థతో మొదలుపెట్టి దానిని ఏ విధంగా మెరుగుపరిస్తే ఎంత పెరుగుదల రేటు వస్తుందని వాస్తవికంగా చేసిన ఊహ కాదిది.

దీని కోసం ఆస్ట్రేలియా నుండి మెక్కిన్సీ కంపెనీ అనే కన్సల్టెంట్‌ను ఎందుకు రప్పించవలసి వచ్చిందో! ఒక్కొక్క దేశ ఆర్థిక వ్యవస్థ అత్యున్నత దశలో ఏయే రంగంలో ఎంతెంత పెరుగుదల రేటు సాధించిందో తెలుసుకోవడం పెద్ద కష్టం కాదు. ఆ

శిఖరాలన్నింటినీ మనం ఒకేసారి అధిగమించబోతామని ఏ ఆధారాలూ లేకుండా ప్రకటించడానికి మెక్కిన్సీ దొరవారు దిగిరావాలా? మనవాళ్ళు సరిపోరా?

అయితే చంద్రబాబు చూపించే భూతల స్వర్గం ఈ అంకెల దగ్గర ఆగిపోలేదు. దానిని వారి 'విజన్' హృద్యమైన భాషలో వర్ణించింది.

'క్రీ.శ. 2020 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి వ్యక్తీ సుఖమైన జీవితాన్ని గడుపుతారు. పేదరికం అప్పటికి నిర్మూలించబడుతుంది. ప్రస్తుతమున్న అసమానతలు తొలగిపోతాయి.'

దళితులు, వెనుకబడిన కులాలు, ఆదివాసులు, మైనారిటీలు, స్త్రీలు, పిల్లలు 'సంపూర్ణంగా ఎదగడానికి కావలసిన అవకాశాలన్నీ పొందుతారు'. 'రాష్ట్రంలోని చిన్న పిల్లలందరికీ కడుపునిండా తిండి ఉంటుంది. ఆరోగ్యంగా ఉంటారు, చదువుకుంటారు.'

'కూడు, గూడు, గుడ్డల లోటు ఏ కుటుంబానికీ ఉండదు. ప్రతి కుటుంబానికీ పరిశుభ్రమైన పరిసరాలుంటాయి. శుభ్రమైన గాలి, నీరు లభిస్తాయి. పనిస్థలానికి చేరుకోవడానికి రవాణా సదుపాయం అందుబాట్లో ఉంటుంది. బంధుమిత్రులతో కబుర్లు చెప్పుకోవడానికీ పనులు చేసుకోవడానికీ టెలిఫోన్లు అందుబాట్లో ఉంటాయి.'

'ప్రతి అమ్మాయికి తన అన్నదమ్ములతో సమానంగా చదువుకునే అవకాశం, ఉద్యోగం చేసే అవకాశం, నిండుగా ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉంటుంది.'

'వర్ధిల్లుతున్న పారిశ్రామిక, వ్యవసాయ, సేవారంగాలలో లభించే ఉత్తేజకరమైన అవకాశాలు' రాష్ట్ర ప్రజల కళ్ళ ఎదుట నిలుస్తాయి. 'వారు గ్రామీణులయితే పునర్జీవనం పొందిన వ్యవసాయరంగంలోనూ, కోళ్ళ పరిశ్రమలోనూ, చేపల కేంద్రాలలోనూ, ఆహార పరిశ్రమలోనూ' జీవనం సంపాదించుకుంటారు. లేదా తామే చిన్న తరహా సంస్థలు నెలకొల్పుకుంటారు.

'వారు పట్టణవాసులయితే ఎగుమతి కంపెనీలలోనూ, వస్త్ర ఉత్పత్తి కేంద్రాల లోనూ, గృహనిర్మాణం, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేపట్టే కంపెనీలలోనూ, పర్యాటక సంస్థలు, ట్రావెల్ ఏజెన్సీలు, కంప్యూటర్ సంస్థలలోనూ' పనిచేస్తారు. గ్రామాలలోనయినా పట్టణాలలోనయినా వారు అంగళ్ళు, హోటళ్ళు పెట్టుకోగలుగుతారు.

| రాష్ట్ర జనాభాలో నిరక్షరాస్యులు (శాతం) (1991) | |
|---|---|
| స్త్రీలలో | పురుషులలో |
| 66.28 | 44.87 |
| (కేరళ రాష్ట్రంలో అక్షరాస్యత స్త్రీలలోనూ పురుషులలోనూ కూడ 98 శాతం ఉంది) | |

| రాష్ట్రంలోని దళితులలో నిరక్షరాస్యులు (శాతం) (1991) | | |
|---|---|---|
| స్త్రీలలో | పురుషులలో | మొత్తం దళితులలో |
| 82.9 | 65.6 | 74.1 |

| రాష్ట్రంలోని ఆదివాసులలో నిరక్షరాస్యులు (శాతం) (1991) | | |
|---|---|---|
| స్త్రీలలో | పురుషులలో | మొత్తం ఆదివాసులలో |
| 93.1 | 79.9 | 86.4 |

| రాష్ట్ర జనాభాలో ప్రాథమిక విద్య పూర్తి చేసినవారు (శాతం) (1991) | |
|---|---|
| స్త్రీలు | పురుషులు |
| 26.4 | 45.3 |

| రాష్ట్ర జనాభాలోని 14 సం॥లు వయసున్న పిల్లలలో బడికి ఎన్నడూ పోనివారు (శాతం) (1991) | | | |
|---|---|---|---|
| గ్రామాలలో | | పట్టణాలలో | |
| అమ్మాయిలు | అబ్బాయిలు | అమ్మాయిలు | అబ్బాయిలు |
| 59.7 | 32.7 | 18.9 | 9.4 |

'ప్రజలందరిదీ అయిన ప్రభుత్వం నుండి అందరూ ప్రయోజనం పొందుతారు. వ్యక్తులూ వ్యాపారులూ నిండుగా ఎదగడానికి ఆ ప్రభుత్వం తోడ్పడుతుంది. పారదర్శకంగానూ సమర్థంగానూ ఉంటుంది'. 'ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ సంపన్నమైన ప్రదేశంగానూ సజీవమైన ప్రదేశంగానూ ఉంటుంది. అత్యున్నత జీవన స్థితికి ప్రమాణాలు నెలకొల్పుతుంది'.

ఇంకొక్క మాటలో చెప్పాలంటే ఎప్పుడో గుప్తరాజుల కాలంలోనో, ఇంకెప్పుడో ప్రజలు అనుభవించారని పుస్తకాలలో రాసుకునే స్వర్ణయుగం ఇక్కడే, మనలో చాలా మంది జీవితకాలంలోనే రాబోతుంది.

కానీ స్వర్ణయుగం కథలు బహుశా చాలామంది చిన్నప్పుడు స్కూల్లో చదువుకున్నప్పుడే నమ్మలేదేమో. ఇప్పుడేం నమ్ముతాం?

అయితే నమ్మశక్యంగాని స్వర్ణయుగాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్ పేరిట ఒక ఊహగా ప్రచారం చేయడమే చంద్రబాబు తప్పయితే క్షమించేయవచ్చు. కానీ 'విజన్ 2020' అక్కడితో ఆగిపోలేదు. ఈ స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించడానికి రాష్ట్రప్రభుత్వం అనుసరించబోయే విధానాలను వివరంగా ప్రతిపాదించింది.

ఆ వివరాలు చదివితే క్రీ.శ. 2020 నాటికి ఈ గడ్డమీద స్వర్ణయుగం నెలకొంటుందా లేక అందుకు పూర్తిగా విరుద్ధమైన వ్యవస్థ నెలకొంటుందా అన్న సహేతుకమైన ప్రశ్న వస్తుంది. ఆ ప్రశ్నను చర్చించుకోవడం చాలా అవసరం. అందరికీ అన్ని రకాల సమాన అవకాశాలనూ, ప్రతిపత్తినీ, కడుపునిండా తినడానికీ, ఆరోగ్యంగా బతకడానికీ, చదువుకోవడానికీ కావలసిన జీవనాధారాన్నీ రాబోయే 20 సంవత్సరాలలో ఈ విధానాల ద్వారా కల్పించడం అసాధ్యమయినంత మాత్రాన, ఈ విధానాన్ని ఆచరించరని అనుకోవడం చాలా పెద్ద పొరపాటవుతుంది. 'విజన్' ప్రతిపాదించే విధాన రచనలో అవాస్తవికత ఏమీ లేదు. దానిని (ఆ మోతాదులో కాకుంటే అంతకంటే తక్కువ మోతాదులో) అమలు చేయడం ప్రభుత్వానికి సాధ్యం చేయడం ఇప్పటికే మొదలయింది కూడా.

రేపు రాబోయే ఎన్నికలలో చంద్రబాబు ఓడిపోయినా ఈ 'విజన్' విషయంలో పెద్దగా తేడా రాదు. అతను దానిని తెగ ప్రచారం చేయడం వల్ల అది అతని ఆలోచనా వైపరీత్యంగా కనిపిస్తున్నది గానీ నిజానికి 'విజన్'లోని వైపరీత్యం చంద్రబాబు స్వంతమేమీ కాదు. అది సమకాలీన తృతీయ ప్రపంచ పాలకనీతి. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థలు, పాశ్చాత్య పెట్టుబడిదారీ కార్పొరేషన్లు, మన బోటి బడుగుదేశాల విధాన నిర్ణేతలు అందరూ ఈ రోజు ఏకాభిప్రాయంతో ప్రోత్సహిస్తున్న సామాజిక ఆర్థిక నీతి అది. కొద్ది హెచ్చుతగ్గులతో రేపటి రోజులలో మనం చూడబోయే విధానాలే అవి.

కాబట్టి 'విజన్ 2020'లోని (విపరీతమైన అతిశయోక్తులతో కూడిన) స్వర్ణయుగపు ఊహను కొట్టి పారేసే క్రమంలో 'విజన్'లో వివరించిన విధాన

ప్రతిపాదనలను కూడ కొట్టిపారేయకూడదు. అవి (కొద్ది హెచ్చుతగ్గులతో) ఆచరణసాధ్యమైనవే. ఎటొచ్చీ వాటి పర్యవసానం 'విజన్' వర్ణించినట్టు ఉండబోదు. కొన్ని విషయాలలో 'విజన్' ఇచ్చే హామీ పాక్షికంగా మాత్రమే నెరవేరగలదు. కొన్ని విషయాలలో అసలే నెరవేరక పోగా, అందుకు విరుద్ధమైన ఫలితాలు వస్తాయి.

పాక్షికంగా నెరవేరబోయేది ఆర్థిక పెరుగుదలకు సంబంధించిన హామీలు. ఈ విషయంలో 'విజన్ 2020' విపరీతమైన ఊహలు చేసిందని పైన చెప్పాము. రాబోయే రెండు దశాబ్దాలలో రాష్ట్ర ఆర్థిక రంగం సగటున 10 శాతం పెరుగుదల రేటును సాధిస్తుందనీ, పారిశ్రామిక రంగం 11 శాతం పెరుగుదల రేటునూ, వ్యవసాయ రంగం 6 శాతం పెరుగుదల రేటునూ, సేవారంగం (తృతీయరంగం) 12 శాతం పెరుగుదల రేటునూ సాధించబోతుందనీ 'విజన్' ఊహిస్తుంది. ఈ ఊహకు వాస్తవికమైన ప్రాతిపదిక ఏదీ లేదు. ప్రపంచంలో ఏదో ఒక దేశం ఏదో ఒక దశలో ఏదో ఒక రంగంలో ఈ మోతాదులో అభివృద్ధి సాధించింది కాబట్టి మన రాష్ట్రం అన్ని రంగాల లోనూ క్రమం తప్పకుండా ఈ అభివృద్ధి రేటును సాధిస్తుందని అనుకోవడంలో తప్పేముందన్న దబాయింపు తప్ప వేరే వివరణ ఏదీ లేదు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ చాలా కాలంపాటు 4 శాతం మించి పెరుగుదల రేటు సాధించలేదు. ఈ దశకంలోనే అది 5 శాతం దాటింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశ సగటు కంటే ఎప్పుడూ వెనకనే ఉంది. అయితే దేశంలో అత్యధికమైన పెరుగుదల రేటు సాధించిన రాష్ట్రాలు సహితం 6 శాతం పెరుగుదల రేటును అందుకోలేదు. అటువంటప్పుడు రాబోయే రెండు దశాబ్దాల కాలంలో మన రాష్ట్ర ఆర్థికరంగం సగటు పెరుగుదల రేటు 10 శాతాన్ని అందుకుంటుందని నమ్మాలంటే కష్టమే. ఆ సంగతి చంద్రబాబు నాయుడుకు తెలియకుండ పోలేదు. 'విజన్ 2020' ప్రతిపాదించే లక్ష్యాలు అవాస్తవికమని విమర్శించబోతారని తనకు తెలుసునని చెప్తూ, తాను ఈ విమర్శతో సవినయంగా విభేదిస్తున్నానని 'విజన్'కు రాసిన ముందుమాటలో అంటాడు.

ఆయన వినయానికేం గానీ 'విజన్' లక్ష్యాలు (పెరుగుదల రేటు విషయంలో సహితం) అవాస్తవికమైనవి. అయితే పెట్టుబడి వనరుల కోసం దేశీయ వనరుల పైననే ప్రధానంగా ఆధారపడాలన్న నియమం పెట్టుకోకుండా ఎక్కడినుండయినా ఎంతయినా పెట్టుబడి తెచ్చుకోవడానికీ, రప్పించుకోవడానికీ సిద్ధపడితే (రాబోయే

రెండు దశాబ్దాలలో రాష్ట్రంలోకి 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి వస్తుందని 'విజన్' అంచనా), ఇప్పటికి మనకు అలవాటయిన పెరుగుదల రేటు కంటే కొంచెం ఎక్కువే సాధించవచ్చు. ఈ అభివృద్ధి లేక ప్రగతి చాలా అస్థిరంగా ఉండబోతుందనీ, ఆ అస్థిరత సహితం మన అదుపులో ఉండదనీ ఒక సంవత్సర కాలంగా తూర్పు ఆసియా దేశాలు అనుభవిస్తున్న సంక్షోభం తెలియజేస్తుంది. అయినప్పటికీ స్థూల గణాంకాలలో కొంత అభివృద్ధి ఒక దశ వరకు సాధ్యమే.

**రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా 1993-94**
**(ప్రపంచబ్యాంకు నిపుణుల అంచనా)**

| | | |
|---|---|---|
| గ్రామీణ ప్రాంతాలలో | - | 1.44 కోట్ల మంది (28.93 శాతం) |
| పట్టణ ప్రాంతాలలో | - | 60 లక్షలమంది (30.82 శాతం) |
| మొత్తం | - | 2.04 కోట్లమంది (29.5 శాతం) |

**రాష్ట్రంలో బాల్యమరణాలు (1992)**
**(పుట్టిన ప్రతి 1000 మంది పిల్లలలో బాల్యంలోనే చనిపోయేవారి సగటు సంఖ్య)**

| | మగపిల్లలలో | ఆడపిల్లలలో | దళితులలో | ఆదివాసులలో | ఇతర కులాలలో |
|---|---|---|---|---|---|
| 1 సం॥ లోపల | 78 | 69 | 94.4 | 85.4 | 68.0 |
| 5 సం॥ లోపల | 100 | 97 | 114.8 | 134.4 | 89.1 |

(కేరళ రాష్ట్రంలో సగటు బాల్య మరణాలు 1000కి 17 మాత్రమే)

కానీ 'విజన్'లో ఈ పెరుగుదల రేటుకు సంబంధించిన అభివృద్ధే కాక సమగ్ర అభివృద్ధి గురించి, సమత గురించి కూడ హామీలున్నాయి. కాని 'విజన్' ప్రతిపాదించే విధానాలు ఈ హామీలకు ఎంతవరకు తోడ్పడతాయనేది తీవ్రంగా సందేహాస్పదమైన విషయం. తోడ్పడకపోగా రాష్ట్ర అభివృద్ధి ఇప్పుడున్న దాని కంటే కూడ మరింత అసమగ్రంగా, అసమానంగా సాగే ప్రమాదం ఉంది. అమర్త్యసేన్ చాలా కాలంగా భారత ఆర్థిక విధాన రచయితలకు ఒక హెచ్చరిక చేస్తున్నాడు. సరళీకరణ, ప్రపంచీకరణలలో 'బ్రెజిల్ నమూనా' ఒకటి ఉందనీ, అది జాతీయ ఆదాయంలో పెరుగుదల రేటును ఒక వైపు పెంచుతూ మరొకవైపు పేదరికాన్నీ అసమానతలనూ హింసనూ పెంచే నమూనా అనీ, భారతదేశం ఆ మార్గం పట్టే ప్రమాదం ఉందనీ ఆయన హెచ్చరిస్తున్నాడు. **'విజన్ 2020'కి ఆ హెచ్చరిక వర్తిస్తుంది.**

ఆంధ్రప్రదేశ్‌లో 1993–94 నాటికి దరిద్రరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య గ్రామాలలో 29 శాతం, పట్టణాలలో 31 శాతం ఉండగా, 2020 నాటికి దరిద్రరేఖకు దిగువన ఎవ్వరూ లేకుండా చేస్తామని 'విజన్' హామీ ఇస్తోంది. పుట్టిన 1000 మంది పిల్లలలో 71 మంది పుట్టిన కొద్దికాలానికి చనిపోతున్నారు. ఆ సంఖ్య 2020 నాటికి 10కి తగ్గిపోతుందని 'విజన్' హామీ ఇస్తోంది. నిరక్షరాస్యత 1991 నాటికి స్త్రీలలో 66.3 శాతం, పురుషులలో 45 శాతం ఉండింది. 2020 నాటికి అందరూ అక్షరాస్యులవుతారని 'విజన్' హామీ ఇస్తోంది.

ఇందులో సగం సాధించినా మన పాలకులను మెచ్చుకోవచ్చు. కానీ 'విజన్' ప్రతిపాదించే విధానాలు ఈ మార్పుల దిశగా కాక అందుకు వ్యతిరేకమైన దిశగా ఉన్నాయి. అక్షరాస్యత బహుశా బాగానే పెరుగుతుంది. 2020 నాటికి అందరూ కాకున్నా చాలామంది అక్షరాస్యులు కావచ్చు. దీనికి ప్రభుత్వ విధానాలే కాక సమాజంలోని ఇతర మార్పులు కూడ బాగా తోడ్పడుతున్నాయి. కానీ పేదరికం 'విజన్' ప్రతిపాదించే విధానాల వల్ల తగ్గుతుందన్న నమ్మకమేమీ లేదు. అసమానతలు మాత్రం కచ్చితంగా పెరుగుతాయి. బాల్య మరణాలు తగ్గడం, తగ్గకపోవడమనేది పేదరికంతో, వైద్యానికయ్యే ఖర్చుతో, శుభ్రమైన నీరు వంటి కనీస సదుపాయాలతో ముడిపడి ఉన్న విషయం. 'విజన్' ప్రతిపాదించే విధానాలు దీనికి ఏమంత అనుకూలంగా లేవు.

'విజన్' ఇచ్చే మరొక హామీ సామాజిక అవకాశాలలో సమానత్వానికి సంబంధించినది. స్త్రీలు, దళిత బహుజన ఆదివాసీ మైనారిటీ ప్రజలు సమాన అవకాశాలనూ సమాన ప్రతిపత్తినీ పొందబోతారని 'విజన్' అంటుంది. కానీ ఈ హామీకీ (లేక ఆశకూ), ప్రతిపాదిత విధానాలకూ ఏ మాత్రం పొంతన లేదు. ఆ విధానాలు ఆర్థిక అసమానతలతోపాటు, సంప్రదాయకంగా సంక్రమించిన అన్ని అసమానతలనూ పెంచే ప్రమాదం చాలా ఉంది. రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు తగ్గి అన్ని ప్రాంతాల వారూ ఒకేరకంగా అభివృద్ధి చెందుతారన్న హామీ ఒకటి 'విజన్'లో ఉంది. కానీ 'విజన్' ప్రతిపాదించే విధానాలను అనుసరించేటట్టయితే ప్రాంతీయ అసమానతలు నిజానికి పెరిగే ప్రమాదం ఉంది.

ఈ విషయాలను దిగువ అధ్యాయాలలో వివరంగా చూద్దాం.

## II అసంబద్ధత

హృద్యంగా తోచే భవిష్యత్ చిత్రాన్ని 'విజన్ 2020' మన ముందు పదే పదే ఉంచుతుంది. దానికోసం ఇది చేస్తాం అది చేస్తాం అంటుంది. కానీ ఈ విధాన ప్రతిపాదనలలో నిర్దిష్టత లేదు. అక్కడక్కడ మాత్రమే కొన్ని చాలా నిర్దుష్టమైన ప్రతిపాదనలు ఉన్నాయి. అవి విధాన క్రమాన్ని నిర్ణయించే ప్రతిపాదనలు. అవి నిజంగా అమలు కాబోయేవి, అవుతున్నవి. వీటిని వెలికితీసి పట్టుకొని వాటిని రూపొందించే విధాన క్రమాన్ని మనం ఆవిష్కరించుకోవాలి. ఆ క్రమం ఏపాటి హృద్యమైన భవిష్యత్ దృశ్యాన్ని మన ముందు ఉంచుతుందో చూడాలి. ఆ దృశ్యాన్ని 'విజన్ 2020' అడుగడుగునా మనల్ని ఊరించడానికి మన ముందుంచే ఊహాచిత్రంతో పోల్చి చూసుకోవాలి.

ఒక్క మాటలో చెప్పాలంటే 'విజన్ 2020' ప్రకటించుకునే లక్ష్యాలకూ, అది ప్రతిపాదించే సాధనాలకూ మధ్యవున్న అగాధాన్ని విశ్లేషించుకోవాలి. అప్పుడే 'విజన్' మనకు అర్థం అవుతుంది. లేకపోతే అందమయిన పేజీలపైన అందంగా అచ్చువేసిన అందమైన భవిష్యత్ దృశ్యంలో ఏదో అబద్ధం ఉందని అనుమానిస్తూనే (చెప్పేడివాడు చంద్రబాబు కాబట్టి) ఆ అబద్ధం ఏమిటో అర్థంకాని స్థితిలో ఉండిపోతాం.

'విజన్' ప్రచురణనే ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. ఇది అతి ఖరీదయిన కాగితం మీద అచ్చువేసిన సుందరమైన ప్రచురణ. 352 పేజీల గ్రంథం. అచ్చువేసిన ధరకే దీనిని అమ్మినా 1500 రూపాయలకు అమ్మవలసి ఉంటుంది. ఏ ప్రజలలో అయితే ఈ ప్రచుణరను చర్చకు పెట్టాలని, ఆ ప్రజల అభిప్రాయం తీసుకొని పాలనా విధానాలకు తుది రూపం ఇవ్వాలని అన్నారో ఆ ప్రజలెవ్వరూ దీనిని కొనలేరు. ఒక క్లుప్తమైన తెలుగు ప్రచురణ కూడ ఉన్నమాట వాస్తవమే కానీ అందులో చర్చించడానికి కావలసిన వివరాలేవీ లేవు. వివరాలుండేది ఖరీదయిన ఈ ఇంగ్లీషు ప్రచురణలోనే.

అది ప్రజలెవ్వరికీ అందుబాట్లో లేనంత ఖరీదయిన ప్రచురణే కాక, అసలు దానిని ప్రభుత్వం అమ్మకానికే పెట్టలేదు. పత్రికల కార్యాలయాలకు మాత్రమే ఇచ్చారు. చదవదలచుకున్న ప్రజలు పత్రికల దగ్గరో, ప్రభుత్వ అధికారుల దగ్గరో అడుక్కొని తెచ్చుకోవలసి వస్తుంది.

ప్రజలలో 'విజన్'ను చర్చకు పెట్టి వారి అభిప్రాయాలు తీసుకొని దానికి తుది రూపం ఇవ్వాలన్న ప్రకటిత లక్ష్యానికీ, ప్రచురణ చేపట్టిన పద్ధతికీ పొంతన ఏమీ లేదు. బహుశా దీనిని చర్చించవలసిన 'ప్రజలు' పత్రికా కార్యాలయాలలోనో సెక్రటేరియట్‌లోనో పరపతి ఉండి 'విజన్ 2020' ప్రతిని సంపాదించుకోగలవాళ్ళే అయి ఉండాలేమో! 'పారదర్శక పాలన' గురించి 'విజన్ 2020' చివరి అధ్యాయంలో ఇచ్చిన ఆకర్షణీయమైన హామీని కూడ ఈ కోణం నుండే అర్థం చేసుకోవాలేమో. ప్రభుత్వ పాలనకూ, పాలనా విధానాలకూ సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందుబాట్లో ఉంచడం పారదర్శక పాలన ప్రాథమిక లక్షణాలలో ఒకటి. కానీ ఆ హామీ యిచ్చే ఈ విధానపత్రం సహితం ప్రజలకు అందుబాట్లో లేదు.

ఇంతకంటే లోతయిన అసంబద్ధత 'విజన్'లో ఉంది. ఇక్కడ రెండు ఉదాహరణలు యిచ్చి ఇతర వివరాలు తరువాతి అధ్యాయాలలో చూద్దాం. ప్రజలకు జీవనాధారం కల్పించే విషయంలో ప్రభుత్వానికి బాధ్యత ఏదీ లేదనేది ప్రస్తుతం ప్రపంచాన్ని ఏలుతున్న రాజకీయార్థిక నీతి చెప్పే ముఖ్యమైన విషయాలలో ఒకటి. అయితే విద్య, ఆరోగ్యం అనే రెండు విషయాలలో మాత్రం ప్రజల పట్ల ప్రభుత్వానికి బాధ్యత ఉందని ఈ నీతి చెప్తుంది. దీనికి గల కారణాన్ని ఆ విధాన నిర్ణేతలు దాచిపెట్టుకోరు. 'మానవ వనరులు' అనేది వాళ్ళు ఉపయోగించే మాటలలో ఒకటి. ఆర్థిక అభివృద్ధికి పెట్టుబడి వనరులు, భౌతిక వనరులు ఎంత అవసరమో, 'మానవ వనరులు' కూడ అంత అవసరం. విద్య, ఆరోగ్యం ఉన్న మనుషులు మంచి 'మానవ వనరుల'వుతారు. అంటే సమర్థవంతంగా పని చేయగలుగుతారు. కాబట్టి విద్య, వైద్యరంగాల అభివృద్ధి పట్ల మాత్రం ప్రభుత్వం కొంత బాధ్యత తీసుకోవాలని ప్రస్తుత పాలక రాజనీతి చెప్తుంది. అయితే అది కూడ ప్రాథమిక రంగాలలోనే. ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం ప్రభుత్వ బాధ్యతగా ఉండాలనీ, ద్వితీయ తృతీయ శ్రేణుల విద్యా వైద్యరంగాలలో ప్రభుత్వం ఒకవేళ ఉన్నా ప్రైవేట్ చొరవనే ఎక్కువగా ప్రోత్సహించాలనీ ఈ పాలకనీతి చెప్తుంది.

విద్యా, వైద్య సదుపాయాలను కేవలం 'మానవ వనరుల' కోణం నుండే కాకుండా మనుషుల హక్కులుగా కూడ చూడాలనీ – అంటే ఆర్థిక వ్యవస్థ అవసరాల కోణం నుండే కాక ప్రజల అవసరంగా కూడ చూడాలని – అమర్త్యసేన్ వంటివాళ్ళు అంటున్నారు. ఆర్థిక వ్యవస్థ ఏదయినా, అందులో పాల్గొని ప్రయోజనం పొందడానికి

ప్రజలకు సామర్థ్యం, బలం ఉండాలనీ, దానిని కల్పించే బాధ్యత ప్రభుత్వ విధాన రచన మీద ఉంటుందనీ అమర్త్యసేన్ అంటాడు. ఆ సామర్థ్యానికి లేక బలానికి తోడ్పడే విషయాలుగా ఆయన గుర్తించేవి – ప్రజల చేతిలో జీవన వనరులు, ప్రజలకు అందుబాట్లో విద్యా వైద్య సేవలు, సమాన అవకాశాలు కల్పించే సాంఘిక వ్యవస్థ, తమ శ్రమనూ తమకు అందుబాట్లో ఉన్న వనరులనూ మార్పిడి చేసుకునే ఆర్థిక స్వేచ్ఛ, విధాన రచనలో పాలుపంచుకొనే అవకాశం ప్రజలకు కల్పించే రాజకీయ వ్యవస్థ. వీటిలో మొదటి దాని గురించి – ప్రజలకు జీవనాధారం లేదా ఉపాధి కల్పించే వనరులు అందుబాట్లో ఉండడం గురించి – 'విజన్ 2020' ఏమీ మాట్లాడదు. సమాన అవకాశాలు కల్పించే సాంఘిక వ్యవస్థ గురించి ఆర్భాటంగా ప్రకటనలు చేయడమయితే 'విజన్' నిండా ఉంది గానీ నిర్దిష్టమైన విధానమేదీ లేదు. లేకపోగా, అవకాశాలలో అసమానతను పెంచే దిశగా పనిచేసే విధాన తర్కం 'విజన్' నిండా ఉంది. శ్రమనూ వనరులనూ స్వేచ్ఛగా మార్పిడి చేసుకునే మార్కెట్ వ్యవస్థకు 'విజన్' పెద్దపీట వేస్తుంది గానీ స్వేచ్ఛతోబాటు అవకాశం కూడ ఉంటుందన్న భరోసా ఏమీ లేదు. రాజకీయ భాగస్వామ్యాన్ని గురించి తరువాత చూద్దాం.

ఇంక మిగిలింది విద్యా వైద్య సేవలు. వీటిని సహితం ప్రజలకు ఒక హక్కుగా (బలాన్నీ సామర్థ్యాన్నీ కల్పించే విషయాలుగా) చూడడానికీ, బాగా పనిచేసే మానవ వనరులుగా వారిని మలిచే అవసరంలో భాగంగా చూడడానికీ చాలా తేడా ఉంది. ఉదాహరణకు నిండయిన మనుషులుగా ఎదిగే హక్కులో భాగంగా చూసినప్పుడు ఈ విషయంలో ప్రభుత్వ బాధ్యత కేవలం ప్రాథమిక విద్యా వైద్య రంగాలకే పరిమితమైతే సరిపోదు. పైస్థాయిలో కూడ విద్యా వైద్య సదుపాయాలు అందరికీ అందుబాట్లోకి రావడానికి కావలసిన విధాన రచన ఉండాలి. కావలసింది సమర్థవంతులైన కార్మికులను తయారు చేసుకోవడం మాత్రమే అయితే వేరే సంగతి. అప్పుడు ప్రాథమిక విద్యా వైద్య సదుపాయాలు అందించడం వరకే ప్రభుత్వ విధానాల బాధ్యత అవుతుంది. ఆ పైన ఎవరి స్థోమతుకు వారిని వదిలేయొచ్చు.

ఇది సాధారణ విషయం. 'విజన్ 2020'లో మాత్రమే కాక సమకాలీన పాలక రాజకీయార్థిక నీతిలో సర్వత్రా ఉండే అవలక్షణమే ఇది. కానీ 'విజన్ 2020' అక్కడితో ఆగిపోలేదు. ప్రాథమిక విద్యా వైద్య రంగాలను ప్రభుత్వం తన బాధ్యతగా భావించాలనీ,

ఆపైన ఆ రెండు రంగాలనూ మార్కెట్ శక్తులకు వదిలివేయాలనీ అనడం ఒక ఎత్తయితే, విజన్ 2020 ఒకడుగు ముందుకు పోయి విద్యా వైద్య రంగాల వ్యాపారీకరణను రాష్ట్ర ఆర్థిక అభివృద్ధిలో ఒక ముఖ్య చోదకశక్తిగా గుర్తించింది. ఏ రాష్ట్రమైనా ఏ దేశమైనా తనకు అనుకూలంగా ఉన్న ఆర్థిక ప్రక్రియలను ఎంచుకొని వాటిని ప్రోత్సహించడం ద్వారా పురోభివృద్ధి సాధించాలని సూత్రీకరిస్తూ, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినంత వరకు విద్యావైద్య వ్యాపారం అటువంటి ఒక ముఖ్య ఆర్థిక చోదక శక్తి అని 'విజన్ 2020' ప్రకటిస్తుంది. పెరుగుదలకు ఇటువంటి చోదక శక్తులు 'ఇంజన్' వంటివని 'విజన్' అభివర్ణిస్తుంది. మన రాష్ట్ర అభివృద్ధికి 'విజన్' గుర్తించే 19 'ఇంజన్'లలో విద్యావ్యాపారం, వైద్య వ్యాపారం రెండూ ఉన్నాయి.

ఒక పక్క విద్యనూ వైద్యాన్నీ ఆర్థిక పెరుగుదల రేటును వేగంగా పెంచడానికి ఉపయోగపడే ముఖ్య పెట్టుబడి రంగాల జాబితాలలో చేరుస్తూ, మరొకవైపు 'అందరికీ విద్య, అందరికీ వైద్యం' అనే నినాదాన్ని ఎన్నిసార్లు వల్లె వేసినా ఒరిగేదేముంది? ప్రభుత్వం ఈ రెండు రంగాలలోనూ కొంత పెట్టుబడి పెట్టి పేదలకు కొంతమేరకు ఉచితంగా సేవలు అందించవచ్చు. కానీ ఆపైన ఏం కావాలన్నా ప్రైవేట్ పెట్టుబడికి ఒక ముఖ్య కేంద్రంగా విధానపరంగానే గుర్తించబడిన విద్యా వైద్య రంగాలలో దానిని వెతుక్కోవాలంటే అది సామాన్యులకు సాధ్యమయ్యేది కాదు. డబ్బున్న వాళ్ళ రంగమొకటి, లేనివాళ్ళ రంగమొకటి రెండు వేరు వేరు ప్రపంచాలుగా రూపం తీసుకుంటాయి. 2020 నాటికి అందరికీ విద్య, అందరికీ వైద్యం అని ఎన్నిసార్లయినా 'విజన్'లో ప్రకటించనీ గాక, ఆ పత్రం ప్రతిపాదించే ఆర్థిక విధానాల వాస్తవ ఫలితమైతే పై విధంగానే ఉండబోతుంది.

రెండవ ఉదాహరణ పరిపాలనలో వికేంద్రీకరణకు సంబంధించినది. పంచాయతీరాజ్ సంస్థకు బాధ్యత అప్పగించడం ద్వారా పరిపాలనను వికేంద్రీకరించడం జరుగుతుందని 'విజన్' అంటుంది. పరిపాలనా సంబంధమైన బాధ్యతలను, ఆర్థిక అధికారాన్నీ స్థానిక నిర్వహణకు అప్పగించడం జరుగుతుందని అంటుంది. 73వ, 74వ రాజ్యాంగ సవరణలో ఇప్పటికే ఈ ఆలోచనలు ఉన్నాయనీ, వాటిని అమలు చేయడం ద్వారా పరిపాలనలో స్థానిక సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడం జరుగుతుందనీ 'విజన్' అంటుంది.

అదే సమయంలో 'జన్మభూమి' కార్యక్రమాన్ని 'విజన్' గొప్పగా ప్రశంసిస్తుంది. 'విజన్'లోని ఆలోచనలకు ఒక సూచిగా జన్మభూమిని చూపిస్తుంది.

ఒక పక్క స్థానిక సంస్థలకు బలం చేకూర్చే ఆలోచననూ, మరొక పక్క జన్మభూమి నమూనానూ ప్రతిపాదించడంలో ఉన్న అసంబద్ధత 'విజన్ 2020'ని రూపకల్పన చేసిన వారికి తోచినట్టు కనిపించదు. జన్మభూమి కార్యక్రమం వల్ల ఏ ప్రయోజనమూ రాలేదా అనేది ప్రస్తుత చర్చ కాదు. దానివల్ల వేరే ప్రయోజనాలేవయినా ఒనగూడి ఉండవచ్చు కాని ఆ కార్యక్రమం స్థానిక సంస్థలను పూర్తిగా బలహీనపరచిందనేది సత్యం. ఆ మేరకు జన్మభూమి 73, 74వ రాజ్యాంగ సవరణలకు వ్యతిరేకం. ఆర్థిక నిర్వహణలో స్థానిక సంస్థల బాధ్యతలను పెంపొందించే బదులు వాటిని పూర్తిగా పక్కన పెట్టి దాని స్థానంలో ముఖ్యమంత్రి చుట్టూ, ఆయన పార్టీ చుట్టూ అల్లుకున్న గ్రామీణ అభివృద్ధి వ్యూహాన్ని ప్రవేశపెట్టింది జన్మభూమి. అది పాలనా వ్యవస్థను వికేంద్రీకరించే బదులు ఒక రకంగా మరింత కేంద్రీకృతం చేసింది. అయితే అదే సమయంలో అధికారులను గ్రామాలకూ, పట్టణాలలోని పేదలవాడలకూ పంపించడం ద్వారా, వారిని ప్రశ్నించే అవకాశం ప్రజలకు కల్పించడం ద్వారా ప్రజల మన్ననలు ఒక మేరకు పొంది ఉండవచ్చుగాక. అంతమాత్రంచేత జన్మభూమి వికేంద్రీకరణకు తోడ్పడకపోగా దానిని బాగా దెబ్బతీసిందని గుర్తించకుండా ఉండలేము. అందువల్ల జన్మభూమినీ, పాలనా వికేంద్రీకరణనూ ఒకే సందర్భంలో ప్రస్తావించడంలోని అసంబద్ధతను కూడ గుర్తించకుండా ఉండలేము.

కానీ 'విజన్'ను జాగ్రత్తగా చదివితే ఆ విధానపత్రం హామీ యిచ్చేది మౌలిక అధికారాల నిర్వహణలో వికేంద్రీకరణ కాదని అర్థం అవుతుంది. పారిశుధ్యం మీద, గ్రామీణ పాఠశాలల మీద, వ్యాపారీకరణకు అవసరమైన రోడ్ల వంటి నిర్మాణాల మీద, అంగళ్ళ మీద మాత్రమ స్థానిక సంస్థలకు అజమాయిషీ ఉంటుందనేది ఈ వికేంద్రీకరణకు గల అర్థం. గ్రామానికి అందుబాట్లో ఉన్న వనరుల నిర్వహణ మీద అజమాయిషీ ఉంటుందని కాదు, విధాన నిర్ణయాలలో స్థానిక సంస్థలకు స్థానం ఉంటుందని కాదు. నీటివాడకందార్ల సంఘాలు దీనికొక మినహాయింపుగా కనిపించవచ్చునుగానీ వాటికి కూడ అప్పటికే తవ్విన ప్రాజెక్టు కాలవల నిర్వహణ మీద, అప్పటికే కట్టిన చెరువుల నిర్వహణ మీద మాత్రమే అధికారం కల్పించారు.

నదీ జలాల ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలలో గానీ, బావుల కింద జరిగే సాగుకు అవసరమైన కరెంటు సరఫరాకు సంబంధించిన నిర్ణయాలలో గానీ, భూగర్భజలాల మెరుగుదల కోసం నిర్మించే చెక్‌డ్యాంలకు సంబంధించిన నిర్ణయాలలో గానీ ఈ సంఘాల అభిప్రాయాలకేమీ స్థానం లేదు. నీటి వాడకందార్ల సంఘాలకు ఈ మాత్రమైనా అధికారమిచ్చారేమోగానీ, ఇతర భౌతిక వనరుల మీద గ్రామీణ స్థానిక సంస్థలకు 'విజన్' ఇచ్చే అధికారం శూన్యం. అవి కార్పొరేట్ పెట్టుబడితో సహా అన్ని రకాల పెట్టుబడికీ 'స్వేచ్ఛగా' అందుబాట్లో ఉండాలనేది 'విజన్'లోని ముఖ్యమైన ఆలోచనలలో ఒకటి. జలవనరులలోని చేపలు, పచ్చిక బయళ్ళలోని గడ్డి, అడవులలోని కలప, పళ్ళతోటలకు యోగ్యమైన బంజర్లు – వీటిలో దేనిపైనా స్థానిక సంస్థలకు నిర్వహణాధికారం లేదు. అవన్నీ పెట్టుబడికి 'స్వేచ్ఛగా' అందుబాట్లో ఉండాలంతే. అప్పుడే రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి వేగంగా జరుగుతుంది. పెట్టుబడి ఈ వనరులను 'అభివృద్ధి' కోసం వాడుకోవడానికి అవసరమైన నిర్మాణాల (రోడ్లు, మొదలయినవి) నిర్వహణలో మాత్రం స్థానిక సంస్థలకు బాధ్యత ఉంటుంది. ఆపైన పారిశుద్ధ్యం, పాఠశాలలపై అజమాయిషీ మొదలయినవి ఉంటాయి.

ఇంత వివరంగా చెప్పుకుంటే తప్ప 'విజన్ 2020'లోని వికేంద్రీకరణ ఎటువంటిదో అర్థం కాదు.

## III గ్రామీణ వనరులు

ఆర్థిక వ్యవస్థ గురించి ఆలోచన ఎక్కడ మొదలుపెడతాం, ఎవరితో మొదలు పెడతాం అనేది ఆర్థిక విధాన రచనలో ప్రధానమైన విషయం. పెట్టుబడి పెద్దఎత్తున రాష్ట్రంలోకి ప్రవహించడం అన్నిటికంటే ముఖ్య అవసరం అని ముందే నిర్ణయించుకొని, ఆ పెట్టుబడిని ఆకర్షించడానికి దేశంలోని పొరుగు రాష్ట్రాలతోనే కాక మనబోటి ఇతర బడుగు దేశాలతో కూడ పోటీపడాలంటే ఏమేం చేయాలి, దానికి కావలసిన నిర్మాణ పనులు చేపట్టడానికి ప్రపంచబ్యాంకు నుండి అభివృద్ధి రుణాలు పొందాలంటే ఏమేం చేయాలి, ఈ రెండింటి కోసం కావలసిన విదేశీ మారకం సంపాదించాలంటే ఏమేం చేయాలి అని ఆలోచిస్తే ఒక రకమైన జవాబు దొరుకుతుంది. ఈ జవాబులో సామాన్య ప్రజలు, వారి అవసరాలు ఎక్కడో ఒక మూల మాత్రమే కనిపిస్తాయి. వాళ్ళ కోసం ఆ నమూనాలో స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మిస్తామనడం అబద్ధం అవుతుంది. పెట్టుబడి అవసరాలన్నీ సమకూరి ఆర్థిక రంగం వేగంగా అభివృద్ధి చెంది రాష్ట్ర ఆదాయం బాగా పెరిగి స్థిరంగా నిలబడుతుందనీ, ఆ ఆదాయంలో పేదలందరికీ కూడ వాటా దొరుకుతుందనీ నమ్మాలంటే వర్తమాన చరిత్రను కొంచెం సేపు విస్మరించాలి. రాష్ట్ర ఆదాయం కొంతకాలం పాటు బాగానే పెరగవచ్చు. కానీ అది స్థిరంగా ఉండదు. ఆ పెరుగుదలకు భరోసా ఉండదు. పైగా అది చాలా అసమానంగా ఉంటుంది. ఆస్తిపరులు బాగా ఆస్తులు పెంచుకోవడంతో పాటు, కొంతమేరకు వనరులు అందుబాట్లో ఉన్న మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలలో ఒక సెక్షన్‌కు ఆ అస్థిర పెరుగుదలలో వాటా దక్కగలదు. కానీ పూర్తిగా వనరులు, సాంఘిక అవకాశాలు లేని వర్గాలకు దక్కే వాటా ఏమీ ఉండదు.

పెట్టుబడిదారీ మార్కెట్ వ్యవస్థను పూర్తిగా తిరస్కరించకుండానే అభివృద్ధిని వేరే కోణంలో చూడవచ్చు. దానిని పూర్తిగా తిరస్కరించమని మన రాష్ట్ర పాలకులకు చెప్పి ప్రయోజనం లేదు. కానీ దాని పరిధిలో కూడ ప్రపంచబ్యాంకు దృష్టి కంటే భిన్నమైన కోణం నుండి విషయాన్ని పరిశీలించవచ్చునని చెప్పడం అవసరం. అప్పుడు ఫలితాలు కొంతవరకయినా భిన్నంగా ఉంటాయని కూడ చెప్పడం అవసరం.

పెట్టుబడితో మొదలు పెట్టకుండా ప్రజల ఉపాధి అవసరంతో మొదలుపెట్టి విషయాన్ని పరిశీలించవచ్చు. కేవలం ఉపాధే కాకుండా నిండుగా ఎదిగే అవకాశాన్ని

ప్రాతిపదిక చేసుకొని ఆలోచించవచ్చు. ఉపాధి దొరకాలంటే ప్రజలకు భౌతిక వనరులపైన హక్కయినా ఉండాలి. లేదా గౌరవప్రదమైన జీవనానికి తగినంత పని అయినా తప్పనిసరిగా లభించాలి. భౌతిక వనరులంటే సాగుయోగ్యమైన భూమి, దానిని సాగుయోగ్యం చేసే నీరు, పశువులు, వాటిని పోషించుకోవడానికి అవసరమైన పచ్చిక బీళ్ళు, పళ్ళు, పూలు మొదలయిన వృక్ష ఉత్పాదితాలు, చేపలు దొరికే కాలవలు, చెరువులు, అటవీ ఉత్పత్తులు మొదలయినవి. వీటి మీద ప్రజలకు ఏదో ఒక రూపంలో

**ఆంధ్రప్రదేశ్‌లో రక్షిత మంచినీటి సరఫరా అందుబాటులో లేని కుటుంబాలు (శాతం) 1991**

| గ్రామాలలో | పట్టణాలలో |
|---|---|
| 42.6 | 12.9 |

(ఆదిలాబాద్ జిల్లాలో 80 శాతం జనావాసాలకు అసలే లేదు)

**ఆంధ్రప్రదేశ్‌లో రక్షిత మంచినీటి సరఫరా లేని దళిత, ఆదివాసీ కుటుంబాలు (శాతం) (1991)**

| దళిత కుటుంబాలు | | ఆదివాసీ కుటుంబాలు | |
|---|---|---|---|
| గ్రామాలలో | పట్టణాలలో | గ్రామాలలో | పట్టణాలలో |
| 45.6 | 24.1 | 51.7 | 30.5 |

**ఆంధ్రప్రదేశ్‌లో కరెంటు సరఫరా లేని కుటుంబాలు (శాతం) (1991)**

| గ్రామాలలో | పట్టణాలలో |
|---|---|
| 62.5 | 26.7 |

**ఆంధ్రప్రదేశ్‌లో కరెంటు సరఫరాలేని దళిత, ఆదివాసీ కుటుంబాలు (శాతం) (1991)**

| దళిత కుటుంబాలు | | ఆదివాసీ కుటుంబాలు | |
|---|---|---|---|
| గ్రామాలలో | పట్టణాలలో | గ్రామాలలో | పట్టణాలలో |
| 80.1 | 50.8 | 89.4 | 62.4 |

(కానీ ప్రతి గ్రామానికీ కరెంటు సరఫరా ఉన్న కొద్ది రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటి)

హక్కు కల్పిస్తూ వీటి ద్వారా లభ్యమయ్యే ఉత్పత్తులను మారకం చేసుకునే ప్రాథమిక ప్రయోజనం కల్పించే వ్యవస్థగా మార్కెట్ వ్యవస్థను అర్థం చేసుకొని, ఆ ప్రాతిపదిక మీద అన్ని అత్యాధునిక సాంకేతిక ప్రక్రియలకూ చోటు కల్పించే ఆర్థిక వ్యవస్థను ఊహించుకోవచ్చు. ఈ ప్రాతిపదిక దెబ్బతినకుండా ఉండే పద్ధతిలో పెట్టుబడికి ప్రోత్సాహం కల్పించే విధాన రచన చేపట్టడం ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో సహితం ఆశించగల విషయమే. అప్పుడు 20 ఏళ్ళలో స్వర్ణాంధ్రప్రదేశ్ సిద్ధించకున్నా దారిద్ర్యం కొంతమేరకైనా అదుపులో ఉండే అభివృద్ధి లభ్యమవుతుంది.

పేదలందరికీ ప్రకృతి వనరులపైన హక్కు కల్పించడం అసాధ్యమయితే ఆ హక్కు ఇవ్వలేని వారికి నిత్యం పని కల్పించే విధాన రచన ఉండాలి. పారిశ్రామిక వ్యవసాయ విధానాలను ఆ కోణం నుండి రూపొందించాలి. అప్పుడు కూడ దారిద్ర్యం కొంతమేరకే అదుపులో ఉంటుంది. దానితోపాటు విద్యావకాశాలు అందరికీ కల్పించి, సాంకేతికంగా మెరుగయిన జీవనరంగంలోకి ప్రవేశించే అవకాశం ఇస్తే ఈ తరంలో కాకపోతే వచ్చే తరంలోనయినా బాగా బతికే అవకాశం కల్పించినట్టవుతుంది.

**రాష్ట్రంలో భూసంస్కరణల అమలు (1992 నాటికి)**

| | | |
|---|---|---|
| రాష్ట్ర భూవైశాల్యం | – | 686 లక్షల ఎకరాలు |
| అందులో సాగుయోగ్యమైన భూమి | – | 267 లక్షల ఎకరాలు |
| సీలింగ్ చట్టం కింద మిగులు భూమి అని ప్రాథమిక విచారణలో తేలినది | – | 16.64 లక్షల ఎకరాలు (సాగుయోగ్యమైన భూమిలో 6.25 శాతం) |
| అప్పీల్‌లో భూస్వాములు గెలుచుకున్నది పోగా మిగిలిన మిగులు భూమి | – | 8.00 లక్షల ఎకరాలు (సాగుయోగ్యమైన భూమిలో 3 శాతం) |
| అందులో ప్రభుత్వం పంపకానికి స్వాధీనం చేసుకున్న భూమి | – | 5.7 లక్షల ఎకరాలు |
| అందులో పేదలకు పంచిన భూమి | – | 5.10 లక్షల ఎకరాలు (సాగుయోగ్యమైన భూమిలో 2 శాతం) |

(ఇందులో ఎన్ని ఎకరాలు లబ్ధిదారుల దగ్గరే ఉందో, ఎన్ని ఎకరాలు తిరిగి తొలి యజమానుల చేతిలోకే పోయిందో లెక్కవేసినవారు లేరు)

అమర్త్యసేన్ మాటలు వినడానికి తమకు అభ్యంతరం లేదని మన పాలకులు అంటుంటారు కాబట్టి ఆయన మాటలలోనే చెప్పుకుందాం. ఆయన ఆర్థిక సరళీకరణను, ప్రపంచీకరణను మా లాగా వ్యతిరేకించడు. పెట్టుబడి దిగుమతిని, ఉత్పత్తుల ఎగుమతిని వ్యతిరేకించడు. అయితే ప్రభుత్వం విధాన రచన చేసేటప్పుడు మొదటి ప్రాధాన్యం ఇయ్యవలసింది పెట్టుబడికి అవసరమైన వసతులూ, నిర్మాణాలూ ఏ విధంగా కల్పించాలా అనే విషయానికి కాదనీ, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో పాల్గొని ప్రయోజనం పొందడానికి అవసరమైన బలం లేక సామర్థ్యం ప్రజలకు ఏ విధంగా కల్పించాలా అన్న ప్రశ్న దగ్గర మొదలుపెట్టాలనీ అంటారు. భౌతిక వనరులు, విద్యా వైద్య సదుపాయాలు, సమాన సాంఘిక అవకాశాలు, ఆర్థిక స్వేచ్ఛ, రాజకీయ ప్రజాస్వామ్యం మొదలైనవి ప్రజలకు బలాన్నీ సామర్థ్యాన్నీ కలిగిస్తాయని ఆయన నమ్ముతాడు. విధాన రచన ఈ కోణం నుండి చేస్తే అది 'విజన్ 2020' కంటే చాలా భిన్నంగా ఉంటుంది. నిజానికి ఇది పెట్టుబడిదారీ ఆర్థిక నీతి పునాదులనే ప్రశ్నిస్తుంది కూడ. కానీ ఆ విషయాన్ని చర్చించడానికిది సందర్భం కాదు.

భౌతిక వనరులపై ప్రజలకు హక్కు కల్పించే ఆలోచన లేశమంతయినా 'విజన్ 2020'లో లేదు. లేకపోగా అది భౌతిక వనరులన్నిటినీ పెట్టుబడికి భోజ్యం చేయాలని చూస్తుంది. అరకొరగా అమలయిన భూసంస్కరణలను ఇప్పుడయినా (అవకాశమింకా మిగిలి ఉన్న మేరకు) పూర్తిగా అమలు చేస్తామన్న హామీ సహితం 'విజన్ 2020'లో లేదు. దాని బదులు పెద్ద పెద్ద వ్యవసాయ ఉత్పత్తుల కార్పొరేషన్‌లు భూగరిష్ఠ పరమితి చట్టాల బాధ లేకుండా పేద రైతుల దగ్గర ఎకరం రెండెకరాలు లీజుకు తీసుకొని పెద్ద ఎస్టేట్లు తయారుచేసి ఎగుమతుల కోసం వ్యవసాయ ఉత్పత్తి చేపట్టే మార్గం ఆలోచిస్తామంటుంది.

భూమే కాకుండా పేదలకు ఉపాధి కల్పించే ఇతర భౌతిక వనరులు చాలా ఉన్నాయి. నదులలో చెరువులలో చేపలు, గొర్రెల పోషణకు పనికొచ్చే బీళ్ళు, కల్లుగీత పని కల్పించే తాటిచెట్లు, ఈతచెట్లు, అడవులలో దొరికే అటవీ సంపద మొదలయినవెన్నో ఉన్నాయి. వీటిపైన సంప్రదాయకంగా ఉన్న హక్కులకు రక్షణ కల్పించి, ఈ ఉత్పత్తులను మారకం చేసుకోవడానికి అవసరమైన మార్కెట్ వ్యవస్థను మెరుగుపరచి, రవాణా సదుపాయాలు అభివృద్ధి చేసి, పెట్టుబడి సదుపాయాలు, కనీస

ధరలు కల్పించే ఆలోచన చేసినట్లయితే ప్రస్తుత మార్కెట్ వ్యవస్థలో అంతర్భాగంగానే పేదలు, దళిత బహుజన కులాలవారు చాలామంది బాగుపడే అవకాశం ఉండేది. కాని దీని ఊసు 'విజన్'లో ఎక్కడా లేదు. లేకపోగా ఈ వనరులను బడా పెట్టుబడికి అందిచ్చే ఆలోచనలు కావలసినన్ని ఉన్నాయి. ఉదాహరణకు పచ్చిక బీళ్ళను గొర్రెల పెంపకాన్ని ఒక బడా వ్యాపారంగా చేపట్టడానికి అవసరమైన వనరుగా చూడాలని 'విజన్' అంటుంది. అప్పుడు చిన్న చిన్న గొర్రెల మందలు పెట్టుకుని బతికే గొల్ల, కురుమ కులస్తులు ఏమవుతారు? వాళ్ళు గొర్రెల కార్పొరేషన్‌తో పోటీ పడలేరు. పచ్చిక బయళ్ళను ప్రభుత్వం దగ్గర లీజుకు తీసుకోవడంలో పోటీ పడలేరు. మాంసం బాగా ఇచ్చే కొత్త జాతుల రూపకల్పనలో పోటీ పడలేరు. మాంసాన్ని విక్రయానికి అనుకూలమైన పద్ధతిలో ప్యాకేజీ చేయడంలో పోటీ పడలేరు. కోల్డ్ ఫ్రీజర్లు కిరాయికి తీసుకోలేరు. కాబట్టి కొన్నాళ్ళకు తమ గొర్రెలను గొర్రెల కార్పొరేషన్లకే అమ్ముకొని కూలి చేసుకొని బతుకుతారు.

**రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం (1992–93)**

**రూ॥ 16.00**

| దళితుల తలసరి ఆదాయం | | ఆదివాసుల తలసరి ఆదాయం | |
|---|---|---|---|
| గ్రామాలలో | పట్టణాలలో | గ్రామాలలో | పట్టణాలలో |
| రూ॥ 6.30 | రూ॥ 10.30 | రూ॥ 6.40 | రూ॥ 6.60 |

**రాష్ట్రంలో 10 లక్షల జనాభాకు ఆస్పత్రి పడకలు (శాతం) (1991)**

| గ్రామాలు | పట్టణాలు |
|---|---|
| 76 | 1827 |

(కేరళ రాష్ట్రంలోని గ్రామాలలో దీనికి 20 రెట్లు ఉన్నాయి)

ఇది అన్ని ప్రకృతి వనరులకూ వర్తిస్తుంది. ఉదాహరణకు ప్రభుత్వ యాజమాన్యం లోని పోరంబోకు, బంజరు భూముల కోసం గ్రామీణ పేదలు, ముఖ్యంగా దళితులు అనేక పోరాటాలు చేసారు, చేస్తున్నారు. కానీ 'విజన్' ఆ వనరులను వేరే కళ్ళతో చూస్తుంది. అన్ని వనరుల లాగా ఈ భూములను కూడ ఎక్కువ ప్రతిఫలం పొందగల వారికి కట్టబెట్టాలన్నది 'విజన్' ఆలోచన. పోరంబోకును పేదలకు పంచితే, వాళ్ళు మెట్టపంటలేవో పండించుకొని బతికితే 'రాష్ట్ర ఆదాయం' ఎక్కువగా పెరగదు. అదే భూమిని పళ్ళతోటలకు అప్పగిస్తే, పళ్ళు పండించి ఎగుమతి చేయడానికి అవసరమైన

రవాణా సదుపాయాలూ, కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలూ కల్పిస్తే అదే భూమి నుండి కొన్ని రెట్లు ఎక్కువ ఆదాయం పొందవచ్చు. (ఎవరు పొందుతారు అన్న ప్రశ్న అడగకుండా 'రాష్ట్రం' లేకపోతే 'తెలుగుజాతి' పొందుతుంది అని సర్దిచెప్పుకోవడం 'విజన్' అనుసరించే తర్కానికి కీలకమైన విషయం).

నిజమే, పేదలకు ఒకటి రెండెకరాల చొప్పున పోరంబోకు భూములు పంచి వదలిపెడితే వాళ్ళ జీవితాలూ పెద్దగా బాగుపడవు. రాష్ట్ర స్థూల ఆదాయమూ ఎక్కువగా పెరగదు. పేదలు కడుపు నిండీ నిండని స్థితిలో శాశ్వతంగా ఉండిపోవాలని, అదే నిజమైన అభివృద్ధి అని వాళ్ళూ అనరు కానీ దానికి ప్రత్యామ్నాయం ప్రభుత్వ భూములన్నిటినీ పళ్ళ తోటలకు అప్పగించడం కాదు. ఆ పేదల భూములకు సాగునీరు అందించడం, భూగర్భ జలాలను పెంపొందించడానికి కృషి చేయడం, వ్యవసాయ రుణాలు తగిన మొత్తంలో అందించడం మొదలయిన చర్యలు చేపట్టాలి. దీనివల్ల 'విజన్' ఊహించినంత పరిమాణంలో పెరుగుదల రేటు రాకపోవచ్చును కానీ అంతకంటే స్థిరమైన అభివృద్ధి లభిస్తుంది. పేదలకు కొంత తిండిపెట్టే అభివృద్ధి లభిస్తుంది.

కానీ 'విజన్' కళ్ళకు మెట్ట భూములన్నీ ఎగుమతికి అవకాశమున్న పళ్ళ తోటలకు తగిన భూములుగానే కనిపిస్తాయి. ఇప్పుడున్న ప్రభుత్వ భూములే కాదు, వాటర్‌షెడ్ అభివృద్ధి ద్వారా సాగులోకి తేవాలని ప్రభుత్వం ఆలోచిస్తున్న 41 లక్షల ఎకరాలు కూడ ఇందుకోసమే వినియోగించాలని 'విజన్ 2020' నిర్మొహమాటంగా చెప్తుంది. ఇక మీదట ప్రభుత్వ పోరంబోకుల కోసం, బంజర్ల కోసం పేదలు, దళితులు పోరాటాలు చేసే అవకాశమే ఉండదు. 'ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి' అన్న డిమాండుకు తావే ఉండదు. పళ్ళతోటల వ్యాపారం వల్ల రాష్ట్ర స్థూల ఆదాయం ఎంత పెరుగుతుందోగానీ ఈ మాత్రం భూములు పొందే అవకాశం కూడ పోతే పేదరికం మాత్రం మరింత పెరుగుతుంది.

ప్రభుత్వ భూములు పొందే పేదల చేతనే పళ్ళతోటలు పెట్టించడం ప్రభుత్వ ఉద్దేశ్యమనీ, విజన్ 2020 చెప్తున్నది అదేననీ వాదించే ఆస్కారం లేకపోలేదు. కానీ విజన్ 2020 ఆలోచిస్తున్నది పేదలకు తిండిపెట్టే పళ్ళ సాగు గురించి కాదు. రాష్ట్ర ఆర్థిక పెరుగుదల రేటును వేగంగా పెంచే ఒక చోదకశక్తిగా పళ్ళసాగు జరగాలన్నది 'విజన్' దృష్టి. ఆ లక్ష్యానికి పళ్ళ సాగు చిన్న చిన్న కమతాలలో జరుగుతుండడం ఒక

ప్రతిబంధకం అని కూడ 'విజన్ 2020' అభిప్రాయం. అందుకే పెద్ద కమతాలలో జరిగేటట్టు చూడాలని అంటుంది. కాబట్టి ప్రభుత్వ భూములను పళ్ళతోటల పెంపకానికి వినియోగించాలనడంలో అర్థం – వాటిని పేదలకు పంచకుండా, అంతో యింతో స్థోమత ఉన్న రైతులకు లేక కంపెనీలకు లీజుకు ఇచ్చి భారీ వ్యాపారంగా వాటి పెంపకాన్నీ, వాటి ఎగుమతినీ చేపట్టడానికి కావలసిన రవాణా, మార్కెట్, స్టోరేజ్ సదుపాయాలు కల్పించాలనే తప్ప వేరే ఏమీ కాదు. చిన్న రైతులెవరయినా ఇందులో భాగమైనా అందుకు కావలసిన పెట్టుబడి వారికి దొరకదు కాబట్టి, ఆ పెట్టుబడిని చవకగా వారికి కల్పించే బాధ్యత ప్రభుత్వంగానీ ప్రభుత్వ వాణిజ్య సంస్థలుగానీ తీసుకోవు కాబట్టి ఆ రైతులు వ్యాపార అవసరాల ఒత్తిడికి తట్టుకోలేక త్వరలోనే తమ భూమిని అమ్ముకొని లేక లీజుకిచ్చి బయటపడతారు.

మరి వేగవంతమైన పెరుగుదల రేటు సాధించడానికి చిన్న ఆస్తులూ చిన్న ఉత్పత్తులూ ఆటంకమయితే, పెట్టుబడి పెద్దగా అవసరం లేకుండా చేసుకోగల మేరకు వ్యవసాయం చేసుకొని బతికే చిన్న బతుకులు ఆటంకమయితే, ఈ చిన్న మనుషులంతా ఏమయిపోతారు? విస్తరిస్తున్న పారిశ్రామిక రంగంలో వీళ్ళకేమైనా పనులూ ఉద్యోగాలూ దొరుకుతాయా? కల్పించబోతారా?

ఈ ప్రశ్నకు జవాబు తరువాత అధ్యాయంలో చూద్దాం.

## IV ఉపాధి అవకాశాలు

ప్రకృతి వనరులను పేదలకు అందుబాట్లో ఉంచి, వాటిని సమర్థంగా వాడుకోవడానికి అవసరమైన పెట్టుబడి రుణాలూ, మార్కెటింగ్ వ్యవస్థ, అభివృద్ధికి అవసరమైన సాంకేతిక సహాయం అందజేయడం; ప్రకృతి వనరులు అందించలేని వారికి కనీస జీవనాధారం కల్పించే ఉపాధి అవకాశాలు అందుబాట్లోకి తెచ్చే ప్రయత్నం చేయడం; చదువుకొని నైపుణ్యం పెంచుకోవడం ద్వారా ఉన్నత సాంకేతిక రంగాలలోకి ప్రవేశించే సాంఘిక అవకాశాలు కల్పించి, ఆ క్రమంలో వీలయినంత ఎక్కువ పెరుగుదల రేటు సాధించాలని చూడడం ఒక రకమైన విధాన రచన. అందులో ఏ సమస్యలూ ఉండవని కాదుగానీ అందరికీ కనీస జీవనాధారం, అభివృద్ధికి అవకాశం కల్పించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న ఈ విధాన రచన ఆ మేరకు ప్రజాతంత్ర స్వభావాన్ని కలిగి ఉంటుంది.

కాని విపరీతమైన పెరుగుదల రేటును, దానికి అవసరమైన లక్షల కోట్ల పెట్టుబడి సాధనను, అందుకు తప్పనిసరి అయిన ఎగుమతి వ్యాపారాన్ని లక్ష్యంగా పెట్టుకున్న విధాన రచనలో చిన్న మనుషులకూ, వారి జీవన సమస్యకూ చోటు ఏదో ఒక మూల మాత్రమే ఉంటుంది. 'విజన్ 2020' స్వభావం ఇదే. అటువంటి విధాన వ్యూహానికి చిన్నస్థాయి ఉత్పత్తులు పనికిరావు. వాటిని ప్రోత్సహించడం మానేయాలని 'విజన్' స్పష్టంగా అంటుంది. సంప్రదాయక ఉత్పత్తి ప్రక్రియలు (అది మెట్ట నేలల్లో పల్లికాయల  సాగు కానీయండి, అది చేతి మగ్గాలపైన వస్త్రాల నేత కానీయండి) కూడ దానికి పనికి రావు. అంతేకాక ఆ విధాన వ్యూహం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీకి, ఇతర అత్యాధునిక సాంకేతిక ప్రక్రియలకూ పెద్దపీట వేయడం వల్ల అది ఎక్కువమందికి పనులూ కల్పించలేదు.

మరి పని చేసుకుంటే తప్ప బతుకు గడవని వారంతా ఏమవుతారు? 'క్రీ.శ. 2020 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం ఉండదు. లేమి ఉండదు. అవకాశాలలో అసమానత ఉండదు. అనారోగ్యం తీవ్రస్థాయిలో ఉండదు. అవిద్య ఉండదు. బాల్యంలో పిల్లల చావులు, ప్రసవంలో తల్లుల చావులు బాగా తగ్గిపోతాయి' అంటూ 'విజన్ 2020' ఇచ్చే హామీలు చదివినప్పుడు శ్రామిక ప్రజలు ఏ ప్రాతిపదిక మీద ఈ స్థితికి చేరుకుంటారు అన్న ప్రశ్న వేసుకోక తప్పదు. ఇవాళ అన్ని రకాల లేమినీ అనుభవిస్తున్న ప్రజలు 20 సంవత్సరాల కాలంలో – 20 కాకపోతే 80 కానీయండి, మనం గడువు

గురించి బాధపడనవసరం లేదు – అన్నిటినీ అధిగమిస్తారంటే అది ఏ విధంగా జరుగుతుంది? కనీస జీవనాధారానికి అవసరమైన వనరులు లేక ఉపాధి కల్పించి, ఆపైన క్రమంగానయినా ఆర్థికంగానూ సాంఘికంగానూ అభివృద్ధి చెందడానికి కావలసిన అవకాశాలు వారికి అందుబాట్లో పెట్టే విధానం పాలకుల వద్ద ఉన్నట్టయితే ఇది సాధ్యం కావచ్చు. కాని 'విజన్'లో ఎంత వెతికినా అటువంటిదేమీ కనిపించదు. మరి ఈ రోజు ఏమీ లేని వాళ్ళు 20 ఏళ్ళలో స్వర్ణయుగంలోకి ఎట్లా ప్రవేశించబోతారని అడిగితే 'విజన్ 2020' చెప్పే జవాబు ఏమిటంటే, **'పలుగు, పార, తట్ట పట్టుకొని'** అని.

**గ్రామీణ దళిత, ఆదివాసీ కుటుంబాల ఉపాధి పరిస్థితి**

| | దళిత కుటుంబాలు | ఆదివాసీ కుటుంబాలు |
|---|---|---|
| స్వంత వ్యవసాయం ఉన్నవి (%) | 10.7 | 38.5 |
| ఇతర స్వంత ఉపాధి వనరులున్నవి (%) | 5.5 | 10.2 |
| వ్యవసాయ కూలీ కుటుంబాలు (%) | 69.7 | 39.9 |
| ఇతర రూపాలలో కూలిచేసుకునే కుటుంబాలు (%) | 8.8 | 5.6 |
| ఇతరాలు (%) | 5.3 | 5.8 |
| మొత్తం | 100.0 | 100.0 |

**మరుగుదొడ్లు లేని దళిత, ఆదివాసీ కుటుంబాలు (శాతం) (1991)**

| దళిత కుటుంబాలు | | ఆదివాసీ కుటుంబాలు | |
|---|---|---|---|
| గ్రామాలలో | పట్టణాలలో | గ్రామాలలో | పట్టణాలలో |
| 97.0 | 71.8 | 98.5 | 75.7 |

'విజన్ 2020' కోరుకునే అభివృద్ధికి 30 లక్షల కోట్ల రూపాయల భారీ పెట్టుబడి అవసరం. ఇందులో అత్యధిక భాగం వివిధ నిర్మాణాలలోకి పోతుంది. రోడ్లు, రైల్వే లైన్లు, ఓడరేవులు, బిల్డింగులు, నదీజలాల ప్రాజెక్టులు, విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు, ఫ్యాక్టరీ భవంతులు మొదలయినవి పెద్దఎత్తున నిర్మించవలసి ఉంటుంది. దీనికి కావలసిన

కూలి జనంగా భూమి లేని శ్రామికులను 'విజన్ 2020' చూస్తుంది. వారంతా ఈ నిర్మాణం పని నుండి ఉపాధి సంపాదించుకొని 20 సంవత్సరాలలో స్వర్ణాంధ్రప్రదేశ్ లోకి అడుగుపెడతారు. సమాన పౌరులుగా, లేమి ఎరుగని వారిగా అడుగుపెడతారు.

అంతే తప్ప స్వంత భూములలో వ్యవసాయం చేసుకొని కాదు, ఫ్యాక్టరీ కార్మికులుగా కాదు, చదువుకొని లేదా కొత్త సాంకేతిక నైపుణ్యాన్ని సంపాదించుకొని కాదు. 300 పై చిలుకు పేజీల 'విజన్ 2020' ఏ ఆస్తూలూ లేని పేదల గురించి చెప్పేది ఈ రెండు వాక్యాలే.

నిజంగానే రాబోయే 20 ఏళ్ళలో రాష్ట్రంలోకి 30 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి ప్రవేశిస్తుందని అనుకున్నా, దానివల్ల శ్రామికులందరికీ ప్రతిరోజూ తట్టపని, మట్టిపని దొరుకుతుందని అనుకోవడానికి ఆధారాలేవీ 'విజన్' చూపించదు. రాష్ట్రంలోని శ్రామిక జనాభా ఎంత, వారికి ఎన్ని 'పనిదినాలు' కల్పించవలసి ఉంటుంది, 'విజన్' నమూనా అభివృద్ధికి అనుబంధంగా సాగే నిర్మాణం పనులు ఎంతమేరకు పని కల్పించగలుగుతాయి అన్న అంచనా ఏదీ లేదు. అది వారి పేదరికాన్ని పోగొట్టి వారి జీవితాలను గుణాత్మకంగా మారుస్తుందని నమ్మడానికి కూడ ఆధారాలేవీ 'విజన్' చూపించదు. నిజానికి ఈ విషయాన్ని గురించి 'విజన్ 2020'లో చర్చే లేదు. రెండు వాక్యాల ప్రకటన మాత్రమే ఉంది.

అత్యధికమైన పెరుగుదల రేటును 'విజన్ 2020' తన లక్ష్యంగా పెట్టుకుందని మరచిపోకూడదు. దానిని అందుకోవాలంటే ఏయే రంగాలలో పెట్టుబడి పెట్టడాన్ని ప్రోత్సహిస్తే అది సాధ్యపడుతుందో ఆయా రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలని 'విజన్' అంటుంది. అవి పెద్దగా ఉద్యోగాలు, ఉపాధి కల్పించే రంగాలు కాకపోవచ్చు. ఆ రంగాలలో పెట్టుబడినీ, వ్యాపారీకరణనూ ప్రోత్సహించడం సామాజికంగా నష్టకరం కావచ్చు. ఉదాహరణకు విద్యా వైద్య వ్యాపారీకరణ చాలా నష్టకరమయినప్పటికీ మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వేగంగా పెరగడానికి తోడ్పడే పెట్టుబడి కేంద్రాలుగా 'విజన్' వాటిని చూస్తుందని ఇదివరకే చెప్పాము. ఒక్కొక్క దేశానికీ ఒక్కొక్క రాష్ట్రానికీ ప్రత్యేక సానుకూలత గల రంగాలు కొన్ని ఉంటాయనీ, వాటిలో పెట్టుబడి పెట్టడాన్ని ప్రోత్సహిస్తే అత్యధిక పెరుగుదల రేటు సాధించవచ్చుననీ 'విజన్' సూత్రీకరిస్తుంది.

పారిశ్రామిక రంగంలో 'విజన్' గుర్తించే సానుకూలతా రంగాలు సమాచార సాంకేతిక రంగం (ఐ.టి రంగం), బయోటెక్నాలజీ, మందులు, నిర్మాణ రంగం, రెడీమేడ్ దుస్తులు, తోలు ఉత్పత్తులు. వీటిలో మొదటి మూడూ పెద్దగా ఉద్యోగాలు కల్పించే రంగాలు కావు. పైగా ఐ.టి., బయోటెక్నాలజీ రంగాల సాంకేతిక స్థాయి అత్యాధునికం కావడం వల్ల వాటిలో పని దొరకాలంటే విద్యా ప్రమాణాలు, సాంకేతిక నైపుణ్యం చాలా ఎక్కువ ఉండాలి. అంటే అవి సమాజంలోని ఆధిపత్య కులాలకూ వర్గాలకూ మాత్రమే అందుబాట్లో ఉంటాయి. నిర్మాణ రంగం అత్యున్నత శిఖరాలను అందుకోబోతుందని 'విజన్' అంటుంది గానీ అది స్థిరమైన ఉపాధి కల్పించలేదు, శాశ్వత ఉద్యోగాల్ని ఇవ్వలేదు. నిర్మాణ రంగమే కార్మికులకు గతి అయితే వారు కాంట్రాక్టు కార్మికులుగా ఉండిపోతారు. రెడీమేడ్ దుస్తులు, తోలు ఉత్పత్తుల రంగాలు కూడ కాంట్రాక్ట్ విధానానికీ, వెట్టిచాకిరీకీ, అతి తక్కువ వేతనాలకూ నిలయాలు. అంటే రాష్ట్ర ఆర్థిక రంగం పెరుగుదలకు ప్రధాన పారిశ్రామిక చోదకశక్తులుగా పనిచేసే వాటిలో కొన్ని అత్యధిక విద్యాప్రమాణాలు, నైపుణ్యం గల కొద్దిమంది ఆధిపత్య వర్గాలకూ, కులాలకూ పనులు కల్పించి మంచి జీతాలు ఇచ్చే రంగాలు కాగా మిగిలినవి కాంట్రాక్ట్ విధానానికీ, అస్థిరతకూ, వెట్టిచాకిరీకీ, అతి తక్కువ వేతనాలకూ నిలయాలు. రెడీమేడ్ దుస్తుల తయారీకి ఒక ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్ (ఇ.పి.జడ్) సికింద్రాబాద్ దగ్గర నిర్మించాలని 'విజన్' ప్రతిపాదిస్తుంది. ఈ ఇ.పి.జడ్‌లో నెలకొల్పే ఫ్యాక్టరీలకూ కార్ఖానాలకూ ఎగుమతి దిగుమతి సుంకాల నుండి మినహాయింపే కాక కార్మిక చట్టాల నుండి కూడ మినహాయింపు ఉంటుందని ఈ మధ్యనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. తోలు ఉత్పత్తులకూ ఇదే వర్తించవచ్చు. ఈ రంగాలలో ఉండబోయేది అత్యధికంగా దళిత బహుజన కులాలకు చెందిన పేదలేననడంలో సందేహం లేదు. అంటే 'విజన్' ఎంచుకున్న పారిశ్రామిక చోదక శక్తులు ఆర్థిక సాంఘిక అసమానతలను విపరీతంగా పెంచబోతాయి.

2020 నాటికి ఏ రకమైన సమాజం ఉండబోతుందనేది ఈ లోపల మనం ఏ విధానాలు అనుసరిస్తామనే దానిమీద ఆధారపడి ఉంటుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. అయితే విధానాలకూ, లక్ష్యాలకూ ఏమీ సంబంధం లేనట్లు 'విజన్ 2020' వాదన సాగుతుంది కాబట్టి ఈ విషయం స్పష్టంగా చెప్పక తప్పదు. ఈ పత్రం

ప్రతిపాదించే విధానాలను వివరంగా విశ్లేషించి అవి 'విజన్' ప్రకటించుకునే లక్ష్యాలకు ఎంతమాత్రం అనుకూలమైనవో చూద్దాం.

బడుగు వర్గాల ప్రజలు సాంఘికంగా ఆర్థికంగా నిజంగా పురోగమించాలంటే విద్యార్హతలూ, సాంకేతిక నైపుణ్యం ఎక్కువ కావలసిన ఉత్పత్తి రంగాలలోకి ప్రవేశించే అవకాశాలు విస్తరించాలి. దానికి కావలసిన సామర్థ్యాన్ని సంపాదించుకునే అవకాశాలు కూడ విస్తరించాలి. కానీ వారందరినీ కేవలం శారీరక నైపుణ్యం తప్ప సాంకేతిక నైపుణ్యానికి చోటెక్కువ లేని నిర్మాణరంగానికీ రెడీమేడ్ దుస్తుల ఉత్పత్తికీ తోలు ఉత్పత్తులకూ పరిమితం చేసి, సాంకేతిక స్థాయి హెచ్చుగా ఉండే రంగం వ్యాప్తిని అతి కొద్ది ఉద్యోగాలు కల్పించే ఐ.టి పరిశ్రమకూ బయోటెక్నాలజీకీ పరిమితం చేసేట్టయితే బడుగువర్గాలు సాంఘికంగా ఆర్థికంగా పురోగమించకపోగా వారికీ 'ఉన్నత' కుల–వర్గాలకూ మధ్య అంతరాలు వేగంగా పెరుగుతాయి.

ఆదివాసులు మన రాష్ట్ర జనాభాలో 6 శాతం ఉన్నారు. అయినప్పటికీ వారి పురోగమనం గురించి ప్రత్యేకించి ఒక్క వాక్యం కూడ 'విజన్ 2020'లో లేకపోవడం ఆ విధాన పత్రం స్వభావానికొక సూచిక.

మంచి ఏమీ లేకపోతే పోయింది. కనీసం ఆదివాసులకు చెడు చేసే ప్రతిపాదనలు లేకుంటే అదే పదివేలని అనుకోవచ్చు. కానీ అటువంటి ప్రతిపాదనలు రెండు విజన్ 2020లో ఉన్నాయి.

ఒకటి, షెడ్యూల్డు ప్రాంతం అంటే ఆదివాసుల జనాభా 50 శాతం మించి ఉండే ప్రాంతం అన్న కొత్త నిర్వచనం. ఆ నిర్వచనం ఇప్పటి చట్టంలో గానీ రాజ్యాంగంలో గానీ ఉన్నది కాదు. ఆదివాసీ ప్రాంతాలలో ఆధిపత్యం చెలాయిస్తున్న ఆదివాసేతరుల మనసులోని కోరిక అది. ఆదివాసీ ప్రాంతాలలోకి వారి వలసను అరికట్టడానికి చట్టాలు ఉన్నప్పటికీ అది అప్రతిహతంగా కొనసాగుతూనే ఉంది. అది కొనసాగేకొద్దీ ఆదివాసీల జనాభా అదే నిష్పత్తిలో పడిపోతున్నది. ఇది 50 శాతం కంటే తక్కువకు పడిపోయిన ఒక్కొక్క ప్రాంతాన్నీ షెడ్యూల్డు ప్రాంతాల జాబితా నుండి తొలగించడం ఈ దురాక్రమణకు చట్టబద్ధత కల్పించడం తప్ప వేరే ఏమీ కాదు. ప్రస్తుత చట్టం అందుకే ఈ నిర్వచనాన్ని అంగీకరించలేదు. రాష్ట్రపతి షెడ్యూల్డు ప్రాంతంగా

ప్రకటించినది షెడ్యూల్డు ప్రాంతం. దానిని సవరించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంది. దాని స్థానంలో, ఆదివాసుల జనాభా 50 శాతం కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాలను మాత్రమే షెడ్యూల్డు ప్రాంతాలుగా పరిగణించాలన్న డిమాండు ఆదివాసీయేతరులు చాలా కాలం నుండి పెడుతున్నారు. దానికి ఇప్పటికీ పార్లమెంటుగానీ న్యాయస్థానాలుగానీ ఆమోదముద్ర వేయలేదు కాని చంద్రబాబు 'విజన్ 2020' మాత్రం వేసేసింది.

ఆదివాసులకు చాలా నష్టం చేయగల మరొక ప్రతిపాదన – ఆదివాసీ ప్రాంతాలలో ప్రైవేట్ రంగంలో ఖనిజ ఉత్పత్తికి (మైనింగ్‌కు) అనుమతి ఇచ్చే చట్ట సవరణ చేపట్టాలన్న 'విజన్' ప్రతిపాదన.

మన రాష్ట్రంలో అల్యూమినియం ముడి ఖనిజమైన బాక్సైట్ విస్తారంగా ఉంది. దేశంలోని నిల్వలలో 27 శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. అయితే అది మొత్తం ఆదివాసీ ప్రాంతాలలో ఉండడం వల్ల, ఆదివాసీ ప్రాంతాలలో ప్రభుత్వం లేక ఆదివాసులు తప్ప వేరే ఎవరూ మైనింగ్ చేయడానికి వీలు లేదని చట్టాలు చెప్తుండడం వల్ల బాక్సైట్ తవ్వకాలు జరగడం లేదని 'విజన్' వాపోతుంది. ఈ చట్టాలను (ప్రధానంగా '1 ఆఫ్ 70' అని పిలవబడే ఆం.ప్ర. షెడ్యూల్డు ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టం) సవరించి ఆదివాసీ ప్రాంతాలలో భారీ ఎత్తున పెట్టుబడి పెట్టి ప్రైవేట్ రంగంలో బాక్సైట్ గనులు నిర్వహించే అవకాశం కల్పించాలని 'విజన్' అంటుంది.

దీని ఫలితంగా ఆదివాసులు కూడ గని కార్మికులుగా మారి ఆధునిక సాంకేతిక జీవితంలో అడుగుపెడతారనే ఆశ చూపించే సాహసం 'విజన్' కూడ చేయదనుకోండి. ఎందుకంటే అది జరగదని అందరికీ తెలుసు. ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాలలో ఉన్న ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలలోని సింగరేణి గనులనే ఉదాహరణగా తీసుకుంటే భవిష్యత్‌లో బాక్సైట్ గని ప్రాంతాలలో ఏం జరగబోతుందో అర్థం చేసుకోవచ్చు. ఆదిలాబాద్ జిల్లాలోని బొగ్గుగనులు మొత్తం ఒకప్పటి ఆదివాసీ ప్రాంతంలోనే ఉన్నాయి. కానీ అక్కడి గని కార్మికులలో ఒక్క శాతం కూడ ఆదివాసులు లేరు. అందరూ మైదాన ప్రాంతాల గిరిజనేతరులే. ఆదివాసులంతా ఏమయ్యారంటే తమ జన్మభూమిని సింగరేణికి అప్పగించి ఇంకా లోలోపలి అడవులకు వెళ్ళిపోయారు.

పైగా సింగరేణి ప్రభుత్వరంగ సంస్థ. ఇక విచ్చలవిడిగా గనుల విస్తరణకు అవకాశం కల్పించే ప్రైవేట్ మైనింగ్‌కు అనుమతి ఇస్తే పరిస్థితి ఇంకెంత అధ్వాన్నంగా ఉంటుందో ఊహించుకోవచ్చు.

మరయితే బాక్సైట్ ఖనిజం భూమి పొరలలో నిరుపయోగంగా ఉండిపోవలసిందేనా అని మమ్మల్ని ఆవేశంగా అడుగుతారేమో, నిరుపయోగంగా ఉండిపోవాలని మేమూ అనడం లేదు. కానీ దానిని ఉపయోగంలో పెట్టడం కోసం ఆదివాసీ ప్రాంతాలలో ప్రైవేట్ మైనింగ్‌పైన నిషేధం ఎత్తివేయవలసిన అవసరం ఏమీ లేదు. ఆదివాసుల ఆవాసాలు ఎక్కువగా లేని ప్రాంతాలలో మొదలుపెట్టి ప్రభుత్వమే గనుల తవ్వకం ప్రారంభించవచ్చు. ఆదివాసులకే ఆ పనిలో తర్ఫీదు ఇచ్చి వారినే ప్రధానంగా పనిలోకి తీసుకోవచ్చు. (ప్రభుత్వం ఒక సంక్షేమ నియమంగా ఈ పని చేయగలదు గానీ ప్రైవేట్ గనుల యజమానులు చేయరు.) లేదా కాలక్రమంలో ఆదివాసుల సహకార సంస్థలకే గనుల నిర్వహణను అప్పగించవచ్చు.

ఇది సాధ్యం కాదని 'విజన్ 2020' భావించడానికి గల కారణం కొత్తది కాదు. ఆదివాసుల దగ్గర పెట్టుబడి లేదు. ప్రభుత్వం దగ్గరా లేదు కాబట్టి ప్రైవేట్ పెట్టుబడిని ఆహ్వానించక తప్పదని 'విజన్' అంటుంది. కానీ ప్రభుత్వం దగ్గర పెట్టుబడి ఉందా లేదా అనేది ప్రభుత్వం సామాజిక సంపదలో ఎంత భాగాన్ని తన చేతిలోకి తీసుకోదలచుకుంటుంది, ఆ వాటాను ఏ రూపంలో సేకరిస్తుంది, ఏ ప్రాధాన్యతల ప్రాతిపదికన ఖర్చు పెడుతుంది అనే విషయాలపైన ఆధారపడి ఉంటుంది. 'ఫిస్కల్ డెఫిషిట్'ను అదుపు చేయడం అనే పేరు మీద కొంత పన్నులు ఎక్కువ సేకరిస్తే ఉత్పత్తికి ప్రోత్సాహం కొరవడుతుందన్న పేరు మీద మరికొంత – సామాజిక సంపదలో ప్రభుత్వం చేతిలోకి పోయే భాగాన్ని బాగా తగ్గించాలని చూసే ప్రపంచబ్యాంకు నియమానికి మన పాలకులు మన సామాజిక పరిస్థితులతో నిమిత్తం లేకుండా తలొగ్గకుండా ఉంటే, ఆదివాసుల జీవితాన్నీ జీవనాన్నీ కాపాడడానికి అటవీ ప్రాంతాలలో జరిగే మైనింగ్‌లో ప్రభుత్వమే చొరవ తీసుకోవడం అసాధ్యమేం కాదు.

## V తెలంగాణ, రాయలసీమ

ఇప్పుడు మన సమాజంలో వస్తున్న అన్ని ఉద్యమాలనూ మన పాలకులు గమనిస్తున్నట్లు 'విజన్ 2020' చదవగానే అర్థం అవుతుంది. దళితులు, ఆదివాసులు, స్త్రీలు, వెనుకబడిన కులాలు, మైనారిటీలు, వెనుకబడిన ప్రాంతాలు అంటూ 'విజన్' అనేక చోట్ల దండకం వల్లె వేస్తుంది. ఇవన్నీ భిన్న కోణాల అణచివేతనూ వివక్షనూ సూచించే ప్రయోగాలు. భిన్న ఉద్యమాలు ఈ వివక్షనూ అణచివేతనూ ప్రశ్నిస్తూ ముందుకొస్తున్నాయి. వాటన్నిటికీ జవాబు చెప్తున్నట్టు ఈ మాటలను పదే పదే ప్రయోగించడం, ఆ ఉద్యమాల ఆకాంక్షలకు జవాబు చెప్తామని హామీలివ్వడం 'విజన్'లో కనిపిస్తుంది. కానీ ఒక్కొక్కరికీ ఏమివ్వబోతారని వెతికితే కనిపించేది శూన్యమే.

ప్రాంతీయ వివక్షనూ అసమానతలనూ దీనికొక నిదర్శనంగా తీసుకోవచ్చు. రాష్ట్రంలోని భిన్న ప్రాంతాల మధ్య అసమానతలు పోగొడతామన్నది 'విజన్' ఇచ్చే హామీలలో ఒకటి. కానీ నిర్దిష్టంగా ఏముందని వెతికితే అసమానతలను పెంచే ప్రతిపాదనలే కనిపిస్తాయి.

మన రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం వనరులుండీ వెనుకబడిన ప్రాంతం, రాయలసీమ వనరులు లేక వెనుకబడిన ప్రాంతం. ఈ రెండు ప్రాంతాలు వెనుకబడి ఉండిపోవడానికి చారిత్రక కారణాలు ఉన్నాయనేది వాస్తవం. కానీ ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన ఈ నలభై చిల్లర సంవత్సరాలలో ఆ వెనుకబాటుతనాన్ని అధిగమించడానికి ప్రభుత్వాలకొక విధానమంటూ లేదు. మన రాష్ట్రానికి ఉండే రాజకీయ ఆర్థిక నైజం వల్ల అవి కాలక్రమంలో ఒకవైపు పెరుగుతూ, వెనుకబాటుతనానికీ వివక్షకూ వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల కారణంగా అప్పుడప్పుడు తగ్గుతూ ఉన్నాయి. అయితే భారీ పెట్టుబడికి పెద్దపీట వేసే 'విజన్' ఈ అసమానతలను విపరీతంగా పెంచే ప్రమాదం ఉంది.

ఈ రెండు ప్రాంతాల ఉద్యమకారులూ తమ డిమాండ్లలో సాగునీటికి ప్రాముఖ్యం ఇస్తున్నారు. దానికి కారణం లేకపోలేదు. కోస్తా ఆంధ్ర ప్రాంతం ఈ రోజు మొత్తంగానే తెలంగాణ, రాయలసీమల కంటే అభివృద్ధి చెంది ఉండడానికి ప్రధాన కారణం సాగునీటి సమృద్ధి. సాగునీరు లభ్యమైతే కేవలం పెద్ద వ్యవసాయదారులే కాక చిన్న రైతులు కూడ (అదే దామాషాలో కాకపోయినా)

ప్రయోజనం పొందుతారు. అభివృద్ధికి కొంత విస్తృత ప్రాతిపదిక ఏర్పడుతుంది. ఆపైన విద్యా వ్యాప్తి, సాంకేతిక పురోగమనం సాధ్యమవుతాయి. 'విజన్' తెలంగాణ, రాయలసీమల సాగునీటి అవసరాల గురించి ఎక్కువ మాట్లాడదు. దాని బదులు ఎక్కడి సానుకూలతను బట్టి అక్కడ పెట్టుబడి పెట్టాలన్న సాధారణ సూత్రాన్ని ('విజన్' ప్రాపంచిక దృక్పథంలో ఈ సూత్రానికి కేంద్రస్థానం ఉంది) అనుసరించి ఈ రెండు ప్రాంతాలలో సాగునీటి లేమి కల్పించే 'సానుకూలత'ను ఆసరా చేసుకొని తెలంగాణలో పెద్దఎత్తున కోళ్ళ పెంపకాన్నీ, రాయలసీమలో పళ్ళతోటల పెంపకాన్నీ, రెండు ప్రాంతాలలోనూ పశుపోషణనూ ప్రోత్సహించాలని 'విజన్' ప్రతిపాదిస్తుంది. కోళ్ళ దాణాకు ఉపయోగపడే మొక్కజొన్న తెలంగాణలోని మెట్ట నేలలలో బాగా పండుతుంది. కాబట్టి కోళ్ళ పరిశ్రమపైనా, దానికి అనుబంధంగా సాగే మొక్కజొన్న సాగుపైనా దృష్టి పెట్టి ఈ రంగంలోకి  పెట్టుబడిని ఆహ్వానిస్తే ఈ ప్రాంతం స్థూల ఆదాయం వేగంగా పెరుగుతుందనేది 'విజన్' అభిప్రాయం. స్థూల ఆదాయం పెరుగుదల రేటు కొంచెం తక్కువయినా పరవాలేదు, మరింత ఎక్కువమందికి అందే ప్రత్యామ్నాయం ఏమైనా ఉందా అని 'విజన్' ఆలోచించదు. మొక్కజొన్న విస్తారంగా పండించి, కోళ్ళ ఫారాలను రికార్డు స్థాయిలో పోషించి, పెద్ద ఎత్తున ఎగుమతులు చేపట్టడానికి పనికొచ్చే మెట్టసాగు కిచ్చే ప్రోత్సాహంకన్నా మరింత ఎక్కువ మందికి ఆదాయం, ఉపాధి కల్పించే సాగునీటి కల్పన వల్ల ఈ ప్రాంతం మొత్తంగా మరింత విస్తృతమైన అభివృద్ధి, మరింత స్థిరమైన అభివృద్ధి సాధిస్తుందన్న ఆలోచనకు 'విజన్' తర్కంలో స్థానం లేదు.

అంటే మొక్కజొన్న పండించనే వద్దని గానీ, కోళ్ళ ఫారాలను అసలే ప్రోత్సహించవద్దని గానీ చెప్పడం లేదు. అభివృద్ధి 'ఫోకస్' ఎక్కడ ఉండాలన్నది ఇక్కడ సమస్య. మన రాష్ట్రంలోని సాగునీటి వనరులను సమగ్రంగా ఉపయోగంలోకి తెస్తే ప్రతి ఎకరం సాగుభూమికీ ఒక పంటకు నీరు అందియ్యవచ్చునని అంచనా. 'అభివృద్ధి' ప్రధానంగా దానిమీద ఫోకస్ చేసి ఆపైన స్థానిక సానుకూలతను బట్టి ఏ వ్యూహ రచన అయినా చేయవచ్చు. అప్పుడొచ్చే ఆర్థిక పెరుగుదల రేటు అత్యధికంగా ఉండక పోవచ్చును గానీ అభివృద్ధిలో కొంతమేరకైనా సమగ్రత, స్థిరత్వం, విస్తృతి ఉంటాయి. సానుకూలతను బట్టి పెద్దఎత్తున పెట్టుబడిని ఆహ్వానించే వ్యూహంతో మొదలుపెట్టే 'అభివృద్ధి' విధాన రచన తెలంగాణ, రాయలసీయల ఆర్థిక వ్యవస్థలను

వికృతంగా తయారుచేస్తుంది. పోనీ ఈ రకమైన అభివృద్ధి వల్ల కోళ్ళ పరిశ్రమ ఉత్పత్తులూ, పళ్ళూ, పాడీ ఈ ప్రాంతాలలో చవకగా లభిస్తాయని భావిద్దామా అంటే అదేమీ లేదు. 'విజన్' సానుకూలతలను గుర్తించేది పెట్టుబడి కళ్ళతో. తెలంగాణలోనూ, రాయలసీమలోనూ మెట్ట నేలలనూ పచ్చిక బయళ్ళనూ ఆసరా చేసుకుని జరిగే అభివృద్ధిలో పెట్టుబడి (స్వదేశీయే కాదు, విదేశీ కూడ) పెద్దఎత్తున ప్రవేశించాలని 'విజన్' ఆశిస్తుంది. పళ్ళు, మాంసం, పాల ఉత్పత్తులు, కోడిగుడ్లు కొనుగోలు చేసి దేశం లోపలా బయటా అమ్మే వ్యాపార సంస్థలతో ఇక్కడి ఉత్పత్తి సన్నిహితంగా ముడిపడి సాగాలని భావిస్తుంది. కాబట్టి ఈ ఉత్పత్తులేవీ ఇక్కడి ప్రజలకు చవగ్గా దొరకవు.

అంతే కాక, కార్పొరేట్ పెట్టుబడితో ముడిపడిన ఈ వ్యవసాయ వ్యాపారం కార్పొరేట్ వెట్టిచాకిరీకీ కార్పొరేట్ బానిసత్వానికీ దారితీసే ప్రమాదం ఉంది. 'విజన్' ఆశించే వ్యవసాయ వ్యాపారానికి కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలు, రవాణా ఖర్చు, కొంత ప్రాథమికమైన ప్రాసెసింగ్ మొదలయినవి అవసరం. రైతులు ఎవరికి వారు ఇవన్నీ చేసుకోలేరు. వ్యవసాయ వ్యాపార కార్పొరేషన్‌లతో కొనుగోలు ఒప్పందాలు, రుణ సంబంధమైన ఒప్పందాలు చేసుకోవలసి ఉంటుంది. రుణాలు ఇచ్చే బాధ్యత ప్రభుత్వ బ్యాంకులు తీసుకోవు కాబట్టి వారికి ఇది తప్పదు. కొనుగోలు ఒప్పందాలలో ప్రభుత్వం కూడ భాగస్వామిగా ఉండి వాటిని అమలు చేసే అధికారం కలిగి ఉండేటట్లు చట్టాన్ని

**రాష్ట్రంలో సాగునీటి వసతి ఉన్న భూమి**
**(సాగుయోగ్యమైన భూమిలో శాతం) (1991-92)**

| ఆంధ్ర | తెలంగాణ | రాయలసీమ | మొత్తం |
|---|---|---|---|
| 58 | 33 | 22 | 39.5 |

రూపొందిస్తామని 'విజన్' అంటుంది కాని అవతలివైపు ఉండేది దేశవ్యాప్తంగా కాక విదేశాలలో కూడ వ్యాపారం చేసే కార్పొరేషన్‌లు కాబట్టి ఈ ఒప్పందాలను ప్రభుత్వం ఎంతమేరకు నిజంగా అమలు చేయించగలదో చెప్పలేము. భోపాల్ మారణ హోమానికి బాధ్యులయిన యు.సి.సి. వారిని మన పాలకులు ఎంత మేరకు బాధ్యులు చేయగలిగారో మనం మరచిపోలేదు. ఒకవేళ చేసుకున్న ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయించ గలిగినా, ఆ ఒప్పందాలు రైతులకు అనుకూలంగా ఉండేటట్టు చూడడం ప్రభుత్వానికి సాధ్యం కాదు. కార్పొరేషన్లకు ఇక్కడ అనుకూలంగా లేకపోతే వేరొక చోటికి పోయి

కొనుగోలు చేసుకుంటాయి. కొనుగోలు కార్పొరేషన్‌ల నుండి తీసుకునే రుణాలను రైతులు సకాలంలో చెల్లించకపోతే వారికే తమ భూములను అమ్ముకోవడమో లేక చవగ్గా లీజుకిచ్చుకోవడమో చేయవలసి ఉంటుంది. ఈ దుర్గతి నుండి ప్రభుత్వం వారిని కాపాడలేదు.

'విజన్' ప్రతిపాదించే వ్యవసాయ విధానాన్ని చర్చించేటప్పుడు ఈ విషయాన్ని మరికొంత వివరంగా చూద్దాం. ఇప్పుడు ప్రాంతీయ వివక్ష గురించి మరికొంచెం చూద్దాం.

రాయలసీమకు సాగునీరు అందియ్యగల హంద్రీ – నీవా, గాలేరు – నగరి ప్రాజెక్టుల గురించి ఆ ప్రాంతవాసులు చాలా కాలంగా ఆందోళన చేస్తున్నారు. 'విజన్ 2020'ను బట్టి చూస్తే ఆ రెండు ప్రాజెక్టులు కేంద్రం ఆమోదం పొందిన ప్రాజెక్టుల జాబితాలో లేవు. ఆమోదం పొందడానికి ప్రయత్నం చేస్తున్న ప్రాజెక్టుల జాబితాలోనూ లేవు. నల్గొండకు సాగునీరిచ్చే శ్రీశైలం ఎడమకాలువ, మహబూబ్‌నగర్‌లోని కరువు ప్రాంతాలకు నీరిచ్చే కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంల గతి కూడ అంతే. అదేమంటే ఇవి కృష్ణా నదిలోని వరదనీటిపైన ఆధారపడినవని 'విజన్' వివరిస్తుంది. కానీ అదే వరదనీటిపైన ఆధారపడిన పులిచింతల, కృష్ణా డెల్టా ఆధునీకరణ పథకాలకు మాత్రం ఇప్పటికే కేంద్రం ఆమోదం లభించినట్టు 'విజన్' చెప్తుంది. పులిచింతలకు వ్యతిరేకంగా నల్గొండ జిల్లావాసులు ఆందోళన చేసినప్పుడు అది మిగులు జలాల ప్రాజెక్టు కాదనీ, కృష్ణా డెల్టా స్థిరీకరణ కోసం ఆ డెల్టా ఆధునీకరణ ద్వారా మిగిలే నీటితో కడుతున్న ప్రాజెక్టనీ అన్నారు. కానీ ఇప్పుడు 'విజన్ 2020' చదివితే అర్థమయ్యే దేమిటంటే పులిచింతల మిగులు జలాల ప్రాజెక్టే. రాయలసీమకూ దక్షిణ తెలంగాణకూ సాగునీరిచ్చే మిగులు జలాల ప్రాజెక్టులకు పొందని అనుమతి పులిచింతలకు మాత్రం ఎట్లా సాధ్యం అయిందనే ప్రశ్నకు జవాబు లేదు. అంతేగాక, ఈ ప్రాజెక్టులకు నీరు ఏదో ఒక విధంగా సమకూర్చే ప్రయత్నం చేస్తామన్న హామీ సహితం 'విజన్ 2020'లో లేనప్పుడు, వేరే నీటి వసతులేవీ లేని రాయలసీమ, దక్షిణ తెలంగాణలు స్వర్ణాంధ్రప్రదేశ్‌లోకి ఏ విధంగా అడుగుపెడతాయి? బావుల కింద వ్యవసాయం విస్తరించుకునే అవకాశం ఉందని అంటారేమో. నిజానికి గడచిన 10–15 సంవత్సరాల కాలంలో తెలంగాణ, రాయలసీమలలో బావుల కింద వ్యవసాయం బాగా విస్తరించింది. ఈ రెండు

ప్రాంతాలకూ అది చాలా మేలు చేసింది. అయితే కరెంటు సబ్సిడీ తగు మోతాదులో ఉండడం వల్ల అది సాధ్యం అయింది. కానీ ఇప్పుడు 'విజన్ 2020' దృక్పథంలో కరెంటు సబ్సిడీలకు స్థానం లేదు. వ్యవసాయదారులందరికీ ఒకే మోతాదులో కరెంటు సబ్సిడీ ఇవ్వాలని ఎవ్వరూ అనరు గానీ సాగునీటి విషయంలో వెనుకబడి ఉన్న ప్రాంతాలలోని పేద, మధ్యతరగతి రైతులకు మాత్రం అది అవసరం. అయితే రోడ్లు, కరెంటు మొదలయిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అయ్యే ఖర్చు మొత్తం వాడకందార్ల నుండే వసూలు చేయాలన్నది 'విజన్' దృష్టి. తెలంగాణ, రాయలసీమల అభివృద్ధి మీద ఇది పెద్ద దెబ్బ వేస్తుంది.

**సాగునీటి పెరుగుదల 1951-96**

**వివిధ నీటి వనరుల కింద రాష్ట్రంలో సాగయిన భూమి వైశాల్యం** (లక్షల ఎకరాలలో)

| సం॥ | కాలవలు | చెరువులు | బావులు | ఇతరములు | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1950-51 | 32.0 | 19.0 | 7.5 | 0.15 | 58.65 |
| 1960-61 | 33.2 | 28.0 | 8.1 | 2.5 | 71.80 |
| 1970-71 | 39.5 | 27.7 | 12.5 | 2.81 | 82.50 |
| 1980-81 | 42.5 | 22.5 | 19.0 | 2.25 | 86.25 |
| 1990-91 | 46.4 | 24.2 | 32.5 | 4.0 | 107.1 |
| 1995-96 | 38.3 | 18.4 | 41.0 | 4.5 | 102.2 |

45 సం॥లలో సాగునీటిలో ప్రధానంగా పెరుగుదల వచ్చింది బావుల వల్లనే అని దీనిని బట్టి అర్థం అవుతుంది. 1950-51లో మూడవ స్థానంలో ఉన్న బావుల కింద సాగు ఇప్పుడు ప్రథమ స్థానంలో ఉంది. ఇది ప్రధానంగా రైతుల పెట్టుబడితోనూ ప్రభుత్వం ఇచ్చిన కరెంటు సబ్సిడీతోనూ సాధ్యం అయింది. తెలంగాణ, రాయలసీమలకు ఈ మార్పు చాలా మేలు చేసింది.

కానీ రైతులకు బ్యాంకులు చవకగానూ అనుకూలమైన పద్ధతులలోనూ పెట్టుబడి రుణాలు ఇయ్యబోవనీ, కరెంటు ఉత్పత్తికీ సరఫరాకూ అయ్యే ఖర్చు రైతుల నుండి ముక్కు పిండి వసూలు చేసుకోబోతారని 'విజన్' అంటుంది. అంటే బావినీటి పారుదలలో సాధించిన మెరుగు ఇక కుంటుపడుతుంది. బాగా తగ్గిపోవచ్చు కూడ. అట్లయితే 2020 నాటికి పై పట్టిక రూపం ఎట్లాగుంటుందో ఒకసారి ఆలోచించండి!

'విజన్ 2020' ప్రతిపాదించే అభివృద్ధిలో భారీ ఎగుమతులకు ప్రధాన స్థానం ఉంది. ఈ రకమైన అభివృద్ధే వికృతం కాగా, అది ఏ ప్రాంతంలో కేంద్రీకృతమయి ఉంటుందో ఆ ప్రాంతాలకే ఈ వికృతమయిన అభివృద్ధయినా దొరుకుతుంది. 'విజన్' దృశ్యంలో హైదరాబాద్ నగరం ఒక అభివృద్ధి కేంద్రం అయితే హైదరాబాద్ ఉండేది తెలంగాణలోనయినా ఆ నగర పరిసరాల అభివృద్ధి వల్ల తెలంగాణవాసులు పొందింది తక్కువే. కోస్తా ఆంధ్ర ప్రాంతీయులు, రాష్ట్రేతరులు ఎక్కువ ప్రయోజనం పొందారు.

హైదరాబాద్ కాక రెండవ ప్రధాన ఎగుమతి వ్యాపార కూడలి విజయవాడ – కాకినాడ – విశాఖపట్నంల కూడలి. రాష్ట్రం నుండి బయటి రాష్ట్రాలకూ విదేశాలకూ ఎగుమతి అయ్యే సరుకులు ఈ కూడలిలో చేరి అక్కడ ఆయా సరుకులకు ఉచితమైన వేర్‌హౌస్‌లలో భద్రపరచబడి రైలుమార్గంలో గానీ ఓడ మార్గంలో గానీ రాష్ట్రం నుండి బయటికి పోతాయి. 'అభివృద్ధి'లో కీలక స్థానం ఉన్న దేశీయ అంతర్దేశీయ ఎగుమతి వ్యాపారం నుండి వచ్చే లాభాలు, అది కల్పించే ఉపాధి ఈ మూడు నగరాల 'కారిడార్'లో కేంద్రీకృతమయి ఉంటుంది. ఇది రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ప్రాంతీయ అసమానతలను మరింతగా పెంచుతుంది.

## VI వ్యవసాయం

వ్యవసాయ ప్రధానమైన మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఒకవైపు ఉపాధి కల్పన విషయంలో వ్యవసాయం ప్రాధాన్యతను బాగా తగ్గించాలనీ, మరోవైపు వ్యవసాయం కూడ భారీగా పెరగబోతున్న అభివృద్ధి పెరుగుదల రేటులో భాగం పంచుకోవాలనీ 'విజన్ 2020' అంటుంది.

ప్రస్తుతం మన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగ శ్రామికుల సంఖ్య 70 శాతం ఉంది. దానిని 2020 నాటికి 40 లేక 45కు తగ్గించాలని 'విజన్ 2020' ఆశిస్తుంది. అంటే ఇప్పుడు నూటికి 70 మంది శ్రామికులు, రైతులు లేక వ్యవసాయ కూలీలు. ఆ సంఖ్యను రాబోయే 20 ఏండ్లలో 40 లేక 45కు తగ్గించాలని 'విజన్' ప్రతిపాదన. మిగిలిన 25 లేక 30 మంది ఏమవుతారు? పారిశ్రామిక రంగంలోకీ సేవారంగంలోకీ పోతారని 'విజన్' అంటుంది. కానీ 'విజన్' ప్రతిపాదించే పారిశ్రామిక రంగం ఎంతమందికి ఏపాటి ఉపాధి కల్పించగలదన్న ప్రశ్న వేసుకుంటే ఈ లెక్కల గురించి సందేహమే మిగులుతుంది.

ఐ.టి (సమాచార సాంకేతిక) పరిశ్రమ, బయోటెక్నాలజీ పరిశ్రమ వ్యవసాయం నుండి పరిశ్రమలకు తరలివచ్చే వారికి పనులు కల్పించగల రంగాలు కావు. అవి ఇంగ్లీష్ చదువుకున్న పట్టణ ప్రాంత పెత్తందారీ కులాల విద్యావంతులకు మాత్రమే (అందులోనూ పరిమితంగా) ఉద్యోగాలు కల్పించగలవు.

ఈ రెండూ కాక అభివృద్ధికి చోదకశక్తులుగా 'విజన్ 2020' భావించే పారిశ్రామిక రంగాలు మందుల పరిశ్రమ, తోలు ఉత్పత్తుల పరిశ్రమ, రెడీమేడ్ దుస్తుల (గార్మెంట్స్) పరిశ్రమ. మందుల పరిశ్రమ పెద్దగా ఉద్యోగాలు కల్పించదు. మిగిలిన రెండూ కొంత మేరకు ఉద్యోగాలు కల్పిస్తాయి గానీ ఆ రెండు రంగాలలోనూ కాంట్రాక్ట్ పద్ధతి, అతి తక్కువ వేతనాలు, వెట్టి చాకిరీని పోలిన పని పరిస్థితులు తీవ్ర పరిమాణంలో ఉన్నాయి. అది ఇప్పటి పరిస్థితి కాగా రాబోయే రోజులలో వీటిని ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్‌లలో (ఇ.పి.జడ్.) నెలకొల్పడాన్ని ప్రోత్సహిస్తామని 'విజన్' అంటుంది. ఎగుమతులు ఎక్కువ చేయడం కోసం ఈ జోన్‌లలో జరిగే ఉత్పత్తికి అన్ని రకాల పన్ను రాయితీలు ఇవ్వడమే కాక ఇక్కడ కార్మిక చట్టాలు కూడ వర్తించవు.

(ఈ విషయం 'విజన్'లో చెప్పలేదు గానీ ఈ మధ్యనే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసింది.) అంటే తోలు ఉత్పత్తుల రంగంలోనూ రెడీమేడ్ బట్టల ఉత్పత్తిలోనూ ఇప్పటికే ఉన్న బాధాకరమైన పని పరిస్థితులు మరింత దిగజారుతాయి. అటువంటి రంగాలలోకి వ్యవసాయ శ్రామికులను పంపించి వేయాలని 'విజన్ 2020' అంటుంది.

ఇక మిగిలింది నిర్మాణ పనుల (కన్‌స్ట్రక్షన్) పరిశ్రమ. నిజానికి 'విజన్' చేసే ఊహ ప్రకారం అత్యధికులు ఈ రంగంలోకే పోవలసి ఉంటుంది. వచ్చే 20 సంవత్సరాలలో రాష్ట్రంలోకి రాబోయే 30 లక్షల కోట్ల పెట్టుబడిలో 16 లక్షల కోట్లు నిర్మాణ రంగంలోనికే రాబోతాయని 'విజన్' అంచనా. భారీ ఎత్తున జరగబోయే అభివృద్ధి కోసం చేపట్టే రోడ్లు, రైల్వేలైన్లు, ఓడరేవులు, ఫ్యాక్టరీ బిల్డింగులు, పట్టణ నివాసాలు మొదలయిన వాటిని నిర్మించే రంగం ఇది. ఇక్కడ కూడ ప్రధానంగా కాంట్రాక్ట్ వ్యవస్థే ఉంది. పైగా ఈ నిర్మాణ రంగం ఎంతమందికి ఎంతకాలం ఏపాటి స్థిరమైన ఉపాధి కల్పించగలుగుతుందనేది పెద్ద ప్రశ్నే.

ప్రశ్నార్థకమైన ఈ పట్టణ ప్రాంత పరిస్థితులలోకి వ్యవసాయ శ్రామికులను పెద్ద సంఖ్యలో తరిమేయాలని చూసే 'విజన్ 2020' వ్యవసాయంలో మిగిలిపోయిన వారికి ఏ రకమైన ఉపాధి కల్పిస్తుంది?

వ్యవసాయ రంగంలో వ్యాపారీకరణను భారీ ఎత్తున ప్రవేశపెట్టాలన్నది 'విజన్ 2020' లక్ష్యాలలో ఒకటి. వ్యవసాయ ఉత్పత్తిలోకి పెట్టుబడి భారీ ఎత్తున ప్రవేశించడమే కాక, ఆ ఉత్పత్తులను కొనుక్కొని, ప్రాసెస్ చేసి, భద్రపరచి దేశం లోపలో బయటో విక్రయించే వ్యాపారంలోకి కూడ భారీ ఎత్తున దేశీయ విదేశీయ పెట్టుబడి ప్రవేశించాలని 'విజన్' ఆశిస్తుంది.

వరి పంట, పాడి పరిశ్రమ, కోళ్ళ పరిశ్రమ, పండ్లతోటలు, చేపలు – ఈ ఉత్పత్తుల మీద, వాటిని ఆధారం చేసుకున్న పరిశ్రమల మీద, ఆ ఉత్పత్తులనూ, వాటిని 'ప్రాసెస్' చేయగా వచ్చిన ఉత్పత్తులనూ రాష్ట్రం బయటికీ, దేశం బయటికీ ఎగుమతి చేసే వ్యాపారం మీద 'విజన్' బలంగా దృష్టి పెడుతున్నది. వ్యవసాయ వ్యాపార రంగాన్ని రాష్ట్ర స్థూల ఆదాయంలో వేగంగా పెరుగుదల సంపాదించి పెట్టే ఒక చోదకశక్తిగా 'విజన్' చూస్తుంది.

కాని ఈ వ్యవసాయ వ్యాపారీకరణ మన గ్రామీణ జీవితంలో అనేక మార్పులు తీసుకొస్తుంది. భూమిని ఇప్పటిదాకా జీవనానికి అవసరమైన ఒక వనరుగా మాత్రమే చూస్తున్నాం. 'విజన్' భూమిని పెట్టుబడికి ఉపయోగపడే వనరుగా చూస్తుంది. భూమిని జీవన వనరుగా చూసినప్పుడు వీలయినంత ఎక్కువమందికి కనీస జీవనానికి అవసరమైన మేరకు భూమి మీద యాజమాన్యం కల్పించాలని చూస్తాం. భూ సంస్కరణలు, సీలింగ్ చట్టాలు, దళితులకు, ఇతర పేదలకు ప్రభుత్వ పోరంబోకులు, బంజర్లు పంచే ప్రభుత్వ విధానాలు – ఇవన్నీ ఈ ప్రయత్నంలో భాగమే. ఈ కోణం నుండి చూసినప్పుడు చిన్న కమతాలు అభ్యంతరకరమైనవిగా కనిపించవు. అయితే వాటిని అభివృద్ధి చేయడానికి రైతాంగానికి కావలసిన నీటివసతి, పెట్టుబడి రుణాలు, వ్యవసాయ విస్తరణను అందియ్యడంలో ప్రభుత్వానికి బాధ్యత ఉందని ఈ దృక్పథం భావిస్తుంది.

భూమిని పెట్టుబడికి వనరుగా చూసే దృక్పథానికి (అంటే 'విజన్ 2020' దృష్టికి) చిన్న కమతాలు అభ్యంతరకంగా కనిపిస్తాయి. వ్యవసాయ వ్యాపారీకరణకు చిన్న కమతాలు ఒక ఆటంకం అని 'విజన్' పదే పదే అంటుంది. దీనికి రెండు రకాల విరుగుడును విజన్ ప్రతిపాదిస్తుంది.

వ్యవసాయ వ్యాపారంలో పెట్టుబడి పెట్టే కంపెనీలకు రైతుల భూమిని లీజుకు తీసుకునే అవకాశం కల్పించడం లేదా ప్రభుత్వమే భూసేకరణ చట్టాల ద్వారా రైతుల భూమిని సేకరించి ఆ కంపెనీలకు లీజుకు ఇవ్వడం లేదా అమ్మడం చేయాలని 'విజన్' ప్రతిపాదన. దీని కోసం భూసేకరణ చట్టాన్నీ, ఇతర చట్టాలను కూడ సవరించవలసి రావచ్చునని 'విజన్' అంటుంది. ఈ విధంగా కంపెనీలకు భూములు అమ్ముకున్న లేక లీజుకు ఇచ్చిన రైతాంగం బతుకు ఏమవుతుందో ఊహించాలంటే ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయి నష్టపరిహారం తీసుకొని వెళ్ళిపోయిన రైతాంగాన్ని ఒక దృష్టాంతంగా తీసుకోవచ్చు. అటువంటి రైతాంగంలోని పేద, దిగువ మధ్యతరగతి రైతులందరి జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయనేది అందరికీ తెలిసిన విషయమే.

వ్యవసాయ వ్యాపారీకరణకు ఆటంకంగా ఉన్న చిన్న కమతాల సమస్యను అధిగమించడానికి భూముల లీజును లేక సేకరణను ఒక మార్గంగా 'విజన్' కోళ్ళ పరిశ్రమను గురించి చర్చించే సందర్భంలో ప్రతిపాదించింది. కానీ అది పళ్ళతోటలకు, పాడి పరిశ్రమకు కూడ వర్తిస్తుంది.

రెండవ మార్గం కాంట్రాక్ట్ సేద్యం. మొదటి మార్గం కంటే దీనినే 'విజన్' ఎక్కువగా చర్చిస్తుంది. ఈ కాంట్రాక్ట్ పద్ధతిలో రైతుల దగ్గర గ్రామీణ ఉత్పత్తులు కొనుగోలు చేసి వాటితో వ్యాపారం చేయడం గానీ, వాటిని పారిశ్రామిక ఉత్పత్తులకు ముడి పదార్థంగా వినియోగించడం గానీ చేసే పెట్టుబడిదారీ కంపెనీలు ఆ రైతులతో కొనుగోలు కాంట్రాక్టులు ఏర్పరచుకుంటాయి. ఆ కంపెనీలు రైతులకు రుణాలు ఇస్తాయి. సాంకేతిక సలహాలు, సూచనలు కూడ అందజేస్తాయి. రైతులు నిర్ణీత ధరకు వారికే తమ ఉత్పత్తిని అమ్మాలి. ఈ కాంట్రాక్టులలో మూడవ వ్యక్తిగా ఉండి అవి తప్పక అమలయ్యేటట్టు చూడడం ప్రభుత్వం బాధ్యత అని 'విజన్' అంటుంది.

కాంట్రాక్ట్ సేద్యం 'విజన్' ప్రతిపాదించే వ్యవసాయ విధానానికి కీలకమైనది కాబట్టి దీనిని కొంచెం పరిశీలిద్దాం. ఇప్పటికే ఇటువంటి కాంట్రాక్టులు చెరుకు సాగులో ఉన్నాయని 'విజన్' అంటుంది గానీ చెరుకు పండించే రైతులతో కొనుగోలు ఒప్పందాలు పెట్టుకునే చక్కెర మిల్లులు ఎక్కువగా అదే రైతుల సహకార సంఘాలకు చెందినవి, లేదా ప్రభుత్వం చేతిలో ఉన్నవి. అటువంటి కొనుగోలుదార్ల దగ్గర సరయిన ధరలు పొందడానికీ చవకగా రుణాలు పొందడానికీ రైతులకు కొన్ని మార్గాలు ఉంటాయి. కానీ ఇప్పుడు 'విజన్' ప్రతిపాదిస్తున్న కొనుగోలుదార్లు రైతాంగ సహకార సంఘాలు కావు, ప్రభుత్వ సంస్థలు అంతకంటే కావు. దేశ విదేశాలలో వ్యాపారం చేసే పెట్టుబడిదారీ సంస్థలు. వారికి అనుకూలమైన వంగడాలు వారు చెప్పిన పద్ధతిలో పండించి వారికి అనుకూలమైన ధరలకు అమ్మే రైతాంగంతో మాత్రమే వారు ఒప్పందం చేసుకుంటారు. లేకపోతే ఇంకొక ప్రాంతానికో రాష్ట్రానికో పోతాము పొమ్మంటారు. వారు రైతులకిచ్చే రుణాలు కూడ సకాలంలో తీర్చకపోతే భూమి స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలకు పాల్పడతారు.

1997-98 సంవత్సరాలలో వరంగల్ జిల్లాలోనూ ఇతర తెలంగాణ జిల్లాల్లోనూ పెద్దఎత్తున జరిగిన రైతుల ఆత్మహత్యలను ఒకసారి జ్ఞాపకం చేసుకుందాం. ఆ ఆత్మహత్యలు కూడ వ్యవసాయ వ్యాపారీకరణ లేక పెట్టుబడిదారీ సేద్యం చేపట్టిన నేపథ్యంలో జరిగినవే. ఆత్మహత్యలు చేసుకున్నవారు అత్యధికంగా ఎస్సి, ఎస్టి, బిసి కులాలకు చెందిన చిన్న లేక దిగువ మధ్యతరగతి రైతులు. ఈ రైతాంగం పెట్టుబడిదారీ సాగులోకి ప్రవేశించి ప్రయోజనం పొందాలంటే చవకగా సకాలంలో

లభ్యమయ్యే రుణాలు అవసరమనీ, వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించాలనీ, ఎరువులు, మందుల ధరల మీద నాణ్యత మీద ప్రభుత్వానికి అదుపు ఉండాలనీ నాటి ఆత్మహత్యల ఉదంతాలు చెప్తాయి. ప్రభుత్వ బ్యాంకులూ ఇతర రుణ సంస్థలూ పక్కకు తప్పుకోవడం వల్లనే, ప్రభుత్వం గిట్టుబాటు ధరలకు హామీ ఇవ్వడం గానీ వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు సంస్థల ద్వారా కొనుగోలు చేయకపోవడం వల్లనే, మందులు, ఎరువుల ధరలపైన, నాణ్యతపైన అదుపు లేకపోవడం వల్లనే అన్ని ఆత్మహత్యలు జరిగాయి.

ఇప్పుడు 'విజన్' ప్రతిపాదించే వ్యవసాయ విధానంలో ప్రభుత్వ రుణ సంస్థలకూ ప్రభుత్వ కొనుగోలు సంస్థలకూ ఉండే పాత్ర స్వల్పం. ఇవి రెండూ రైతులతో కొనుగోలు ఒప్పందం చేసుకునే కంపెనీలకే అప్పగించబడ్డాయి. అంటే రైతులకు రుణాల విషయంలోనూ గిట్టుబాటు ధర విషయంలోనూ భరోసా ఏమీ ఉండదు. ఇక ఎరువులు, మందుల నాణ్యత మీద, ధరల మీద ప్రభుత్వానికి అదుపు ఈ రోజూ లేదు, స్వర్ణాంధ్రప్రదేశ్‌లోనూ ఉండబోదు.

మరి ఒక్క పత్తి పంటే అన్ని ప్రాణాలను బలిగొంటే ఈ విస్తృతమైన వ్యవసాయ వ్యాపారీకరణ ఇంకెన్ని ప్రాణాలను తీస్తుందో! ఇది కృత్రిమమైన పోలిక కాదు. పెట్టుబడిదారీ సేద్యానికి స్వాభావికమైన ఆటుపోట్లను తట్టుకోవడం చిన్నకారు సన్నకారు రైతులకు సాధ్యం కాదు. ఒక సంవత్సరం వర్షాలు సరిగ్గా కురుస్తాయి, ఒక సంవత్సరం కురవవు. ఒక సంవత్సరం పంటకు పురుగు పడుతుంది, ఒక సంవత్సరం పట్టదు. ప్రభుత్వం రుణాల రూపంలోనూ, గిట్టుబాటు ధరలకు అవసరమైన 'సపోర్టు' రూపంలోనూ ఏమైనా భరోసా ఇస్తేనే చిన్న రైతులు తట్టుకోగలరు. ప్రభుత్వ బాధ్యతకు పూర్తిగా తిలోదకాలిచ్చి వ్యవసాయ వ్యాపారీకరణను సంపూర్ణ స్థాయిలో అమలు చేయాలని చూసే 'విజన్' చిన్నకారు, సన్నకారు రైతులకు ప్రాణాంతకం కాగలదు.

ఇది 'మామూలు' కాలం సంగతి. అయితే అకస్మాత్తుగా దేశీయ అంతర్జాతీయ మార్కెట్‌లో కోడి మాంసం ధర లేదా కోడిగుడ్ల ధర పడిపోయినా, మామిడిపళ్ళకూ, బాస్మతి బియ్యానికీ గిరాకీ పడిపోయినా ఇక్కడి రైతులు తీవ్రంగా దెబ్బతింటారు. లేదా ద్రవ్యలావాదేవీల వైపరీత్యాల వల్ల కొనుగోలు కంపెనీలు దివాలా తీస్తే (ఈ మధ్య తూర్పు ఆసియాలో జరిగినట్టు) మరీ ఘోరంగా దెబ్బతింటారు.

'విజన్' ప్రతిపాదించే వ్యవసాయ వ్యాపారీకరణలో ఎక్కువ భాగం కోళ్ళ ఫారాలు, పాడి పరిశ్రమ, పండ్ల తోటలే – అంటే మెట్ట వ్యవసాయమే ఉండడం గమనార్హం. అంటే వ్యవసాయ రంగంలో జరిగే చర్చ ఎక్కువగా సాగునీటి గురించి ఉండగా, చంద్రబాబు ఆలోచనలు మాత్రం (మొహమాటానికి సాగునీటి గురించి మాట్లాడుతూనే ఉన్నప్పటికీ) మెట్ట భూములను మాగాణులుగా మార్చే ప్రక్రియ మీద కాక, పెట్టుబడికి వనరుగా మార్చే ప్రక్రియ మీదనే ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నాయి. ఇది తెలంగాణ, రాయలసీమలకు మరీ ప్రమాదకరమైన ఆలోచనారీతి. సాగునీరుంటే సంక్షోభ సమయంలో అంతా పోయినా తిండి గింజలు పండించుకొని తిని బతకొచ్చు. మెట్ట భూములలో వ్యవసాయ వ్యాపారానికి ఒడిగట్టిన వారికి ఆ సదుపాయం ఉండదు.

వ్యవసాయాన్నీ భూమినీ వ్యాపారం కళ్ళతోనూ, పెట్టుబడి కళ్ళతోనూ కాక ఉపాధి, జీవనాధారం అనే దృష్టితో చూస్తే కనిపించే అనేక విషయాలకు 'విజన్' దృష్టిలో చోటు ఉండదు. ఉదాహరణకు భూసంస్కరణల గురించి ఒక్క మాట సహితం 'విజన్ 2020' లోని 350 పేజీలలో లేదంటే ఆశ్చర్యపోతారేమో! స్వాతంత్ర్యానంతరం భూసంస్కరణల గురించి అసలే మాట్లాడని తొలి ప్రభుత్వ విధాన పత్రం బహుశా ఇదేనేమో!

సాగునీటి వనరులకు కూడ మామూలుగా ఉండవవలసిన ప్రాముఖ్యం 'విజన్'లో లేదు. రాష్ట్రంలో అందుబాట్లో ఉన్న సాగునీటి వనరులన్నిటినీ సమంగా, సక్రమంగా వాడుకున్నట్టయితే ప్రతి ఎకరం సాగు భూమికీ ఒక పంటకు సాగునీరు అందియ్యవచ్చునన్న అంచనా ఎప్పటి నుండో ఉంది. భూమినీ, వ్యవసాయాన్నీ ప్రాథమికంగా ఉపాధి కోణం నుండి, జీవనం కోణం నుండి చూస్తే దీనిని సాధించడం అన్నిటికంటే ప్రథమ సమస్యగా తోస్తుంది. ఆ విధంగా చేస్తే ప్రతి ఒక్కరికీ కాకపోయినా అధిక శాతం గ్రామీణ ప్రజానీకానికి తిండి లభించేటట్టు చూడవచ్చు. ఆ రకంగా సాగునీటి సమృద్ధి కల్పించబడ్డ వ్యవసాయం నుండి దక్కే మిగులుతో వ్యాపారం చేసుకోవడానికి అవసరమైన మార్కెట్ వ్యవస్థను గురించి ఆలోచించవచ్చు. ఈ పరిధిలో ఉపాధి లభించని వారికి పని కల్పించడానికి ఏ రకమైన పారిశ్రామీకరణ తగినదో ఆలోచించడం రెండవ మెట్టు అవుతుంది. మార్కెట్ సానుకూలతను కాక ఉపాధి సానుకూలతను ప్రధాన ప్రమాణంగా ఎంచుకొని మార్కెట్‌ను దానికి

అనుబంధంగా చూడవచ్చు. ఈ రకమైన అభివృద్ధి 10 శాతం పెరుగుదల రేటు సాధించకపోవచ్చును గానీ అందులో సమత, భద్రత కొంచెం ఎక్కువగా ఉండగలవు.

కానీ సాగునీటి సమృద్ధికి విజన్ ఇచ్చే ప్రాముఖ్యం అతి స్వల్పం. ఆ కొంచెం కూడ నదీజలాల ప్రాజెక్టుల గురించి మాత్రమే మాట్లాడుతుంది. బావుల కింద జరిగే వ్యవసాయాన్ని గురించి గాని, చెరువుల కింద జరిగే వ్యవసాయాన్ని గురించి గాని 'విజన్'లో ఒక్క వాక్యం కూడ లేదు. కానీ వెనుకబడిన ప్రాంతాలకు – ముఖ్యంగా తెలంగాణ, రాయలసీమలకు – ఇవి ముఖ్యమైన నీటి వనరులు. చెరువుల వ్యవస్థ ఇప్పుడెంత అధ్వాన్నంగా ఉందో అందరికీ తెలుసును. ఎప్పుడో కాకతీయులు, విజయనగర రాజులు, కుతుబ్‌షాహీ, అసఫ్‌జాహీ పాలకులు తవ్వించిన చెరువులే తప్ప కొత్తగా కట్టినవేవీ లేవు. పాతవి కూడ విపరీతంగా పూడిపోయి, కట్టలు తూములు మత్తడి నాశనమై అవసానదశలో ఉన్నాయి. బావుల మాటకొస్తే, పైన చెప్పినట్టు బావుల కింద వ్యవసాయం కరెంటు సబ్సిడీల పుణ్యాన గడచిన దశాబ్ద కాలంలో వేగంగా విస్తరించింది. కానీ 'విజన్ 2020' దృక్పథంలో కరెంటు సబ్సిడీ ఒక మహాపాపం. రైతులు అనుభవించే వనరుల ఖర్చు మొత్తం వారే చెల్లించాలి. కరెంటేమిటి, రోడ్లు, బ్రిడ్జిల ఖర్చు సహితం వాటి వాడకందార్లయిన వాహన చోదకుల నుండే వసూలు చేయాలని 'విజన్' చెప్తుంది.

ఈ పరిస్థితిలో బావుల కింద వ్యవసాయం పెరగకపోగా కుదించుకు పోతోంది. చెరువుల కింద వ్యవసాయం ఎట్లాగూ నాశనం అయింది. నదీజలాల ప్రాజెక్టులకు ఇప్పటికింకా చాలావరకు అనుమతులు లేవు. ఇది తెలంగాణ, రాయలసీమ జిల్లాలకు చాలా నష్టం చేస్తుంది. సాగునీటి అభివృద్ధి స్థానంలో మెట్ట సేద్యాన్ని, అదీ ఎగుమతి దిగుమతి కంపెనీలతో ముడిపెట్టి బాగుపడమని 'విజన్ 2020' ఈ ప్రాంతాలవారికి చెపుతోంది.

## VII ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యూహం

'విజన్' నిర్మాణ రంగాన్ని (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) ఆర్థికాభివృద్ధికి కీలకంగా చూస్తుంది కాబట్టి ఏ విధంగా అది నిర్మాణ రంగాన్ని అభివృద్ధి పరచదలచుకుంది, ఆయా విధానాలు ప్రజల అవసరాలకు, సామాజిక ప్రయోజనాలకు తగు విధంగా వున్నాయా లేదా అని చూడటం తప్పనిసరవుతుంది. రాష్ట్రంలో రోడ్లు, వంతెనలు, భవనాలు, ఓడరేవులు, విద్యుదుత్పత్తి కేంద్రాలు వగైరా రంగాలలోకి భారీగా విదేశీ పెట్టుబడుల్ని ఆహ్వానించి తద్వారా ఆయా రంగాలను అభివృద్ధి పరచాలని 'విజన్' సూచిస్తుంది. రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలను కలుపుతూ నాలుగు లేన్ల సూపర్ హైవేలను నిర్మించి ప్రతి గ్రామం నుంచి వాటిని కలుపుతూ రోడ్లు వేయటం, ఉన్న నాలుగు ఓడరేవుల స్థోమత పెంచటమే కాక మరో రెండు చిన్న తరహా ఓడరేవులను నిర్మించటం, విద్యుత్ రంగంలో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి మరిన్ని విద్యుదుత్పత్తి కేంద్రాలను స్థాపించడం ఇవన్నీ దీనిలో భాగం. ఇవి సాధించటానికి 'విజన్' రెండు రకాల వ్యూహాలను సూచిస్తుంది.

ఎ) ఇప్పుడు ఈ సర్వీసులకున్న ధరలను (రేషనలైజ్ చేసి) పెంచి ఈ రంగాలను ప్రైవేటు పెట్టుబడులకు 'ఆకర్షణీయంగా' మార్చటం.

బి) ఆయా రంగాల్లోని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించి, తద్వారా అవి అందించే సేవలను మెరుగుపరచటం.

ఈ విధంగా చేసి నిర్మాణ రంగాన్ని మెరుగుపరిస్తే ఆర్థికాభివృద్ధి దానికదే జరుగుతుందని 'విజన్' ప్రతిపాదిస్తుంది. ఈ రంగాలలో 2005 నాటికి నాలుగు లక్షల కోట్లు, 2010 నాటికి 10 లక్షల కోట్లు, 2020 నాటికి 16 లక్షల కోట్లు – పెట్టుబడి పెట్టాలని 'విజన్' సూచిస్తుంది.

ప్రజలందరికీ అవసరమయిన ఈ సౌకర్యాలను ప్రైవేటు (విదేశీ) పెట్టుబడిదారులు ఎందుకు అందిస్తారు, ఎందుకు అందించాలి అనే ప్రశ్నలు మనకు వెంటనే వస్తాయి. ప్రభుత్వరంగం ఈ సేవలను సరిగ్గా అందించలేదు కనుక అని 'విజన్' మనకి చెప్తుంది. అయితే ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో (ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, ఇంగ్లండ్, అమెరికా తప్ప) చాలావరకు ప్రభుత్వరంగ సంస్థలే ఈ సర్వీసులను అందిస్తున్నాయి. ఆ దేశాల్లో ఆ సర్వీసులు బాగాలేవని ఎవరూ

అనలేదు. ఇంగ్లండ్, అమెరికాలలో కూడ కొన్ని సర్వీసులు మాత్రమే ప్రైవేటు రంగంలో వున్నాయి. మిగతా అన్నిటిలో ప్రైవేటు భాగస్వామ్యం చాలా తక్కువ. అయితే 'విజన్' దీన్ని ఈ విధంగా సమర్థించుకోవచ్చును. అదేమిటంటే ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న దేశాల్లోకి విదేశీ పెట్టుబడులు బాగా వస్తున్నాయని, సరైన వసతులు కల్పిస్తే పెట్టుబడులు రావటానికి ఢోకా ఉండదని. ఇది కూడ సందేహాస్పదమైన వాదనే. ఎందుకంటే 'ప్రపంచ నిర్మాణ రాజధాని' (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాపిటల్) గా పేరు పొందిన బ్యాంకాక్ నగరంలోనే ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఎంతో ప్రోద్బలం, ప్రోత్సాహం ఇచ్చిన తరువాత కూడ ఆ రంగాలలో ప్రైవేటు పెట్టుబడులు అంతకు ముందు కంటే 18 శాతం మాత్రమే పెరిగాయి.

కాబట్టి ప్రైవేటు పెట్టుబడులు మన రాష్ట్రానికి విపరీతంగా రప్పించుకునేటట్లు చెయ్యొచ్చు, ప్రైవేటు పెట్టుబడులతో మన నిర్మాణ రంగాన్ని అభివృద్ధి పరచుకోవచ్చు అనే వాదనలు వాస్తవికమైనవి కావు. మరి 'విజన్'లో ఈ వాదనలు ఎందుకు చోటు చేసుకున్నాయనే ప్రశ్న వస్తుంది. ఎక్కడెక్కడ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించాలని 'విజన్' సూచిస్తుందో జాగ్రత్తగా గమనిస్తే మనకు దీనికి జవాబు దొరుకుతుంది. పెద్దగా లాభాలు రాని, ఆదాయం లేని గ్రామీణ రోడ్లు, వెనకబడిన ప్రాంతాల రోడ్లు ప్రభుత్వమే నిర్మించాలని చెప్తూ, లాభాలు గడించగల అవకాశమున్న రోడ్లు, రేవులు, విద్యుచ్ఛక్తి కేంద్రాలకు ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించాలని 'విజన్' సూచిస్తుంది. అంటే ముఖ్యంగా దేశీయ, విదేశీ పెట్టుబడిదారులకు లాభాలు చేసుకునే అవకాశం కల్పించాలని 'విజన్' చెప్తుందనేది మనకు అర్థమవుతుంది.

అయితే 'విజన్' తర్కంలో ప్రైవేటు ప్రయోజనాలకు, సామాజిక ప్రయోజనాలకు మధ్య ఘర్షణ లేదు. అంటే ప్రైవేటు పెట్టుబడిదారులు లాభాలు చేసుకుంటే దాని వల్ల ప్రజలందరికీ, సమాజానికంతటికీ ప్రయోజనం చేకూరుతుందనేది 'విజన్' సారాంశం. అయితే నిర్మాణ రంగంలో విదేశీ ప్రైవేటు పెట్టుబడిదారులకు సూచించిన స్కీములు జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ రెంటికీ మధ్య వున్న అగాధం ఎంతో మనకు అర్థమవుతుంది.

ఈ స్కీముల ద్వారా విదేశీ ప్రైవేటు సంస్థలే రోడ్లు, వంతెనలు, ఓడరేవులు నిర్మించి, వాటిని నడిపి, కొంతకాలం తరువాత తిరిగి ప్రభుత్వానికి (లేదా ఇతర దేశీయ ప్రైవేటు సంస్థలకు) అప్పగిస్తాయి. ఈ స్కీము వల్ల ప్రభుత్వానికి పైసా ఖర్చు

లేకుండా రాష్ట్రానికి, ప్రజలకు రోడ్లు, వంతెనలు వగైరా చేకూరుతాయనేది ప్రభుత్వ/ 'విజన్' వాదన. ఈ స్కీములని BOT (Build, Operate, Transfer) లేదా BOOT (Build, Operate, Own, Transfer) అని పిలుస్తారు. ఇది నిజమైతే బాగానే వుంటుంది. కాని ప్రైవేటురంగ సంస్థలే వీటిని మెరుగ్గా నడపగలిగితే వీటిని తిరిగివ్వాల్సిన అవసరం ఏముంది? తమ ఆధీనంలో ఉంచుకుని ప్రజలకు అంత మంచి సేవలు ఎప్పటికీ అందియ్యవచ్చు కదా?

అంతే కాదు, ఆర్థిక దృక్కోణంలో చూసినప్పుడు ప్రభుత్వరంగ సర్వీసుల కంటే BOT, BOOT స్కీముల కింద అందించే సర్వీసులు చాలా ఖరీదయినవని మనకు అర్థమవుతుంది. ప్రభుత్వాలకు ప్రైవేటు పెట్టుబడి పౌరులకు దొరికిన దాని కంటే తక్కువ వడ్డీకి దొరుకుతుంది కనుక ప్రభుత్వ ప్రాజెక్టు ఖర్చులు ప్రైవేటు పెట్టుబడిదార్ల ప్రాజెక్టు కంటే ఎప్పుడూ తక్కువగానే వుంటాయి. రెండవది BOT, BOOT స్కీముల కింద ప్రైవేటు పెట్టుబడిదారులు నిర్ణీతకాలంలోనే పెట్టుబడులను తిరిగి రాబట్టుకోవడం, లాభాలు ఆర్జించుకోవడం చెయ్యాలి గనుక అవి తమ సర్వీసులను తక్కువ ధరలకు, సామాన్య ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా అందించలేవు. అదే ప్రభుత్వ రంగ సంస్థలకయితే – ఎప్పటికీ ఈ నిర్మాణాలు వారి ఆధీనంలోనే వుంటాయి కాబట్టి త్వరగా లాభాలు గుంజుదామనే ఆశ, ప్రజలకు అందుబాటులో లేనంత ధరలలో సర్వీసులు అందించవలసిన అవసరం వుండవు. ప్రజల అవసరాల దృష్టితో చూసినా లేదా సామాజిక ప్రయోజనాల దృష్టితో చూసినా BOT, BOOT స్కీములు సహేతుకమైనవి కావు. అంతకంటే ప్రభుత్వరంగ సంస్థలే ఈ నిర్మాణాలని చేపట్టి ఆ ఖర్చులను పెట్రోలు పన్ను ద్వారానూ, రవాణా ఛార్జీల ద్వారానూ వసూలు చేయటం సామాజికంగా ప్రయోజనకరమవుతుంది. మూడవది ఈ స్కీముల కింద ప్రభుత్వానికి ఖర్చు వుండదనేది కూడ పూర్తి నిజం కాదు. ఆయా విదేశీ సంస్థలకు పన్ను రాయితీల ద్వారానూ, ఆయా నిర్మాణల కోసం చవగ్గా భూమి ఇవ్వటం ద్వారానూ ప్రభుత్వం ప్రజాధనాన్ని సబ్సిడీల రూపంలో ఖర్చు చేస్తుంది.

ఈ ప్రైవేటు (విదేశీ) పెట్టుబడిదారులకు ఏ విధమైన సామాజిక బాధ్యతలూ వుండవు. ఉదాహరణకు వ్యవసాయరంగానికి తక్కువ ఖర్చుతో కరెంటు ఇవ్వాల్సిన బాధ్యత లేదు. వారు చేపట్టే ఉత్పత్తులు అందరికీ అందుబాటులో వుండవు.

అంతే కాదు, ఇంతకంటే ముఖ్యమైనది ప్రభుత్వాల వద్ద ఆ పెట్టుబడిదారులను నియంత్రించడానికి అవసరమైన సంస్థాగత నిర్మాణాలు కూడ లేవు.

ఇవే కాకుండా ఈ స్కీముల వల్ల ప్రజల స్వయం నిర్ణయాధికారం పూర్తిగా దెబ్బ తింటుంది. ఆయా సర్వీసులు విదేశీ ప్రైవేటు సంస్థలు సరిగ్గా అందించకపోయినా, ఆయా ప్రాజెక్టులు ఆర్థికంగా నష్టకరమైనా వాటిని రద్దు చేసే అధికారం గానీ, వాటిని ప్రశ్నించే అధికారం గానీ ప్రస్తుత ప్రభుత్వాలకు లేవు. ఎందుకంటే ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల ఆధ్వర్యంలో రుణాలు తీసుకున్నప్పుడు ప్రభుత్వాలు దీర్ఘకాల ఒప్పందాల లోకి ప్రవేశిస్తాయి. విదేశీ పెట్టుబడులు ప్రపంచ బ్యాంకు ఇచ్చే గ్యారంటీలతో మాత్రమే రాష్ట్రంలోకి వస్తాయి. అంటే ప్రభుత్వాలు ఈ ఒప్పందాలను ఉల్లంఘించవు అని ప్రపంచ బ్యాంకు విదేశీ సంస్థలకు గ్యారంటీ ఇస్తుందన్నమాట. కాని ప్రపంచబ్యాంకు అదే విధమైన గ్యారంటీ విదేశీ పెట్టుబడిదారుల విషయంలో ప్రభుత్వాలకి ఇవ్వదు. ఇక్కడే ఈ 'అభివృద్ధి' ఎవరికి లాభదాయకమో, ప్రపంచబ్యాంకు ఎవరివైపు నుందో మనకు స్పష్టంగా అర్థమవుతుంది.

అంతే కాదు. ఒకవేళ ప్రజలు ఈ పథకాలను వ్యతిరేకించి ఈ ఒప్పందాలపై సంతకం చేసిన ప్రభుత్వాన్ని దింపి వేరే పార్టీని ఎన్నుకున్నప్పటికీ, ఆ ప్రభుత్వానికి కూడ ఈ ఒప్పందాన్ని ధిక్కరించే అధికారం ఉండదు. అంటే ప్రజలకు రాజ్యాంగ పరంగా లభించిన స్వయం నిర్ణయాధికారం అర్థంలేనిదవుతుంది.

## VIII ముగింపు

ఇంక ఈ ఆర్థిక విధానాలు ఏ రకమైన సామాజిక వ్యవస్థను తయారుచేస్తాయో చూసి మన సమీక్షను ముగిద్దాం. ఇప్పటికే చూచాయగా ఆ చిత్రాన్ని పాఠకులు గ్రహించి ఉండాలి గాని మరింత స్పష్టంగా చెప్పుకుందాం.

రాజ్యవ్యవస్థ గురించి ఒక సంక్షేమాత్మక అవగాహన ఈ శతాబ్దంలో ముందు కొచ్చింది. సోషలిజం కోసం ఈ శతాబ్దంలో జరిగిన విస్తృతమైన కృషి ఈ అవగాహనకు చాలా దోహదం చేసింది. ఆ కృషిలో ఉన్న లోపాలనూ, రాజ్యానికి ఆ కృషి ఇచ్చిన విశిష్టమైన స్థానం వల్ల వచ్చిన సమస్యలనూ చర్చించడానికి ఇది సందర్భం కాదు. కాని రాజ్యం అనేది కేవలం భద్రతనూ శాంతినీ నెలకొల్పే యంత్రాంగం మాత్రమే కాదనీ, దానికి మరి రెండు ముఖ్యమైన బాధ్యతలున్నాయనీ భావించడం అభ్యుదయాన్నీ సమతనూ ఏదో ఒక మేరకు కోరుకునే ప్రజల 'కామన్ సెన్స్'లో భాగం అయింది.

ఒకటి, రాజ్యానికి ఆర్థిక పురోభివృద్ధి సాధించడంలో కీలకమైన పాత్ర ఉంది. ప్రైవేట్ పెట్టుబడి లాగ రాజ్యం తక్షణ లాభాలను కాంక్షించనక్కరలేదనీ, అత్యధిక లాభాలనే తన లక్ష్యంగా పెట్టుకోనక్కరలేదనీ, ఇవ్వాల్టి లాభాలతో రేపు వ్యాపారం చేయకుండా విస్తృత ప్రాతిపదికన పెట్టుబడి సేకరించగలదనీ, ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తూ అదే సమయంలో ఉద్యోగులకూ కార్మికులకూ కొన్ని హక్కులు కల్పించగలదనీ, ఇవాళ్టి వాడకపు వస్తువుల మార్కెట్ కల్పించే డిమాండ్‌తో సంతృప్తి చెందకుండా రేపటి ఉత్పత్తి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇవాళ్టి ఉత్పత్తి సాగించగలదనీ, ప్రస్తుత లాభాల వేటకే పరిమితం కాకుండా దీర్ఘకాలిక సమత, సమాన అవకాశాలను కూడ దృష్టిలో పెట్టుకొని ప్రణాళికా రచన చేయగలుగుతుందనీ నమ్మడం ఇందులో భాగమే. ఈ దృక్పథాన్ని అపహాస్యం చేయడం ఈనాటి సరళీకరణ వాతావరణంలో ఒక ఫ్యాషన్ అయిపోయింది గానీ ఇందులో కొంత సత్యం లేకపోలేదని గడచిన ఐదు దశాబ్దాల చరిత్ర చెప్తుంది.

ఈ బాధ్యతను ప్రస్తుతం ప్రపంచంలో ఆధిపత్యం వహిస్తున్న ఆర్థిక సిద్ధాంతం తిరస్కరిస్తుంది. ప్రభుత్వం ఉత్పత్తి రంగం నుండి పక్కకు తప్పుకొని కేవలం ఉత్పత్తి రంగానికి వసతులు కల్పించే కర్తవ్యానికి పరిమితం కావాలని ఈ దృక్పథం అంటుంది.

దీనికి ఆ దృక్పథం చూపించే కారణాల విశ్లేషణలోకి పోవడానికిది సందర్భం కాదు కానీ దానివల్ల ఆర్థిక వ్యవస్థ ఇప్పుడున్న దాని కంటే ఇంకింత వికృత రూపం తీసుకుంటుందని గుర్తించడానికి పెద్దగా కష్టపడనక్కరలేదు.

రాజ్యానికున్న రెండవ బాధ్యత సామాజిక అసమానతలనూ, అసమాన అవకాశాలనూ కాలక్రమంలో తగ్గించే దిశగా కృషి చేయడం. సంప్రదాయకంగా మన సమాజంలో ఉన్న అసమానతలను తగ్గించే కృషితోపాటు పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాల వ్యాప్తి వల్ల కొత్తగా ముందుకొచ్చిన అసమానతలను కూడ అదుపు చేయాల్సిన కర్తవ్యం దానికి ఉంది.

దీనిని 'సంక్షేమ రాజ్యం' లేక రాజ్యానికి ఉండే సంక్షేమ బాధ్యత అనే పేర్లతో సిద్ధాంతీకరించడం జరిగింది. ఈ సంక్షేమ బాధ్యత నిర్వర్తించడానికి రాజ్యం (మూడవ ప్రపంచ దేశాలలోనే కాక అభివృద్ధి చెందిన దేశాలలో కూడ) అనేక విధానాలనూ చట్టాలనూ నిర్మాణాలనూ రూపొందించింది. ఆహార సబ్సిడీ, ప్రభుత్వరంగంలో విద్యా సదుపాయాల కల్పన, సామాజికంగా వెనుక ఉంచబడిన ప్రజలకు విద్యా ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు, ఇతర సదుపాయాలు, నైసర్గికంగా వెనుకబడిన ప్రాంతాలకూ చారిత్రకంగా వెనుక ఉంచబడిన ప్రాంతాలకూ ప్రత్యేక రాయితీలు, చవక బియ్యం, చవక కరెంటు, స్కాలర్‌షిప్పులు, మధ్యాహ్న భోజన పథకాలు, ఆదివాసులకు ప్రత్యేక హక్కులు, విధానాలు, చేనేతకూ ఇతర చేతి వృత్తులకూ ప్రత్యేక రక్షణ...చెప్పుకుంటే చాలానే ఉన్నాయి. ఇవేవీ ప్రకటించుకున్నంతగా అమలు కాకున్నా, పాత అసమానతలనూ కొత్తగా పెరుగుతున్న అసమానతలనూ అడ్డుకోవడంలో పరిమితమైన పాత్ర మాత్రమే నిర్వహించగలిగినా వీటిని సామాజిక అసమానతలను అదుపు చేసే కృషికి తోడ్పడే సాధనాలుగా చూడకుండా ఉండలేము. ఎంత లేదన్నా అసమానతల నుండి కొంత ఉపశమనాన్ని కల్పించాయని గుర్తించకుండా ఉండలేము.

కానీ ప్రస్తుత ఆధిపత్య దృక్పథం రాజ్యానికి ఉండే ఈ బాధ్యతను గుర్తించదు. వేగవంతమైన ఆర్థిక పెరుగుదల, దానికి ఏకైక సాధనమైన స్వేచ్ఛా విపణి వ్యవస్థ కాలక్రమంలో అన్ని అసమానతలనూ పోగొడతాయనీ, ప్రభుత్వం దానికి అడ్డం రాకుండా ఉంటే చాలనీ నమ్ముతుంది. ఒకవేళ వేరే ఏ రూపాలలోనయినా సమాన

అవకాశాల సాధన కోసం లేదా అసమానతల అదుపు కోసం రాజ్యం ఏమైనా చేసినా చేయొచ్చు గానీ స్వేచ్ఛా విపణికీ, పెట్టుబడి సమీకరణకూ అడ్డమొచ్చే పనులేవీ సమత, సమాన అవకాశాల పేరిట రాజ్యం చేయకూడదు.

అంటే వెనుక ఉంచబడిన ప్రజలకూ ప్రాంతాలకూ ఉపాధి రంగంలోనూ విద్యారంగంలోనూ రిజర్వేషన్లు కల్పించడం, పేదలకు చవక బియ్యం ఇవ్వడం కోసం రైస్ మిల్లుల మీద లెవీ విధించడం, ఆహార వస్తువుల ధరలను అదుపు చేయడం కోసం వాటి రవాణాపైన ఆంక్షలు పెట్టడం, ఆదివాసుల రక్షణ కోసం అడవులలోకి ఇతరుల ప్రవేశాన్ని నియంత్రించడం, ఖరీదయిన కరెంటును పేదరైతులకు చవగ్గా ఇవ్వడం, నేతపనివారు బతకనీ అనీ లుంగీలు టవళ్ళు వాళ్ళు మాత్రమే తయారు చేయాలని రిజర్వేషన్లు పెట్టడం, భూమిలేని పేదలు రెండు గింజలు తిని బతకనీ అని కోళ్ళ ఫారాలకూ డైరీ ఫారాలకూ పనికొచ్చే పోరంబోకులు వారికి పట్టా చేయడం...ఇత్యాది సంక్షేమ చర్యలు ప్రస్తుత ఆధిపత్య దృక్పథంలో నిషిద్ధాలు.

'విజన్ 2020' దృష్టి కూడ ఇదే. మరి ఈ దృక్పథం ఏ రకమైన సంక్షేమ బాధ్యతనూ గుర్తించదా అంటే అత్యంత ప్రాథమికమైన స్థాయిలో మాత్రమే గుర్తిస్తుంది. దీనిని చాలా దూకుడుగా ప్రకటించుకుంటుంది కూడ. ప్రభుత్వ చవక బియ్యం పథకాలు అసలైన పేదలకు అందడం లేదని, మధ్యతరగతి వాటిని చేజిక్కించుకుంటున్నదని ప్రపంచ బ్యాంకు అనేక సందర్భాలలో మన ప్రభుత్వాల విధానాలను తీవ్రంగా విమర్శిస్తుంటుంది. ఇందులో కొంత నిజం ఉంది కాబట్టి ప్రపంచబ్యాంకు మన పాలకుల కంటే ఎక్కువగా సంక్షేమ దృష్టి కలిగి ఉందని భ్రమించే అవకాశం ఉంది. కానీ ఈ విమర్శ వెనుక ఉన్న ఆలోచనా రీతి ఏమిటంటే ప్రభుత్వ సంక్షేమ బాధ్యత మొత్తంగా అసమానతలను అదుపు చేసే దిశగా ఉండకూడదు. ఏమీ లేని అట్టడుగు ప్రజానీకానికి కొంత ఆధారం చూపించడానికి మాత్రమే అది పరిమితం కావాలి.

అంటే భిన్న వర్గాలకు భిన్న ధరలకు బియ్యం అందుబాట్లో ఉంటే చవక ధరల దుకాణాలు పెట్టనవసరం లేదు. తద్వారా అసమాన ఆదాయాల పర్యవసానాన్ని అదుపు చేసే ప్రయత్నం చేయనవసరం లేదు. క్షామంలో గంజి కేంద్రాలలాగ ఈ రోజు ఇంత తిండి పెట్టకపోతే రేపు చచ్చిపోతారేమో అనుకునే వారికి మాత్రమే

చవక బియ్యం ఇవ్వాలి. ప్రభుత్వ సంక్షేమ బాధ్యత దానికే పరిమితం కావాలి. ఈ విషయం చెప్పడానికే దిగువ మధ్యతరగతికి కూడ సబ్సిడీ కల్పించే చవక బియ్యం సరఫరాను ప్రపంచ బ్యాంకు తీవ్రంగా దుయ్యబడుతుంది. అసలు ఏమీ లేనివారి ప్రయోజనాల దృష్టితో విమర్శించినట్టు అభిప్రాయం కలిగిస్తుంది.

దీని అర్థం ప్రస్తుత రేషన్ వ్యవస్థలో లోపాలేవీ లేవనీ, అనర్హులు దాని వల్ల ప్రయోజనం పొందడం ద్వారా అర్హులకొక మేరకు నష్టం జరగడం లేదనీ కాదు. అది వేరే విషయం. కానీ ప్రభుత్వ సంక్షేమ బాధ్యతను మొత్తం అసమానతలనూ అసమాన సామాజిక వ్యవస్థనూ అదుపుచేసే బాధ్యతగా అర్థం చేసుకోవడానికీ, కేవలం అట్టడుగున ఉన్న వారికి కొంత ఉపశమనం కలిగించి మిగిలిన పని మార్కెట్ వ్యవస్థకు వదిలేయడమే మంచిదని భావించడానికీ చాలా తేడా ఉంది. ఇందులో రెండవదే ప్రపంచబ్యాంకు దృక్పథం, 'విజన్' దృక్పథం. ఈ దృక్పథం మొదటి సంక్షేమ భావనను అట్టడుగున ఉన్న అతి పేదల తరఫున విమర్శించిట్టు కనిపించడం వట్టి బూటకం తప్ప వేరే ఏమీ కాదు.

రెండవ దృక్పథం ప్రాథమిక విద్యా వైద్య రంగాలకు మాత్రమే ప్రభుత్వ బాధ్యత పరిమితమయి ఉంటే చాలునంటుంది. మొదటి దృక్పథం విద్యా వైద్య సదుపాయాలు మొత్తంగా అందరికీ ఎప్పటికీ ఫ్రీగా ఉండాలని అనకపోయినా, కేవలం ప్రాథమిక విద్యా, వైద్య రంగాలే కాక ఇంజనీరింగ్ విద్య, మూత్రపిండాల మార్పిడి వంటి ఆపరేషన్లు కూడ అందరికీ అందుబాట్లో ఉండాలంటుంది. విద్యా వైద్య రంగాలను ప్రైవేట్ పెట్టుబడికి వదిలేసి కొన్ని స్కాలర్‌షిప్పులు, కొందరికి ఆపరేషన్ ఖర్చు ఇస్తాము లెమ్మని చెప్పే 'విజన్' దృక్పథంతో అది సంతృప్తి చెందదు.

ఆదివాసులు, దళితులు, స్త్రీలు, మైనారిటీలు, వెనుకబడిన కులాలు, వెనుకబడిన ప్రాంతాలు అంటూ 'విజన్ 2020' అనేకచోట్ల దండకం చదివినట్టు చదువుతుంది కానీ సంక్షేమ రాజ్య భావనను కేవలం ఆకలి చావులను తగ్గించే గంజి కేంద్రాల స్థాయికి కుదించేసి, మిగిలిన విషయాలలో పెట్టుబడికి పెద్దపీట వేసే 'విజన్' దృక్పథం అసమానతలను ఎదుర్కొనడానికి ఏమీ చేయకపోగా వాటిని పెంచుతుంది. అన్ని రంగాలలోనూ అప్పటికే ఉన్న అసమానతలను పెంచడం పెట్టుబడికి ఉండే

స్వాభావిక లక్షణాలలో ఒకటి. (అది మొత్తంగా సంపదను పెంచవచ్చు. కొన్ని సందర్భాలలో ప్రతి ఒక్కరి ఆదాయాన్ని కూడ పెంచవచ్చు గాక). విపరీతంగా పెట్టుబడిని ఆకర్షించి ఆ పెట్టుబడి విపరీతమైన వేగంతో పెరగడానికి కావలసిన సానుకూలత, సదుపాయాలు కల్పించే పాత్రకు ప్రభుత్వ బాధ్యతను కుదించివేసే 'విజన్' అసమానతల అంశం గురించి మాట్లాడడం కంటే బూటకం వేరే ఉండబోదు.

నిజానికి ఉత్పత్తి, ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఇప్పటిదాకా గుర్తింపు పొందిన ప్రభుత్వ సంక్షేమ బాధ్యతలన్నీ కూడ పెట్టుబడికి ఉండే స్వేచ్ఛను అదుపు చేసేవే. ఇష్టమొచ్చిన రంగంలో ఇష్టమొచ్చిన ప్రాంతంలో ఇష్టమొచ్చినంత పెట్టుబడి పెట్టి ఇష్టమొచ్చిన వారిని ఇష్టమొచ్చినంత కాలం పనిలో పెట్టుకొని ఇష్టమొచ్చిన ఉత్పత్తి చేసి ఇష్టమొచ్చిన చోట ఇష్టమొచ్చిన ధరకు అమ్మే 'స్వేచ్ఛ' పెట్టుబడికి ఉండాలని ప్రస్తుత పాలక ఆర్థిక నీతి, 'విజన్' ఆర్థిక నీతి చెప్తాయి. ఇప్పటిదాకా ఎస్.సి, ఎస్.టి బి.సిలకూ, స్త్రీలకూ ఉద్యోగ రంగంలో రిజర్వేషన్లు, ఉత్పత్తుల రవాణాపైన, ఎగుమతుల పైన నియంత్రణ, ధరలపైన ఆంక్షలు, చౌకగా ఇవ్వడం కోసం బలవంతపు లెవీలు, చేతివృత్తులకూ చిన్న పరిశ్రమలకూ ప్రత్యేక రిజర్వేషన్ కోటాలు, రకరకాల కార్మిక చట్టాలు మొదలయిన అనేక సంక్షేమ విధానాలూ, చట్టాలూ ఉనికిలో ఉన్నాయి. ఎంత అస్తవ్యస్తంగా అమలయినా అపరిమితమైన స్వేచ్ఛా విపణి వల్ల సామాజికంగా జరిగే హానిని కొంతమేరకయినా అదుపు చేయగలుగుతున్నాయి. కులం, పితృస్వామ్యం అనే రెండు ప్రధాన అసమాన వ్యవస్థలను బలహీన పరచడానికి రిజర్వేషన్లు బాగానే ఉపయోగపడ్డాయి.

ఇంక మీదట ఇవేవీ ఉండవని 'విజన్' చెప్పదలుచుకుంది. మొత్తంగా ఒకేసారి కాకున్నా కొద్ది కొద్దిగా వీటిని తీసేయదలచుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు తీసేయరు గానీ ప్రభుత్వ రంగం బాధ్యతలను ఒక్కొక్కటిగా ప్రైవేట్ రంగానికి అప్పగించడం ద్వారా రిజర్వేషన్ల పునాదిని క్రమంగా తీసేస్తారు. సహజంగానయితే ఆర్థిక పురోభివృద్ధి జరిగేకొద్దీ ప్రభుత్వ రంగం కూడ, అదే దామాషాలో కాకున్నా, పెరగాలి. కానీ పెరగక పోగా దానిని సంవత్సరానికి 1 శాతం (ఉద్యోగుల సంఖ్యలో) చొప్పున తగ్గించి వేస్తామని

సమాజం అవసరాలతో నిమిత్తం లేకుండా ప్రభుత్వం ఇప్పటికే ప్రపంచబ్యాంకుకు హామీ ఇచ్చింది. వెనక్కి తగ్గుతున్న ప్రభుత్వరంగం స్థానాన్ని ఆక్రమించుకుంటున్న ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు ఉండవు. ప్రభుత్వం భూములు, ఇతర వసతులు చవగ్గా ఇచ్చే ప్రైవేట్ సంస్థలలో సహితం రిజర్వేషన్ల విషయంలో పట్టుపట్టదని ఐ.ఐ.ఐ.టి వ్యవహారంలో చంద్రబాబు నాయుడు అసెంబ్లీలోనే స్పష్టం చేశాడు.

'విజన్' ప్రతిపాదించే విధానాల ఫలితంగా మన సమాజం రెండు ప్రపంచాలుగా చీలిపోయే ప్రమాదం ఉంది. కంప్యూటర్ సాంకేతిక ప్రక్రియల చుట్టూ అల్లుకున్న అతి ఖరీదయిన అత్యాధునిక ప్రపంచం ఒకటి. దాని పాదాల కింద చీకట్లో చావలేక బతికే అధోజగత్తు ఒకటి. మొదటిది పెత్తందారీ కులాలకు నిలయంగా ఉంటుంది. దళిత బహుజన ఆదివాసీ ప్రజానీకం (వారిలో ఇప్పటికే బాగుపడి పైకి పోయిన కొద్దిమందిని మినహాయిస్తే) రెండవ ప్రపంచంలో ఉంటారు. రెండు ప్రపంచాలలోనూ స్త్రీల పరిస్థితి కొన్ని దశాబ్దాలు వెనక్కి పోతుంది. విద్య ఆర్జించడానికీ నైపుణ్యాన్ని ఉపయోగంలో పెట్టడానికీ శ్రమను అమ్ముకోవడానికీ పెట్టుబడి కనుసన్నలలో స్త్రీలు మగ ప్రపంచంతో సంఘర్షించాలి. బహుశా (కొద్దిమంది అతి విద్యావంతులయిన నిపుణులను మినహాయిస్తే) ఇంటి బయట పనిచేసే స్త్రీలు ఎక్కువగా కాంట్రాక్ట్ కార్మిక రంగంలో ఉండబోతారు. అత్యధికులు ఇంటి బయటకు పోకనే పోవచ్చు.

ఇదంతా అతిశయోక్తి అనీ, మరీ ఇంత ఘోరం జరగబోదనీ అనుకుంటారేమో. 'విజన్ 2020'లో ప్రకటించిన విధానాల పర్యవసానాలను ఇక్కడ చర్చిస్తున్నాం. ఆ విధానాలు మన పాలకులు అనుకున్నంత సంపూర్ణంగా అమలు కాకపోవచ్చు. కాకపోవడానికి ఉండగల అనేక కారణాలలో మా దృష్టిలో ముఖ్యమైనవి రెండు. ఒకటి, భారత రాజ్యాంగ వ్యవస్థకున్న ప్రజాస్వామ్య స్వరూపం. రెండు, ప్రజలలో ఉన్న ప్రజాస్వామ్య చైతన్యం. ఇవే లేకపోతే ఇప్పటికే పరిస్థితులు ఇంకా చాలా దిగజారి ఉండేవి. సరళీకరణ, ప్రపంచీకరణలలో భాగంగా మన పాలకులు తలపెట్టిన అనేక మార్పులు ఈపాటికే అమలయిపోయి ఉండేవి.

అందువల్ల ఏ మేరకైతే మనం ప్రజాస్వామ్యాన్నీ ప్రజాస్వామ్య చైతన్యాన్నీ కాపాడుకొని 'విజన్' నమూనా విధానాలను సమైక్యంగా ప్రతిఘటించగలుగుతామో ఆ మేరకే పైన వ్యక్తం చేసిన ఆందోళనను నిజంగానే 'అతిశయోక్తి' చేయగలుగుతాం. అది అతిశయోక్తి లెమ్మని ఊరుకుంటే మాత్రం అదే నిజమవుతుంది.

*మానవహక్కుల వేదిక ప్రచురణగా వచ్చింది*

***మే, 1999***

## మానవ హక్కులు వేదిక ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1 | శివమెత్తిన సేన | జనవరి 1999 |
| 2 | ఎండమావి 2020 | మే 1999 |
| 3 | మానవ హక్కులు-1999 (బులెటిన్ -1) | నవంబర్ 1999 |
| 4 | మానవ హక్కులు-2000 (బులెటిన్ -2) | జూన్ 2000 |
| 5 | మానవ హక్కులు-2001 (బులెటిన్ -3) | మార్చి 2001 |
| 6 | యుద్ధ సత్యాలు (బులెటిన్-4) | నవంబర్ 2001 |
| 7 | మానవ హక్కులు-2002 (బులెటిన్ -5) | ఏప్రిల్ 2002 |
| 8 | గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం | జూన్ 2002 |
| 9 | ఎవరిదీ అడవి? | ఫిబ్రవరి 2003 |
| 10 | మానవ హక్కులు-2004 (బులెటిన్ -6) | ఫిబ్రవరి 2004 |
| 11 | మణిపూర్ : ఎందుకింత ఆగ్రహం | డిసెంబర్ 2004 |
| 12 | ఆరుగాలం కరువు | మే 2005 |
| 13 | మానవ హక్కులు-2005 (బులెటిన్ -7) | మే 2005 |
| 14 | Death, Displacement & Deprivation: The War in Dantewara: A Report | డిసెంబర్ 2006 |
| 15 | మానవ హక్కులు-2007 (బులెటిన్ -8) | మే 2007 |
| 16 | ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధం | మే 2007 |
| 17 | మానవ హక్కులు-2008 (బులెటిన్ -9) | డిసెంబర్ 2008 |
| 18 | Kashmir: Will The Pain Never End? | డిసెంబర్ 2008 |
| 19 | మానవ హక్కులు-2009 (బులెటిన్ -10) | జూన్ 2009 |
| 20 | సచార్ చెప్పిన సత్యాలు | జూలై 2009 |
| 21 | కంధమాల్ నుండి కరావళి దాకా: ప్రజాస్వామ్యం పైన సంఘ్ పరివార్ దాడి | అక్టోబర్ 2009 |
| 22 | హక్కుల ఉద్యమం-తాత్విక దృక్పథం, కె.బాలగోపాల్ | అక్టోబర్, 2010 |
| 23 | మా బాలగోపాల్ (బులెటిన్ -11) | అక్టోబర్ 2010 |

24 మానవ హక్కులు–2011 (బులెటిన్ –12) అక్టోబర్ 2011
25 హక్కుల బాటసారి : బుర్ర రాములు రచనలు అక్టోబర్ 2011
26 ఆ శిక్షే ఒక నేరం, కె.బాలగోపాల్ ఏప్రిల్,2012
27 Of capital and other punishments, K. Balagopal అక్టోబర్, 2012
28 The Terrible Cost of an Inhuman
Counter-Insurgency అక్టోబర్ 2013
29 మానవ హక్కులు–2013 (బులెటిన్ –13) అక్టోబర్ 2013
30 ముస్లిం ఐడెంటిటీ–హిందుత్వ రాజకీయాలు, కె.బాలగోపాల్ 6 డిసెంబర్ 2013
31 చుండూరు: ఒక మారణకాండ తరువాత అక్టోబర్ 2014
32 Tsunduru: An Atrocity and Its aftermath అక్టోబర్ 2014
33 నక్సలిజంపై రాజ్యం అణచివేత :
మూల్యం చెల్లిస్తున్న ఆదివాసులు అక్టోబర్ 2014
34 పాలస్తీనా ప్రజాపోరాటం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2014
35 ఆదివాసులు:ఛత్తీస్‌గఢ్, కంధమాల్ పై వ్యాసాలు, నివేదికలు
కె.బాలగోపాల్ అక్టోబర్ 2015
36 అభివృద్ధి–విధ్వంసం: భూమి, భావజాలం, కోర్టులు,
కోస్టల్ కారిడార్, కె.బాలగోపాల్ అక్టోబర్ 2015
37 విస్థాపన–విధ్వంసం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2016
38 మానవ హక్కులు–2015 (బులెటిన్ –14) అక్టోబర్ 2015
39 విశాఖకు 7వ నెంబరు కాలుష్య హెచ్చరిక అక్టోబర్ 2016
41 సరళీకరణ–విధ్వంసం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2017
40 ఎన్నికలు–ప్రజాస్వామ్యం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2017
42 మానవ హక్కులు–2017 ( బులెటిన్–15) అక్టోబర్ 2017
43 అణుశక్తి–విధ్వంసం, కె.బాలగోపాల్ సెప్టెంబర్ 2018
44 హిందూ మత జాతీయవాద రాజకీయాలు,
జి.శివ నాగేశ్వరరావు సెప్టెంబర్ 2018
45 కరువు – వ్యవసాయ సంబంధాలు, కె.బాలగోపాల్ అక్టోబర్ 2018



# విజన్ - విధ్వంసం

## కె. బాలగోపాల్



"పేదలందరికీ ప్రకృతి వనరులపైన హక్కు కల్పించడం అసాధ్యమయితే ఆ హక్కు ఇవ్వలేని వారికి నిత్యం పని కల్పించే విధాన రచన ఉండాలి. పారిశ్రామిక వ్యవసాయ విధానాలను ఆ కోణం నుండి రూపొందించాలి. అప్పుడు కూడ దారిద్ర్యం కొంతమేరకే అదుపులో ఉంటుంది. దానితోపాటు విద్యావకాశాలు అందరికీ కల్పించి, సాంకేతికంగా మెరుగయిన జీవనరంగంలోకి ప్రవేశించే అవకాశం ఇస్తే ఈ తరంలో కాకపోతే వచ్చే తరంలోనయినా బాగా బతికే అవకాశం కల్పించినట్టవుతుంది."

Rs. 100/-

మానవహక్కుల వేదిక ప్రచురణ